
'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 164

గురువారం 4-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




**జొకోవిచ్ జైత్రయాత్ర**

యూఎస్ ఓపెన్‌లో 14వ సారి సెమీఫైనల్ చేరుకున్న సెర్బియా దిగ్గజం -14లో



**7రోజుల్లో 7,000 జంప్**

రూ.1,07,070 వద్ద కొత్త గరిష్ట స్థాయికి బంగారం -15లో



## న్యూస్‌రీల్

### పడేదంతా బోనస్సే



నైరుతి రుతుపవనాల సీజన్‌లో వర్షాలు సంతృప్తికర స్థాయిలో నమోదయ్యాయి. ఇకపై కురిసే వర్షాలు అదనమేనని, వర్షాలు కురిస్తే సగటు సాధారణ వర్షపాతాన్ని మించి నమోదైనట్టేనని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

- వివరాలు 5లో▶

### జస్టిస్ ఘోష్ నివేదిక మీకెక్కడిది?



కాళేశ్వరంపై విచారణ జరిపిన జస్టిస్ ఘోష్ నివేదిక మీ చేతికెలా వచ్చిందని పిటిషనర్, మాజీ సీఎస్ ఎస్కే జోషిని హైకోర్టు ప్రశ్నించింది. అసెంబ్లీలో ప్రవేశపెట్టి సభ్యుల కిస్తే వారి వద్దే ఉండాలి కదా? బహిర్గతం ఎలా అవుతుంది? అని ప్రశ్నించింది.

- వివరాలు 2లో▶

### మైక్రో బ్రూవరీలకు గ్రీన్‌సిగ్నల్



ఇక నుంచి తెలంగాణలో బీరు తాగాలంటే బార్ అండ్ రెస్టారెంట్‌కే వెళ్లాల్సిన పనిలేదు... వైన్‌షాపుల్లోనే కొనుక్కోవాల్సిన అవసరం అంతకంటే లేదు... హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, పర్యాటక స్థలాల్లో ఎక్కడైనా దొరుకుతుంది.

- వివరాలు 12లో▶

# ఇక బ్రెడ్డు, బన్ను, చపాతీ, పరోటా చౌక


మీడియా సమావేశంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**వీటిపై ఉన్న 5-18 శాతం పన్ను ఎత్తివేత** **ఆరోగ్య, జీవిత బీమాపై పన్ను సున్నా**

- గణనీయంగా తగ్గనున్న వాహన ధరలు
- ఎలక్ట్రిక్ వాహనాలపై 5శాతం పన్ను.. టూత్‌పేస్ట్, షాంపూలు, సబ్బులు, హెయిర్ ఆయిల్‌పై 5 శాతం
- సిగరెట్లు, గుట్కాలు, కూల్‌డ్రింక్స్ విలాస వస్తువులపై 40 శాతం
- రెండు శ్లాబుల విధానానికి ఏకగ్రీవ ఆమోదం
- ఈ నెల 22 నుంచి అమల్లోకి
- జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ: సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ధరల భారం దించుతూ జీఎస్టీ మండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. స్వాతంత్య్ర దినోత్సవంనాడు ప్రధాని ప్రకటించిన దీపావళి కానుక దసరాకు ముందే వచ్చింది. చపాతీ, పరోటా, బ్రెడ్డు, బన్నులపై జీఎస్టీని పూర్తిగా తొలగించాలని బుధవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అధ్యక్షతన భేటీ అయిన జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించింది. అంతేకాదు కుటుంబాలకు ఆధారమైన ఆరోగ్య, జీవిత బీమాపై ప్రస్తుతమున్న 18 శాతం జీఎస్టీని ఎత్తివేయనుంది. దీంతో ఆ మేరకు వాటి ప్రీమియంలు తగ్గనున్నాయి. ఇకపై జీఎస్టీలో 5, 18 శాతం పన్ను శ్లాబులే ఉంటాయి. 12 శాతం, 28 శాతం శ్లాబుల్లోని వస్తువులు 5, 18 శాతం శ్లాబుల్లోకి మారనున్నాయి. బంగారం, వెండి, వజ్రాభరణాలపై మిగతా 16వ పేజీలో ▶

**నిత్యావసరాలపై జీఎస్టీ తగ్గింపు (శాతాల్లో)**

| వస్తువు | ప్రస్తుత శ్లాబు | కొత్త శ్లాబు |
|---|---|---|
| హెయిర్‌ఆయిల్, షాంపూ, టూత్‌పేస్ట్, టాయిలెట్ సోప్, టూత్ బ్రష్షులు, షేవింగ్ క్రీమ్‌లు | 18 | 5 |
| వెన్న, నెయ్యి, చీజ్, డెయిరీ స్ప్రెడ్స్ | 12 | 5 |
| ప్రీ-ప్యాకేజ్డ్ నమ్‌కీన్స్, భుజియా, మిక్చర్స్ | 12 | 5 |
| పాత్రలు | 12 | 5 |
| పిల్లల పాల బాటిల్స్, శిశువుల నాప్కిన్స్, క్లినికల్ డైపర్స్ | 12 | 5 |
| కుట్టుమెషీన్లు, విడిభాగాలు | 12 | 5 |

# బీఆర్‌ఎస్ హస్తగతానికి కుట్ర..


మీడియా సమావేశంలో రాజీనామా పత్రాలను చూపుతున్న కవిత

**హరీశ్‌రావు, సంతోష్‌రావు కుట్ర చేస్తున్నారు**

**మీడియా సమావేశంలో కల్వకుంట్ల కవిత**

- హరీశ్, సంతోష్ మేక వన్నె పులులు..
- మా కుటుంబం, తెలంగాణ మంచి కోరుకునే వాళ్లు కాదు
- వాళ్లను పక్కన పెడితేనే పార్టీ బతికి బట్ట కడుతుంది
- నన్ను పార్టీ నుంచి బయటకు పంపి బలి చేశారు..ఇది ఇంతటితో ఆగదు
- నాన్న కేసీఆర్‌కు, రామన్నకు కూడా ఇలాంటి ప్రమాదమే పొంచి ఉంది
- మా కుటుంబం విచ్ఛిన్నమైతే వారికి అధికారం వస్తుంది కాబట్టే కుట్ర
- హరీశ్.. సీఎం రేవంత్ కాళ్లు పట్టుకున్న నాటి నుంచే కుట్రలు మొదలు
- నాపై కుట్రల విషయం ప్రెస్‌మీట్ పెట్టి చెప్పినా రామన్న స్పందించలేదు
- హరీశ్ వల్లే ఈటల, జగ్గారెడ్డి తదితరులు పార్టీ వదిలి వెళ్లారు
- కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని కోరుకుంటున్నానన్న కవిత
- నాన్నా.. మీ చుట్టూ ఏం జరుగుతోందో చూసుకోండి అంటూ హితవు
- ఎమ్మెల్సీ పదవికి, బీఆర్‌ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: 'బీఆర్‌ఎస్ పార్టీని హస్తగతం చేసుకునేందుకు హరీశ్‌రావు, సంతోష్‌రావు కుట్ర చేస్తున్నారు. అందులో భాగంగా నన్ను పార్టీ నుంచి బయటకు పంపారు..' అని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. 'నాన్నా.. దయచేసి మీ చుట్టూ ఏం జరుగుతోందో చూసుకోండి. నేను కూడా మీలా ముక్కుసూటి మనిషిని కాబట్టి నన్ను పార్టీ నుంచి బయటకు పంపి బలి చేశారు. రేపు మీకూ, రామన్నకు కూడా ఇలాంటి ప్రమాదమే పొంచి ఉంది..' అని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి తనను సస్పెండ్ చేసిన నేపథ్యంలో బుధవారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. పార్టీ ద్వారా తనకు లభించిన ఎమ్మెల్సీ పదవితో పాటు బీఆర్‌ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ మిగతా 12వ పేజీలో ▶


బచ్చల నర్సమ్మ ఇంటి వద్ద ఆమె కుటుంబంతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, వాకిటి శ్రీహరి, ఎంపీ రఘురాంరెడ్డి తదితరులు

# మీ పంచాయితీల్లోకి మమ్మల్ని లాగొద్దు

**ఏదైనా ఉంటే కుటుంబంలో కూర్చొని మాట్లాడుకోండి..**

**కుల పెద్ద దగ్గరకు వెళ్లండి.. కుదరకపోతే మంత్రగాని దగ్గరకు పోండి**

**కేసీఆర్ కుటుంబాన్ని ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు**

3లో

- ఒకప్పుడు రాష్ట్రంలో ఏ పార్టీ కూడా ఉండకూడదని చూశారు
- ఇప్పుడు కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకుంటున్నారు
- తాను తెలంగాణ ప్రజల వెనుక ఉంటానని వెల్లడి
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం

## ఉప ఎన్నికపై దృష్టి పెట్టండి

- పార్టీ నేతలకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశం
- ఎర్రవల్లి నివాసంలో కేటీఆర్ తదితరులతో భేటీ



సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో పాటు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలపై దృష్టి కేంద్రీకరించాలని బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పార్టీ నాయకులను ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల దిశగా పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయడానికి అనుసరించాల్సిన కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. ఎర్రవల్లి నివాసంలో బుధవారం పార్టీ అధినేత కేసీఆర్‌తో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, జి.జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ సంతోష్ భేటీ అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ తరహా ఎజెండాతో ప్రజల్లోకి వెళ్లాలనే అంశంపై మిగతా 12వ పేజీలో ▶


6లో

**ఎదురులేనంతగా ఎదుగుతాం: జిన్‌పింగ్**

చైనా మిలటరీ పరేడ్‌లో భూ మండలాన్ని కవర్ చేసే భారీ క్షిపణి ప్రదర్శన

# విద్యార్థులతో టీచర్లూ భోజనం!




**ఫుడ్ పాయిజన్ సమస్యకు ఇదే పరిష్కారమన్న హైకోర్టు**

- వారు నాణ్యతపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటారని వ్యాఖ్య
- విద్యార్థులు స్కూల్ పనుల్లో భాగస్వాములైతే తప్పేంటి? అని ప్రశ్న
- తాను కూడా చిన్నప్పుడు పాఠశాలలో పనులు చేశానన్న సీజే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు అక్కడే భోజనం చేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. ఫుడ్ పాయిజన్ (కలుషితాహారం) ఘటనల సమస్యను ఇది పరిష్కరిస్తుందని అభిప్రాయపడింది. నాణ్యతపై వారు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని వ్యాఖ్యానించింది. ప్రతీ స్కూల్ విద్యార్థికి ఎంత మొత్తంలో ఆహారం ఇస్తారు? ఏమేమి ఇస్తారు? ఎలా అందిస్తారు? న్యూట్రిషన్ ఎలా లెక్కిస్తారు?.. ఇలా పూర్తి వివరాలతో స్థాయి నివేదికను అందజేయాలని ఆదేశించింది. శ్రమను గౌరవించే గుణం అలవడాలంటే ముందు కష్టం తెలియాలని.. విద్యార్థులు పాఠశాల పనుల్లో భాగస్వామ్యమైతే తప్పేంటని ప్రశ్నించింది. చిన్నతనం నుంచే వారికి తమ పనులు తాము చేసుకోవడం అలవాటు చేయాలని సూచించింది. ఈ కేసుకు మిగతా 3వ పేజీలో ▶

## ఒత్తిడి.. ఆందోళన ఇవేనయా ప్రపంచాన!



ఆర్థికంగా ఎదగాలన్న ఆశ, సామాజికంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలన్న ఆకాంక్ష .. ఈ పోటీ ప్రపంచంలో మనుషుల్ని మానసిక రోగులుగా మార్చేస్తున్నాయి. పైకి ఆరోగ్యంగా కనిపిస్తున్నా.. మనుషుల్లో ఒత్తిళ్లు, మనో వైకల్యాలు అధికంగా ఉంటున్నాయి. 16లో

# అప్పుడే మొదలైంది!



**సెప్టెంబర్ నెల ప్రారంభంలోనే రూ.6 వేల కోట్ల అప్పు..**

- రాష్ట్ర ఖజానా కటకట.. ఆశించిన మేర రాని ఆదాయం
- పెరుగుతున్న ఖర్చులతో అప్పులు
- అప్పుల మాసంగా సెప్టెంబర్.. త్వరలో మరో రూ.3 వేల కోట్లు సేకరణ?.. రూ.35 వేల కోట్లు దాటనున్న ఆరునెలల రుణ పద్దు
- ఈ నెలలో అన్ని శాఖల ఉద్యోగులకు రాని వేతనాలు.. కాంట్రాక్టు బిల్లుల చెల్లింపులు నెలాఖరులోనే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఖజానా కటకటలాడుతోంది. ఆదాయం తక్కువై..ఖర్చులు ఎక్కువ కావడంతో అప్పులు చేయాల్సి వస్తోందని గణాంకాలు చెబుతున్నాయి. ప్రతి నెలా రూ.12 వేల కోట్లకు మించి ఆదాయం రాకపోవడం, అదే సమయంలో రూ.18 వేల కోట్ల వరకు అనివార్య ఖర్చులు చేయాల్సి వస్తుండటంతో అప్పుల పద్దు ప్రతి నెలా పెరిగిపోతోంది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే ముగిసిన ఐదు నెలల కాలం కంటే అదనంగా సెప్టెంబర్ నెల ప్రారంభంలోనేప్రభుత్వం ఏకంగా రూ.6 వేల కోట్ల అప్పు తీసుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా బహిరంగ మార్కెట్‌లో సెక్యూరిటీ బాండ్లను వేలం వేయడం ద్వారా ఈ మొత్తాన్ని సమకూర్చుకుంది. కాగ్ వెల్లడించిన గణాంకాల ప్రకారం ఈ ఏడాది జూలై 31 వరకు చేసిన రూ.25వేల కోట్లకు తోడు ఆగస్టు నెలలో తీసుకున్న రూ.3వేల కోట్లు, ఈ నెలలో తీసుకున్న రూ.6వేల కోట్లు, ఈనెలలోనే ఇంకా ప్రభుత్వం తీసుకుంటుందని భావిస్తున్న మరో రూ.3వేల కోట్లు కలిపి తొలి ఆరు నెలల్లోనే రాష్ట్ర రుణపద్దు రూ.37వేల కోట్లకు చేరుతుందని అంచనా. ఇది మొత్తం ఏడాది కాలంలో అప్పుల రూపంలో బహిరంగ మార్కెట్ ద్వారా సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న దాదాపు రూ.64వేల కోట్లలో 50 శాతం కంటే రూ.5వేల కోట్లు ఎక్కువే కావడం గమనార్హం.

### కనాకష్టంగా సర్దుబాటు

వాస్తవానికి, ఈ ఆర్థిక సంవత్సర ప్రారంభం నుంచే నిధుల సర్దుబాటు కష్టంగా మారింది. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలల కాలంలో సొంత పన్నుల ఆదాయం పెద్దగా పెరగలేదు. జీఎస్టీ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లతోపాటు ఎక్సైజ్, అమ్మకపు పన్ను, కేంద్ర పన్నుల్లో వాటా, గ్రాంట్ ఇన్ ఎయిడ్... ఇలా అన్ని రాబడి మార్గాలు కలిపినా గత ఏడాది కంటే పెద్దగా మిగతా 3వ పేజీలో ▶



## ఇదండీ సంగతి





అలాగే మన బంధాన్ని కూడా వారు గౌరవిస్తే బావుండేది!

## 6న నిమజ్జనం సెలవు

సాక్షి, హైదరాబాద్: వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని పురస్కరించుకుని ఈనెల 6వ తేదీన హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశా రు. బదులుగా అక్టోబర్ రెండో శనివారం 11వ తేదీన ఈ మూడు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు పనిచేస్తాయని అందులో స్పష్టం చేశారు.

## అలయ్ బలయ్‌కు హాజరవ్వండి

### మాజీ గవర్నర్ దత్తాత్రేయ



సాక్షి, న్యూఢిల్లీ: విజయదశమిని పురస్కరించుకుని అక్టోబర్ 3న హైదరాబాద్‌లో జరగనున్న అలయ్ బలయ్-2025 కార్యక్రమానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆహ్వానాలు అందిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన బుధవారం హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీని, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరినీ అలయ్ బలయ్ వేడుకలో పాల్గొనాలని దత్తాత్రేయ ఆహ్వానించారు.



ఏదైనా ప్రమాదం జరుగుతుంది.. తలకు పెద్ద దెబ్బ తగులుతుంది. లోపల ఏం జరిగిందో వెంటనే ఎవ్వరికీ తెలీదు. మెదడులో రక్తస్రావం అయిందో.. రక్తం గడ్డ కట్టిందో.. అది మెదడుపై ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలీదు. అది చిన్నది లేదా చాలా తీవ్రమైన సమస్య కావచ్చు. దానివల్ల మెదడు పనిచేయకపోవచ్చు.. దీర్ఘకాల అనారోగ్య సమస్యలకు లేదా మానసిక సమస్యలకు దారితీయవచ్చు.. ఆఖరికి ప్రాణాలూ పోవచ్చు. ఇలా మనదేశంలో ఏటా సుమారు 20 లక్షల మంది గాయపడుతుంటే.. 10 లక్షల మంది మరణిస్తున్నారు! మరి, దీనికి పరిష్కారం లేదా? 'సెరెబో' ఉందంటున్నాయి భారతీయ వైద్య పరిశోధనా మండలి, ఎయిమ్స్ భోపాల్ వంటి సంస్థలు.

- సాక్షి, స్పెషల్ డెస్క్




# సెరెబో.. మెదడు పాలిట సంజీవని!

గ్రామీణ ప్రాంతాల్లో.. సీటీ స్కాన్, ఎమ్మారై వంటి అధునాతన డయాగ్నస్టిక్ పరికరాలు ఉండవు. పట్టణంలోని ఆసుపత్రికి తీసుకెళ్లి ఆ పరీక్ష చేసేలోగా పరిస్థితి చేయిదాటిపోవచ్చు. ఒకవేళ ఆసుపత్రికి తీసుకెళ్లినా.. సీటీ స్కాన్ లేదా ఎమ్మారైకి సమయం పడుతుంది. కొన్నిసార్లు ఆ ఆలస్యమూ ప్రాణాంతకం కావచ్చు. ఇలాంటి సమయాల్లో రోగులకు సంజీవనిలా ఉపయోగపడుతుంది 'సెరెబో'.

### ఎవరు తయారు చేశారు?

భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎమ్ఆర్), మెడికల్ డివైస్ అండ్ డయాగ్నస్టిక్స్ మిషన్ సెక్రెటేరియట్ (ఎమ్‌డీఎమ్ఎస్), ఎయిమ్స్ భోపాల్; జాతీయ మానసిక ఆరోగ్యం, న్యూరో సైన్సెస్ ఇన్‌స్టిట్యూట్ (నిమ్‌హాన్స్), బెంగళూరు; బయోస్కాన్ రీసెర్చ్ సంయుక్తంగా దీన్ని రూపొందించాయి.

### ఎలా పనిచేస్తుంది?

ఎమ్మారై, సీటీ స్కాన్ కంటే చాలా తక్కువ వ్యయంతో దీన్ని తయారుచేశారు. దీని ఖరీదు రూ.15 లక్షలే. మెదడుకు తగిలే తీవ్రమైన గాయాలు (ట్రమాటిక్ బ్రెయిన్ ఇంజురీస్ -టీబీఐ) గుర్తించడంలో ఇది సాయపడుతుంది. మెదడులో రక్తస్రావం లేదా వాపు వంటి వాటిని కేవలం ఒక నిమిషంలోనే పసిగట్టి చెప్పేయడం దీని ప్రత్యేకత. సమస్య తీవ్రతను వెంటనే గుర్తించేందుకు రంగుల్లో (కలర్ కోడెడ్) ఫలితాలు ఇస్తుంది. రేడియేషన్ ప్రమాదం ఉండదు కాబట్టి పూర్తి సురక్షితం. చాలా తక్కువ వ్యయంతోనే ఈ పరీక్ష పూర్తవడం మరో ప్రత్యేకత.

**ఎక్కడెక్కడ వాడుకోవచ్చు?**
అంబులెన్సులు, ట్రామా సెంటర్లు, గ్రామీణ ప్రాంతాల్లోని క్లినిక్‌లు, విపత్తు స్పందన యూనిట్లు

**ఎవరికి ప్రయోజనం?**
ప్రమాదాల్లో తలకు దెబ్బతగిలినవారు, చిన్నారులు, గర్భిణులు

**ఎవరు వాడొచ్చు?**
దీనికి ఎమ్‌డీ చేసిన డాక్టర్లో, సర్జన్లో అవసరం లేదు. ఎలాంటి నైపుణ్యం లేనివారైనా, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎమ్‌ల వంటి వారు కూడా దీన్ని ఉపయోగించి సమస్యను తెలుసుకోవచ్చు. చేత్తోనే దీన్ని పట్టుకుని, తల బయటి నుంచే పరీక్ష చేసేయొచ్చు.

**ఐసీఎమ్ఆర్ ఏమంటోంది?**
'క్లినికల్ ధ్రువీకరణ పూర్తయింది. అవసరమైన సంస్థల నుంచి అనుమతులు కూడా వచ్చాయి. ట్రయల్స్ కూడా పూర్తయ్యాయి. త్వరలోనే దీన్ని అందరూ అత్యవసర వైద్యం, సైన్యానికి సంబంధించిన వైద్య సేవల్లో కూడా వాడొచ్చు.

**రోడ్డు ప్రమాదాలే అధికం**
మెదడుకు తగిలే తీవ్రమైన గాయాలకు ప్రధాన కారణం.. రోడ్డు ప్రమాదాలే. మొత్తం కేసుల్లో 60 శాతం ఇవే. పైనుంచి పడటం లేదా జారి పడిపోవడం వల్ల 25 శాతం, హింసాత్మక సంఘటనల వల్ల మరో 10 శాతం ఇలాంటివి జరుగుతున్నాయి.

## నక్సలిజం ఎక్కడి ఫిలాసఫీ?

### ప్రపంచంలో అతి పెద్ద కుంభకోణం 'కాళేశ్వరం': కేంద్రమంత్రి బండి సంజయ్



వేదికపై విల్లును ఎక్కు పెడుతున్న బండి సంజయ్, రాంచందర్‌రావు


సాక్షి ప్రతినిధి, కరీంనగర్: నక్సలిజం ఫిలాసఫీ.. అని సీఎం రేవంత్‌రెడ్డి అంటే కాంగ్రెస్ కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి దానికి అనుకూలంగా మాట్లాడటం విడ్డూరమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. నక్సలైట్ల చేతిలో ప్రాణాలు కోల్పోయిన కాంగ్రెస్ నేతల కుటుంబ సభ్యులు శ్రీధర్‌బాబు, పర్ణికారెడ్డి నక్సలిజం ఫిలాసఫీని ఆమోదిస్తారా? అని ఆయన ప్రశ్నించారు. నక్సలైట్ల విషయంలో కేంద్రం క్లియర్‌గా ఉందని, వచ్చే మార్చి నాటికి నక్సలిజాన్ని అంతమొందించి తీరుతామని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టాక తొలిసారి బుధవారం కరీంనగర్‌కు వచ్చిన రాంచందర్‌రావుకు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పోలింగ్ బూత్ అధ్యక్ష, కార్యదర్శుల సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. ప్రపంచంలో పెద్ద కుంభకోణం కాళేశ్వరమన్నారు. కేసీఆర్ బిడ్డ కవిత కూడా కాళేశ్వరంలో అవినీతి జరిగిందని అంగీకరించారని పేర్కొన్నారు. కాళేశ్వరం విచారణ విషయంలో కాంగ్రెస్ డబుల్ గేమ్ ఆడుతోందన్నారు.

**అవినీతి సొమ్మును పంచుకోవడంలో వివాదాలు**

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి సొమ్మును పంచుకోవడంలో విభేదాలు తలెత్తడంతోనే బీఆర్‌ఎస్‌లో కొట్లాటలు బయటపడుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. గతంలో ప్రజలు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు అవకాశం ఇచ్చారని, కానీ ఆ రెండు పార్టీలతో మేలు జరగకపోవడంతో ప్రజలు ఇప్పుడు బీజేపీ వైపు చూస్తున్నారని ఆయన చెప్పారు. తెలంగాణలో మార్పు రావాలని, బీజేపీ అధికారంలోకి రావాలని, ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## జస్టిస్ ఘోష్ నివేదిక మీకెక్కడిది?

- అసెంబ్లీలో సభ్యులకిస్తే మీ చేతికెలా వచ్చింది?
- బహిర్గతం చేయవద్దని గతంలోనే ఆదేశాలిచ్చాం కదా?
- మాజీ సీఎస్ ఎస్‌కే జోషిని ప్రశ్నించిన హైకోర్టు
- అఫిడవిట్ దాఖలు చేయాలని పిటిషనర్‌కు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ నివేదిక మీ చేతికెలా వచ్చిందని పిటిషనర్, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషిని హైకోర్టు ప్రశ్నించింది. అసెంబ్లీలో ప్రవేశపెట్టి సభ్యులకు అందజేస్తే వారి వద్దే ఉండాలి కదా? బహిర్గతం ఎలా అవుతుంది? అని ప్రశ్నించింది. నివేదికను ఎలాంటి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచకూడదని, ఒకవేళ ఉంచితే తొలగించాలని గత నెల తాము ఇచ్చిన ఆదేశాలను గుర్తు చేసింది. దీంతో నివేదికను తాము ఎక్కడా అప్‌లోడ్ చేయలేదని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. దీంతో నివేదిక ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలని ఎస్‌కే జోషిని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది. జస్టిస్ ఘోష్ నివేదిక రద్దు చేయాలని కోరుతూ నాటి సీఎస్, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి (రిటైర్డ్) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కమిషన్ సాక్షిగా సమన్లు మాత్రమే జారీ చేసిందని.. చట్టప్రకారం ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని తెలిపారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది.

**ఇప్పుడెలాంటి ఆదేశాలు ఇవ్వలేం...**

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. 'సాక్షిగా పిలిచి మాత్రమే జోషిని కమిషన్ వివరాలు అడిగింది. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ ప్రకారం 8సీ నోటీసులు ఇవ్వలేదు. జోషిని బాధ్యుడిని చేస్తూ చర్యలకు సూచించడం ఆశ్చర్యకరం. ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉన్న ఈ నివేదిక చెల్లదు. జస్టిస్ ఘోష్ నివేదిక రద్దు చేయాలి లేదా స్టే ఆదేశాలు ఇవ్వాలి' అని కోరారు. ఈ క్రమంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుని.. అసలు నివేదిక ఎక్కడి వచ్చిందని ప్రశ్నించారు. శాసనసభలో ప్రవేశపెట్టి అక్కడి సభ్యులకు మాత్రమే ఇస్తే.. మీ చేతికి ఎలా వచ్చిందని అడిగారు. సోషల్ మీడియా నుంచి డౌన్‌లోడ్ చేసుకున్నామని న్యాయవాది బదులివ్వగా, ప్రభుత్వ న్యాయవాది కల్పించుకుని తాము ఏ వెబ్‌సైట్‌లో కూడా నివేదికను అప్‌లోడ్ చేయలేదని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. నివేదిక ఎక్కడి నుంచి తీసుకున్నారో అఫిడవిట్ దాఖలు చేయాలని పిటిషనర్‌ను ఆదేశించారు. ఆ తర్వాతే అతనిపై చర్యలకు సంబంధించి విచారణ చేస్తామని స్పష్టంచేసింది. ఇప్పటికిప్పుడు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని చెబుతూ.. విచారణ వాయిదా వేశారు.

## 6న గణేశ్ నిమజ్జనానికి అమిత్ షా



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 6న హైదరాబాద్‌లో జరిగే గణేశ్ నిమజ్జన కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరు కానున్నారు. ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరుతూ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి (బీజీయూఎస్) నిర్వాహకులు పంపించిన ఆహ్వానంపై అమిత్ షా కార్యాలయం నుంచి బుధవారం సాయంత్రం సానుకూల స్పందన వచ్చింది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రి షెడ్యూల్‌ను ఖరారు చేశారు. దీని ప్రకారం అమిత్ షా శనివారం ఢిల్లీ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.10 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఐటీసీ కాకతీయ హోటల్‌లో ఆయన బసచేస్తారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల మధ్యలో రాష్ట్ర బీజేపీ నేతలతో అమిత్‌షా ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఆ తర్వాత 3 గంటల నుంచి 4 గంటల వరకు బీజీయూఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభిస్తారు. ఈ పర్యటనలో భాగంగానే.. ఐటీసీ కాకతీయ హోటల్ నుంచే ఎస్ఎస్‌బీ బెటాలియన్ హెడ్ క్వార్టర్స్‌కు అమిత్ షా వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఆ తర్వాత సాయంత్రం 4:10 నుంచి 4:55 వరకు మొజంజాహీ మార్కెట్ వద్ద గణేశ్ నిమజ్జన వేడుకల్లో ఆయన పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 5:05 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ఢిల్లీకి అమిత్ షా తిరుగు ప్రయాణమవుతారు.

**గతంలో పాల్గొన్న ప్రముఖులు..**

గతంలో హైదరాబాద్‌లో జరిగిన వినాయక నిమజ్జన ఉత్సవాల్లో .. ఉమ్మడి ఏపీ సీఎం డా.మర్రిచెన్నారెడ్డి మొదలు, అస్సాం సీఎం హిమంతబిశ్వ శర్మ, కేంద్ర మాజీ మంత్రులు ఉమాభారతి, సాధ్వి రీతంబర, ఆరెస్సెస్ ప్రస్తుత సర్ సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్, పూర్వ సర్ సంఘ్‌చాలక్‌లు బాలసాహెబ్ దేవరస్, ప్రొ.రాజేందర్‌సింగ్ (రజ్జూభయ్యా), కేఎస్ సుదర్శన్, వీహెచ్‌పీ అంతర్జాతీయ అధ్యక్షుడు అశోక్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారని సాక్షికి బీజీయూఎస్ ప్రధానకార్యదర్శి డా. రావినూతల శశిధర్ తెలిపారు.

## క్లుప్తంగా...

### నేడు కామారెడ్డి జిల్లాలో సీఎం పర్యటన

సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి జిల్లాలో గతవారంలో కురిసిన భారీ వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయిన వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో తాడ్వాయి మండలం ఎర్రపహాడ్ చేరుకోనున్న సీఎం, అక్కడ నుంచి లింగంపేటలో వరదలకు దెబ్బతిన్న లింగంపల్లి కుర్దు బ్రిడ్జిని పరిశీలిస్తారు. అలాగే బుడిగిడ గ్రామంలో దెబ్బతిన్న పంట పొలాలను సీఎం చూస్తారు. అనంతరం కామారెడ్డి మున్సిపాలిటీలో దెబ్బతిన్న రోడ్లను, జీఆర్ కాలనీని సందర్శించిన తర్వాత కలెక్టర్ కార్యాలయంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు. ఈ సందర్భంగా వరద నష్టంపై జిల్లా అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించనున్నట్లు సీఎంఓ వర్గాలు తెలిపాయి.

### కవిత ఎపిసోడ్ పెద్ద రాజకీయ కుటుంబ డ్రామా

పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్సీ కవిత ఎపిసోడ్ పెద్ద రాజకీయ కుటుంబ డ్రామా అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. తెలంగాణ జాతిపితగా పిలుచుకునే కేసీఆర్ తన కుటుంబ సమస్యను పరిష్కరించుకోలేని బలహీన పరిస్థితుల్లో ఉన్నారా? అని ప్రశ్నించారు. బుధవారం సచివాలయంలో మీడియా ప్రతినిధులతో మంత్రి ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి సొమ్ము, అక్రమ సంపాదన పంపకాల్లో వచ్చిన తేడాలతోనే కేసీఆర్ కుటుంబంలో గొడవలు పెద్దవయ్యాయని చెప్పారు. మాజీ ఎంపీ సంతోష్‌రావు బినామీగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి వందల కోట్లు సంపాదించారని కవిత ఆరోపించారన్నారు. కవిత ఆరోపించిన బినామీ ఆస్తులపై బీఆర్‌ఎస్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. 'మొదట కేటీఆర్‌ను టార్గెట్ చేసిన కవిత.. ఇప్పుడు హరీశ్, సంతోష్‌రావును టార్గెట్ చేశారు. పార్టీ నుంచి కవితను సస్పెండ్ చేసినా ఆమె దిష్టిబొమ్మను దగ్ధం చేయటం దురదృష్టకరం. కాళేశ్వరంలో వేల కోట్ల అవినీతి జరిగిందని కవిత అంగీకరించారు. జగదీశ్‌రెడ్డిని విమర్శిస్తే ఎలాంటి చర్యలు తీసుకోలేదు కానీ హరీశ్, సంతోష్‌రావులపై ఆరోపణలు చేయగానే కవితను సస్పెండ్ చేశారు'అని పేర్కొన్నారు. 2018లో కొడంగల్‌లో రేవంత్‌రెడ్డిని ఓడించేందుకు హరీశ్‌రావు వందల కోట్లు ఖర్చు చేశారన్నారు. నిజంగా హరీశ్‌రావును రేవంత్‌రెడ్డి కాపాడాలనుకుంటే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐతో ఎందుకు విచారణ జరిపిస్తారు? అని సీతక్క వ్యాఖ్యానించారు.

### కాళేశ్వరం కామధేనువని రుజువైంది: ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: అవినీతి సొమ్ములో వచ్చిన పంపకాల్లో తేడా కారణంగానే కవిత బీఆర్‌ఎస్ నుంచి బయటపడ్డారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. కాళేశ్వరం పేరుతో తెలంగాణను కేసీఆర్ కుటుంబం దోచుకుందని, ఆ ప్రాజెక్టు ఆ కుటుంబానికి కామధేనువని కవిత వ్యాఖ్యలతో రుజువైందని ఆయన అభిప్రాయపడ్డారు. బుధవారం శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరంలో అవినీతి జరిగిందని ఒప్పుకున్న కవిత ఆ రోజే ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. కేసీఆర్ కుటుంబ కలహాలతో కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదని, రేవంత్‌రెడ్డి ఎవరినీ వెనుక ఉండి నడిపించడని, ఆయన వెనుకనే ప్రజలుంటారని చెప్పారు. అసలు హరీశ్‌రావు అక్రమాలను బయటపెట్టిందే రేవంత్‌రెడ్డి అన్నారు. ఇన్ని రోజులు కల్వకుంట్ల కుటుంబ సభ్యులు కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకున్నారని కవిత ఎపిసోడ్‌తో తేటతెల్లమైందన్నారు.

## అప్పుడే మొదలైంది

▶ మొదటి పేజీ తరువాయి

మార్పు రాలేదు. ఈ ఏడాది జూలై 31 వరకు కాగ్ వెల్లడించిన గణాంకాల ప్రకారం మొత్తం బడ్జెట్ అంచనాల్లో గత ఆర్థిక సంవత్సరం జూలై నాటికి 26.01 శాతం రాగా, ఈసారి వచ్చింది 26.32 శాతం మాత్రమే. అయితే, ఖర్చుల్లో మాత్రం అనివార్య చెల్లింపులకు తోడు అనూహ్య సర్దుబాట్లు అవసరమయ్యాయి. సాధారణంగా ఇచ్చే వేతనాలు, పింఛన్లు, రెవెన్యూ వ్యయం, ప్రభుత్వ నిర్వహణ ఖర్చులు, సబ్సిడీలు, సంక్షేమ పథకాలకు చెల్లింపులతోపాటు అంతకుముందు నెలలో రూ.9వేల కోట్ల మేరకు రైతు భరోసా, గత నెలలో రూ.700 కోట్లకు పైగా ఉద్యోగుల బకాయిలు చెల్లించాల్సి వచ్చింది. కేవలం 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు సమకూర్చుకొని రైతుభరోసా చెల్లించిన తర్వాత ఖజానా పరిస్థితి మరింత కష్టంగా మారిందని ఆర్థికశాఖ వర్గాలంటున్నాయి. ఈ నేపథ్యంలోనే నిధుల సర్దుబాటుకు వేస్‌అండ్ మీన్స్, ఓవర్ డ్రాఫ్టలకు వెళుతున్నామని, ఇది సాధారణమే అయినా అనూహ్యంగా ఖర్చులు వస్తే మాత్రం అప్పులు చేయక తప్పడం లేదని ఆ శాఖ వర్గాలు చెబుతుండడం గమనార్హం. కాగా, ఈ నెల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలకు సంబంధించి ఇంకా కొన్ని శాఖలకు నిధులు విడుదల చేయలేదని తెలుస్తోంది. మార్కెటింగ్ తదితర శాఖల ఉద్యోగులకు ఇంకా వేతనాలు అందలేదని సమాచారం. కాగా, నిధుల సర్దుబాటు కాక ప్రతి నెలా కాంట్రాక్టు బిల్లుల చెల్లింపులను నెలాఖరు వరకు వాయిదా వేస్తున్నారని, అప్పుడు వచ్చే నిధులకు అనుగుణంగా చివరి రోజుల్లో వీలున్నన్ని బిల్లులు మంజూరు చేస్తున్నారని తెలుస్తోంది.



బుధవారం దామరచర్లలో నిర్వహించిన సభకు హాజరైన ప్రజానీకం



ఎస్‌జీడీ ఫార్మా కార్నింగ్ టెక్నాలజీస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, మల్లురవి, యెన్నం, పర్ణికారెడ్డి

# మీ పంచాయితీల్లోకి మమ్మల్ని లాగొద్దు

**ఏదైనా ఉంటే కుటుంబంలో కూర్చొని మాట్లాడుకోండి..**

- కేసీఆర్ కుటుంబాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

సాక్షి ప్రతినిధులు, భద్రాద్రి కొత్తగూడెం/మహబూబ్‌నగర్: 'ఏమైనా సమస్యలు ఉంటే కుటుంబంలో కూర్చుని చర్చించుకుని పరిష్కరించుకోండి.. కాదంటే కుల పెద్ద దగ్గరకు వెళ్లండి.. అదీ కుదరకపోతే మంత్రగాన్ని సంప్రదించండి. అంతేతప్ప మీ గొడవల మధ్యకు మమ్మల్ని ఎందుకు లాగుతున్నారు? ఒకప్పుడు రాష్ట్రంలో ఏ పార్టీ కూడా ఉండకూడదని చూశారు. అక్రమ కేసులు పెట్టి ఎంతోమందిని జైళ్లకు పంపించారు. ఇప్పుడు వాళ్లకు వాళ్లే కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకుంటున్నారు. నేను హరీశ్‌రావు, సంతోష్‌రావు వెనుక ఉన్నానని ఒకరు.. కవిత వెంట ఉన్నానని మరొకరు అంటున్నారు. పదేళ్లలో దోచుకున్న అవినీతి సొమ్మును పంచుకోవడానికి వాళ్లు కొట్లాడుకుంటున్నారు. ఆ చెత్తగాళ్ల వెనుక నేనెందుకుంటా? మిమ్మల్ని ఎప్పుడో ప్రజలు తిరస్కరించారు. నేను నాయకుడిని.. ఉంటే ముందే ఉంటా. పాలమూరు వెనుక, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల వెనుక ఉంటా. వారికి తోడుగా ఉంటా. ప్రజల అభివృద్ధికి కృషి చేస్తా. మీ కుటుంబ, మీ కుల పంచాయితీల్లోకి మమ్మల్ని లాగొద్దు. మాకు ఎలాంటి ఆసక్తి లేదు..' అని మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబాన్ని ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడులో ఆయన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం నిర్వహించారు. అనంతరం దామరచర్లలో నిర్వహించిన సభలో ప్రసంగించారు. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం వేముల శివారులోని ఎస్‌జీడీ ఫార్మా కార్నింగ్ టెక్నాలజీస్ రెండవ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కూడా మాట్లాడారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

**చచ్చిన పామును నేనెందుకు చంపుతా..**

లక్షల కోట్లు దోచుకున్న నాయకుని ఇంట్లో ఈ రోజు నోట్ల కట్టల కోసం పొడుచుకుంటున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని వాళ్లకు ఫామ్‌హౌస్‌లు, టీవీ చానళ్లు, వార్తా పత్రికలు, బంగ్లాలు ఎన్నో ఆస్తులు సంపాదించి ఇచ్చాడు. కానీ ఈ రోజు ఆ ఇంట్లో ప్రశాంతత లేకుండా పోయింది. కుటుంబ సభ్యులే ఒకరితో ఒకరు కొట్లాట పెట్టుకుంటున్నారు. ఆ గొడవల వెనక మనం ఉన్నామంటున్నారు. 2023 డిసెంబర్‌లోనే ఆ కాలనాగును తెలంగాణ ప్రజలు కర్రలతో కొట్టారు. అది ప్రజలను దోచుకుంటున్న అనకొండ అని పెద్ద బండరాయితో తలమీద కొట్టి బొంద పెట్టారు. ఆ చచ్చిన పామును నేను ఎందుకు చంపుతాను.

**ప్రకృతి శిక్షిస్తూనే ఉంటుంది..**

ఒకప్పుడు జనతాపార్టీకి గొప్ప పేరు ఉండేది. అది కనుమరుగైంది. కొంతమంది కుట్రల వల్ల తెలుగుదేశం పార్టీ తెలంగాణలో సమస్యను ఎదుర్కొంటోంది. ఇన్ని దుర్మార్గాలు చేసిన మీరు ఎట్లా మనుగడ సాగిస్తారు? ప్రకృతి అనేది ముందుంది.. అది శిక్షిస్తూనే ఉంటుంది. చేసిన పాపాలు వెంటాడుతూనే ఉంటాయి. అనుభవించి తీరాల్సిందే.

**శీనన్నపై నా అంచనాలు తప్పలేదు**

ఈ రోజు నాయకపోడు మహిళ రమణమ్మకు చెందిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు ఆమె కళ్లలో కనిపించిన ఆనందం చూస్తుంటే.. గతంలో జూబ్లీహిల్స్‌లో డూప్లెక్స్ ఇల్లు కట్టుకున్నప్పుడు నేను పడిన సంతోషం గుర్తుకొచ్చింది. ఆ సంతోషం డబ్బుతో వచ్చేది కాదు. పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు నాకు బలమైన మనిషి అవసరం పడింది. అందుకే హైకమాండ్ దగ్గర పట్టుబట్టి మరీ గృహ నిర్మాణ శాఖను పొంగులేటి శీనన్నకు కేటాయించా. నా అంచనాలు తప్పలేదు.. ఢిల్లీ ముందు తలదించుకోవాల్సిన అవసరం లేకుండా అప్పగించిన పనిని 99.99 శాతం శీనన్న నెరవేరుస్తాడనే నమ్మకం ఉంది. వైఎస్సార్ హయాంలో 2004లో మొదలైన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా 20 లక్షల ఇళ్లు కట్టించాం. హనుమాన్‌గుడి లేని ఊరు ఉంటుందేమో కానీ ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు ఉండదు.

**పాలమూరును చూడటానికి విదేశీయులు రావాలి**

ఒకప్పుడు పాలమూరులో మన కరువును, పేదరికాన్ని, వెనుకబాటుతనాన్ని చూపించడానికి అప్పటి ముఖ్యమంత్రులు విదేశాల నుంచి పర్యాటకులు, ప్రెసిడెంట్లను తీసుకొచ్చారు. టోనీబ్లెయిర్ వచ్చిండంటే మన పేదరికం ఎగ్జిబిషన్‌గా ఉండే. ఇప్పుడు ప్రజలు, మన సాగునీటి ప్రాజెక్టులు, విద్యావసతులు చూడడానికి విదేశాల నుంచి రావాలి. దేవరకద్ర ఎమ్మెల్యే కోరినట్లు డ్రైపోర్టు ఏర్పాటు అంశాన్ని పరిగణనలోకి తీసుకొంటాం. విదేశాల నుంచి మేధావులు ఇక్కడి ట్రిపుల్ ఐటీని చూసేందుకు రావాలి.

**దత్తత గ్రామానికే న్యాయం చేయలేదు: మంత్రి పొంగులేటి**

దామరచర్ల సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వాసాలమర్రి గ్రామాన్ని సీఎం హోదాలో కేసీఆర్ దత్తత తీసుకున్నారని, ఆ గ్రామంలో ఓ 90 ఏళ్ల అవ్వకు ఇల్లు కట్టించి ఇస్తానని హామీ ఇచ్చి నిలుపుకోలేదని విమర్శించారు. కానీ తమ ప్రభుత్వం ఆ అవ్వకు ఇందిరమ్మ ఇల్లు కట్టించి ఇచ్చిందని తెలిపారు.

**గృహ ప్రవేశం చేసి.. పట్టు వస్త్రాలు అందజేసి..**

సీఎం బెండాలపాడు చేరుకోగానే స్థానికులు ఆయనకు కొమ్ముకోయ నృత్యాలతో స్వాగతం పలికారు. నాయక్‌పోడు మహిళ బచ్చల రమణ ఇంటికి సీఎం వెళ్లారు. రిబ్బన్ కట్ చేసి లోపలికి వెళ్లి అన్ని గదుల్లో కలియదిరిగారు. దేవుడి పటాల ముందు జ్యోతి వెలిగించి కుటుంబ సభ్యులకు పట్టు వస్త్రాలు అందజేశారు. ఇంటి ఆవరణలో మొక్కలకు నీరు పోశారు. అనంతరం కుటుంబ సభ్యులతో గ్రూప్ ఫొటో దిగారు. ఆ తర్వాత బచ్చల నర్సమ్మ ఇంటి గృహప్రవేశంలో సీఎం పాల్గొన్నారు. ముందు గదిలో చాపపై కూర్చుని మిఠాయిలు తిన్నారు. ఇంటి యజమానురాలి మనవరాలికి పాయసం తినిపించారు. వారికి వస్త్రాలు అందజేసి గ్రూప్ ఫొటో దిగారు. కాగా సీఎం రేవంత్‌రెడ్డిని, మంత్రి పొంగులేటిని ఇందిరమ్మ ఇంటి యజమానులు సత్కరించారు.

### మీ పిల్లలకు కొరియా, జపాన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తా

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి**

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: 'ఐటీ చదివిన వారు అమెరికాలో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. అందరికీ ఐటీ కోర్సులు చదివే అవకాశం రాకపోవచ్చు. సాధారణ విద్యతోనే సరిపెట్టుకోవాల్సి రావొచ్చు. ఇలాంటి వారికి కూడా ఏటీసీలతో స్కిల్స్ నేర్పించి సింగపూర్, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో ఉద్యోగం చేసే అవకాశాన్ని మా ప్రభుత్వం కల్పిస్తుంది'అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దామరచర్ల సభలో రేవంత్ బుధవారం మాట్లాడుతూ.. గత సీఎం ప్రజలను గొర్రెలు కాసుకోమని, చేపలు పట్టుకోమని, చెప్పులు కుట్టుకోమని చెప్పి.. ఆయన పిల్లలను రాజ్యాలు ఏలాలి, ప్రజా సంపద దోచుకోవాలని చెప్పారని విమర్శించారు. తమ ప్రభుత్వం అలా ఉండదని, పేదరికం రూపుమాపే, తలరాతను మార్చే శక్తి ఉన్న విద్యను అందించడంపై దృష్టి పెడుతోందని తెలిపారు. కొందరు నాయకులకు పేదరికం ఎక్స్‌కర్షన్ వంటిదని, కానీ తనతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేదరికంలోనే పుట్టి, అందులోనే పెరిగామని చెప్పారు. అది తమ జీవన విధానంలో ఓ భాగమని అన్నారు.

### తల్లులూ సంతోషంగా ఉన్నారా?!



నరసమ్మ మనవరాలికి స్వీట్ ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

చంద్రుగొండ: 'తల్లులూ.. సంతోషంగా ఉన్నారా? మేం వచ్చాక రేషన్‌కార్డులు, సన్న బియ్యం ఇచ్చాం.. ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం.. మీ ఊర్లో ఎందరికి ఇళ్లు వచ్చాయి?'అని చంద్రుగొండ మండలం బెండాలపాడులో గృహప్రవేశాల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మహిళలను ఆరా తీశారు. సీఎం ప్రశ్నకు మహిళలంతా ముక్తకంఠంతో 310 మందికి వచ్చాయని సమాధానం చెప్పారు. దీంతో సీఎం స్పందిస్తూ 'మీ కళ్లల్లో సంతోషమే మీరు ఎంత ఆనందంగా ఉన్నారో చెబుతోంది'అని అన్నారు. మీ ఇంటి మంత్రి ఎవరు? అని సీఎం ప్రశ్నించగా.. ఆదివాసీ మహిళలు 'పొంగులేటి అన్న'అని చెప్పారు. 'దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు ఇళ్లు కట్టుకుంటే.. మళ్లీ ఇప్పుడు ఇళ్ల నిర్మాణాలతో కళ కనిపిస్తోంది'అని సీఎం తెలిపారు. బెండాలపాడులో బచ్చల రమణ, బచ్చల నరసమ్మ ఇళ్ల గృహప్రవేశాలు చేయించిన సీఎం పూజ చేశారు.

**ఇల్లు రావడమే గొప్ప అనుకున్నాం..**

ఇందిరమ్మ ఇల్లు రావడమే గొప్ప అనుకున్నా. అలాంటిది ఇంటి నిర్మాణం పూర్తి కావడం.. స్వయంగా ముఖ్యమంత్రి మాకు బట్టలు పెట్టి గృహప్రవేశం చేయించడాన్ని నమ్మలేకపోతున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం మేలు మరిచిపోలేము. సీఎం సార్‌ను శాలువాతో సన్మానించాం. నా కూతురు ఝాన్సీ, ఆమె బిడ్డ వెన్నెలతో సీఎం మాట్లాడి పేర్లు అడిగారు.

– బచ్చల నరసమ్మ, లబ్ధిదారు, బెండాలపాడు

**ఈ సంతోషం మాకెప్పటికీ పదిలం**

రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా మా ఇంటికి వచ్చి మాతో గృహప్రవేశం చేయించడం ఆనందంగా ఉంది. ఈ సంతోషాన్ని జీవితకాలం పదిలంగా గుండెల్లో దాచుకుంటాం. మా ఇంట్లో సీఎం రేవంత్‌రెడ్డి పూజ చేశారు. మేము వండిపెట్టిన పాయసం, గారెలు తిన్నారు. ఇలాంటి పాలన ఉంటే పేదల బతుకులు మారినట్లే.

– బచ్చల రమణ, లబ్ధిదారు, బెండాలపాడు

## నెలకు 175 మీటర్లు తవ్వాలి

- ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనులపై మంత్రి ఉత్తమ్
- సొరంగాల నిపుణుడు హర్పాల్‌సింగ్ బాధ్యతల స్వీకరణ
- నేడు ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష



సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) ప్రాజెక్టు సవరించిన లక్ష్యాల మేరకు సొరంగాన్ని రెండువైపుల నుంచి కలిపి ప్రతి నెలా 175 మీటర్ల మేర తవ్వకాలు జరిపి 2028 జనవరిలోగా పనులు పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇటీవల సవరించిన అంచనా వ్యయంలోపే పనులు పూర్తి చేయాలని స్పష్టంచేశారు. నీటిపారుదల శాఖ గౌరవ సలహాదారుడిగా లెఫ్టినెంట్ జనరల్ హర్పాల్‌సింగ్ బుధవారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టు పనుల పునరుద్ధరణపై మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టులో భాగంగా మొత్తం 44 కి.మీల సొరంగం తవ్వాల్సి ఉండగా, ఇప్పటికే 35 కి.మీ మేర పనులు పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. మిగిలిన 9 కి.మీల మేర మళ్లీ ప్రమాదాలు జరగకుండా అత్యంత జాగ్రత్తగా పనులు చేపట్టాల్సి ఉందని తెలిపారు. కాగా, ఎన్జీఆర్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్వే పురోగతిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. సొరంగం పనులు మూడు షిఫ్టుల్లో జరగాలని, ప్రతి షిఫ్టుకు ఇన్‌చార్జిగా జూనియర్ ఇంజనీర్లను నియమించాలని మంత్రి ఆదేశించారు. సొరంగం పూర్తయితే శ్రీశైలం జలాశయం 824 అడుగుల లోతు నుంచి నీళ్లను తీసుకోగలమని, 840 అడుగుల లోతు నుంచి ఏపీ నీళ్లు తీసుకుంటుండగా, ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టుతో మనం ఏపీని కట్టడి చేయవచ్చని మంత్రి పేర్కొన్నారు.

## హీరో రాజ్‌తరుణ్‌పై మరో కేసు

**దాడి చేయించాడని లావణ్య ఫిర్యాదు**

మణికొండ (హైదరాబాద్): సినీహీరో రాజ్‌తరుణ్‌పై మరో కేసు నమోదైంది. తనపై దాడి చేయించాడని, ఇంట్లోని కుక్కలను చంపేశారని, బంగారం దొంగిలించారని అతని మాజీ ప్రియురాలు లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజ్‌తరుణ్‌తో పాటు మరో ఐదు మందిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజ్‌తరుణ్, లావణ్యతో కలిసి జీవించినపుడు 2016లో కోకాపేటలో విల్లా కొనుగోలు చేశారు. గత సంవత్సరం మార్చిలో రాజ్‌తరుణ్ తనతో కలిసి జీవించాడని, పెళ్లి చేసుకున్నాడని, అబార్షన్ సైతం చేయించి ప్రస్తుతం మరో హీరోయిన్‌తో తిరుగుతున్నాడని లావణ్య నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో 2024 మార్చిలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి రాజ్‌తరుణ్ ఆ విల్లాకు రావటం లేదు. ప్రస్తుతం విల్లాను ఖాళీ చేయాలని తనపై ఒత్తిడి తేవటంతో పాటు తన అనుచరులతో దాడి చేయించాడని ఆమె పేర్కొంది. లావణ్య ఫిర్యాదు మేరకు ఆరుమందిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

**సీఐపై 'హనీట్రాప్' జరిగిందా?**

కాగా, లావణ్య గతంలో ఇచ్చిన ఫిర్యాదుపై విచారణలో భాగంగా అప్పటి క్రైం సీఐ ఆమెకు అనుకూలంగా విచారణ చేశాడని, ఆమెతో హనీట్రాప్‌లో పడ్డాడనే అభియోగాలతో ఆ సీఐపై శాఖాపరమైన చర్యలు తీసుకుని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేసిన విషయం తెలిసిందే. దాంతో ప్రస్తుత కేసు విచారణ బాధ్యతలను ఉన్నతాధికారులు మోకిల పోలీసులకు అప్పగించినట్టు తెలిసింది.

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు

**వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు మంత్రి దామోదర స్పష్టీకరణ**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాలను మరింత మెరుగు పరచడానికి అధికార యంత్రాంగం కృషి చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. హైదరాబాద్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం ఆరోగ్య శాఖ పనితీరుపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, పరికరాల పనితీరుపై అధికారులతో ప్రధానంగా చర్చించారు. ఇందులో భాగంగా గాంధీ ఆస్పత్రి బ్రాండింగ్‌పై, ఆస్పత్రుల్లో శానిటేషన్, ఆపరేషన్ థియేటర్ల ఏర్పాటు, ఎక్విప్‌మెంట్ వినియోగంపై చర్చించారు. ఎమర్జెన్సీ ఎక్విప్‌మెంట్‌లను వెంటనే రిపేర్లు చేయాలని మంత్రి ఆదేశించారు. ఎనిమిదేళ్లు పైబడిన పరికరాలను స్క్రాప్‌గా మార్చాలన్నారు. రాష్ట్రంలోని ఎన్‌సీడీ క్లినిక్‌ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల సహాయకులకు ఐదు అంతస్తులతో సీఎస్‌ఆర్ నిధులతో సౌకర్యవంతమైన భవనాలు నిర్మించాలని ఆదేశించారు. సమీక్షలో ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ, ఆరోగ్య శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్రరెడ్డి, ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

## ఎస్టీఎఫ్‌ల పనితీరుకు పకడ్బందీ కార్యాచరణ

**ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం వెల్లడి**

సాక్షి, హైదరాబాద్: టాస్క్‌ఫోర్స్‌ను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఎక్సైజ్ శాఖ సిద్ధమవుతోంది. డ్రగ్స్, గంజాయి, నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను నియంత్రించడమే లక్ష్యంగా ఆ శాఖ కార్యాచరణ రూపొందించింది. స్టేట్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) పనితీరును మరింత మెరుగుపరిచే ప్రణాళికలు అమలు చేయాలని ఆ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఎస్టీఎఫ్ పనితీరును మెరుగుపరిచే క్రమంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం బుధవారం కీలక సమావేశం నిర్వహించారు. రవాణా శాఖ తనిఖీ కేంద్రాలున్న చోట ఎక్సైజ్‌శాఖ తనిఖీ కేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే ఎక్కడెక్కడ వీటిని ఏర్పాటు చేయాలనే జాబితా రూపొందించాలని, ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకొని ఫైనల్ చేద్దామని ఖాసిం సూచించారు. కేసుల సంఖ్య పెరగాలని, పరిశోధించి పెద్ద కేసులు పట్టుకోవాలని ఆదేశించారు. అనుమతి లేని కల్లు దుకాణాలను వెంటనే మూసివేయాలని సూచించారు. సూర్యాపేట జిల్లాలో వెలుగు చూసిన నకిలీ మద్యం తయారీ కేసులో 31 మంది నిందితులకుగాను 11 మందిని మాత్రమే అరెస్టు చేశారని, మిగిలిన వారిని వెంటనే పట్టుకోవాలని ఆదేశించారు. ఈ కేసును ఛేదించిన ఎస్టీఎఫ్ టీంకు రూ.50 వేల రివార్డును ఖాసిం అందజేసి అభినందించారు.

## కవితను కేసీఆరే నడిపిస్తున్నట్టున్నారు



- టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్
- పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిలో ఆమెకు భాగం లేదా?
- వాటాల్లో పంపకాల కారణంగానే కుటుంబంలో కొట్లాట

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ మాజీ నేత కల్వకుంట్ల కవిత ఎపిసోడ్‌ను కేసీఆరే నడిపిస్తున్నట్టు తమకు అనిపిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. 'కేసీఆర్ కుటుంబమే ఈ వ్యవహారమంతా నడిపిస్తోందేమో? ఆమె కేసీఆర్ విడిచిన బాణమేనేమో?'అని అన్నారు. అంతకుముందు తన అక్కసునంతా కేటీఆర్‌పై వెళ్లగక్కిన కవిత.. ఇప్పుడు అమెరికా వెళ్లి రాగానే తన బాణాన్ని హరీశ్‌రావు వైపు ఎందుకు మరల్చారని ఆయన ప్రశ్నించారు. బుధవారం గాంధీభవన్‌లో మహేశ్‌గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలను మభ్యపెట్టేందుకే ఇదంతా చేస్తున్నట్లు అనుమానం కలుగుతోందన్నారు. తన ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా చేయడం అభినందనీయమని, ఈ పరిణామాన్ని తాము స్వాగతిస్తున్నామని అన్నారు. అయితే ఆమె ఐదేళ్ల క్రితమే పార్టీకి రాజీనామా చేసి పదవులు వదులుకుని ఉంటే ప్రజలు అంగీకరించేవారని పేర్కొన్నారు. తన రాజీనామా సందర్భంగా కవిత కొన్ని కఠోర సత్యాలతో పాటు అర్ధ సత్యాలు, అబద్ధాలు కూడా మాట్లాడారని వ్యాఖ్యానించారు. పదేళ్లు బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కవిత అగ్రభాగాన ఉన్నారని, ఆమెకు భాగం లేకుండానే అవినీతి జరుగుతుందా? అని ప్రశ్నించారు. దొంగల ముఠా కూడా వాటాల పంపకాల్లో తేడా వస్తే దొరికిపోతుందని, అలాగే కేసీఆర్ కుటుంబంలో కూడా వాటాల పంపకాల్లో తేడాలు వచ్చి కొట్టుకుంటున్నారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుంటోందంటూ తాము ఆరేడు సంవత్సరాల నుంచి చెపుతున్న విషయాలనే ఇప్పుడు కవిత చెపుతున్నారని, అందులో కొత్తేమీ లేదని అన్నారు. దోచుకుని, దాచుకుని ఇప్పుడు కవిత నీతి వాక్యాలు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌పై అభాండాలు వేయడం సబబు కాదని, తాము ఎవరి వెనుకా ఉండేది లేదని, ప్రజల వెంట తాముంటే ప్రజలు తమ వెంట ఉంటారని అన్నారు. తాను మొదటి నుంచీ చెపుతున్నట్టుగానే వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్ర రాజకీయ ముఖచిత్రంలో బీఆర్‌ఎస్ ఉండబోదని వ్యాఖ్యానించారు.

## విద్యార్థులతో టీచర్లూ భోజనం!

▶ మొదటి పేజీ తరువాయి

సంబంధించిన తదుపరి విచారణ ఈ నెల 19కి వాయిదా వేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు కమిటీని నియమించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కీతినీడి అఖిల్ శ్రీ గురు తేజ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఫుడ్ పాయిజన్ కేసులకు సంబంధించిన వివరాలు సమర్పించేలా సర్కార్‌ను ఆదేశించాలని కోరారు. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం తాజాగా బుధవారం విచారణ చేపట్టింది.

**ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు..**

పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. 'రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే సౌకర్యాల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు. చట్టప్రకారం స్వచ్ఛమైన పౌష్టికాహారం అందించాలి. కానీ ప్రభుత్వం సరిగా అమలు చేయని కారణంగా విద్యార్థులు తరచూ అస్వస్థతకు గురవుతున్నారు. ఇదే హైకోర్టు మార్గదర్శకాలు జారీ చేసినా, ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసినా.. ఆహార కల్తీ ఘటనలు జరుగుతూనే ఉన్నాయి'అని చెప్పారు.

**బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నాం..**

అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. 'ఫుడ్ పాయిజన్ కారణంగా ఎవరూ చనిపోలేదు. అస్వస్థతకు గురైన విద్యార్థులను ఆస్పత్రిలో చేర్చగా, మరుసటి రోజు డిశ్చార్జ్ అయ్యారు. ఇలాంటి ఘటనల్లో బాధ్యులైన, నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షలకు పైగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భోజనం, టిఫిన్ అందిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. మధ్యాహ్న భోజన నిర్వహణపై కమిటీని ఏర్పాటు చేశాం. ఇందులో కేంద్ర ప్రభుత్వం తరఫున కూడా ఓ సభ్యుడు ఉన్నారు..'అని నివేదించారు.

**వ్యక్తిగతంగా ఎవరి పనైనా చేస్తేనే తప్పు**

సీజే జోక్యం చేసుకుని.. రోజూ పిల్లలతో టీచర్ కూడా కలిసి అక్కడే భోజనం చేసే ప్రక్రియ చేపడితే ఇలాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉండదని అభిప్రాయపడ్డారు. పాఠశాలల్లో విద్యార్థులు పని చేయడం తప్పుకాదని, వ్యక్తిగతంగా ఎవరి పనులైనా చేస్తే మాత్రమే తప్పుబట్టాలన్నారు.



## ఇప్పుడు ప్రజల వద్దకే మంత్రులు వస్తున్నారు

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- కవితను కాంగ్రెస్‌లో చేర్చుకునేది లేదు



సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి అడ్లూరి

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పాలకులెవరూ ప్రజలకు అందుబాటులో ఉండేవారు కాదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంత్రులే ప్రజల వద్దకు వస్తున్నారని ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ప్రతీవారం గాంధీభవన్‌లో నిర్వహించే 'మంత్రులతో ముఖాముఖి'.. కార్యక్రమంలో బుధవారం మంత్రి అడ్లూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఇచ్చిన వినతి పత్రాలను ఆయన స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్‌పై స్పందిస్తూ.. కేసీఆర్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే కవితను లిక్కర్ స్కాంలో అరెస్టు అయినప్పుడే సస్పెండ్ చేయాల్సిందని అన్నారు. హరీశ్‌రావు వెనుక రేవంత్‌రెడ్డి ఉన్నారనేది తప్పుడు ప్రచారమని, అలాంటిదే ఉంటే అసలు కాళేశ్వరంలో అవినీతి విచారణ ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు. కవిత కేవలం రాజకీయ ఆరోపణలు చేస్తున్నారని, ఇంటి పంచాయతీని కాంగ్రెస్ పార్టీపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు.



“ నేను హిందువునైనా, ముస్లింనైనా, పార్సీనైనా, క్రిస్టియన్‌ని అయినా, మరే ఇతర మతానికి చెందినా... అన్నిటినీ మించి మొదట నేను భారతీయుడిని. మన జాతీయత భారతీయత.

– దాదాభాయ్ నౌరోజీ, ‘గ్రాండ్ ఓల్డ్ మ్యాన్ ఆఫ్ ఇండియా’



సాక్షి

గురువారం, 4 సెప్టెంబర్ 2025

# పరువుతీస్తున్న ‘ప్రక్షాళన’!

అనుకున్నదొకటైతే అయింది మరొకటి. బిహార్‌లో ఆఖరి నిమిషంలో ఆదరాబాదరాగా ఎన్నికల సంఘం (ఈసీ) తలపెట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) అసలే అంతంతమాత్రంగా ఉన్న ఆ సంస్థ ప్రతిష్ఠను మరింత దెబ్బ తీసింది. ఓటర్లలో దొంగలున్నారన్న నిర్ణయానికొచ్చి, వారందరినీ ఏరిపారేయాలను కోవటం దీనంతటికీ కారణం. పోనీ అందుకు ప్రాతిపదికేమిటో ఎవరికీ తెలియదు. ఏడెనిమిది నెలల క్రితం ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తానే రూపొందించిన జాబితాలో అవకతవకలున్నాయని అంగీకరించటమంటే తన పనితీరు సరిగా లేదని ఒప్పు కోవటమేనని ఆ సంస్థకు తోచలేదు. 2.74 కోట్ల మంది ఓటర్లలో 99.5 శాతం మంది తమ అర్హతలకు సంబంధించిన పత్రాలు సమర్పించారని ఈసీ సర్వోన్నత న్యాయస్థానానికి చెప్పగా ముసాయిదా జాబితా అవకతవకలు ఒక్కోటే బయటపడి దిగ్భ్రాంతి కలిగి స్తున్నాయి. అర్హులైన ఓటర్లు ఈసీ అడిగిన 11 పత్రాల్లో ఏదో ఒకటైనా దాఖలు చేయటా నికి తిప్పలు పడుతుంటే అనర్హులైనవారు, అనుమానాస్పద వ్యక్తులు దర్జాగా జాబితాలో చోటు దక్కించుకున్నారు. కేవలం 39 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మీడియా సంస్థ ‘రిపో ర్టర్స్ కలెక్టివ్’ నిశితంగా పరిశీలిస్తే అనేక అవకతవకలు బయటపడ్డాయి. ఒకే పేరు, తండ్రి/భర్త పేర్లు ఉండి కనీసం రెండు నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాకెక్కిన 1,87,643 కేసుల్ని ఆ సంస్థ బయటపెట్టింది. కొందరైతే ఒక నియోజకవర్గంలోనే నదురూ బెదురూ లేకుండా ఆ పని చేశారు. మరికొందరు చిరునామాలు మార్చే శ్రమ కూడా తీసుకోలేదు.

‘స్వచ్ఛమైన జాబితా’ రూపకల్పనే ధ్యేయమంటున్న ఈసీ ఈ దొంగ ఓటర్ల విజృం భణకు ఏం సంజాయిషీ ఇస్తుంది? కనీసం అలాంటి విపరీతాలకు కారణమైనవారిపై చర్య తీసుకుంటామని చెప్పటం లేదు. పైగా బిహార్ ప్రధాన ఎన్నికల అధికారి(సీఈఓ) ‘రిపోర్టర్స్ కలెక్టివ్’ వెల్లడించిన అంశాలను ఖండించారు. ఈ క్రమంలో వారు ఎక్కడెక్కడ పొరబడ్డారో చెప్పేందుకు కూడా ప్రయత్నించలేదు. తనకున్న పరిమిత వనరులతో కేవలం 39 చోట్ల ముసాయిదాలో ఒక సంస్థ ఇన్ని లోపాల్ని పసిగట్టగలిగితే, ఓటర్లు అందజేసిన అర్హతా పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి నిగ్గుదేల్చే పనిలో తలమునకలైవున్న వేలాదిమంది ఎన్నికల సిబ్బంది ఏం పనిచేస్తున్నట్టు? వారిపై అధికార పక్షాల ఒత్తిళ్లు న్నాయా? ముసాయిదాలో తొలగించిన 65 లక్షల మందీ ఈసీ దృష్టిలో నకిలీ ఓటర్లు. అందుకోసమే వారి వినతుల్ని పరిశీలించటానికి మొదట్లో ఆ సంస్థ సిద్ధపడలేదు. అందు కోసం సర్వోన్నత న్యాయస్థానం జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. గడువు ముగిసిన సోమ వారం నాటికి కేవలం 33,000 మంది మాత్రమే పత్రాలు సమర్పించారని ఈసీ చెబు తోంది. పొట్ట చేతబట్టుకుని నలు మూలలకూ పోయే సాధారణ కూలీలు, కార్మికులు తమ చిరునామాల్లో ఉండటం, ఈసీ అడిగిన పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించటం అంత తేలికా? చిరునామాల్లో లేకపోతే మరణించినట్టు లేదా శాశ్వతంగా ఆ చిరునామా నుంచి నిష్క్రమించినట్టు ఎన్నికల సిబ్బంది రాసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. అయితే ‘ఓట్ చోరీ’ నినాదంతో ఉద్యమిస్తున్న విపక్షాలు సైతం ఆ సమస్య విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలి. సర్వోన్నత న్యాయస్థానం చెప్పినట్టు రాజకీయ పక్షాలు చురుగ్గా కదలాలి. తమ కార్యకర్తల సాయంతో అర్హులైనవారు ఓటర్ల జాబితాలకెక్కేలా సాయపడాలి.

ఈ మొత్తం వ్యవహారంలో ఎవరిది పైచేయి అవుతుందన్న ప్రశ్న అర్థరహితం. ఎన్నికల నిర్వహణ క్రతువులో తలమునకలై ఉండాల్సిన ఈసీ జవాబుదారీతనాన్ని ప్రద ర్శించాలి. నిలదీస్తున్నదెవరన్న విచికిత్సకు పోకుండా నిజాన్ని నిగ్గుతేల్చి తేల్చాలి. ఎందుకంటే రాగల కాలంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ‘సర్’ అమలు ప్రారంభ మవుతుందని ఆ సంస్థే చెబుతోంది. ప్రతిచోటా ఇదే మాదిరి తప్పుల తడకలతో ఆ ప్రక్రియను సాగిస్తే ఈసీ దేశ ప్రజల దృష్టిలో మాత్రమే కాదు... ప్రపంచ దేశాల ముందు కూడా పలచనవుతుంది. ఓటర్ల జాబితాలో చేరటానికి విధించిన గడువును పొడిగించు కుంటూ పోతే మొత్తం ప్రక్రియ గందరగోళంగా తయారై, తుది జాబితా ఖరారు సమస్యా త్మకమవుతుందంటున్న ఈసీ వాదనల్లో నిజం లేకపోలేదు. కానీ అందుకు బాధ్యత వహించాల్సింది తాను కాదా? అసలు ఎవరూ కోరకుండానే చివరి నిమిషంలో ఈ పెనుభారాన్ని నెత్తిన వేసుకున్నదెవరు? ఈసీ ఆత్మపరిశీలన చేసుకోవాలి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** శు.ద్వాదశి రా.1.46 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ రా.10.35 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ఉ.5.56 నుండి 7.35 వరకు, తిరిగి రా.2.40 నుండి 4.21 వరకు. **దుర్ముహూర్తం:** ఉ.9.55 నుండి 10.44 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.40 వరకు, **అమృత ఘడియలు:** ప.3.54 నుండి 5.34 వరకు.

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం : 6.10
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

## సోషల్ టాక్

### ఛాంపియన్



నువ్వు ఎందులో, ఎంత గొప్ప వ్యక్తి అయినా నీకు క్రమశిక్షణ లేకపోతే నేను నిన్ను లెక్క చేయను. క్రమశిక్షణ అనేది ఒక ఛాంపియన్ జీవనశైలి. ఛాంపియన్‌లు ప్రపంచాన్ని మార్చటానికి ముందు తమను తాము మార్చు కుంటారు.

– మైక్ టైసన్, ప్రొఫెషనల్ బాక్సర్

### బాధ్యత



మీకు సహాయం చేసే అవకాశం ఉంటే, దాన్ని చేయాల్సిన బాధ్యత కూడా మీపై ఉంటుంది. మీకు సహాయం చేసే అవకాశం లేకపోతే ఆ బాధ్యతను ఇంకొకరు స్వీకరించేలా చేయటం కూడా మీ బాధ్యతే!

– జెన్నీఫర్ లారెన్స్, హాలీవుడ్ తార

### వినయం



వినయంగా ఉండండి. మీరు ఎక్కడి నుండి వచ్చారో మర్చిపోకండి ; రగులుతూ ఉండండి. మీ ఆశయాన్ని చల్లారనివ్వకండి ; నిజమైన వ్యక్తిగా ఉండండి. మీతో మీరు కూడా ఎప్పుడూ అబద్ధం చెప్పకండి. ఇవన్నీ కష్టమే! కానీ కట్టుబడి ఉండండి!!

– స్నూప్ డాగ్, ర్యాపర్

### సంతోషం



ఇతరులను సంతోష పెట్టడానికి మిమ్మల్ని మీరు ఇబ్బందికరమైన పరిస్థితు ల్లోకి నెట్టుకోవటం మానే యండి. మీకు మీరు గౌరవం ఇచ్చుకోవటం, మిమ్మల్ని మీరు సంతోషంగా ఉంచుకోవటం మీ కనీస బాధ్యత అని గుర్తుంచుకోండి.

– జయ కిషోరి, ఆధ్యాత్మిక వక్త

### నిద్ర



మీరొక కంపెనీ పెట్టాలను కున్నప్పుడు ప్రతిరోజూ ఉదయం మీరు అదే ఆలోచనతో నిద్ర లేస్తుంటే; అలాగే ప్రతిరోజూ రాత్రి ఆ ఆలోచన మిమ్మల్ని నిద్ర పోనివ్వకుండా చేస్తుంటే... మీరిక నిద్ర మానేయాల్సిన సమయం వచ్చేసిందనే! మీకు అభినందనలు.

– హర్ష్ జైన్, ‘డ్రీమ్ 11’ కో–ఫౌండర్

### టీమ్



లీడర్ మొదట వినాలి. తర్వాతే మాట్లాడాలి. మాట్లాడటం కూడా సంభాషిస్తున్నట్టుగా ఉండాలి. సూచనలు ఇస్తున్నట్లుగా కాదు. ‘పప్పా నోస్ బెస్ట్’ అని యంగ్ జనరేషన్ అనుకోవటం లేదు. అలాగే టీమ్ లీడర్ గురించి టీమ్ సభ్యులు కూడా!

– ప్రబీర్ ఝా, ‘పీపుల్ అడ్వైజరీ’ సీఈవో

# నిషేధించడమే మార్గమా?

విశ్లేషణ



వివాన్ శరణ్

ఆన్‌లైన్ గేమింగ్ ప్రోత్సాహక–క్రమబద్ధీ కరణ బిల్లు (2025)కు పార్లమెంట్ ఉభయ సభలు ఇటీవల ఆమోదం తెలి పాయి. రియల్ మనీ గేమింగ్ (ఆర్‌ఎం జీ)ని నిషేధిస్తూ, ఇ–క్రీడలను, సోషల్ గేమ్‌లను ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యం. నగదు పెట్టి ఆడే గేమ్స్ ఆర్‌ఎంజీ కిందకు వస్తాయి. ప్రత్యక్షంగా లేదా పరో క్షంగా వర్చ్యువల్ ఆస్తుల మార్గాలలో ఆడేవి కూడా అదే కోవలోకి వస్తాయి.

ఆర్‌ఎంజీ సామాజిక, ఆర్థిక, మానసిక పరంగా ప్రజారోగ్యానికి హాని కలిగిస్తోందని దాన్ని నిషేధించడానికి గల కారణాలలో పేర్కొ న్నారు. ముఖ్యంగా యువత ఆర్థికంగా బడుగు వర్గాలకు చెందిన వారు వాటి బారినపడుతున్నారని తెలిపారు.

### పెరుగుతున్న రంగంపై దెబ్బ

ఊహించినట్లుగానే, ఈ బిల్లుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమ య్యాయి. బిల్లు పర్యవసానాలపై ఆదుర్దా సహజంగానే ఆర్‌ఎంజీ ఆటగాళ్ళు, ఉద్యోగులు, ప్లాట్ ఫారమ్ స్థాపకులు, ఈ పరిశ్రమలోని ఇన్వెస్టర్ల నుంచి వ్యక్తమైంది. పన్ను రూపంలో రాబడులున్నా, విదేశీ ఇన్వెస్ట్‌మెంట్ల రూపంలో నిధులు తరలి వస్తున్నా... బేరీజు వేసి చూసినపుడు ప్రజాప్రయోజనాలే ముఖ్యమనిపించాయని ప్రభుత్వం తన నిర్ణయాన్ని సమర్థించుకుంది.

ప్రభుత్వం చెబుతున్న కారణాల్లో కొన్ని లొసుగులున్నాయి. ఈ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఇంచుమించుగా సున్నా. ఇప్పుడిప్పుడే పెట్టుబడులను ఆకర్షిస్తున్న రంగంపైన ప్రభుత్వం విరుచుకుపడటం వింత గొలుపుతోంది. పైగా, ఈ బిల్లుపై చర్చ జరగకుండానే లోక్‌సభ ఆమోదం తెలుపడం గమనార్హం. ఈ బిల్లును సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపవలసిందని కొందరు రాజ్య సభ సభ్యులు కోరారు. కానీ, అసలు సమస్య మరెక్కడో ఉంది. భారతదేశంలో విధాన నిర్ణయాలు సాధారణంగా రెండు విధాలుగా రూపొందుతున్నాయి. ఒకటి– రాజకీయ నాయకులు వారి నియో జక వర్గాల్లోని ప్రజల అభిప్రాయాలను విని బిల్లులు రూపుదిద్దుకునే టట్లు చేయడం. రెండు – మీడియా కథనాలు. ఇది రెండు సమస్య లను సృష్టిస్తోంది.

కాసేపు మిమ్మల్నే ప్రజా ప్రతినిధిగా ఊహించుకోండి. మీ వద్దకు శుభవార్తలు మోసుకొచ్చే పౌరులు అరుదు. ఉద్యోగం, ఆసుపత్రిలో పడక కేటాయింపు, లేదా తీసుకున్న రుణంలో కొంత రాయితీ ఇవ్వాలని కోరడం వంటి పనులతో వస్తారు. డిజిటల్ సేవలలోని సానుకూల కోణాలను వారి నుంచి వినే అవకాశం తక్కువ. ఉద్యోగాల కల్పన, ఉత్పాదకత, లేదా సాంకేతిక పరిజ్ఞాన



- ఆన్‌లైన్ గేమ్‌ల వల్ల ఏర్పడుతున్న ఉద్యోగాల సంఖ్య చిన్నదే అయినా గణనీయమైనదే. ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపుగా రెండు లక్షల మందికి ఉపాధి లభిస్తోంది.
- రియల్ మనీ గేమింగ్‌ను నిషేధించడం వల్ల ఒనగూడగల ప్రయోజనం స్వల్పం. యూనిఫామ్ రిసోర్స్ లొకేటర్లు మళ్ళీ తెరపైకి వస్తారు. అనధికారిక, నియంత్రణ లేని మార్కెట్ కార్యకలాపాలు వృద్ధి చెందుతాయి.

సామర్థ్యాన్ని పెంపొందించడానికి సంబంధించిన అంశాలను వారు ప్రస్తావించరు.

### సమస్య లోతులు పట్టించుకోకుండా...

కోర్టుల మాదిరిగానే, చట్టసభ సభ్యులు కూడా కష్టనష్టాలు, విషాద ఘటనలపైనే ఎక్కువ శ్రద్ధ పెడతారు. ఆర్‌ఎంజీ వల్ల అప్పుల్లో కూరుకుపోయినవారి, ఆత్మహత్యలు చేసుకున్నవారి కథనాలే వారి దృష్టికి వస్తాయి. అయితే, అటువంటి సమస్యలకు మూలాలు ఇంకా లోతున ఉంటాయి. అలా దెబ్బతిన్నవారిలో చాలా మంది నియమ నిబంధలన్నింటినీ తుంగలో తొక్కే విదేశీ ఆపరేటర్ల చేతిలో బాధితులు. మూకుమ్మడిగా అన్నింటినీ నిషేధించడం వల్ల ఇక్కడ ఒనగూడగల ప్రయోజనం స్వల్పం. యూనిఫామ్ రిసోర్స్ లొకేటర్లు మళ్ళీ తెరపైకి వస్తారు. నిషేధించిన ఇతర కార్యకలాపాల విషయంలో మాదిరిగానే, ఈ రంగంలో కూడా అనధికారిక, నియం త్రణ లేని మార్కెట్ కార్యకలాపాలు వృద్ధి చెందుతాయి.

ఆర్‌ఎంజీ వ్యసనం సమస్యను పరిష్కరించేందుకు యాక్సెస్ కంట్రోల్స్ అమలు చేయవచ్చు. తనకు తాను బయటకొచ్చేసే టూల్స్ ప్రవేశపెట్టవచ్చు. అనుమానాస్పద నడతను కనిపెట్టే సదుపాయం కల్పించుకోవచ్చు. రిఫరెల్ హెల్ప్‌లైన్స్‌ను తప్పనిసరి చేయవచ్చు. సకల భారతీయ ఆర్‌ఎంజీ స్టార్టప్‌లను తుడిచిపెట్టేసే బదులు, నిబం ధనలను ఖాతరు చేయని సంస్థలపై జరిమానా విధించవచ్చు.

### వసూళ్లు కురిపిస్తున్నా...

వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ) ద్వారా వచ్చే రాబడులు, ఉపాధి కల్పన సామర్థ్యం అనే రెండు కోణాల నుంచి కూడా ఈ వ్యవహారాన్ని పరిశీలించవచ్చు. విధానాన్ని పన్ను రాబడులు నిర్దేశిం చకూడదని ప్రభుత్వం చెబుతోంది. ఆదర్శనీయమే! కానీ, ఆన్‌లైన్ గేమింగ్‌కు కొత్త జీఎస్టీ విధానాన్ని వర్తింపజేసినప్పటి నుంచి (2023 అక్టోబర్ నుంచి 2024 మార్చి వరకు) ఆరు నెలల్లో వసూళ్ళ స్థాయి, వృద్ధి కొట్టొచ్చినట్లుగా కనిపిస్తున్నాయి. వసూళ్ళు 412% ఎదుగుద లను చూపుతూ రూ. 1,349 కోట్ల నుంచి రూ. 6,909 కోట్లకు పెరి గాయి. ఇవి 2024–25లో 200% పైగా వృద్ధి చెంది రూ. 20,000 కోట్లకు పెరిగాయి. మొత్తంమీద జీఎస్టీ రాబడులలోని 10% వృద్ధితో పోల్చుకుంటే, ఇది ఎంత ఎక్కువ ఉందో చూడవచ్చు. పొగాకు ఉత్పత్తుల ‘పాపపు’ పరిశ్రమ నుంచి ఎంత జీఎస్టీ లభిస్తోందో, అంత మొత్తమూ ఆర్‌ఎంజీ నుంచి కూడా లభిస్తోంది.

ఆన్‌లైన్ గేమ్‌ల వల్ల ఏర్పడుతున్న ఉద్యోగాల సంఖ్య చిన్నదే అయినా గణనీయమైనదే! ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపుగా రెండు లక్షల మందికి ఉపాధి లభిస్తోందని అంచనా. అలాగే ఈ పరిశ్రమకు చెందిన ఒక్కో ఉద్యోగి ద్వారా చేకూరుతున్న ప్రత్యక్ష పన్నులు సుమారు రూ. 10 లక్షల వరకు ఉన్నట్లు మా అంచనా. పొగాకు పరిశ్రమలోని వారి వల్ల ఒక్కొక్కరి నుంచి సుమారు రూ. 1,70,000 మాత్రమే సమకూరుతున్నాయి.

జాతీయ రాజధాని ప్రాంతంలో వీధి కుక్కలను బంధించవల సిందని సుప్రీం కోర్టు ఇటీవల జారీ చేసిన ఆదేశాన్నే చూడండి. వీధి కుక్కలు కరిచినవారి ఫిర్యాదులు, మీడియా కథనాలు, పిటిషన్లపైనే అది ఎక్కువ ఆధారపడినట్లు కనిపించింది. కుక్క కాటుతో రేబిస్ వల్ల మరణిస్తున్న వారి కంటే, దేశంలో పిడుగుపాటు వల్ల మరణి స్తున్న వారి సంఖ్య ఎక్కువ. పైగా ప్రభుత్వ ఆరోగ్య సదుపాయ కేంద్రాలు చాలా వాటిలో రేబిస్ టీకాల కొరత ఉంది. సమస్యలకు మూలకారణాలను వెతికే బదులు, లక్షణాలను చూసి స్పందించే ధోరణిని ప్రభుత్వం ఇక ముందు కూడా కొనసాగించవచ్చు. సమా జంలోని విభిన్న అవసరాలు, ఆకాంక్షలపై స్పందించే విధంగా భారత్ విధానాలను రూపొందించుకోవాలంటే... ముందుగా అది ‘వినే విధానాన్ని’ సవరించుకోవాలి.

*వ్యాసకర్త విధాన నిపుణుడు, ‘వాంక్డ్! ఇండియా ఇన్ సెర్చ్ ఆఫ్ యాన్ ఎకనామిక్ ఐడియాలజీ’ పుస్తక రచయిత*

(‘ద మింట్’ సౌజన్యంతో)

# పారిశుద్ధ్య కార్మికులను పట్టించుకోరా?

నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ ఉన్న మన దేశంలో చేసే పనిని బట్టే గౌరవ మర్యాదలు ఉంటాయి. అందుకే కొన్ని పనులను ఆధిపత్య కులాలవారు చేయడానికి ఇష్టపడరు. ఆ పనులు చేయడానికి ప్రత్యే కించి కొన్ని కులాలవారు ఉన్నారని సమాజం భావిస్తూ ఉంటుంది. ఎందుకంటే పారిశుద్ధ్యం పనులు చేసేవారిలో ఎస్సీ కులాలవారే అత్యధికంగా ఉంటారు. ఎస్టీలూ, అత్యంత వెనుకబడిన బీసీ కులాల వారూ ఒక ఐదు శాతం ఉంటారు. ఏ రంగాల్లో అయినా క్లిష్టమైన పనులకు ఎక్కువ జీతాలు ఇవ్వడం న్యాయం. కానీ అత్యంత కష్ట మైన పనిని చేసే ఈ సఫాయి కార్మికుల వేతనాల గురించి ఎవరూ పట్టించుకోరు. పైగా ‘ఎవరో ఒకరు ఆ పని చెయ్యకపోతే ఎట్లా? అసలు వారినెవరు చేయమన్నారు’ అని అసంబద్ధ వాదన చేస్తారు. ఇక్కడే హక్కుల నేత బాలగోపాల్ ‘అన్యాయం ఎంత దూరంగా జరి గితే న్యాయం వైపున అంత బలంగా నిలబడుతాం. అన్యాయం మనకు దగ్గరవుతున్న కొద్దీ న్యాయం వైపున నిలబడటం అంత కష్టం అవుతుంది’ అన్న మాటల సారం బోధపడుతుంది.

గ్రామాల్లో పనిచేసే ఈ కార్మికులతో పోలిస్తే నగర పారిశుద్ధ్య కార్మికుల జీవితాలు ఇంకా దుర్భరమైనవి. నగరం గుర్రుపెట్టి నిద్ర పోతున్నప్పుడు వీళ్ళు రోడ్ల మీదకు వస్తారు. మనం వదిలిన వ్యర్థాలన్నిటినీ ఒక్కోసారి మెడలోతు మురుగులో మునిగి శుభ్రం చేస్తారు. అటువంటి ఈ మనుషుల పట్ల ప్రభుత్వాలు కనీసం మాన వీయంగా ఆలోచించకపోవడం శోచనీయం. అంతరిక్షం మీద నివా సాలకు అనువైన పరిస్థితులను సృష్టించడం కోసం పరిశోధనలు చేస్తున్న శాస్త్ర, సాంకేతిక పరిశోధనా సంస్థలు... పారిశుద్ధ్య నిర్వహణ కోసం ఆధునిక ఆవిష్కరణలు చేయకపోవడాన్ని ఎట్లా అర్థం చేసుకోవాలి?



- అంతరిక్షం మీద నివాసాలకు అనువైన పరిస్థితులను సృష్టించడం కోసం పరిశోధనలు చేస్తున్న శాస్త్ర, సాంకేతిక పరిశోధనా సంస్థలు... పారిశుద్ధ్య నిర్వహణ కోసం ఆధునిక ఆవిష్కరణలు చేయకపోవడాన్ని ఎట్లా అర్థం చేసుకోవాలి?

ఈ కార్మికులు పని చేసిన తర్వాత తిండి కూడా తినలేరు. సరైన ఆహారం లేకపోవడం, వైద్య సదుపాయాలు అందకపోవడంతో శ్వాసకోశ వ్యాధులు, ఇన్ఫెక్షన్లు, చర్మ వ్యాధులు వంటివాటి బారిన పడుతున్నారు. రోగనిరోధక శక్తి తగ్గి తరచూ రోగాల బారిన పడీ పడీ అత్యంత తక్కువ వయసులో వృద్ధాప్యం పాలై మృత్యువాత పడుతూ ఉంటారు. ఇటువంటివారికి అత్యంత తక్కువ జీతం ఇచ్చి చేతులు దులుపుకొంటే ఎలా? చాలా పెద్ద పెద్ద ఉద్యోగాలను క్రమ బద్ధీకరించిన ప్రభుత్వాలు వీరి ఉద్యోగాలను మాత్రం క్రమబద్ధీకరిం చక వెట్టిచాకిరీ చేయిస్తున్నాయి. ఎప్పుడో కొందరినే పర్మినెంట్ చేస్తూ ఉంటారు. మున్సిపాలిటీల్లో 90 శాతం అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. కనీసం వారికి ఉమ్మడి బీమా సౌకర్యం కూడా ప్రభుత్వం కల్పించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని దశల వారీగానైనా పారిశుద్ధ్య కార్మికులతో మొదలుపెట్టి అన్ని రకాల కార్మికులకీ మెరుగైన జీతాలు ఇవ్వాలి. వారికి ప్రభుత్వం వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యాన్ని అందించాలి. వారి కుటుం బాలకు ప్రత్యేక ఆరోగ్య బీమా సదుపాయాన్ని కల్పించాలి. పారి శుద్ధ్య కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా స్వీకరించాలి. వారికి పదవీ విరమణ అనంతర సౌకర్యాలు కల్పించాలి. ఇలా చేస్తే... సమాజం లెక్క చేయకపోయినా ఈ పని చేసేవారు ఆత్మగౌరవంతో, ఆత్మాభి మానంతో ఉండగలరు. ఆర్థికంగా నిలదొక్కుకుని సమాజంలో ఒక స్థితిలో నిలబడగలరు.

– దిలీప్. వి | మానవ హక్కుల వేదిక

# చక్కెర నుంచి పిల్లల్ని కాపాడాలి!

ఇన్ బాక్స్

సీబీఎస్‌ఈ బోర్డు మే 14న విడుదల చేసిన సర్క్యులర్‌లో పేర్కొ న్నట్లు ఇతర రాష్ట్రాలతో పాటూ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ళన్నిటిలో ‘షుగర్ బోర్డులు’ పెడుతున్నారు.

పంచదార అధిక మోతాదులో ఉన్న జంక్ ఫుడ్స్ తినడం వల్ల పిల్లలలో ఊబకాయం, మధుమేహం ఆందోళనకర స్థాయిలో పెరి గిన రీత్యా ఈ చర్య తీసుకున్నారు. ఇప్పటివరకు కొవ్వు ఆహారాల వల్లే జీవనశైలి వ్యాధులు వస్తున్నాయనీ, కొవ్వులు తగ్గించడమే సమస్యకు పరిష్కారమనీ తప్పుడు ప్రచారం తీవ్ర స్థాయిలో ఉంది. నిజానికి చక్కెర వాడకం అధికం కావడం వల్లే పిల్లలు రకరకాల రుగ్మతలకు గురవు తున్నారు. రోజువారీగా పిల్లలు తీసుకుంటున్న కేలరీలలో పంచదార నుండి వచ్చే కేలరీలు 5 శాతానికి మించకూడదు. మన పిల్లల ఆహారంలో 13 నుండి 15 శాతం (3 రెట్లు) కేలరీలు పంచదార నుండే వస్తున్నట్లు గుర్తించారు.



2010లో ఢిల్లీ హైకోర్టులో ‘ఉదయ్ ఫౌండేషన్’ అనే స్వచ్ఛంద సంస్థ ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేసి జంక్ ఫుడ్స్‌ను నిషేధించ మనడంతో ఈ చర్చ ప్రారంభమయ్యింది. 2015లో కోర్టు ఇందుకు సంబంధించిన నిర్దిష్ట నిబంధనలను రూపొందించమని వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఆదేశించింది. 2013లోనే ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికి జంక్ ఫుడ్స్ అమ్మకాలను స్కూళ్ళలో నిషేధించమని అదే కోర్టు కోరింది. 2019లో తమిళనాడు ప్రభుత్వం జంక్‌ఫుడ్స్‌ను, కూల్‌డ్రిం క్స్‌ను స్కూళ్ళలో నిషేధించింది. పంచదార దట్టించిన ఆహారాలు పిల్లలలో ఊబకాయం, మధుమేహాలనే గాక దంత క్షీణత, గుండె జబ్బులు, బీపీ, మతి మరుపు, మెదడు పనితనం దెబ్బతినడం, డిప్రెషన్ వంటి ఆరోగ్య సమస్యలకు కారణం అవుతున్నట్లు అనేక పరిశోధనల్లో నిర్ధారణ అయింది.

ప్రభుత్వాలు ప్రమాదకరమైన ఈ ఆహారాల తయారీని కట్టడి చేయాలి / నిషేధించాలి. పోషకాహార అంశాల్ని స్కూల్ సిలబస్‌లో భాగం చేయాలి. ఆహారం వండే వర్కుషాపులు కనీసం వారానికొకటి పిల్లలచే చేయించాలి. మన శరీరాలకు బయో క్లాక్ వుంది. హార్మోన్లు విడుదలయ్యే క్రమానికి అను గుణంగా ఆహార వేళలు, నిద్ర వేళలు ఉండాల్సిన అవసరాన్ని చెప్పడమే గాదు, అమలుపరచాలి. ప్రతిరోజూ ఆటలకు, వ్యాయామానికి తగిన సమయం స్కూల్ టైమ్ టేబుల్‌లో కేటాయించాలి.

ప్రజారోగ్య రంగంలో పనిచేస్తున్న వైద్యులుగా, పిల్లల సమగ్ర అభివృద్ధి పట్ల శ్రద్ధ ఉన్న వారిగా మేం ఈ విజ్ఞాపనను ముందు పెడుతున్నాం. తల్లిదం డ్రులు, ఉపాధ్యాయులు, ఆరోగ్యకర పిల్లలతో కూడిన దేశ నిర్మాణం కోరే వారంతా మాతో గొంతు కలపాలని కోరుతున్నాం.

– వైద్యులు, పిల్లల ప్రేమికులు


డేటా పాయింట్

## దక్షిణాది నుంచే అధిక ఐఫోన్లు!

మన దేశం నుంచి ఐఫోన్ ఎగుమతులు భారీగా పెరగడంలో దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక కీలకపాత్ర పోషించాయి.



2024–25లో మొత్తం ఎగుమతుల్లో ఈ 2 రాష్ట్రాల వాటా 78 శాతం. యాపిల్ కంపెనీకి తమిళనాడులో 3 ప్లాంట్లు, కర్ణాటకలో 2 ప్లాంట్లు ఉన్నాయి.




ఆధారం: కేంద్ర వాణిజ్య శాఖ

# ‘దక్షిణ’ సంప్రదాయం

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

చేసిన పనికి ప్రతిఫలం ఇవ్వడాన్ని ‘దక్షిణ’ అనడం మన ఇతిహాస సంప్రదాయం. దీనికి ఆ పేరు రావడం వెనుక పెద్ద కథే ఉంది. గోలోకంలో జరుగుతున్న రాసక్రీడ సందర్భంగా ‘సుశీల’ అనే గోపిక కృష్ణునికి అత్యంత సాన్నిహిత్యంగా ఉండటం వల్ల కోపగించి రాధ అలిగి వెళ్లిపోయింది. ఈ చర్యను అవమానంగా భావించి కృష్ణుడూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటికే రాధ రాసక్రీడ జరిగే ప్రదేశానికి తిరిగి వచ్చి కృష్ణుడు కనిపించక పోవడంతో ఇతర గోపికలతో కలిసి ఆయన కోసం వెతికి వేసారిపోయింది. ఈ వేడుక అంతా భంగం కావడానికి సుశీలే కారణం కనుక వెంటనే ఆమె గోలోకం వదిలి వెళ్ళిపోవాలని రాధ శాసిం చింది. దీంతో సుశీల గోలోకాన్ని వదిలి వెళ్ళి భక్తితో విష్ణువును గురించి తపస్సు చేసింది. విష్ణువు ప్రత్యక్షమై శ్రీమహాలక్ష్మి శరీరంలో కుడి భాగాన సూక్ష్మరూపంలో సుశీల ఉండేటట్లు వరమిచ్చాడు.

ఒకసారి బ్రహ్మదేవుని ఆదేశానుసారం దేవతలంతా లోక కల్యాణహేతువైన యజ్ఞం తలపెట్టారు. ఎంత కాలా నికీ వారు కోరిన ఫలితం రాకపోవడంతో విష్ణువును ప్రార్థించారు. విష్ణువు ప్రసన్నుడై లక్ష్మీదేవి శరీరంలో దక్షిణ భాగంలో ఉన్న ఒక అంశను తీసి బ్రహ్మకిచ్చాడు. ఆ బ్రహ్మ ఆ అంశను అగ్నికిచ్చాడు. ఆ అంశకు దేవతలు ‘దక్షిణ’ అనే పేరు పెట్టారు. అగ్ని ఈ ‘దక్షిణా దేవి’ని వివాహం చేసుకొన్నాడు. వారిరువురికీ కల్గిన పుత్రుడే ‘ఫలితం’.

అప్పటి నుంచి, యజ్ఞములకు దక్షిణ ప్రధాన అంశమయ్యింది. దక్షిణ లేకుండా యజ్ఞయాగాది క్రతువులు పరి పూర్ణమయినట్లు కాదు. కారణం ఈ ‘దక్షిణ’ అగ్నిహోత్రుని ‘భార్య’ కావటం, యజ్ఞాదులలోని హవిస్సును దేవత లకు శ్రద్ధగా అగ్ని చేర్చటం! ఈ దంపతులు క్రతువులకు పరిపూర్ణతను కల్గిస్తున్నారని భావన. యజ్ఞాదులు చేయిం చిన హోత, ఉద్గాత వంటి ఋత్విక్కులకు క్రతు సాద్గుణ్యం కొరకు ధనరూపంలో ఇచ్చేదాన్ని ‘దక్షిణ’ అన్నారు. ఈ దక్షిణ ఇవ్వకపోతే, యజ్ఞకర్తకు ‘ఫలం’ దక్కదు. ఆ ‘ఫలితాన్ని’ దక్షిణాగ్నుల యొక్క కుమారునిగా అభివర్ణించారు. ఇది క్రమంగా సంప్రదాయమైంది. ఈ దక్షిణ ప్రేమాభిమాన పూర్వకంగా ఇవ్వటం శ్రేష్ఠం.

## క్లుప్తంగా...

### కార్మిక శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా జాన్సన్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘానికి అనుబంధంగా ఉన్న కార్మిక శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గం బుధవారం ఏర్పాటైంది. కార్మిక శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా బి.జాన్సన్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా శ్యామ్‌సుందర్ రాజు, సహాధ్యక్షుడిగా ఎన్.చంద్రశేఖర్‌గౌడ్, కోశాధికారిగా కె.యాదయ్య, సహాయ కార్యదర్శులుగా కె.రవీందర్‌రెడ్డి, ఎన్.సత్యనారాయణరెడ్డి ప్రచార కార్యదర్శిగా కె.వినీల ఎన్నికయ్యారు. టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక ప్రక్రియ జరిగింది.

### పంట మునిగిందని రైతు బలవన్మరణం


నారాయణ

సాత్నాల: పంట నీట మునిగిందని రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలం గూడా గ్రామంలో జరిగిన ఈ సంఘటనపై ఎస్ఐ గౌతం పవార్ తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన కార్ల నారాయణ (60) తనకున్న మూడెకరాలతో పాటు మరో 12 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరద పోటెత్తి పత్తి, సోయా పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. పెట్టుబడి నిమిత్తం ఇప్పటి వరకు రూ.2.5 లక్షలు ఖర్చవగా, కౌలు డబ్బు మరో రూ.2 లక్షలు కలిపి రూ.4.5 లక్షలు ఎలా చెల్లించాలోనని కొద్ది రోజులుగా మనోవేదనకు గురయ్యాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి పశువుల పాకలో పడుకుంటానని చెప్పి.. అక్కడ ఉంచిన పురుగు మందు తాగి ఉరేసుకున్నాడు. ఉదయం 6 గంటలకు భార్య నర్సమ్మ వెళ్లి చూడగా నారాయణ విగత జీవిగా కనిపించాడు. మృతుని కుమారుడు రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

### నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

ఊట్కూరు: నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందిన సంఘటన నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. తిమ్మారెడ్డిపల్లి తండాకి చెందిన పూనియానాయక్, జయమ్మ దంపతులకు అభిషేక్ (5) ఆకాశ్ (4) ఇద్దరు కుమారులు. వీరు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి జీవనం కొనసాగిస్తున్నారు. వినాయక నిమజ్జనం కోసం రెండు రోజుల క్రితం సొంత గ్రామం తిమ్మారెడ్డిపల్లి తండాకు వచ్చారు. బుధవారం మధ్యాహ్నం ఇద్దరు చిన్నారులు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఇంటికి కాస్త దూరంలో ఉన్న నీటి గుంతలో పడిపోయారు. పిల్లలు కనపడకపోవడంతో కుటుంబసభ్యులు గ్రామం మొత్తం గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో ఇంటి పక్కనే ఉన్న గుంత వద్దకు వెళ్లి చూడగా అందులో చిన్నారులు మృతిచెంది కనిపించారు. ఘటనపై ఎస్ఐ రమేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### వాగులో కొట్టుకుపోయిన ఆటో

- స్థానికుల సాయంతో ప్రాణాలతో బయటపడ్డ ప్రయాణికులు
- ఆదిలాబాద్ జిల్లా సట్వాజిగూడ వద్ద ఘటన


ప్రయాణికులను కాపాడుతున్న స్థానికులు

ఇంద్రవెల్లి: భారీ వర్షం నేపథ్యంలో పోటెత్తిన వరద కారణంగా వాగులో ఆటో కొట్టుకుపోయింది. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం సట్వాజిగూడ వద్ద బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మధ్యాహ్నం నుంచి కురిసిన భారీ వర్షానికి సట్వాజిగూడ వాగు వరదతో ఉప్పొంగింది. ఈ సమయంలో బుర్సన్‌పటర్ గ్రామానికి చెందిన బాలేరావ్ నిఖిల్ అనే ఆటోడ్రైవర్ ఇంద్రవెల్లి మార్కెట్‌కు వచ్చిన 8 మంది ప్రయాణికులను గ్రామానికి తీసుకువెళ్తున్నాడు. ఆటోలో వాగు దాటే క్రమంలో ఒక్కసారిగా వరద ఉధృతి పెరగడంతో వాహనం కొట్టుకుపోయింది. వెంటనే స్థానికులు అప్రమత్తమై అందులోని వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఈ ఘటనలో కొందరికి స్వల్పగాయాలు కాగా మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్సై సాయన్న ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఆటో వరదలో కొట్టుకుపోయిందని స్థానికులు తెలిపారు. అనంతరం కొద్దిదూరంలో నీట మునిగిన ఆటోను పొక్లెయిన్ సాయంతో బయటకు తీశారు.


మహబూబాబాద్ జిల్లా మరిపెడ పీఏసీఎస్‌లో కూపన్ల కోసం గేటు దూకి పరుగెత్తుతున్న మహిళా రైతులు

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట పీఏసీఎస్ ఎదుట యూరియా కోసం బారులుతీరిన రైతులు


వరంగల్ జిల్లా రామలింగాయపల్లి పీఏసీఎస్ వద్ద పడుకునేందుకు బుధవారం రాత్రి దుప్పట్లు, గొడుగులతో వచ్చిన మహిళలు


కామారెడ్డి జిల్లా బీబీపేటలో సుమారు 300 మీటర్ల వరకు లైన్‌లో రైతులు ఉంచిన రాళ్లు, చెట్టు కొమ్మలు, చెప్పలు

# బస్తా కోసం.. బారులేబారులు

- యూరియా కోసం ప్రతీరోజూ రైతులకు కష్టాలే..
- కామారెడ్డి జిల్లా బీబీపేటలో 15 గంటల పాటు అన్నదాతల నిరీక్షణ
- మరిపెడలో టోకెన్ల కోసం గేటు దూకిన మహిళా రైతులు


యూరియా కోసం నల్లగొండలోని ఆగ్రో ఏజెన్సీ వద్ద బారులు తీరిన రైతులు

సాక్షి, నెట్‌వర్క్: గంటల తరబడి బారులు తీరినా... రైతులకు ఒక్క యూరియా బస్తా కూడా దొరకడం గగనమైంది. రోజురోజుకూ యూరియా కష్టాలు తీవ్రతరం అవుతున్నాయి. దీంతో రాస్తారోకోలు, ధర్నాలకు దిగుతున్నారు.

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చూస్తే...యూరియా కోసం జడ్చర్లలో 167 జాతీయ రహదారిపై సిగ్నల్‌గడ్డ వద్ద రైతులు ధర్నా చేశారు. మహమ్మదాబాద్ మండలం నంచర్లగేట్ వద్ద రైతులు రాస్తారోకో చేయడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. రాజాపూర్, బాలానగర్, చిన్నచింతకుంట, మిడ్జిల్ మండలాల్లోని పలు కేంద్రాల వద్ద రైతులు బారులు తీరారు. నవాబ్‌పేటలో వేలాది మంది రైతులు రావడంతో పోలీసు పహారా మధ్య యూరియా పంపిణీ చేశారు.
- నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఉప్పునుంతల పీఏసీఎస్ వద్ద జప్తీ సదగోడుకు చెందిన మొగిలి అనిత క్యూలో నిల్చొని స్పృహతప్పి పడిపోయింది. వనపర్తి జిల్లా గోపాల్‌పేటలో రైతులు ధర్నా చేశారు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం పీఏసీఎస్‌కు రైతులు భారీగా పోటెత్తారు.
- మెదక్ జిల్లా శివ్వంపేట పీఏసీఎస్‌కు తెల్లవారు జాము నుంచే రైతులు పెద్దఎత్తున బారులు తీరారు.
- నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆగ్రో ఏజెన్సీ వద్దకు రైతులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. చిన్నపిల్లల తల్లులు, వృద్ధులు కూడా క్యూ లైన్‌లో నిల్చున్నారు.
- కామారెడ్డి జిల్లా బీబీపేట మండల కేంద్రంలోని సొసైటీకి యూరియా లారీ వస్తుందన్న సమాచారంతో ఉదయం 4 గంటల నుంచే రైతులు క్యూ కట్టారు. గంటల తరబడి వేచి ఉండడం ఇబ్బందిగా మారడంతో వరుసలో రాళ్లు, చెప్పులు, చెట్ల కొమ్మలు ఉంచారు. రాత్రి 7 గంటల వరకు నిరీక్షించినా లారీ రాకపోవడంతో నిరాశతో తిరుగుముఖం పట్టారు.
- ఉమ్మడి వరంగల్‌జిల్లాలో యూరియా కష్టాలు మరీ ఎక్కువగా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా బయ్యారం సొసైటీ వద్ద రైతులు తెల్లవారుజామునుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాశారు. చివరకు యూరియా లారీ రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. నర్సింహులపేట మండల కేంద్రంలో పీఏసీఎస్ ఎదుట కూపన్ల కోసం ఉదయం నుంచే రైతులు చెప్పులను క్యూలో పెట్టారు. డోర్నకల్ మండలం గొల్లచర్ల సమీపంలోని పీఏసీఎస్ ఎదుట రైతులు రాస్తారోకో నిర్వహించారు. దంతాలపల్లి రైతు వేదిక వద్ద కూపన్ల కోసం కిలోమీటర్ మేర లైన్ కట్టి గంటల కొద్ది వేచి చూశారు. మరిపెడ పీఏసీఎస్‌లో మహిళా రైతులు యూరియా టోకెన్ల కోసం గేటు దూకి మరి కార్యాలయంలోకి వెళ్లారు.
- వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రామలింగాయపల్లి పీఏసీఎస్‌కు రాత్రి యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు అక్కడే పడుకునేందుకు బుధవారం రాత్రి చద్దర్లు, గొడుగులతో వచ్చారు. జనగామ జిల్లా కేంద్రంతోపాటు తరిగొప్పుల, స్టేషన్‌ఘన్‌పూర్‌లో యూరియా కోసం బారులుతీరారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల ఆగ్రోస్-1, చిట్యాల ఓడీఎంఎస్ దుకాణం వద్ద పోలీస్ పహారాలో యూరియా పంపిణీ చేశారు.
- ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని రాజారాంపేట సొసైటీ వద్ద ఒకే బస్తా ఇవ్వడంపై రైతులు మండిపడ్డారు. కేంద్రం ఇన్‌చార్జ్, ఎంపీఓ శివ రైతులతో వాగ్వాదానికి దిగడం ఉద్రిక్తతకు దారి దీసింది. కోర్టుకు వెళ్లాలంటూ రైతులను ఆయన బయటకు తోసేసే ప్రయత్నం చేయగా పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మరికొన్ని యూరియా కష్టాల ఫొటోలు సాక్షి ఫ్లస్ ఈ పేపర్‌లో..

# ఇక పడేదంతా బోనస్సే

- రాష్ట్రంలో సంతృప్తికర స్థాయిలో వర్షపాతం
- సెప్టెంబర్ 2 నాటికి కురవాల్సిన వర్షం 59.30 సెం.మీ.
- 28 శాతం అధికంగా 75.75 సెం.మీ. నమోదు
- ఇకపై కురిసే వర్షాలు అదనమే అంటున్న వాతావరణ శాఖ



సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాల సీజన్‌లో వర్షాలు సంతృప్తికర స్థాయిలో నమోదయ్యాయి. రాష్ట్రంలో ఈ సీజన్‌లో ఇప్పటివరకు కురవాల్సిన సగటు సాధారణ వర్షపాతానికి మించి వానలు పడ్డాయి. అయితే ఈ సీజన్ సెప్టెంబర్ నెలాఖరు వరకు ఉంది కాబట్టి.. ఇకపై కురిసే వర్షాలు అదనమేనని, వర్షాలు కురిస్తే సగటు సాధారణ వర్షపాతాన్ని మించి నమోదైనట్టేనని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు నైరుతి రుతుపవనాల సీజన్ కాగా.. ఈ 4 నెలల కాలంలో రాష్ట్రంలో 74.06 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. సెప్టెంబర్ 2వ తేదీ నాటికి 59.30 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా,... ఏకంగా 75.75 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సగటు వర్షపాతం కంటే 28 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది.

**ఆరు జిల్లాల్లో అత్యధిక వర్షాలు**

- ప్రస్తుత సీజన్‌లో రాష్ట్రంలోని 6 జిల్లాల్లో అత్యధిక వర్షాలు నమోదయ్యాయి. 14 జిల్లాల్లో అధిక వర్షపాతం, 13 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. అత్యధికంగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 60 రోజులు వర్షాలు పడ్డాయి. ఆ తర్వాత ఆదిలాబాద్‌లో 55, ములుగులో 51 రోజుల పాటు వర్షాలు కురిశాయి. నిర్మల్‌లో 48, వరంగల్‌లో 47, మహబూబాబాద్‌లో 44, మెదక్, సంగా రెడ్డి జిల్లాలో 43 రోజుల పాటు వర్షాలు కురిశాయి. నారాయణపేట, రంగారెడ్డి జిల్లాల్లో 42 రోజులు చొప్పున, కామారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, ఖమ్మం జిల్లాల్లో 41 రోజుల చొప్పున వర్షాలు కురిశాయి. మండలాల వారీగా వర్షపాతాన్ని పరిశీలిస్తే..119 మండలాల్లో అత్యధిక వర్షపాతం, 271 మండలాల్లో అధిక వర్షపాతం, 218 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. 13 మండలాల్లో మాత్రం ఇంకా లోటు ఉంది. సీజన్ ముగిసే నాటికి ఈ మండలాల్లో కూడా సాధారణ వర్షపాతం నమోదవుతుందని అధికారులు చెబుతున్నారు. సెప్టెంబర్‌లో రాష్ట్రంలో సాధారణం కంటే కాస్త ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ ఇప్పటికే అంచనాలు విడుదల చేసింది.

**నైరుతి సీజన్‌లో నెలవారీగా వర్షపాతం గణాంకాలు (సెంటీమీటర్లలో)**

| నెల | సాధారణం | నమోదు |
|---|---|---|
| జూన్ | 13.03 | 10.42 |
| జూలై | 22.74 | 23.79 |
| ఆగస్టు | 21.58 | 37.85 |
| సెప్టెంబర్ | 16.71 | 3.69 (ఈ నెల 2వరకు) |

- **అత్యధిక వర్షపాతం నమోదైన జిల్లాలు:** మెదక్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, యాదాద్రి భువనగిరి, వనపర్తి, కామారెడ్డి
- **అధిక వర్షపాతం నమోదైన జిల్లాలు :** సిద్దిపేట, నారాయణపేట, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, జోగుళాంబ గద్వాల, హైదరాబాద్, నల్లగొండ, మేడ్చల్-మల్కాజిగిరి, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్
- **సాధారణ వర్షపాతం నమోదైన జిల్లాలు:** ములుగు, మహబూబాబాద్, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, జనగామ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, హనుమకొండ, పెద్దపల్లి.

# 2.5 లక్షల ఎకరాల్లో పంటనష్టం

- రాష్ట్రానికి వరద సాయం అందించాలి
- కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు మంత్రి తుమ్మల విజ్ఞప్తి


కేంద్ర మంత్రి చౌహాన్‌తో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 2.5 లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేసినట్టు కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తెలంగాణ వరద నష్టాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రానికి ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో తుమ్మల భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

**సుంకం తగ్గింపును పునః పరిశీలించండి**

ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకం తగ్గింపును పునఃపరిశీలించాలని కేంద్రమంత్రికి తుమ్మల విజ్ఞప్తి చేశారు. ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.25 వేలు కనీస మద్దతు ధర కల్పించేలా ఆయిల్‌పామ్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలని మంత్రి కోరారు. న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీ (ఎన్‌బీఎస్) స్కీం కింద ఫాస్ఫరస్, పొటాషియంపై రాయితీని పెంచాలన్నారు.

**పీఎండీడీకేవై పథకంలో చేర్చండి**

భద్రాద్రి కొత్తగూడెం, నారాయణపేట, ములుగు, కుమురంభీం ఆసిఫాబాద్, సంగారెడ్డి జిల్లాలను ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన (పీఎండీడీకేవై) పథకంలో చేర్చాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులపై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సానుకూలంగా స్పందించారని తుమ్మల వెల్లడించారు.

**యూరియా సరఫరాలో కేంద్రం వైఫల్యం**

దేశవ్యాప్తంగా యూరియా కొరత సమస్యగా మారిందని, దీనికి కారణం కేంద్ర ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడమేనని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఖరీఫ్ సీజన్‌కు తెలంగాణ 11 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కోరింది. కేంద్రం 9.8 లక్షల మెట్రిక్ టన్నులు ఇస్తామని చెప్పినా, ఇప్పటివరకు కేవలం 5.20 లక్షల మెట్రిక్ టన్నులే ఇచ్చారు. సెప్టెంబర్‌లో పంటలకు ఎరువులు అత్యవసరం. కానీ సరఫరా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు'అని తుమ్మల తెలిపారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్ల ఫోరం కార్యవర్గం


మార్కెట్ కమిటీ చైర్మన్ల ఫోరం నూతన కార్యవర్గ ప్రతినిధులు

సుభాష్‌నగర్ (నిజామాబాద్ అర్బన్): తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల ఫోరం అధ్యక్షునిగా నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మేడ్చల్ శివారులో బుధవారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా చిలుక మధుసూదన్‌రెడ్డి (గడ్డి అన్నారం), ప్రధాన కార్యదర్శిగా నర్సింహ యాదవ్ (మేడ్చల్), ఉపాధ్యక్షునిగా ఆనంద్ రావు పటేల్ (భైంసా), సలహాదారులుగా రూప్లా నాయక్ (ధర్మారం), గంట సంజీవ్‌రెడ్డి (కేసముద్రం), కొట్టూరి మహేశ్ (చొప్పదండి), తిర్మల తిరుపతి (గోపాల్ రావుపేట్), డైరెక్టర్లుగా సుధాకర్‌రెడ్డి (రాయ్‌కోడ్), తొటం రుూన్సీరాణి (కమలాపూర్), సీహెచ్ రాజిరెడ్డి (పరకాల), పన్నాల అంజిరెడ్డి (కోరుట్ల), వెంకటయ్య (చౌటుప్పల్), హన్మంతరావు (ఖమ్మం), బెక్కరి అనిత (మహబూబ్‌నగర్), చెల్‌కోల్ లక్ష్మి (హైదరాబాద్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని నూతన అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి 'సాక్షి'కి తెలిపారు.

# ప్రియుడి మోజులో పడి..

- భర్తను, కూతురును హత్య చేసిన మహిళ
- అనారోగ్యంతో భర్త చనిపోయాడని, కూతురు కనిపించడం లేదని నమ్మించిన వైనం
- కేసును ఛేదించిన కాటారం పోలీసులు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

భూపాలపల్లి అర్బన్: ప్రియుడి మోజులో పడిన ఓ మహిళ.. భర్తను, కుమార్తెను మూడు నెలల వ్యవధిలో హతమార్చింది. అనారోగ్యంతో భర్త చనిపోయాడని, కూతురు కనిపించడం లేదని నమ్మించింది. పోలీసులు ఆరా తీయగా ఆ మహిళ బాగోతం బయటపడింది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఒడితల గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్పీ కిరణ్‌ఖరే బుధవారం ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఆగస్టు 28న కాటారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి పక్కన యువతి మృతదేహం పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. కాటారం ఎస్సై, సీఐ, డీఎస్పీలు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహం చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన కప్పుల వర్షిణి (22)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆగస్టు 3వ తేదీ నుంచి వర్షిణి కనిపించడం లేదని ఆమె తల్లి కవిత అదే నెల 6న చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గుర్తించారు. పోలీసుల దర్యాప్తులో కవితపై అనుమానం వచ్చిన పోలీసులు ఆ దిశగా విచారణ జరిపి తల్లి కవితనే సూత్రధారిగా గుర్తించారు. ఈ నెల 2వ తేదీన కవిత, ఆమె ప్రియుడు రాజ్‌కుమార్ కాటారం సీఐ నాగార్జునరావుకు పట్టుబడ్డారు. విచారణలో విస్తుపోయే విషయాలు బయటికి వచ్చాయి.

**మూడు నెలలక్రితం భర్తను..**

కుమారస్వామి మొదటి భార్య చనిపోవడంతో మల్హర్ మండలం కొయ్యూరుకు చెందిన కవితను 24 ఏళ్లక్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇరువురు కుమార్తెలు కాగా చిన్న కూతురు ఇటీవల ప్రేమ వివాహం చేసుకుంది. పెద్ద కూతురు ఇంటి వద్దే ఉంటోంది. కుమారస్వామికి పక్షవాతం రాగా ఐదేళ్లుగా మంచంపైనే ఉంటున్నాడు. ఈ క్రమంలో కవిత అదే గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ అనే యువకుడితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయంపై ఇంట్లో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే భర్తను చంపాలని నిర్ణయించుకున్న కవిత.. తన ప్రియుడుతో కలిసి జూన్ 25న మంచంలో పడుకున్న కుమారస్వామిని గొంతు నులిమి హత్య చేశారు. అనారోగ్యంతో చనిపోయాడని చిత్రీకరించారు. ఈ విషయం కూతురు వర్షిణికి తెలియడంతో ఆమెను కూడా హత్య చేయాలని నిర్ణయించారు. ఆగస్టు 3న రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న వర్షిణిని కవిత, రాజ్‌కుమార్ కలిసి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశారు. మృతదేహాన్ని సంచిలో వేసి ఇంటి వెనకాల చెట్ల పొదల్లో దాచిపెట్టి మరుసటి రోజు గ్రామ శివారులోని పొదల్లో పడేశారు. మృతదేహం దుర్వాసన వస్తుండటంతో 25వ తేదీన కాటారం వైపునకు తీసుకువచ్చి అడవిలో పడేసి వెళ్లాడు. పోలీసుల దృష్టి మళ్లించేందుకు యూట్యూబ్‌లో చూసి అడవిలో క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లు వదిలివెళ్లారు. కాగా, విచారణలో రెండు హత్యలు చేసినట్లు కవిత, రాజ్‌కుమార్‌లు ఒప్పుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

# టారిఫ్‌లతో చంపుతోంది

## భారత్‌పై ట్రంప్ గరం గరం

- ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు వసూలు చేస్తోంది
- మేము సుంకాలు భారీగా పెంచడంతో వెనక్కి తగ్గింది
- టారిఫ్‌ల వల్లే ఇతర దేశాలతో బేరమాడే శక్తి పెరిగింది
- అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్య

వాషింగ్టన్: భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి నోరుపారేసుకున్నారు. భారత్ అత్యధిక టారిఫ్‌లతో అమెరికాను చంపుతోందని మండిపడ్డారు. అమెరికా ఉత్పత్తులపై ఇండియాతో పాటు చైనా, బ్రెజిల్‌లు భారీగా టారిఫ్‌లు విధిస్తున్నాయని విమర్శించారు. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధిస్తున్న దేశం ఇండియా అని తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆయన తాజాగా స్కాట్ జెన్నింగ్స్ రేడియో కార్యక్రమంలో మాట్లాడారు. అమెరికా ఉత్పత్తులపై ఇకపై ఎలాంటి టారిఫ్‌లు విధించబోమంటూ ఇండియా తమకు ఆఫర్ ఇచ్చిందని అన్నారు. భారతదేశ ఉత్పత్తులపై తాము టారిఫ్‌లు భారీగా పెంచాం కాబట్టి అలాంటి ఆఫర్ వచ్చిందని, లేకపోతే వచ్చేదేకాదని తేల్చిచెప్పారు. కాబట్టి ఇండియాపై టారిఫ్‌లు వేయడంలో అన్యాయం ఏమీ లేదని పరోక్షంగా స్పష్టంచేశారు. తమ చర్యల వల్లే ఇతర దేశాలతో బేరమాడే శక్తి పెరిగిందని పేర్కొన్నారు.

### భారత్–అమెరికా బంధం ఏకపక్షమే

భారత వాణిజ్య విధానాలను ట్రంప్ మరోసారి తప్పుపట్టారు. భారత్–అమెరికాల మధ్య దీర్ఘకాలంగా ఉన్న ఆర్థిక సంబంధాలన్నీ ఏకపక్ష బంధంగా అభివర్ణించారు. ఆయన స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం వైట్‌హౌస్ ఓవల్ ఆఫీస్ నుంచి మీడియాతో మాట్లాడారు. ''మేము ఇండియాతో చాలా బాగా కలిసి పోయాం. కానీ, మా బంధం చాలా ఏళ్లుగా ఏకపక్ష బంధంగానే ఉంది.



భారత్ అపారమైన సుంకాలను వసూలు చేస్తోంది. మా ఉత్పత్తులపై వందశాతం సుంకాలు విధించింది. అందుకే ఇండియా నుంచి దిగుమతులు ఆపేశాం. వాణిజ్యం చేయడం లేదు. కానీ, ఇండియాకు అమెరికాలో భారీగా మార్కెట్ ఉంది. ఎందుకంటే ఇండియా నుంచి మేము మూర్ఖంగా సుంకాలు వసూలు చేయడం లేదు. వారు తయారు చేసిన ప్రతి వస్తువును అమెరికాకు పంపగలుగుతున్నారు. వారి ఉత్పత్తులను విక్రయించుకోగలుగుతున్నారు. భారత్ వాణిజ్య విధానాలు అమెరికాలోని తయారీదారులకు భారీ నష్టాన్ని కలిగించాయి'' అని ట్రంప్ ఆరోపించారు.

### హార్లీ–డేవిడ్సన్ బైక్‌లు అమ్మలేకపోయాం

అమెరికాలో అత్యంత గుర్తింపు పొందిన మోటార్‌సైకిల్ బ్రాండ్లలో ఒకటైన హార్లీ–డేవిడ్సన్ భారత్‌లో ఎదుర్కొన్న ఇబ్బందులను ట్రంప్ ప్రస్తావించారు. 'హార్లీ–డేవిడ్సన్ బైక్‌లను భారత్‌లో అమ్మలేకపోయాం. మోటార్ సైకిల్‌పై 200 శాతం సుంకం విధించారు. దాంతో సుంకాలను తప్పించుకోవడానికి హార్లీ–డేవిడ్సన్ సంస్థ భారత్‌లోనే ప్లాంట్ నిర్మించాల్సి వచ్చింది. ఈ అన్యాయమైన సుంకాల వల్ల కంపెనీలు తమ ఉత్పత్తులను అమెరికా వెలుపల చేస్తున్నాయి. నేను అధికారంలోకి వచ్చాక ఈ వాణిజ్య విధానాలను తిప్పికొట్టడం ప్రారంభించా. అందులో భాగమే ఈ పరస్పర సుంకాలు'' అని చెప్పుకొచ్చారు.

### ఇప్పుడు అమెరికా వైపే మొగ్గు

తమ నూతన విధానాలతో అనేక సంస్థలు అమెరికాలో కంపెనీలను, ప్లాంట్లను స్థాపించడానికి ముందుకు వస్తున్నాయని డొనాల్డ్ ట్రంప్ హర్షం వ్యక్తంచేశారు. ''మా వాణిజ్య విధానాల వల్ల కార్ల కంపెనీలు, ఏఐ సంస్థలు ఇప్పుడు అమెరికా వైపు మొగ్గుచూపుతున్నాయి. చైనా, మెక్సికో, కెనడా నుంచి మేము దిగుమతి చేసుకుంటున్న అనేక కార్ల కంపెనీలు ఇప్పుడు మా దేశంలోనే ఏర్పాటవుతున్నాయి. దానివల్ల ఆయా కంపెనీలపై సుంకాల మోత తప్పుతోంది. వాటికి ఆర్థికంగా లబ్ధి చేకూరుతోంది'' అని ట్రంప్ తెలిపారు.

### ఏడు యుద్ధాలను ఆపేశా..

ప్రపంచ యుద్ధాలను ఆపానంటూ ఇప్పటికే పలుమార్లు ప్రకటించిన ట్రంప్ మరోమారు అదే విషయం చెప్పారు. తన వాణిజ్య విధానాలతో ఏడు యుద్ధాలను పరిష్కరించానని స్పష్టంచేశారు. ''సుంకాల పెంపు అమెరికా ఆర్థిక వ్యవస్థకే కాకుండా ఏడు యుద్ధాలను పరిష్కరించడానికి సహాయపడింది. అమెరికా చాలా శక్తివంతమైన దేశం. అమెరికా లేకపోతే ప్రపంచంలో ఏదీ లేదు. టారిఫ్‌లు మా దేశాన్ని ఆర్థికంగా అత్యంత శక్తివంతంగా మార్చాయి. ఈ టారిఫ్‌లతోనే ఏడు యుద్ధాలను ఆపాను'' అని వ్యాఖ్యానించారు.

### అవన్నీ వదంతులు..

తన అనారోగ్యంపై వస్తున్న వార్తలను ట్రంప్ కొట్టిపారేశారు. ''మీరు చనిపోయారంటూ వార్తలు మీ దృష్టికి వచ్చాయా?'' అని ఓ విలేకరి ప్రశ్నించగా ట్రంప్ స్పందించారు. తన ఆరోగ్యంపై వదంతులు వచ్చాయని మాత్రమే విన్నానని తెలిపారు. అవి కూడా పుకార్లేనని ఖండించారు. తాను చాలా చురుగ్గా ఉన్నానని, ముందే చెప్పినట్టుగా ఇప్పుడున్నంత ఆరోగ్యంగా మరెప్పుడూ లేనని స్పష్టం చేశారు.



కులూలో కొనసాగుతున్న సహాయక చర్యలు



అఖ్నూర్ వద్ద చినాబ్ నది ఉధృతి

# వరద ఉధృతిలో ఉత్తరాది

- పలు రాష్ట్రాలను తడిపేసిన వర్షాలు
- విరిగిపడిన కొండచరియలు
- పది మంది మృతి

జమ్మూ/షిమ్లా/కురుక్షేత్ర/శ్రీనగర్/జైపూర్/చండీగఢ్/న్యూఢిల్లీ: భారీ వర్షాలు ఉత్తరాది రాష్ట్రాలను భయపెట్టడం ఆపలేదు. ఎడతెరపి కురుస్తున్న వానలతో ఉత్తరభారతంలోని నదులు ఉప్పొంగి ప్రవహిస్తూ దిగువ ప్రాంతాలను తమలో కలిపేసుకుని ఆయా ప్రాంతాల ప్రజలకు కన్నీటి కష్టాలను పెంచేశాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో వర్ష, వరద, కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనల్లో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంకొందరు గాయాలతో బయటపడ్డారు. వరద కారణంగా తమ గ్రామాలకు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోవడంతో విద్యుత్, ఆహారం కోసం పలు ముంపు ప్రాంతాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జమ్మూకశ్మీర్‌లోని అఖ్నూర్ పరిధిలోని గర్ఖాల్ గ్రామంలో వర్షంధాటికి ఇంటి పైకప్పు కూలడంతో తల్లీకూతుళ్లు చనిపోయారు. 40 మంది గ్రామంలో చిక్కుకుపోయారు. ఇక్కడ చినాబ్ నది ప్రమాదకరస్థాయిలో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఉధంపూర్, బనిహాల్ మధ్యలో శ్రీనగర్–జమ్మూ జాతీయరహదారిపై పలుచోట్ల కొండచరియలు విరిగిపడటంతో ఆ మార్గంలో రాకపోకలు స్తంభించిపోయాయి. జమ్మూసహా కశ్మీర్‌లోయలో అన్ని విద్యాలయాలు తెరచుకోలేదు. గత 24 గంటలుగా కురుస్తున్న వర్షం కారణంగా పుల్వామా, షోపియాన్, కుల్గామ్‌సహా దక్షిణ కశ్మీర్‌లోని చాలా ప్రాంతాల్లో వరద పోటెత్తింది. జమ్మూ, కత్రా రైల్వేస్టేషన్లకు 68 రైళ్ల రాకపోకలను నార్తర్న్ రైల్వే రద్దుచేసింది. గత ఎనిమిది రోజులుగా జమ్మూ రైల్వే డివిజన్‌లో ఒక రైలు కూడా కదల్లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. జమ్మూ రీజియన్‌లో 1910 ఏడాది తర్వాత ఈసారే 380 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది.

### పంజాబ్, హరియాణాల్లో

ఇప్పటికే వరదలతో ఇబ్బంది పడుతున్న పంజాబ్‌ను బుధవారం భారీ వర్షాలు పలకరించి కలవరపెట్టాయి. ఇరుగుపొరుగు హరియాణా, పంజాబ్‌లకు ఉమ్మడి రాజధాని చండీగఢ్‌లోనూ ఎడతెరపి వానలు కురిశాయి. మొహాలీలో 55.5 మిల్లీమీటర్లు, అమృత్‌సర్‌లో 27.6 మిల్లీమీటర్లు, హరియాణాలోని అంబాలాలో 105.6 మిల్లీమీటర్లు, చండీగఢ్‌లో 63.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పంచ్‌కులా, అంబాలాలో మంగళవారం నుంచి ఆగకుండా వర్షం పడుతోంది. కురుక్షేత్ర పట్టణంలో ఇంటి పైకప్పు కూలి ఇద్దరు కూలీలు చనిపోయారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీలో కొండచరియలు పడిన ఘటనలో మరణాల సంఖ్య 7కు పెరిగింది.

### అధిక వర్షపాతాలు నమోదు

ఈఏడాది జూన్ ఒకటో తేదీ నుంచి సెప్టెంబర్ రెండో తేదీ వరకు ఉత్తరాదిలోని చాలా జిల్లాల్లో ఇప్పటికే సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. జైపూర్ జిల్లాలో 85 శాతం, జోధ్‌పూర్‌లో 79 శాతంగా నమోదైంది. పంజాబ్‌లో ఏకంగా 3,00,000 ఎకరాల పంటభూములు నీటమునిగి రైతన్నలకు తీరని వెతలు మిగిల్చాయి. హరియాణాలో గత 27 ఏళ్లలో లేనంతటి స్థాయిలో అధిక వర్షాలు కురుస్తున్నాయి.

### ప్రమాదకర స్థాయిలో యమున

ఢిల్లీలోని పాత రైల్వే వంతెన వద్ద యమునా నది ప్రమాదకరంగా 207.33 మీటర్ల స్థాయిలో ప్రవహిస్తోంది. ఢిల్లీ చరిత్రలో అత్యంత ఎత్తయిన ప్రవాహాల్లో మూడోదిగా ఇది రికార్డ్ నెలకొల్పింది. బుధవారం దిగువ ప్రాంతాల్లోని మరో 8,018 మందిని ఎగువ ప్రాంతాలకు తరలించారు. పాఠశాలలుసహా పాతిక చోట్ల సహాయక శిబిరాలను ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయమే బజీరాబాద్ బ్యారాజ్ నుంచి 1.38 లక్షల క్యూసెక్కుల హాథ్‌నీకుండ్ బరాజ్ నుంచి 1.62 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు రావడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అధికారులు చెప్పారు. ఢిల్లీలోని పురాతన, రద్దీ అయిన నిగంబోధ్ ఘట్ శ్మశానవాటికలోకి నీరు చేరడంతో పలు పార్థివదేహాల అంత్యక్రియల తంతు ఆగిపోయింది. వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భారత వాతావరణ శాఖ ఢిల్లీవాసులకు రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లను పంపింది. నోయిడా, గురుగ్రామ్, ఘజియాబాద్, ఫరీదాబాద్‌లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ వర్షార్పణమైంది. దాంతో 273 విమానాల టేకాఫ్, 73 విమానాల ల్యాండింగ్‌ను రద్దుచేశారు.

# రూ.1,500 కోట్లతో ఇన్సెంటివ్ స్కీమ్

- అరుదైన ఖనిజాల రీసైక్లింగ్‌కు ప్రోత్సాహం
- కేంద్ర మంత్రివర్గం ఆమోదం

న్యూఢిల్లీ: దేశంలో అరుదైన ఖనిజాల రీసైక్లింగ్ ప్రక్రియను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం రూ.1,500 కోట్లతో ఇన్సెంటివ్ స్కీమ్‌ను అమల్లోకి తీసుకురాబోతోంది. బుధవారం కేంద్ర మంత్రివర్గ సమావేశంలో దీనికి ఆమోదముద్ర వేశారు. అరుదైన ఖనిజాల రీసైక్లింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచబోతున్నట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రతిఏటా 270 కిలో టన్నుల రిసైక్లింగ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల ఏటా 40 కిలో టన్నుల అరుదైన ఖనిజాల ఉత్పత్తి జరుగుతుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా 70 వేల మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌లో భాగంగా ఇన్సెంటివ్ స్కీమ్‌ను తీసుకురాబోతున్నారు. ఏడేళ్లలో రూ. 34,300 కోట్లతో నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌ను అమలు చేయబోతున్నట్లు గతంలోనే ప్రభుత్వం ప్రకటించింది. కాపర్, లిథియం, నికెల్, కోబాల్ట్ సహా రేర్‌ఎర్త్ ఖనిజాల రీసైక్లింగ్‌కు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది.

**ప్రధాని మోదీ హర్షం**

కేబినెట్‌లో ఆమోదించిన ఇన్సెంటివ్ పథకం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. దీనివల్ల అరుదైన ఖనిజాల రీసైక్లింగ్‌కు మరింత ప్రోత్సాహం లభిస్తుందన్నారు. బ్యాటరీ వ్యర్థాలు, ఈ–వ్యర్థాల రీసైక్లింగ్ సామర్థ్యం పెరుగుతుందని, ఎంతోమందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టుచేశారు.

# సీఏఏ కటాఫ్ తేదీ పొడిగింపు

- 2024 డిసెంబర్ 31 కంటే ముందువచ్చినా పౌరసత్వం!
- అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ నుంచి వచ్చిన ముస్లిమేతర మైనార్టీలకు ఊరట

న్యూఢిల్లీ: అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ నుంచి ఇండియాకు వలస వచ్చిన ముస్లిమేతర మైనార్టీలకు భారీ ఊరట లభించింది. ఆయా దేశాల్లో మతపరమైన వివక్షను తట్టుకోలేక 2024 డిసెంబర్ 31తేదీ కంటే ముందు భారత్‌కు చేరుకున్న హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైన్‌లు, పార్సీలు, క్రైస్తవులు పాస్‌పోర్ట్ సహా ఇతర ధ్రువపత్రాలు లేకపోయినా మరికొంత కాలం భారత్‌లో ఉండే వెసులుబాటు దక్కింది. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) ప్రకారం 2014 డిసెంబర్ 31 కంటే ముందు వచ్చిన శరణార్థులు ధ్రువపత్రాలు లేకపోయినా భారత్‌లో ఉండడానికి అర్హులు. అంతేకాకుండా వారు భారత పౌరసత్వం పొందవచ్చు. ఇమిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్–2025 కింద ఈ కటాఫ్ తేదీని 2024 డిసెంబర్ 31వ తేదీ దాకా పొడిగిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ ప్రకటించింది. 2024 డిసెంబర్ 31 కంటే ముందు కాందిశీకులుగా వచ్చిన ముస్లిమేతర మైనార్టీలకు పౌరసత్వం కల్పిస్తామని వెల్లడించింది. వారందరికీ చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్, వీసా కలిగి ఉండాలన్న నిబంధన లేదని, వారంతా భారత్‌లో ఉండిపోవచ్చని పేర్కొంది. వారు గౌరవప్రదమైన జీవితం గడపవచ్చని, దేశంలో ఎక్కడికైనా రాకపోకలు సాగించవచ్చని, ఆస్తులు కొనుగోలులో చేయొచ్చని స్పష్టం చేసింది.

## 150 ఏళ్లు బతకొచ్చంటారా?


**పుతిన్, జిన్‌పింగ్ మధ్య సంభాషణ**

బీజింగ్: ఇప్పటికే దశాబ్దాలుగా చైనా, రష్యాలను ఏకఛత్రాధిపత్యంతో ఏలేస్తున్న జిన్‌పింగ్, పుతిన్‌లకు ఇంకొన్ని దశాబ్దాల పాటు అధికార పీఠాన్ని అట్టిపెట్టుకోవాలనే ఆశ ఉన్నట్టుంది. బుధవారం బీజింగ్‌లో కట్టుదిట్టమైన మిలటరీ భద్రత మధ్య జరిగిన సైనిక, సాయుధ పరేడ్‌లో వీరిద్దరి అనూహ్య సంభాషణ ఈ విషయాన్ని రుజువుచేసింది. ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ సమక్షంలో జిన్‌పింగ్, పుతిన్‌ల గుసగుసలు దగ్గర్లోని మైక్రోఫోన్ ద్వారా బయటకు వినిపించడంతో వీరి మనసులోని మాట బయటపడింది. తియాన్మెన్‌స్క్వేర్ గేట్ నుంచి పరేడ్ వీక్షణ వేదిక మీదకు వెళ్లే మార్గంలో నడుచుకుంటూ జిన్‌పింగ్, పుతిన్, కిమ్, ఇతర నేతలు మాట్లాడారు. ఈ సందర్భంగా 150 ఏళ్ల దాకా మనిషి జీవించగలడు అనే అంశం చర్చకొచ్చింది. ఈ సందర్భంగా జిన్‌పింగ్‌తో పుతిన్.. '' జీవసాంకేతిక శాస్త్రం అద్భుతంగా పురోగమిస్తోంది. ముసలివైపోతున్న, పాడవుతున్న అంతర్గత అవయవాలను ఎప్పటికప్పుడు మార్పిడి చేసుకుంటూ మనిషి చాన్నాళ్లు జీవించవచ్చు. ఇలా నూతన అవయవాలతో యవ్వన ఛాయతో మెరుగైన జీవనం సాధ్యమే. బయోటెక్నాలజీతో సాధ్యమైతే చివరకు మృత్యువునూ జయించవచ్చు'' అని అన్నారు. దీనికి జిన్‌పింగ్ మాండరిన్ భాషలో బదులిచ్చారు. '' గతంలో 70 ఏళ్లు బతకడం అంటే గగనం. ఇప్పుడు 70 ఏళ్లు వయసొచ్చినా చిన్నపిల్లాడి కిందే లెక్క. కొందరు శాస్త్రవేత్తల అంచనా ప్రకారం అభివృద్ధిలోకి వస్తున్న వైద్యశాస్త్ర పరిశోధనా ఫలాలను అందిపుచ్చుకుంటే ఈ శతాబ్దిలోనే మనుషులు 150 ఏళ్లదాకా జీవించగలరు'' అని అన్నారు. ఇదే సమయంలో జిన్‌పింగ్, పుతిన్‌లను చూసి కిమ్ కిసుక్కున నవ్వారు. వీళ్ల సంభాషణ విని నవ్వారో, ఊరకే యథాలాపంగా నవ్వారో తెలీదు. కానీ ఈ సంభాషణ మొత్తం అక్కడి సీసీటీవీ కెమెరాకు అమర్చిన మైక్రోఫోన్ ద్వారా ప్రత్యక్షప్రసారమైందని రాయిటర్స్ వార్తాసంస్థ తన కథనంలో పేర్కొంది. పుతిన్, జిన్‌పింగ్ ఇద్దరి వయసూ 72 కావడం గమనార్హం. తదుపరి ఎన్నికల్లోనూ అధ్యక్ష పీఠంపై కూర్చునేలా జిన్‌పింగ్ ఇప్పటికే రాజ్యాంగంలో మార్పులుచేశారు. పుతిన్ సైతం ఇదే తరహాలో గతంలోనే రాజ్యాంగ సవరణ చేశారు. ఇద్దరికీ మరికొన్నాళ్లు పరిపాలించాలనే ఆసక్తి ఎక్కువగా ఉందని అందరికీ తెల్సిందే.

# ఎదురులేనంతగా ఎదుగుతాం: జిన్‌పింగ్

- 80వ విక్టరీ డే పరేడ్ సందర్భంగా శత్రు భీకర అస్త్రశస్త్రాల ప్రదర్శన
- తొలిసారిగా అత్యంత అధునాతన ఆయుధాలతో పరేడ్
- పరేడ్‌లో పాల్గొన్న పుతిన్, కిమ్, అమెరికా బద్ధ వ్యతిరేక దేశాల అగ్రనేతలు

బీజింగ్/హాంకాంగ్: అసాధారణ రక్షణరంగ పాటవంతో అత్యాధునీకరించిన అస్త్రశస్త్రాలతో చైనా ఎదురులేకుండా ఎదుగుతోందని ఆ దేశ అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ప్రకటించారు. రెండో ప్రపంచయుద్ధంలో జపాన్‌పై గెలుపునకు గుర్తుగా జరిపిన 80వ విజయోత్సవ పరేడ్ ఇందుకు వేదికైంది. టారిఫ్‌లతో స్నేహితులు, శత్రువులు అనే తేడా లేకుండా ఇష్టారీతిన ఆధిపత్య బలప్రదర్శన చేస్తున్న అగ్రరాజ్యాధినేత ట్రంప్ వైఖరిని ధిక్కరించేలా జిన్‌పింగ్ ప్రసంగం సాగింది. చైనా సైన్యానికి సెంట్రల్ మిలటరీ కమిషన్ సారథిగా సర్వసైన్యాధ్యక్షుడి హోదాలో జిన్‌పింగ్ ప్రసంగించారు. '' మానవత్వం అనేది ఎన్నో ఎత్తుపల్లాలను చవిచూడక తప్పదని చరిత్ర మనకు ఏనాడో చెప్పింది. చైనా పునరుజ్జీవానికి పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ ఎప్పటికప్పుడు వ్యూహాత్మక తోడ్పాటునందిస్తోంది. అది ప్రపంచ శాంతి, అభివృద్ధికి సైతం ఎంతగానో సాయపడుతోంది. దేశ సార్వభౌమత్వం, ఐక్యత, ప్రాదేశిక సమగ్రతను కంటికి రెప్పలా కాపాడేందుకు చైనా మిలటరీ స్వశక్తితో ఉక్కు సంకల్పంతో శత్రు దుర్భేద్యంగా తయారైంది. ఆధునిక చరిత్రలో రెండో ప్రపంచయుద్ధంలో జపాన్ సేనలను మట్టికరిపించడం ద్వారా చైనా తొలిసారిగా విదేశీ దురాక్రమణలను విజయవంతంగా అడ్డుకుంది. మానవ నాగరికత, ప్రపంచశాంతి సంరక్షణ, యుద్ధంలో త్యాగాలతో చైనా ప్రజలు ఈ క్రతువులో కీలక పాత్ర పోషించారు. అందరం సమానం, శాంతి సామరస్యంతో జీవనం సాగిద్దామనే భావన ఒక్కటే ప్రపంచదేశాలను యుద్ధాల బాటలో నడవకుండా ఆపుతుంది. నేడు మానవత్వం అనేది కఠిన సవాళ్లను ఎదుర్కొంటోంది. ఇప్పుడు ఏదో ఒక్కటే ఎంచుకోవాలి. శాంతి కావాలా యుద్ధం కావాలా? చర్చలా లేదా ఘర్షణలా? యుద్ధాలకు దిగితే రక్తసిక్తమైన మరుభూమి మినహా మనకేం మిగలదు'' అని జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు.



పరేడ్‌ను చూసేందుకు వస్తున్న జిన్‌పింగ్, పుతిన్, కిమ్, పలు దేశాల అగ్రనేతలు



పరేడ్‌లో ముందుకెళ్తున్న యుద్ధట్యాంక్‌లు

### నభూతో నభవిష్యతి

గతంలో ఎన్నడూ మీడియాకంట పడని, అత్యంత నూతన తరం ఆయుధాలు, అణ్వస్త్ర బాలిస్టిక్ క్షిపణులు, యుద్ధట్యాంక్‌లు, జలాంతర డ్రోన్లు, ఎల్రక్టానిక్ యుద్ధ పరికరాలు, ఐదో తరం యుద్ధవిమానాలను చైనా తొలి సారిగా ప్రదర్శించింది. బీజింగ్‌లోని ప్రఖ్యాత తియాన్మెన్‌స్క్వేర్ కూడలి మీదుగా ఈ పలు రకాల ఆయుధ వ్యవస్థల పరేడ్ సాగింది. నభూతో నభవిష్యతి అన్న రీతిలో జరిగిన ఈ పరేడ్‌ను చూసేందుకు జనం లక్షలాదిగా తరలివచ్చారు.

### పరేడ్‌కు హాజరైనవారు..

రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో, ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియంతో, కాంబోడియా రాజు నోరోడోమ్ సిహమోనీ, వియత్నాం అధ్యక్షుడు లూంగ్ కూంగ్, మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, మయన్మార్ సైనిక నేత సీనియర్ జనరల్ మిన్ ఆంగ్ లాంగ్, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, కజకిస్తాన్ అధ్యక్షుడు కాసిం జోమార్ట్ తొకయేవ్, జింబాబ్వే అధ్యక్షుడు ఎమర్సన్ నాంగాగ్వా, కాంగో అధ్యక్షుడు డెనిస్ ససూ ఎన్‌గిసో, క్యూబా అధ్యక్షుడు మెగెల్ డియాజ్ క్యానెల్, అజర్‌బైజార్ అధ్యక్షుడు ఇల్హామ్ అలియేవ్ సహా 26 దేశాల అగ్రనేతలు బీజింగ్‌లో జరిగిన ఈ విక్టరీ పరేడ్‌లో ముఖ్య అతిథులుగా పాల్గొని పరేడ్‌లో అత్యాధునిక ఆయుధ సంపత్తిని స్వయంగా తిలకించారు.

### లేజర్ వెపన్, అండర్‌వాటర్ డ్రోన్లు

పెద్ద హెచ్‌జెడ్–155 రకం వాహనంపై నుంచి ప్రయోగించే శ్వేతవర్ణ భారీ ఎల్‌వై–1 లేజర్ ఆయుధాన్ని చైనా ప్రదర్శించింది. ఇది శత్రువుల ఆయుధాలు, ఆయుధ వ్యవస్థలను ముక్కలు ముక్కలుగా కోసేస్తుంది. ఇది సముద్రజలాలపై యుద్ధరీతులను మార్చేయడం ఖాయమని చైనా రక్షణనిపుణులు చెప్పారు. దీంతోపాటు గాల్లోంచి ప్రయోగించి చిన్నపాటి జేఎల్–1 అణ్వస్త్రసామర్థ్యమున్న క్షిపణిని ప్రదర్శించారు. దీంతోపాటు ఇదే సామర్థ్యమున్న ఇతర వేరియంట్లు డీఎఫ్–51, డీఎఫ్–31లనూ చూపించారు. వైజే–17 యాంటిషిప్ మిస్సైల్, డీఎఫ్–61 క్షిపణి, 5,000 కి.మీ.ల దూరాలను ఛేదించే డీఎఫ్–26డీ మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణిని ప్రదర్శించారు. యుద్ధవిమానాలు జే–20, జే–20ఏ, జే–20ఎస్, జే–35ఏలను ప్రదర్శించింది. తమ జాడ శత్రువులకు చిక్కకుండా రహస్యంగా ఎగిరొచ్చే( స్టెల్త్ సామర్థ్యమున్న) ఐదో తరం అన్ని వేరియంట్ల యుద్ధవిమానాలను ఇలా ఒకే పరేడ్‌లో ప్రదర్శించడం ఇదే తొలిసారి. ప్రపంచంలో జే–20ఏ మోడల్ యుద్ధవిమానంలో మాత్రమే ఇద్దరు పైలట్లు కూర్చునే వీలుంది. ఇవిగాక సీజే–1000 వాహనం నుంచి ప్రయోగించే సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి, నౌక నుంచి ప్రయోగించే క్రూయిజ్ మిస్సైల్, గగనతలం నుంచి ప్రయోగించే బాలిస్టిక్ క్షిపణులనూ ప్రదర్శించారు. నీటిలో నిఘా అవసరాలకు వాడే డ్రోన్లనూ చూపించారు. హెచ్‌క్యూ20, హెచ్‌క్యూ–22ఏ, హెచ్‌క్యూ–29 వంటి గగనతల రక్షణ వ్యవస్థ, ఎల్రక్టానిక్ ఉపకరణాలనూ ప్రదర్శించారు. హైపర్‌సోనిక్ గ్లైడ్ క్షిపణిని సైతం అడ్డుకునే హెచ్‌క్యూ–19 గగనతల రక్షణ వ్యవస్థను ప్రదర్శించారు. టైప్–100 యుద్ధ ట్యాంక్‌ను ప్రదర్శించింది. ఈ ట్యాంక్‌ను అత్యంత తెలివైన ట్యాంక్‌గా చెబుతారు. సమన్వయం చేసుకొంటూ దాడులు చేయగలదని చైనా పేర్కొంది. 12,000 కిలోమీటర్లు ప్రయాణించే డాంగ్‌ఫెంగ్–61 ఖండాంతర క్షిపణిని ప్రదర్శించింది. 60 అడుగుల పొడవైన సముద్ర డ్రోన్ 'ఏజేఎక్స్002' ఈసారి పరేడ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లాంగ్ రేంజ్ బాంబర్‌లు సైతం బీజింగ్ గగనతలంపై చక్కర్లు కొట్టాయి. నౌకలను నీటిలో ముంచేసే క్షిపణులను ఈ బాంబర్ నుంచి ప్రయోగించవచ్చు. హెచ్ఎస్‌యూ 100 అండర్‌వాటర్ డ్రోన్‌నూ చూపించారు. కృత్రిమ మేధ సాయంతో దాడిచేసే డ్రోన్లు, జీజే–11 స్టెల్త్ డ్రోన్లను సైతం ప్రదర్శించారు.

### భూమండలాన్ని కవర్ చేసే భారీ క్షిపణి

పరేడ్‌లో తొలిసారిగా ద్రవరూప ఇంధనంతో పనిచేసే ఖండాతర వ్యూహాత్మక అణ్వస్త్ర ఆయుధం డీఎఫ్–5సీను ప్రదర్శించారు. దీని లక్ష్య పరిధి ఏకంగా 20,000 కిలోమీటర్లు. అంటే ప్రపంచంలో ఎక్కడ దాక్కున్నా శత్రువును శబ్దం కంటే 10 రెట్లు ఎక్కువ వేగంతో దూసుకొచ్చి తుదముట్టిస్తుంది. ఇంతటి వేగంతో రావడంతో దీనిని అడ్డుకునే శత్రుదేశాల గగనతల రక్షణ వ్యవస్థలు సంసిద్ధమయ్యేందుకు సరిపడా సమయం చిక్కదు. ఆలోపే ఇది లక్ష్యను




తుత్తునియలు చేస్తుంది. పైగా ఇది ఒకేసారి 10 వేర్వేరు దిశల్లోని లక్ష్యాలను ఛేదించేలా 10 వార్‌హెడ్‌లను ప్రయోగించగలదు.

## డ్రోన్ కమెండోల కోసం బీఎస్ఎఫ్ శిక్షణ కేంద్రం

న్యూఢిల్లీ: భవిష్యత్తులో ఆపరేషన్ సిందూర్ వంటి ఆపరేషన్లు చేయాల్సి వస్తే సుదూర సమరక్షేత్రాల్లో డ్రోన్లతో విజయం సాధించే లక్ష్యంతో డ్రోన్ కమెండోలు, డ్రోన్ వారియర్లను తయారు చేసే ఉద్దేశ్యంతో సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) కొత్తగా డ్రోన్ వార్‌ఫేర్ స్కూల్‌ను మొదలెట్టింది. మధ్యప్రదేశ్‌లోని టికాన్‌పూర్‌లో డ్రోన్ స్కూల్‌ను మంగళవారం బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జీత్ ఛౌదరీ ప్రారంభించారు. అన్‌మ్యాన్డ్ ఎరియల్ వెహికల్, యాంటీ డ్రోన్ వార్‌ఫేర్, నిఘా, పర్యవేక్షణలో తర్ఫీదునిస్తారు. సిములేటర్లు, డ్రోన్ ఫ్లయింగ్ జోన్లు, పేలోడ్ వినియోగం, రాత్రిళ్లు డ్రోన్ల వినియోగం, రేడియోఫ్రీక్వెన్సీ జామర్ల వినియోగం, హార్డ్‌వేర్, కృత్రిమమేథ ఉపకరణాల వాడకంపై పట్టుసాధించేలా తగు శిక్షణ ఇస్తారు.

# బిల్లులపై గవర్నర్ల పెత్తనమేంటి?

- అసెంబ్లీలో ఆమోదించిన బిల్లు యోగ్యతను వారు ప్రశ్నించలేరు
- లెజిస్లేటివ్ విధుల్లో ఎగ్జిక్యూటివ్ వర్గం జోక్యం చేసుకోవద్దు
- సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట పశ్చిమ బెంగాల్ సర్కార్ వాదన

న్యూఢిల్లీ: శాసన నిర్వాహక వర్గం విధులు, ప్రక్రియలో కార్యనిర్వాహక వర్గం జోక్యం చేసుకోవడానికి వీల్లేదని సుప్రీంకోర్టుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తెలియజేసింది. బిల్లు రూపంలోని ప్రజల ఆకాంక్ష, అవసరాన్ని గవర్నర్లు లేదా రాష్ట్రపతి ఇష్టాయిష్టాలకు లోబడి ఉంచలేమని పేర్కొంది. శాసనసభలో ఆమోదించిన బిల్లు యోగ్యతను గవర్నర్లు ప్రశ్నించజాలరని తేల్చిచెప్పింది. బిల్లుకు సమ్మతి తెలియజేసే విషయంలో గవర్నర్లు/రాష్ట్రపతికి సుప్రీంకోర్టు 3 నెలల గడువు విధించిన సంగతి తెలిసిందే. దీనిపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభ్యంతరం తెలిపారు. గవర్నర్లు లేదా రాష్ట్రపతికి గడువు నిర్దేశించే అధికారం కోర్టులకు ఉందా? అని ప్రశ్నించారు. దీనిపై స్పష్టత ఇవ్వాలని సుప్రీంకోర్టుకు సూచించారు. రాష్ట్రపతి రిఫరెన్స్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం విచారణ ప్రారంభించింది. ఈ వ్యవహారంపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తన వాదనను బుధవారం ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చింది. ప్రభుత్వం తరఫున సీనియర్ లాయర్ కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లు కార్యనిర్వాహక వర్గం పరిధిలోకి రాదని పేర్కొన్నారు. ప్రజల సంకల్పమే అత్యున్నతం అని ఉద్ఘాటించారు. ధర్మాసనం స్పందిస్తూ... లెజిస్లేటివ్ నిబంధనలకు అనుగుణంగా లేని బిల్లులను కూడా గవర్నర్లు/రాష్ట్రపతి సమ్మతించాలని మీరు భావిస్తున్నారా? బిల్లుల యోగ్యతను కోర్టులు పరీక్షించవచ్చా? అని ప్రశ్నించింది. చట్టాల రాజ్యాంగబద్ధతను కోర్టులను పరీక్షించవచ్చని సిబల్ బదులిచ్చారు. కార్యనిర్వాహక వర్గానికి ఆ అధికారం లేదన్నారు. అసెంబ్లీలో ఆమోదం పొందిన బిల్లులపై గవర్నర్లు తక్షణమే త్వరగా నిర్ణయం తీసుకోవాలన్నారు. మూడు నెలలు లేదా ఆరు నెలలు అనడం సరైంది కాదన్నారు. మన దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత బిల్లును గవర్నర్లు లేదా రాష్ట్రపతి నిలిపివేసిన సందర్భాలు ఎక్కువగా లేవని గుర్తుచేశారు. ఒక బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందితే దానికి రాజ్యాంగబద్ధత వచ్చేసినట్లేనని అభిప్రాయపడ్డారు. ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 9వ తేదీకి వాయిదా వేసింది.

## దాడికి ముందే నిల్వలు పెంచారు

**ఇరాన్ శుద్ధ యురేనియంపై ఐరాస వెల్లడి**

వియన్నా: గాజాలో హమాస్ సాయుధ సంస్థకు ఆయుధాలిచ్చి పరోక్షంగా సాయంచేస్తోందన్న ఆగ్రహంతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ జూన్ 13వ తేదీన వైమానిక దాడులు చేయడం తెల్సిందే. అయితే ఆ తేదీ కంటే ముందే అణుబాంబులో వాడే లక్ష్యంతో మరింతగా శుద్ధిచేసిన యురేనియం నిల్వలను ఇరాన్ పెంచుకుందని ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ నివేదించింది. వియన్నా కేంద్రంగా పనిచేసే అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ నివేదికలో ఈ విషయం బయటపడింది. మే నెలలో ఇరాన్ వద్ద 60 శాతం శుద్ధతతో ఉన్న నిల్వలతో పోలిస్తే జూన్ 13నాటికి మరో 32.3 కేజీల శుద్ధ యురేనియం వచ్చిచేరిందని దాంతో ఆ కొద్దిరోజుల్లోనే నిల్వలు 440.9 కేజీలు పెరిగాయని ఐఏఈఏ తెలిపింది.

# సాక్షి హైదరాబాద్

గురువారం । 4 । సెప్టెంబర్ । 2025






**ఈ-కుప్పలు**

సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో.. అంతకు రెట్టింపుగా ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలు (ఈ-వేస్ట్) విడుదల అవుతున్నాయి. -8లో



**అపు'రూపం'**

ప్రతీ ఆర్టిస్ట్ తన జీవితకాలంలో కనీసం ఒక్క సారైన తనివి తీరా వినాయకుడి రూపాన్ని చిత్రిస్తారని నగరానికి చెందిన చిత్రకారులు అంటున్నారు. - సిటీప్లస్‌లో

**వాతావరణం**

గరిష్ఠం/కనిష్ఠం 28.0/22.0

నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురవొచ్చు. గరిష్ఠంగా 28, కనిష్ఠంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



# రూట్లు.. ఏర్పాట్లు..!

గణేశ్ శోభాయాత్ర మార్గాలను పరిశీలించిన కర్ణన్, సీవీ ఆనంద్, ఇతర అధికారులు

- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

**సాక్షి, సిటీబ్యూరో:** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 6న హైదరాబాద్‌లో నిర్వహించే నిమజ్జనం ఏర్పాట్లలో నగర అధికార యంత్రాంగం నిమగ్నమైంది. శోభాయాత్ర రూట్లలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, రాచకొండ సీపీ సుధీర్ బాబు, అదనపు సీపీ విక్రమ్‌సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డెవిస్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరిలతో కలిసి బాలాపూర్ వినాయకుడి శోభాయాత్ర రూట్ మ్యాప్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ట్యాంక్‌బండ్ వరకు జరిగే శోభాయాత్ర మార్గంలో కీలకమైన బాలాపూర్, చార్మినార్ సర్కిల్, మొజం జాహి మార్కెట్, తెలుగుతల్లి ఫ్లై ఓవర్ రూట్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు. విగ్రహాలను తీసుకెళ్లే వాహనాలు, వాటి ఎత్తు, ఊరేగింపులు, పోలీసు బందోబస్తు, వ్యర్థాల తొలగింపు, నిరంతర విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ మళ్లింపు, అత్యవసర వైద్యసేవలు వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు.

**బందోబస్తులో 30 వేలమంది పోలీసులు**

నగరంలో గణేశ్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో జరిగేలా 30 వేల మంది పోలీస్ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని సీవీ ఆనంద్ చెప్పారు. 303.3 కిలోమీటర్ల మేర ప్రధాన ఊరేగింపు మార్గంలో విగ్రహాల ఊరేగింపు సజావుగా జరిగేందుకు 160 గణేశ్ యాక్షన్ టీంలను సిద్ధం చేశామన్నారు. ఖైరతాబాద్, బాలాపూర్ విఘ్నేశ్వరుల శోభాయాత్ర సకాలంలో పూర్తి అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టామని పేర్కొన్నారు. సంబంధిత ప్రభుత్వ శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అనంతరం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ ఈ నెల 2 వ తేదీ వరకూ నగరవ్యాప్తంగా 1,21,905 గణేశ్ ప్రతిమల నిమజ్జనం జరిగిందన్నారు. ఈ నెల 6వ తేదీన సుమారు 50 వేల విగ్రహాలు నిమజ్జనం అవుతాయని అంచనా వేస్తున్నామని తెలిపారు.

**బాలాపూర్ గణేశ్ రూట్ మ్యాప్**

కట్ట మైసమ్మ దేవాలయం- కేశవగిరి- చంద్రాయణగుట్ట ఎక్స్ రోడ్- మహబూబ్‌నగర్ ఎక్స్ రోడ్- ఇంజన్ బౌలి- అలియాబాద్- నాగుల్ చింత జంక్షన్ - హిమ్మత్‌పురా- చార్మినార్- మదీనా క్రాస్ రోడ్- అఫ్జల్ గంజ్- ఎంజే మార్కెట్- అబిడ్స్ జీపీఓ- బీజేఆర్ విగ్రహం- బషీర్‌బాగ్ క్రాస్‌రోడ్- లిబర్టీ- అంబేడ్కర్ విగ్రహం- ట్యాంక్ బండ్

**ఖైరతాబాద్ గణేశుడి రూట్ మ్యాప్**

బడా గణేశ్- పాత సైఫాబాద్ పీఎస్- ఇక్బాల్ మినార్- తెలుగుతల్లి విగ్రహం- అంబేడ్కర్ విగ్రహం- ట్యాంక్ బండ్

| గ్రేటర్‌లో నిమజ్జన ఏర్పాట్లు ఇవీ |
| --- |
| పోలీసు బందోబస్తు సిబ్బంది: 30 వేలు |
| కంట్రోల్ రూమ్‌లు: 13 |
| నిమజ్జనం కోసం ప్రధాన చెరువులు: 20 |
| కృత్రిమ కొలనులు: 72 |
| క్రేన్లు: 134 స్థిర క్రేన్లు, 259 మొబైల్ క్రేన్లు |
| తాత్కాలిక విద్యుత్ దీపాలు: 56,187 |
| హుస్సేన్ సాగర్‌లో బోట్లు: 9 |
| గజ ఈతగాళ్లు: 20 మంది |
| శానిటేషన్ సిబ్బంది: 14,486 |

# కార్పొరేట్‌కు కాసులు.. సర్కార్ ఆసుపత్రులకు అప్రతిష్ట

చివరి నిమిషంలో విషమ కేసులు రిఫర్ చేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులు

- సక్సెస్ రేటు కోసం అడ్డదారులు
- ప్రభుత్వాసుపత్రుల్లో డెత్‌రేటు పెరగడానికి ఇదే కారణం
- ఉస్మానియా, గాంధీ, నిమ్స్ ఆసుపత్రుల్లో నిత్యం ఇదే పరిస్థితి



రెండు వారాల క్రితం జూబ్లీహిల్స్‌లో ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు సమీపంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా సుమారు 10 గంటల వైద్యం చేసి రూ.1.5 లక్షల బిల్లు వసూలు చేశారు. అనంతరం రాత్రి 7 గంటల సమయంలో ఉస్మానియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ వైద్యులు ఆమె పరిస్థితి చేయిదాటిపోయిందని చెప్పినా కుటుంబ సభ్యులు వినకుండా వైద్యులతో వాగ్వాదానికి దిగారు. ఆసుపత్రిలో చేరిన మూడు గంటల తరువాత ఆమె మృతి చెందింది. ఇది ఉదాహరణకు ఒకటి మాత్రమే. రోజూ ఇలాంటి ఎన్నో కేసులు చివరి నిమిషంలో గాంధీ, ఉస్మానియా, నిమ్స్ వంటి ఆసుపత్రులకు రిఫరల్‌గా వస్తున్నాయి.

సాక్షి, సిటీబ్యూరో/అఫ్జల్‌గంజ్

ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు ప్రభుత్వ దవాఖానాలను అప్రతిష్టపాలు చేస్తున్నాయి. డెత్ రేటు విషయంలో అడ్డంగా బుక్ చేస్తున్నాయి. కింది స్థాయి నుంచి క్రిటికల్ కేసులను రాబట్టుకోవడం, చికిత్సల పేరుతో రూ.లక్షలు వసూలు చేయడం, పరిస్థితి చేయిదాటిన తరువాత ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేసి చేతులు దులిపేసుకోవడం ఈ 'కాసుపత్రులకు'షరామామూలుగా మారింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరాక 50 శాతం కేసుల్లో రోగులు మృత్యువాత పడుతున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెత్‌రేట్ పెరుగుతోంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో డెత్ రేటు తక్కువగా ఉండటానికి ఇదే కారణమని ప్రభుత్వ వైద్యులు పేర్కొంటున్నారు. ఈ నివేదికలను చూపించి ప్రైవేటు హాస్పిటల్స్ యాజమాన్యాలు తమ సక్సెస్ రేటును ప్రచారానికి వాడుకుంటున్నారు.

గాంధీ, ఉస్మానియా, నిమ్స్ వంటి ఆసుపత్రులకు రాష్ట్రం నలుమూలల నుంచి క్రిటికల్ కేసులు రిఫరల్‌గా వస్తుంటాయి. రోగి ప్రాథమిక దశలో వస్తే మెరుగైన వైద్య సేవలందిస్తున్నారు. సదరు రోగి క్షేమంగా తిరిగి ఇంటికి వెళుతున్నారు. అయితే నగరంలో ఉన్న సుమారు 40కిపైగా కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రులు, వాటి శాఖలు ప్రతిరోజూ పదుల సంఖ్యలో ప్రభుత్వాసుపత్రులకు రిఫరల్స్ పంపిస్తున్నాయి. ఇందులో చివరి నిమిషంలో వచ్చిన కేసులే అధికంగా ఉంటున్నాయి. ఈ క్రమంలో గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో రోజుకు కనీసం 10 నుంచి 25 మంది వరకు మృతి చెందుతున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో 30 శాతం నుంచి 50 శాతం కేసులు సిఫార్సుపై వచ్చినవేనని ప్రభుత్వాసుపత్రుల వైద్యులు పేర్కొంటున్నారు. దీంతో సాధారణ ప్రజల్లో ఆయా ఆసుపత్రులకు వెళితే ఇక అంతే, ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సిందే అనే భావన కలుగుతోంది. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా శస్త్రచికిత్సలు చేస్తున్న ప్రభుత్వాసుపత్రులు దాన్ని ప్రజలకు తెలియజేయడంలో వెనుకబడిపోతున్నాయి.

**వేల సంఖ్యలో ఓపీ..**

ఉస్మానియాలో ప్రతిరోజు అవుట్ పేషెంట్(ఓపీ) 1,600 కాగా, 1,150 వరకు బెడ్స్ అందుబాటులో ఉన్నాయి. నిమ్స్ ఓపీ సుమారు 2,500 కాగా, బెడ్స్ 1,500, గాంధీలో ఓపీ సుమారు 2,500, బెడ్స్ వెయ్యి ఉన్నాయి. కొత్తగా మరో 2 వేలకుపైగా బెడ్స్ అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో ఆసుపత్రిలో రోజుకు 300లకుగాపై ఇన్‌పేషెంట్(ఐపీ)గా చేరుతున్నారు. శస్త్రచికిత్సలు, ఇతర వైద్య సేవలతో ఆసుపత్రి సిబ్బంది తలమునకలై ఉన్న క్రమంలో అడ్మిషన్ సమయంలో కొంత జాప్యం జరుగుతోంది. రోగి పరిస్థితి చేయి దాటిందని చెప్పినా వినిపించుకోకుండా చేర్చుకోవాలంటూ ఒత్తిడి చేస్తున్నారని, వాగ్వాదానికి దిగుతున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. ఎక్కడైనా చిన్న సేవా లోపం కనిపిస్తే రోగి బంధువులు దాన్ని పెద్ద రాద్ధాంతమే చేస్తున్నారు.

**ఉచితంగా ఆధునిక వైద్యం అందిస్తున్నాం**



మేం అత్యాధునిక శస్త్రచికిత్సలు అందిస్తున్నాం. కొత్త టెక్నిక్స్ అందుబాటులోకి తెస్తున్నాం. కార్పొరేట్ ఆసుపత్రులతో సమానంగా వైద్యులకు ఎప్పటికప్పుడు అవసరమైన అప్‌డేట్ ట్రైనింగ్ కార్యక్రమాలు చేపడుతున్నాం. చిన్నపాటి జ్వరం నుంచి అవయవాల మార్పిడి వరకు అన్ని రకాల శస్త్రచికిత్సలు ఉచితంగా అందిస్తున్నాం. రోగిని రక్షించుకోవడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాం. చివరి నిమిషంలో వచ్చి ఆసుపత్రి పేరును బద్నాం చేయడం సమంజసం కాదు.

– రాకేష్ సహాయ్, ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్

# 'గ్రేటర్' ఖజానా కళకళ

టౌన్ ప్లానింగ్ ద్వారా రూ.759.98 కోట్ల ఆదాయం

- గత ఏడాది కంటే 90 శాతం అధికం
- 5 నెలలు.. 4,389 అనుమతులు
- 1,008 ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ



**సాక్షి, సిటీబ్యూరో:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్‌ఎంసీ) ఖజానాకు టౌన్ ప్లానింగ్ కాసుల కళ తెచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో గత ఐదు నెలల్లోనే భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల(ఓసీ) జారీ ద్వారా భారీ ఆదాయం సమకూరింది. వీటి ద్వారా రూ.759.98 కోట్ల రాబడి వచ్చింది. గత ఏడాది ఇదే ఐదునెలల కాలంలో రూ.399.61 కోట్ల ఆదాయం మాత్రమే లభించింది. 90 శాతం ఆదాయం అధికంగా రావడంతో జీహెచ్‌ఎంసీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. గత రెండేళ్లుగా రియల్ ఎస్టేట్ రంగం క్రమేపీ అభివృద్ధి చెందుతుండటంతో ఇది సాధ్యమైందని అధికారులు పేర్కొన్నారు. భవన నిర్మాణ అనుమతుల్లో కొత్తగా అందుబాటులోకి తెస్తున్న సరళీకరణ విధానాలు, ఎఫ్‌డీఐ పెట్టుబడులు, ఆఫీసు స్థలాల ఆక్యుపెన్సీ, నివాస గృహాల విక్రయాలు పెరగడం వంటివి ఇందుకు ఉపకరించినట్లు భావిస్తున్నారు.

**మౌలిక సదుపాయాలతో సానుకూలత**

హై సిటీ(హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్టు కింద ప్రభుత్వం చేపట్టబోయే మౌలిక సదుపాయాల పనులు, మల్టీ లెవెల్ ఫ్లైఓవర్లు, గ్రేడ్ సెపరేటర్లు, అండర్ పాస్‌లు, జంక్షన్ల అభివృద్ధి, రోడ్ల విస్తరణ వంటి పనులు సైతం సానుకూల వాతావరణాన్ని సృష్టించినట్లు చెబుతున్నారు. జీహెచ్‌ఎంసీ ఆదాయ వనరుల్లోనూ ఆస్తిపన్ను తర్వాత టౌన్‌ప్లాన్ విభాగమే కీలకం. భవన అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు అన్నీ 'బిల్డ్ నౌ'అప్లికేషన్‌లో ఆన్‌లైన్‌లో ప్రాసెస్ అవుతున్నాయి. ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్, ఇన్‌స్టంట్ అనుమతి, సింగిల్ విండో వంటి విధానాల ద్వారా అనుమతులు జారీ అవుతున్నాయి.

**ఐదు నెలల్లో రికార్డు స్థాయి ఆదాయం**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్–ఆగస్టు మధ్య కాలంలో జీహెచ్‌ఎంసీ 4,389 భవన నిర్మాణ అనుమతులు, 1,008 ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేయడం ద్వారా రూ.759.98 కోట్ల ఆదాయం ఆర్జించింది. గత సంవత్సరం ఇదే కాలంలో వచ్చిన ఆదాయం రూ. 399.61 కోట్లు మాత్రమే. దీంతో 90% వృద్ధి నమోదైనట్లయింది.

**సీఎం నేతృత్వంలో..**

భవన నిర్మాణ అనుమతులకు టీజీబీపాస్ స్థానంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన ఏఐ ఆధారిత 'బిల్డ్ నౌ'సమగ్ర ప్లాట్‌ఫామ్ ద్వారా అనుమతులు త్వరితంగా జారీ అవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. మునిసిపల్ శాఖను పర్యవేక్షిస్తున్న సీఎం సూచనలతోనూ దరఖాస్తుల పరిష్కారం వేగవంతమై, ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని పేర్కొంటున్నారు. జీహెచ్‌ఎంసీ, ప్రభుత్వ యూజర్ ఫ్రెండ్లీ విధానాలతో సుస్థిర నగరంగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ అభివృద్ధి పథంలో ముందుకెళ్తోందని జీహెచ్‌ఎంసీ పేర్కొంది.

**గత 5 నెలల్లో..**

| కేటగిరీ | భవన అనుమతులు | ఓసీలు |
| --- | --- | --- |
| ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్ | 194 | -- |
| ఇన్‌స్టంట్ అనుమతులు | 3240 | 161 |
| సింగిల్ విండో | 955 | 847 |
| మొత్తం | 4389 | 1008 |

# తాగునీటి వృథా.. ఇద్దరికి జరిమానా

జలమండలి ఎండీ ఆదేశాల మేరకు చర్య

**సాక్షి, సిటీబ్యూరో:** జలమండలి సరఫరా చేసే తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగిస్తున్న ఇద్దరికి అధికారులు జరిమానా విధించారు. బుధవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి బంజారాహిల్స్ ప్రధాన రహదారిపై వెళుతుండగా రోడ్ నం.12లో నీరు పారుతుండటాన్ని గమనించి స్థానిక మేనేజర్ ద్వారా లీకేజీ కారణాలపై ఆరా తీశారు. జలమండలి సరఫరా చేసే నీటితో ఒక వ్యక్తి కారు, బైక్ కడిగినట్లు చెప్పారు. ఎండీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ తాగునీటిని ఇలా ఇతర అవసరాలకు వినియోగించిన వినియోగదారుడికి నోటీసు అందించి, జరిమానా విధించాలని మేనేజర్‌ను ఆదేశించారు. ఎండీ ఆదేశాల మేరకు ఆ వ్యక్తికి రూ.10 వేల జరిమానా విధించారు. ఆ ప్రాంతంలోనే మరో వ్యక్తికి చెందిన తాగునీటి సంపు నిండి పొంగిపొర్లి దాదాపు కిలోమీటర్ వరకు రహదారిపై నీరు ప్రవహించింది. నిర్లక్ష్యంతో నీటిని వృథా చేసినందుకు ఈ వ్యక్తికి రూ.5 వేల జరిమానా విధించారు. జలమండలి సరఫరా చేసే తాగునీరు ఇతర అవసరాలకు వినియోగించవద్దని ఎండీ అన్నారు. ఎవరైనా ఇలాంటి పనులు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పాతబస్తీకి 'ఎన్టీపీసీ వెలుగులు'

- చార్మినార్, లాడ్‌బజార్ తదితర ప్రాంతాల్లో..
- త్వరలో ప్రత్యేక లైటింగ్



**సాక్షి, సిటీబ్యూరో:** పాతబస్తీ పరిధిలోని చార్మినార్, దాని పరిసరాలైన పత్తర్‌ఘట్టి, చార్‌కమాన్ తదితర ప్రాంతాలకు 'ఎన్టీపీసీ వెలుగులు'రానున్నాయి. ఆ ప్రాంతాలను ఆకర్షణీయమైన విద్యుల్లతలతో అలంకరించనున్నారు. సీఎస్సార్ కింద ఎన్టీపీసీ సంస్థ అందజేసిన నిధులతో నయాపూల్ నుంచి చార్మినార్ వరకు.. లాడ్ బజార్, చార్మినార్ పరిసరాల్లో ఉన్న నాలుగు ఆర్చ్‌లు, ఇతరత్రా ఐకానిక్ ప్రాంతాలను ప్రత్యేకంగా తీర్చిదిద్దనున్నారు. ఈ మేరకు పనులు చేసేందుకు దాదాపు రూ. 7 కోట్ల అంచనా వ్యయంతో జీహెచ్‌ఎంసీ కమిషనర్ తరఫున కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) టెండరు నోటిఫికేషన్ జారీ చేసింది. టెండర్ల దాఖలుకు ఈ నెల 16 చివరి తేదీ. టెండరు పూర్తయ్యాక ఈ పనుల్ని ఆరు నెలల్లో పూర్తి చేయనున్నారు. పనులు పూర్తయ్యాక ఐదేళ్ల వరకు ఏవైనా లోపాలు తలెత్తినా డిఫెక్ట్ లయబిలిటీ కింద ఎంపికైన కాంట్రాక్టు ఏజెన్సీయే సరిచేయాల్సి ఉంది. పనుల్లో భాగంగా చార్మినార్ పిల్లర్లకు, చార్మినార్ చుట్టూ, మదీనా జంక్షన్ నుంచి చార్మినార్ వరకు పత్తర్‌గట్టి ప్రాంతంలో రెయిలింగ్‌కు ప్రత్యేక లైటింగ్ ఏర్పాట్లు చేయాలి. మదీనా జంక్షన్ నుంచి గుల్జార్ హౌస్ వరకు మీడియన్ ట్రీస్‌కు, మచిలీ కమాన్, చార్ కమాన్, కాళి కమాన్, షేర్ ఎ బట్లికి కమాన్‌లకు ఈ ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేయాలి. పాతబస్తీ చారిత్రక ప్రాశస్త్యం ప్రతిబింబించేలా, ఆయా కట్టడాల వాస్తుశిల్పం చెదరకుండా, చూపరులను ఆకట్టుకునేలా పనులు చేయాల్సి ఉంటుంది.

# 18న బాచుపల్లి ప్లాట్ల ఈ-వేలం



**సాక్షి, సిటీబ్యూరో:** హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్‌ఎండీఏ) బాచుపల్లి లేఅవుట్‌లోని 70 ఖాళీ ప్లాట్లకు ఈ నెల 18న ఈ-వేలం వేయనుంది. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం లే అవుట్‌లో ప్రీబిడ్ మీటింగ్ నిర్వహించింది. ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి వేలంపాట ప్రక్రియ గురించి వివరించారు. ఎంఎస్‌టీసీ ప్రతినిధులు ఈ-వేలం పాట విధానం గురించి ప్రజెంటేషన్ ఇచ్చారు. కేపీఎంజీ ప్రతినిధులు ఈ ప్రాంతంలోని వ్యూహాత్మక ప్రాధాన్యతలు, భవిష్యత్ అభివృద్ధి అవకాశాలపై ప్రత్యేకంగా ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో పాల్గొన్నవారి నుంచి వచ్చిన సందేహాలకు ఆయా విభాగాల అధికారులు నివృత్తి చేశారు. సమావేశంలో హెచ్‌ఎండీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యప్రసాద్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి అర్ధరాత్రి వరకే 'మహా' దర్శనం

**ఖైరతాబాద్:** ఖైరతాబాద్ మహా వినాయకుడి దర్శనానికి గురువారం అర్ధరాత్రి వరకే అనుమతి ఉంటుందని, ఆ తర్వాత భక్తుల దర్శనాలను నిలిపివేస్తామని నిర్వాహకులు తెలిపారు. శనివారం మహా వినాయకుడి నిమజ్జనం సందర్భంగా షెడ్డు తొలగింపు పనులు, క్రేన్ ఏర్పాట్ల కారణంగా శీఘ్ర, సర్వదర్శనాలకు అవకాశం ఉండదు. భక్తులు ఈ విషయాన్ని గమనించి నిర్వాహకులకు, పోలీసులకు సహకరించాలని కోరారు.

## 1.04 లక్షల విగ్రహాల నిమజ్జనం

**సాక్షి,సిటీబ్యూరో:** జీహెచ్‌ఎంసీలోని ఆరు జోన్ల పరిధిలో మంగళవారం వరకు 1,04,135 విగ్రహాల నిమజ్జనం జరిగినట్లు జీహెచ్‌ఎంసీ తెలిపింది. ఆయా ప్రాంతాల్లోని పెద్ద చెరువులతోపాటు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కొలనుల్లో ఈ నిమజ్జనాలు జరిగాయి. వీటిలో చిన్న, పెద్ద విగ్రహాలు కూడా ఉన్నాయి.



# పురాతన పైప్‌లైన్లకు డీ సిల్టింగ్

మురుగు సమస్యకు తాత్కాలికంగా చెక్

- శాశ్వత పరిష్కారానికి మాస్టర్‌ప్లాన్
- జలమండలి ఎండీ క్షేత్రస్థాయి పర్యటనలో ఆదేశాలు

**సాక్షి, సిటీబ్యూరో:** ఏళ్లనాటి సీవరేజీ పైప్‌లైన్లు రోడ్డు కింద పూడుకుపోయి మట్టి, చెత్త చేరి మురుగు సాఫీగా ముందుకు సాగక మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతున్నాయి. తాత్కాలికంగా డీ-సిల్టింగ్‌తో ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు జలమండలి చర్యలకు ఉపక్రమించింది.

బుధవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి పలు ప్రాంతాల్లో పర్యటించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. డివిజన్–6 పరిధిలోని జూబ్లీ హిల్స్ వెంకటగిరి, కృష్ణానగర్ కాలనీ, శ్రీనగర్ కాలనీల్లోని పలు సమస్యాత్మకమైన ప్రాంతాలను పరిశీలించారు. వెంకటగిరి ప్రాంతంలో వర్షం పడ్డప్పుడు ఔట్‌లెట్ సరిగ్గా లేక నీరు కాలనీలో నిలుస్తోంది. ప్రజలు ఇబ్బంది పడుతుండటంతో ఇటీవల జలమండలి డీ-సిల్టింగ్ పనులు చేపట్టింది. ఆ పనులు ఎండీ పరిశీలించారు. పురాతన సీవరేజ్ లైన్లను డీ-సిల్టింగ్ చేసి తాత్కాలికంగా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శాశ్వత పరిష్కారంగా మ్యాన్‌హోళ్లను రోడ్డుకు సమాంతరంగా పునర్నిర్మాణం చేయాలని అన్నారు. ఈ ప్రాంతంలో సర్వే నిర్వహించి సీవరేజి మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని ఆదేశించారు.

**వాననీటి కాలువలో సీవరేజి నీరు చేరకుండా..**

జీహెచ్‌ఎంసీ వాననీటి కాలువలో సీవరేజ్ నీరు చేరకుండా ప్రత్యేక పైప్‌లైన్లను నిర్మించాలని అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ వాననీటి కాలువలో డీ-సిల్టింగ్ పనులు చేపడితే ఈ సమస్య కొంతమేరకు తీరుతుందని, ఆ పనులు వెంటనే చేపట్టాలని స్థానిక జీహెచ్‌ఎంసీ డీసీకి సూచించారు. జలమండలి, జీహెచ్‌ఎంసీ శాఖల అధికారులు సమస్య పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కృష్ణానగర్ కాలనీ ఏ, బీ బ్లాక్, లేబర్ అడ్డా ప్రాంతాలు, రహదారులలో మురుగునీరు పారే ప్రాంతాల్లో పర్యటించి శాశ్వత పరిష్కారం కోసం ప్రతిపాదనలను రూపొందించి, తాత్కాలికంగా సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఎండీ సూచించారు.

**రోడ్డుకు సమాంతరంగా వాల్వ్ చాంబర్లు**

రహదారులపై ఉన్న తాగునీటి వాల్వ్ చాంబర్లు కొన్ని ప్రాంతాల్లో ధ్వంసమైన పరిస్థితిని జలమండలి ఎండీ గుర్తించారు. వెంటనే చాంబర్లలో నీరు చేరితే కలుషితమయ్యే అవకాశం ఉన్నందున, వెంటనే వాటిని గుర్తించి రోడ్డుకు సమాంతరంగా నిర్మించాలని ఏఎంఎస్ ఏజెన్సీని ఆదేశించారు. తాగునీటి వాల్వ్ చాంబర్ల వద్ద లీకేజీని అరికట్టి కలుషిత నీరు సరఫరా కాకుండా నిరోధించాలన్నారు. కలుషిత నీరు సరఫరా విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సీవరేజీ మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

**ఇంజెక్షన్ బోర్‌వెల్**

నిరుపయోగంగా ఉన్న చేతి పంపును గుర్తించి, దాన్ని స్పెషల్ డ్రైవ్‌లో ఇంజెక్షన్ బోర్‌వెల్‌గా మార్చాలని అశోక్‌రెడ్డి ఆదేశించారు. ఇంజెక్షన్ బోర్‌వెల్స్‌గా మార్చడానికిగాను నిరుపయోగంగా ఉన్న మరిన్ని బోర్‌వెల్స్‌ను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జలమండలి సీజీఎం ప్రభు, జీఎం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆరువేల మందితో బందోబస్తు

- వినాయక నిమజ్జనాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

**మూసాపేట:** సైబరాబాద్ పరిధిలో వినాయక నిమజ్జనానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన కూకట్‌పల్లిలోని ఐడీఎల్ రంగధాముని చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జన ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 6 వేల మంది పోలీసులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన 700కు పైగా పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. రాబోయే మూడు రోజుల్లో వినాయక నిమజ్జనాలు భారీ ఎత్తున జరగనున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. చివరి రోజు నిమజ్జన ఏర్పాట్లపై ఇప్పటికే అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసినట్లు తెలిపారు. భక్తులు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. పోలీసులతో గస్తీ నిర్వహిస్తూనే సీసీటీవీల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బాలానగర్ జోన్ డీసీపీ సురేష్‌కుమార్, కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్, కూకట్‌పల్లి సీఐ కె.వి. సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళ మెడలో గొలుసు చోరీ

**సనత్‌నగర్:** నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న ఓ మహిళ మెడలోని 1.5 తులాల బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.సనత్‌నగర్ ఎస్సార్టీకాలనీకి చెందిన కదారి రమాదేవి ఈ నెల 1న సాయంత్రం స్థానిక నెహ్రూ పార్కు సమీపంలోని గణేష్ మండపానికి వచ్చింది. రాత్రి ఇంటికి తిరిగి వెళుతుండగా సాయిబాబా ఆలయ సమీపంలో బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని 1.5 తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బైక్‌పై వచ్చిన వ్యక్తి స్కైబ్లూ కలర్ జర్కిన్ ధరించినట్లు బాధితురాలు పేర్కొంది.

## హాష్ ఆయిల్ విక్రేతల అరెస్టు

**రహమత్‌నగర్:** గుట్టు చప్పుడు కాకుండా నిషేధిత హాష్ ఆయిల్ విక్రయిస్తున్న యువకులను బోరబండ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సెక్టార్ ఎస్‌ఐ కాశయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఏజీ కాలనీలో కొందరు వ్యక్తులు హాష్ ఆయిల్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో మంగళవారం రాత్రి దాడి చేసిన పోలీసులు హాష్ ఆయిల్ విక్రయిస్తున్న హేమంత్‌గౌడ్, సతీష్, కార్తీక్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి 55 బాటిళ్లు(220 ఎంఎల్) స్వాధీనం చేసుకుని ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు.



# 'ఈ' కుప్పలు!

### రాష్ట్రంలో పెరుగుతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలు

- తొలిసారిగా లక్ష మెట్రిక్ టన్నులు దాటిన ఈ-వేస్ట్
- 2024-25లో 1,19,187 మెట్రిక్ టన్నుల విడుదల
- ఉత్తర్‌ప్రదేశ్, హర్యానా తర్వాత అత్యధికంగా ఈ-వేస్ట్ మన రాష్ట్రంలోనే
- రాష్ట్రంలో కేవలం 15 రీసైక్లింగ్ కేంద్రాలే
- పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం



**సాక్షి, సిటీబ్యూరో:** సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో.. అంతకు రెట్టింపు వేగంతో ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలు (ఈ-వేస్ట్) విడుదల అవుతున్నాయి. సెల్‌ఫోన్, కంప్యూటర్, ల్యాప్‌టాప్, రిఫ్రిజిరేటర్, ఏసీ, ప్రింటర్లు ఇలా ప్రతి ఎలక్ట్రానిక్ ఉత్పత్తి వినియోగం తర్వాత వ్యర్థాలుగా మారుతున్నాయి. తెలంగాణలో తొలిసారిగా ఈ-వేస్ట్ లక్ష మెట్రిక్ టన్నుల మార్క్‌ను దాటింది. 2024-25లో 1,19,187 మెట్రిక్ టన్నుల ఈ-వేస్ట్ విడుదలయ్యాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. అదే 2023-24లో 65,226 మెట్రిక్ టన్నుల ఈ-వేస్ట్ విడుదలైంది. అంటే ఏడాది కాలంలో రాష్ట్రంలో అదనంగా 53,961 మెట్రిక్ టన్నులు ఈ-వ్యర్థాలు విడుదలయ్యాయి.

- దేశంలో ఉత్తరప్రదేశ్, హరియాణా తర్వాత దేశంలో అత్యధిక ఈ-వ్యర్థాలు విడుదలవుతున్నది మన రాష్ట్రంలోనే. తెలంగాణలో అధికంగా ఈ-వేస్ట్ విడులయ్యేది హైదరాబాద్ నుంచే. గత ఐదేళ్లలో నగరంలో ఉత్పత్తి అయ్యే ఎలక్ట్రానిక్ వ్యర్థాల పరిమాణం గణనీయంగా పెరుగుతుందని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2017-18లో నగరంలో 33,425 మెట్రిక్ టన్నుల ఈ-వ్యర్థాలు ఉత్పత్తి కాగా.. ఇప్పుడవి 50,835 మెట్రిక్ టన్నులకు పెరిగాయి.

**ఈ-వేస్ట్ ప్రాసెసింగ్..**

దేశంలో ఈ-వ్యర్థాల ప్రాసెసింగ్ సామర్థ్యం 13.97 మెట్రిక్ టన్నులు కాగా.. ఇందులో తెలంగాణ వాటా 8.5 శాతం. ప్రాసెసింగ్ వృద్ధిలో ఉత్తరప్రదేశ్ తర్వాత తెలంగాణ రెండో స్థానంలో ఉంది. 2021-22 నుంచి ఈ-వేస్ట్ ప్రాసెసింగ్ మూడు రెట్లు వృద్ధి చెందుతోంది. ఐటీ సంస్థల కార్యకలాపాలు, పెరుగుతున్న ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం, చురుకైన ఈ-వేస్ట్ నిర్వహణ విధానాలు ప్రాసెసింగ్ వృద్ధికి ప్రధాన కారణాలు. 2021-22లో 42,297 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ప్రాసెసింగ్ కాగా.. గత ఆర్థిక సంవత్సరానికి 1.19 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది. అయితే రాష్ట్రంలో కేవలం 15 రీసైక్లింగ్ కేంద్రాలే ఉన్నప్పటికీ.. ప్రాసెసింగ్‌లో ఈ స్థాయిలో వృద్ధి నమోదు కావడం గమనార్హం.

**అత్యధిక ఈ-వేస్ట్ రీసైక్లింగ్ కేంద్రాలున్న రాష్ట్రాలివీ**

| రాష్ట్రం | కేంద్రాల సంఖ్య |
|---|---|
| ఉత్తరప్రదేశ్ | 82 |
| కర్నాటక | 45 |
| మహారాష్ట్ర | 43 |
| హర్యానా | 32 |
| గుజరాత్ | 29 |
| తెలంగాణ | 15 |
| తమిళనాడు | 13 |
| రాజస్థాన్ | 10 |

**ప్రజారోగ్యంపై ప్రభావం..**

ఈ-వ్యర్థాలు ప్రజారోగ్యం, పర్యావరణంపై ప్రభావం చూపిస్తుందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలక్ట్రానిక్ ఉపకరణాల్లో సీసం, పాదరసం, కాడ్మియం, క్రోమియం వంటి రసాయన పదార్థాలు ఉంటాయి. వీటిని సరిగా నిర్వీర్యం చేయకుండా పారేస్తే.. గాలి, నీరు, నేల కలుషితం అవుతాయి. ఈ కలుషితాలతో శ్వాసకోశ వ్యాధులు, నాడీ సంబంధిత రుగ్మతలు, దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతాయని వైద్యులు చెబుతున్నారు. పిల్లలు, వృద్ధులపై ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుంద ని వారు పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ సక్రమంగా, కఠినంగా అమలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

## నాంపల్లి కోర్టుకు హీరో నాగార్జున

- విచారణకు గైర్హాజరైన మంత్రి కొండా సురేఖ
- తదుపరి విచారణ 24కి వాయిదా

**సిటీ కోర్టులు:** రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖపై సినీనటుడు నాగార్జున దాఖలు చేసిన పరువునష్టం కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్)లో జరిగింది. ఈ విచారణకు నాగార్జున హాజరై వాంగ్మూలం ఇవ్వగా, మంత్రి సురేఖ గైర్హాజరయ్యారు. నాగార్జున వాంగ్మూలాన్ని రికార్డు చేసుకున్న కోర్టు పలు డాక్యుమెంట్లను కూడా మార్క్ చేసింది. అనంతరం క్రాస్ ఎగ్జామినేషన్ కోసం విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసింది. ఆరోజు క్రాస్ ఎగ్జామినేషన్ ఉంటుందని నాగార్జునకు కోర్టు తెలిపింది. నాగార్జున కుమారుడైన హీరో నాగచైతన్య-సమంత దంపతుల విడాకుల విషయంపై మంత్రి సురేఖ అసంబద్ధమైన వ్యాఖ్యలు చేశారని, వాటి కారణంగా తమ కుటుంబ పరువు పోయిందని నాగార్జున కోర్టులో పరువునష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ విచారణకు నాగార్జునతోపాటు నాగచైతన్య కూడా నాంపల్లి కోర్టుకు వచ్చారు.

## డిజిటల్ అరెస్టు పేరుతో టోకరా

నిందితుడి అరెస్టు

**సాక్షి, సిటీబ్యూరో:** డిజిటల్ అరెస్టు పేరుతో మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కర్నాటకకు చెందిన ప్రతాప్ కేసరి ప్రధాన్ బెంగళూరులోని తిరుమలశెట్టిహళ్లిలో ఏయూ స్మాల్ ఫైనాన్స్ ప్రైవేట్ బ్యాంక్‌లో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కస్టమర్లకు పొదుపు, కరెంట్ ఖాతాలు తెరవడం, కస్టమర్లతో సంబంధాలు నిర్వహించడం అతడి బాధ్యత. ఈ క్రమంలో కస్టమర్లకు కమీషన్ ఆశ చూపించి, వారి నుంచి ఖాతా వివరాలను తీసుకుని వాటిని సైబర్ నేరగాళ్లకు చేరవేస్తూ అక్రమంగా డబ్బు సంపాదించేవాడు. వారు ఆయా ఖాతాలను సైబర్ నేరాలు, మోసాలకు వినియోగించేవారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన మహిళకు గత జులైలో సైబర్ నేరగాడు ప్రదీప్ సావంత్ అనే వ్యక్తి ఫోన్ చేసి, ముంబైలోని అంధేరి ఈస్ట్ పోలీసు అధికారిగా పరిచయం చేసుకున్నారు. బాధితురాలి బ్యాంక్ ఖాతా నుంచి అనధికారికంగా లావాదేవీలు జరిగాయని, మనీలాండరింగ్ కేసు నమోదైందని ఆమెను భయభ్రాంతులకు గురి చేశారు. ఆర్‌బీఐ, సీబీఐ, ఈడీ అధికారులుగా నటిస్తూ బాధితురాలిని ఏకంగా ఆరు గంటల పాటు వీడియో కాల్‌లో విచారించారు. వాట్సాప్ ద్వారా నకిలీ గుర్తింపు కార్డులు, అరెస్టు వారెంట్లను పంపించి బాధితురాలిని భయపెట్టారు. ఆర్‌బీఐ నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ రాగానే 24 గంటల్లోపు డబ్బును తిరిగి చెల్లిస్తామని నమ్మించి, బాధితురాలి ఫిక్స్‌డ్ డిపాజిట్ నుంచి రూ.10.02 లక్షలు కాజేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఫి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు.. సాంకేతిక ఆధారాలతో నిందితుడు ప్రతాప్ కేసరి ప్రధాన్‌ను అరెస్టు చేశారు. అతడిపై ఇప్పటికే దేశవ్యాప్తంగా ఏడు కేసులు ఉండగా.. తెలంగాణలో రెండు కేసులు ఉన్నట్లు తెలిపారు.

## ప్రతి ఇంటా సైబర్ మోసాలపై చర్చ జరగాలి



శిఖా గోయల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ప్రతిభా కుందా

**పంజగుట్ట:** సైబర్ మోసాలు నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఇంట్లో సైబర్ మోసాలపై చర్చ జరగాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ అన్నారు. మోసాన్ని గమనించిన బాధితులు గోల్డెన్ అవర్‌లో 1930 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. బుధవారం ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమాజిగూడ పార్క్ హోటల్‌లో హ్యాక్ ప్రూఫ్-స్టే సేఫ్ ఆన్‌లైన్ పేరుతో సైబర్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శిఖా గోయల్ మాట్లాడుతూ... అప్రమత్తతతోనే సైబర్ నేరాల నియంత్రణ సాధ్యమన్నారు. తెలంగాణ పోలీసులు ఇప్పటివరకు 43000 సిమ్‌లు, 14000 ఐఎమ్‌ఈఐలు, 8000 యూఆర్‌ఎల్‌లు బ్లాక్ చేసినట్లు తెలిపారు. గత సంవత్సరం బాధితులకు రూ. 292 కోట్లు తిరిగి చెల్లించామన్నారు. 2024లో దేశవ్యాప్తంగా రూ.24,000 కోట్లు సైబర్ మోసాల్లో కోల్పోగా తెలంగాణలో రూ.1900 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. సైబర్ సెక్యూరిటీ నిపుణుడు రక్షిత్ టాండన్ మాట్లాడుతూ .. తన వద్దకు సైబర్ క్రైమ్‌లో ఎక్కువగా విద్యావంతులే మోసపోతున్నారన్నారు. సైబర్ సెక్యూరిటీ చాయ్ పే చర్చా విషయం కావాలన్నారు. తరచూ పాస్‌వర్డ్స్ మార్చాలని, బలమైన పాస్‌వర్డ్స్ ఉండాలని సూచించారు. తెలియని లింక్‌లు, అటాచ్‌మెంట్లు క్లిక్ చేయకూడదన్నారు. వ్యక్తిగత సమాచారం, ఫోటోలు, డబ్బు షేర్ చేయడానికి ముందు ధృవీకరించాలన్నారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్ ప్రతిభా కుందా మాట్లాడుతూ .. ప్రతి 39 సెకెండ్లకు ఒక సైబర్ దాడి జరుగుతుందన్నారు. ఒక తప్పు లింక్‌పై క్లిక్, ఒక నిర్లక్ష్యమైన వ్యక్తిగత సమాచారం, ఒక బలహీనమైన పాస్‌వర్డ్ మన భద్రత ఒక్కసారిగా కదిలి పోతుందని అప్రమత్తతే అసలు భద్రత అని సూచించారు.

## బ్యాంకాక్ నుంచి వచ్చిన మహిళ వద్ద గంజాయి పట్టివేత...!

**శంషాబాద్:** మహిళా ప్రయాణికురాలి వద్ద భారీ ఎత్తున గంజాయి పట్టుబడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి... ఈ నెల 1న రాత్రి ఇండిగో విమానంలో బ్యాంకాక్ నుంచి వచ్చిన మహిళా ప్రయాణికురాలి కదలికలను అనుమానించిన అధికారులు ఆమె లగేజీని తనిఖీ చేయగా అందులో గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ దాదాపు రూ.3 కోట్లు ఉండవచ్చునని అధికారులు అంచనా వేసినట్లు సమాచారం. అయితే గంజాయి పట్టివేతపై సంబంధిత వర్గాలు అధికారికంగా ఎలాంటి సమాచారాన్ని వెల్లడించకపోవడం గమనార్హం.

**గంజాయి విక్రయిస్తున్న వృద్ధురాలి అరెస్టు..**

**సనత్‌నగర్:** గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న వృద్ధురాలిని సనత్‌నగర పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..ఫతేనగర్ ఎల్‌బీఎస్‌నగర్‌లోని ఓ ఇంట్లో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి విక్రయిస్తున్న షేక్ జతీన్ బీ (70) అనే వృద్ధురాలు గంజాయి విక్రయిస్తున్నట్లుగా గుర్తించి, ఆమె ఇంట్లో సోదా చేయగా 430 గ్రాముల గంజాయి లభ్యమైంది. ధూల్‌పేట్ నుంచి గంజాయిని తీసుకువచ్చి చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణతో వెల్లడైంది. నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## లైంగిక దాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు

రూ.60 వేల జరిమానా



నిందితుడు అభిరాందాస్ (ఫైల్)

**జవహర్‌నగర్:** లైంగిక దాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ.60 వేల జరిమానా విధిస్తూ మేడ్చల్ ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు బుధవారం తీర్పు చెప్పింది. సీఐ సైదయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. 2021లో దమ్మాయిగూడకు చెందిన బాలికను (4) గుర్తు తెలియని వ్యక్తి కిడ్నాప్ చేసినట్లు జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు అందింది. కేసు నమోదు చేసిన పోలీసులు కుషాయిగూడ ఏసీపీ శివకుమార్ నేతృత్వంలో విచారణ చేపట్టారు. కీసర అహ్మద్‌గూడకు చెందిన అభిరాందాస్ చిన్నారిని కిడ్నాప్ చేసినట్లు గుర్తించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అంతేగాక అతను అదే ఏడాది మరో బాలికతో అసభ్యంగా ప్రవర్తించడంతో కేసు నమోదైంది. రెండు కేసులపై విచారణ చేపట్టిన న్యాయస్థానం నిందితుడు అభిరాంకు పోక్సో కేసులో యావజ్జీవ శిక్ష, రూ.60 వేలు జరిమానా, మరో కేసులో ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. నింతితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఏసీపీ శివకుమార్, జవహర్‌నగర్ పోలీసులను రాచకొండ సీపీ సుధీర్‌బాబు అభినందించారు.

## విమాన టికెట్లు బుక్ చేస్తానని..బురిడీ..

- రూ. లక్షలు వసూలు చేసి నకిలీ టికెట్లు అంటగట్టిన వైనం
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- కేసు నమోదు..

**సనత్‌నగర్:** విమాన టికెట్లు బుక్ చేస్తానని చెప్పి రూ.లక్షల్లో వసూలు చేసి చివరకు నకిలీ టికెట్లను అంటగట్టిన ఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. భరత్‌నగర్ శక్తినగర్‌కు చెందిన వ్యాపారి దేవరపల్లి తిరుపతిరెడ్డికి మే 10న అతడి స్నేహితుడు గోలిపల్లి సంజీవ్ ఫోన్‌చేసి యూఎస్‌ఏలో ఉంటున్న తన కుమారుడిని చూసేందుకు వెళుతున్నట్లు చెప్పాడు. ఇందుకుగాను టికెట్లు బుక్ చేసుకునేందుకు ఏదైనా ఏజెన్సీ వివరాలు ఇవ్వాలని కోరాడు. దీంతో తిరుపతిరెడ్డి తన సహోద్యోగి డీఎంఎస్ ప్రసాద్‌ను ఆరా తీయగా, అతను మల్లి శ్రీకాంత్ పేరును సూచించాడు. గతంలో ప్రముఖ ఏజెన్సీలో పని చేశానని చెప్పుకున్న శ్రీకాంత్ సంజీవ్ నెంబర్ తీసుకుని అతనికి ఫోన్ చేసి పరిచయం చేసుకున్నాడు. అంతర్జాతీయ టికెట్లు బుక్ చేయడంతో తనకు అపారమైన అనుభవం ఉందని చెప్పాడు. ప్రస్తుతం ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్‌లో సేవలు అందిస్తున్నానని, అవసరమైతే ఎయిర్‌లైన్స్ ఏజెన్సీని సంప్రదించి వారికి నచ్చిన భోజనం, సీట్లతో ప్రయాణం చేయించేలా చూసుకుంటానని హామీ ఇచ్చాడు. దీంతో గోపల్లి సంజీవ్, అతని భార్య హైదరాబాద్ నుంచి వాషింగ్టన్‌కు, అక్కడి నుంచి తిరిగి హైదరాబాద్‌కు వచ్చేలా టికెట్లు బుక్ చేయాలని శ్రీకాంత్‌ను కోరారు. దీంతో శ్రీకాంత్ టికెట్ బుకింగ్‌కు రూ.2,12,450 చెల్లించాల్సి ఉంటుందని చెప్పడంతో ఆ మొత్తాన్ని చెల్లించాడు. అనంతరం శ్రీకాంత్ వాట్సాప్ ద్వారా ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ టికెట్‌గా పేర్కొంటూ ఒక సాఫ్ట్ కాపీని పంపాడు. కొద్ది సేపటి తర్వాత సంజీవ్ అతడికి ఫోన్ చేసి కనెక్టింగ్ ఎమిరేట్స్ ఎయిర్‌లైన్‌కు దుబాయ్‌లో లేఓవర్ సమయం 7 గంటలు ఉన్నందున ఆ సమయాన్ని తగ్గించడానికి 28న తిరుగు ప్రయాణ టికెట్‌ను మరేదైనా ఎయిర్‌లైన్‌కు మార్చాల్సిందిగా కోరాడు. దీంతో ఖతార్ ఎయిర్‌లైన్స్‌లో లేఓవర్ సమయం దాదాపు రెండున్నర గంటలు మాత్రమే ఉంటుందని, రూ.లక్ష విలువైన ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ తిరుగు ప్రయాణ టికెట్ రద్దు చేయాలంటే రూ.13,000 చార్జీ చెల్లించాల్సి ఉంటుందని చెప్పాడు. టికెట్ రద్దు చేసుకున్న తర్వాత రావాల్సిన రూ. లక్ష వారం రోజుల తర్వాత ఎమిరేట్స్ తనకు తిరిగి చెల్లిస్తుందని, ఆ మొత్తం జమ అయిన తర్వాత తిరిగి చెల్లిస్తానని చెప్పాడు. ప్రస్తుతం ఖతార్ ఎయిర్‌లైన్స్‌లో ఈ నెల 28న తిరుగుప్రయాణ టికెట్‌ను బుక్ చేసేందుకు వెంటనే రూ.1,13,268 చెల్లించాలని సంజీవ్‌ను కోరాడు. అతడి మాటలు నమ్మిన సంజీవ్ మరోసారి రూ.1,13,000 చెల్లించాడు. ఆ వెంటనే ఖతార్ ఎయిర్‌వేస్ టికెట్‌గా పేర్కొంటూ వాట్సప్‌లో సాఫ్ట్‌కాపీని పంపాడు. అయితే అందులో సీటు నిర్ధారణ అయిన వివరాలు లేకపోవడంతో శ్రీకాంత్‌ను అడగగా తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో అనుమానం వచ్చిన సంజీవ్ మరో బుకింగ్ ఏజెన్సీకి ఫోన్ చేసి ఆరా తీయగా శ్రీకాంత్ పంపిన టికెట్లు నకిలీవిగా చెప్పారు. దీంతో సంజీవ్ తన స్నేహితుడు తిరుపతిరెడ్డికి జరిగిన విషయాన్ని తెలియజేయగా, అతను తన సహోద్యోగి, అతని స్నేహితుడిని సంప్రదించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇదిలా ఉండగా తిరుపతిరెడ్డి సైతం తన కుమార్తె వాషింగ్టన్ నుంచి హైదరాబాద్‌కు టికెట్ బుక్ చేయాలని శ్రీకాంత్‌ను కోరాడు. ఇందుకోసం ఎతిహాద్ ఎయిర్‌లైన్స్‌లో టికెట్ ఛార్జీల కోసం రూ.43,000 చెల్లించాడు. ఆ తర్వాత వాట్సప్ ద్వారా ఎతిహాడ్ ఎయిర్‌లైన్స్ టికెట్‌గా పేర్కొంటూ సాఫ్ట్‌కాపీని పంపాడు. దీంతో అతను సదరు టికెట్ విషయమై ఆరాతీయగా నకిలీదని తేలింది. ఇరువురు బాధితుల నుంచి 3,68,450 వసూలు చేసి నకిలీ టికెట్లు అంటగట్టిన శ్రీకాంత్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ తిరుపతిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## హెడ్ కానిస్టేబుల్‌పై యువకుల దాడి

గణేశ్ నిమజ్జన యాత్రలో ఘటన

**రహమత్‌నగర్:** గణేశ్ నిమజ్జన యాత్ర సందర్భంగా హెడ్ కానిస్టేబుల్‌పై యువకులు దాడి చేసిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మంగళవారం రాత్రి ఈఎస్‌ఐ విజయలక్ష్మీ ఆలయం వద్ద వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళుతున్నాయి. ఆ సమయంలో ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ యువకులు గొడవ చేస్తుండటాన్ని తన సెల్ ఫోన్‌లో రికార్డు చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆగ్రహానికి లోనైన వారు హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేశారు. రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన బోరబండ పోలీసులు గణేశ్ మండప నిర్వాహకులకు ఆదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



నందు మృతదేహం

**హస్తినాపురం:** యువకుడి వేధింపులు తాళలేక బీటెక్ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈశ్వరమ్మ కాంప్లెక్స్‌లో నివాసం ఉంటున్న బానోతు అచ్చమ్మ, చిన్న మున్నయ్య దంపతుల కుమార్తె బానోతు నందు(21) బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఆమెకు సూర్యపేట జిల్లా, మూన్లానాయక్ తండాకు చెందిన ధరావత్ వినీత్‌తో పరిచయం ఉంది. నందు ఫోన్ నంబర్ తీసుకున్న అతను తరుచూ ఆమెకు ఫోన్ చేసి, తనకు ఫోన్‌పే లో డబ్బులు పంపాలని లేని పక్షంలో తనతో చేసిన చాటింగ్ బయట పెడతానని బెదిరిస్తున్నాడు. దీంతో మనస్తాపానికి లోనైన నందు మంగళవారం రాత్రి ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యక్తి అనుమానాస్పద మృతి

**అంబర్‌పేట:** ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అంబర్‌పేట మున్సిపల్ కాలనీకి చెందిన కోటయ్య(60) తాపీ మేస్త్రీగా పని చేసేవాడు. మద్యానికి బానిసైన అతను మంగళవారం రాత్రి సీపీఎల్ రోడ్డులోని ఓ వైన్స్‌లో మద్యం సేవించి రోడ్డు దాటుతుండగా కింద పడ్డాడు. దీనిని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహన ఢీ కొట్టిందా లేదా మద్యం మత్తులో కింద పడ్డాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బైక్ అదుపుతప్పి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



అంజిరెడ్డి (ఫైల్)

**హస్తినాపురం:** బైక్ అదుపు తప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక హైకోర్టు కాలనీకి చెందిన దుర్గంపూడి అంజిరెడ్డి(43) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి అతను బైక్‌పై వెళుతుండగా పనామాచౌరస్తా సమీపంలోని మాక్స్‌విజన్ ఐ ఆసుపత్రి వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని గుర్తించిన స్థానికులు 108 కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ అంజిరెడ్డిని వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి సోదరుడు గోపాలకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వనస్థలిపురం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

## ఆరీఫ్ మృతదేహం వెలికితీత



మృతదేహాన్ని వెలికి తీసిన ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

**రాజేంద్రనగర్:** హిమాయత్‌సాగర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఆరీఫ్ మృతదేహాన్ని ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది బుధవారం వెలికి తీశారు. జీవితంపై విరక్తి చెంది ఆరీఫ్ అనే యువకుడు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆరీఫ్ మృతదేహాన్ని వెలికి తీసిన అనంతరం రాజేంద్రనగర్ పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రోడ్డు ప్రమాదంలో ఆరీఫ్ కాలుకు గాయం కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## 10న 'అగర్వాల్ నారీ శక్తి పర్వం'

హిమాయత్‌నగర్: మహారాజా శ్రీ అగ్రసేన్ మహారాజ్ జయంతి ఉత్సవాలలో భాగంగా శ్రీ అగ్రసేన్ నారీ శక్తి పర్వం మహిళా ఉత్సవాన్ని ఈ నెల 10న సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా తెలిపారు. బుధవారం ఆహ్వాన కమిటీ చైర్మన్‌గా నరేంద్ర కుమార్ గోయల్, జయంతి వేడుకల కన్వీనర్‌గా సీమా జైన్, కల్చరల్ కమిటీకి చైర్మన్‌గా ఋతు అగర్వాల్, వైస్ చైర్మన్లుగా డింపుల్ అగర్వాల్, రజని అగర్వాల్, ఆర్తి అగర్వాల్, అనూ కేడియాలకు నియామక పత్రాలు అందజేశారు.

## నవనీత శోభితుడైన విజయగణపతి



బంజారాహిల్స్: బంజారాహిల్స్ బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న శ్రీ విజయగణపతి స్వామి బుధవారం భక్తులకు వెన్న అలంకరణలో దర్శనమిచ్చారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు స్వామి వారిని ప్రతీరోజూ భిన్న రూపాల్లో అలంకరిస్తున్నారు వెన్న అలంకారంలో ఉన్న స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి హోమం నిర్వహించారు.

## గణేశ్ మండపం వద్ద హెల్త్ క్యాంప్



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బంజారాహిల్స్: గణనాథుడి మండపాల వద్ద పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలే కాకుండా కొంత మంది మండప నిర్వాహకులు సామాజిక కార్యక్రమాలు కూడా చేస్తున్నారు. చింతల్ బస్తీలోని నవ జ్యోతి యూత్ అసోసియేషన్ గణనాథుడి వద్ద నిర్వాహకులు ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆస్పత్రి వైద్యులతో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. గణనాథుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో పాటు బస్తీవాసులకు ఆస్పత్రి వైద్యులు ఈ క్యాంపులో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. నిర్వాహకులు రాకేష్ కుమార్ శర్మ, అరుణ్ కుమార్, వినోద్‌కుమార్, అల్లం రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పార్కు చేసిన బైక్ చోరీ

సనత్‌నగర్: పార్కు చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భరత్‌నగర్‌కాలనీ నివసించే కొమ్మ హితేష్‌రెడ్డి (27) ఈ నెల 1న రాత్రి 10.30 గంటల సమయంలో తన బైక్ (టీజీ 09 ఏబీ టీ/ఆర్ 9416)ను తన ఇంటి ముందు పార్కు చేశాడు. మరుసటిరోజు 2న ఉదయం 10.30 గంటలకు వచ్చి చూడగా, పార్కు చేసిన తన బైక్ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వాకబు చేసినా ఫలితం లేదు. దీంతో సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

సనత్‌నగర్: రోడ్డు దాటుతున్న మహిళను గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ ఎస్‌ఆర్‌ఆర్‌పురంకు చెందిన మౌనిక (26) గత నెల 27న సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఎర్రగడ్డ సిగ్నల్ వద్ద నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా, గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ క్రమంలో ఆమె కిందపడిపోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. శరీరం కుడివైపు భాగం పక్షవాతానికి గురైంది. వెంటనే స్థానికులు సమీపంలోని సెయింట్ థెరిస్సా ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆలయ హుండీల లెక్కింపు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ ఆలయం హుండీలను లెక్కించారు. లెక్కించిన దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆలయంలోని అన్ని హుండీలను లెక్కించగా రూ.86 లక్షల, 39 వేల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు. వీటిలో అన్నదాన రూపంలో రూ.1 లక్షా, 81 వేల 734 వచ్చాయన్నారు. 122 అమెరికా డాలర్లు, ఒక మలేషియా, 15 కథార్, ఒక యూరో, యూఏఈ, 65 చైనా, ఒక బెహరిన్, మిక్స్‌డ్ బంగారం, వెండి ఆభరణాలు భక్తులు అమ్మవారి సమర్పించినట్లు చెప్పారు.

# మీ భద్రత.. మా భరోసా..!

### మేమున్నామంటూ కేంద్ర బలగాల మార్చ్‌ఫాస్ట్

- వెస్ట్‌జోన్ పరిధిలో భారీ బందోబస్తు
- మండపాల్లో విజిట్ చేసిన నగర పోలీస్ కమిషనర్



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

బంజారాహిల్స్: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో గణేశ్ నిమజ్జన శోభాయాత్ర నిర్వహించేందుకు వెస్ట్‌జోన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు అదనపు బలగాలను కేటాయించారు. ఇప్పటికే వెస్ట్‌జోన్ పరిధికి కేంద్ర బలగాలు చేరుకున్నాయి. గణేశ్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో జరిగేలా మేమున్నామంటూ పోలీసులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా బస్తీల్లో కవాతు నిర్వహిస్తూ ప్రజలకు భద్రత కోసం మేమున్నామని భరోసా కల్పిస్తున్నారు. మూడు రోజుల క్రితం నగర కమిషనర్ సీవీ ఆనంద్, జూబ్లీహిల్స్, మధురానగర్, ఫిలింనగర్, పోలీస్‌స్టేషన్ల పరిధిలో వినాయక మండపాలను ఆకస్మిక తనిఖీ చేశారు. మండపాల నిర్వాహకులకు తగిన సూచనలు జారీ చేశారు. పోలీసులకు సహకరించాలని నిర్వాహకులను కోరారు.

- కేంద్ర బలగాలతో ఆయా ఠాణాల పోలీసులు తమ పరిధిలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తూ ప్రజలకు మేమున్నామనే భరోసా ఇస్తున్నారు.
- జోన్ పరిధిలోని అధికారులు తమ పరిధిలోని విగ్రహాలను సకాలంలో నిమజ్జనానికి బయలుదేరే విధంగా మార్గనిర్దేశం చేస్తున్నారు.
- గత అనుభవాలను బట్టి చూస్తే విగ్రహాల నిమజ్జనానికి 40 గంటల సమయం పడుతుందని భావించిన పోలీసులు నిమజ్జనానికి తక్కువ సమయం పట్టాలంటే ముందుగా బయలుదేరాలని కోరుతున్నారు.
- శోభాయాత్ర మార్గమధ్యంలో ఎత్తుకు సంబంధించిన పరిమితులు, కూడళ్ల వద్ద క్లియరెన్స్‌లను చూసుకోవాలని పోలీసులకు సూచిస్తున్నారు.
- గణేశ్ ఊరేగింపు మార్గంలో క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు, డాగ్‌స్క్వాడ్‌లు, యాంటీ చైన్‌స్నాచింగ్ బృందాలు, షీ టీమ్‌లను కూడా మోహరించనున్నారు.
- నిమజ్జనం రోజున జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, ట్రాన్స్‌కో, ఆర్ అండ్ బీ, వాటర్‌వర్క్స్, వైద్య, ఆరోగ్య శాఖ విభాగాల సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని కూడా సూచిస్తూ వాట్సప్ గ్రూపుల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తున్నారు.
- అసాంఘిక శక్తులు, పిక్‌పాకెటర్లు, ఈవ్ టీజర్లు, చైన్‌స్నాచింగ్‌ల వంటి నేరాలను నివారించడానికి ప్రతిష్ఠమైన నిఘా ఏర్పాటు చేస్తున్నారు.
- ముందుజాగ్రత్తగా రాత్రిపూట నిర్వాహకులు, వలంటీర్లు విగ్రహాల వద్ద తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని నగర పోలీసు కమిషనర్ బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో పాయింట్ బుక్‌ను కూడా చెక్ చేశారు.
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాసబ్‌ట్యాంక్, పంజగుట్ట, మధురానగర్, ఎస్సార్‌నగర్, బోరబండ ఫిలింనగర్, ఖైరతాబాద్, సైఫాబాద్, నారాయణగూడ తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో గణనాథులను విగ్రహాలు త్వరగా నిమజ్జనం చేసేందుకు అవసరమైన కార్యాచరణ, ప్రణాళికలు రూపొందించుకోవాలని, సాధ్యమైనంత త్వరగా నిమజ్జన ఊరేగింపు పూర్తి చేసి క్షేమంగా ఇంటికి చేరుకునేలా భద్రత ఏర్పాట్లు చేయాలని అధికారులు సూచించారు.



ప్రతాప్‌నగర్‌లో కార్పొరేటర్ కవితారెడ్డి, మన్నె గోవర్ధన్‌రెడ్డి



నందినగర్‌లో తెలంగాణ స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి..

## వాడవాడలా గణనాథుడికి పూజలు



జూబ్లీహిల్స్ కాంగ్రెస్ సీనియర్ నేత మామిడి నర్సింగరావు



వెంకటరమణ కాలనీ పద్మావతినగర్‌లో..

బంజారాహిల్స్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఖైరతాబాద్ నియోజక వర్గంలోని వివిధ బస్తీలు, కాలనీల్లో సంక్షేమ సంఘాలు, మండప నిర్వాహకులు ఏర్పాటు చేసిన గణనాథుడికి పూజలు జోరుగా సాగుతున్నాయి. బుధవారం ఆయా మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించగా మరికొన్ని మండపాల వద్ద హోమాలు, కుంకుమార్చనలు జరిగాయి. ప్రతాప్‌నగర్ బస్తీలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్ కవితారెడ్డి హాజరై ప్రారంభించగా, నందినగర్‌లోని వీర భజరంగి అసోసియేషన్ గణనాథుడి వద్ద తెలంగాణ స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- జూబ్లీహిల్స్ డివిజన్‌లోని ఫిలింనగర్‌లోని మహాగణనాథుని పూజా కార్యక్రమంలో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పాల్గొని ఇక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.



జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



దుర్గా భవానీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్...



వినాయనగర్ బస్తీలో బాల గణేశ్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్...



పూజల్లో ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు ఆదినారాయణ

## మహాగణపతి దర్శనానికి పోటెత్తిన భక్తులు

### హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ సభ్యుల దర్శనం



మహాగణపతి వద్ద సైక్లిస్ట్ గ్రూప్ సభ్యులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు బుధవారం భక్తులు భారీగా తరలివచ్చారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు 2 లక్షలకు పైగా భక్తులు మహాగణపతిని దర్శించుకున్నారు. ఉదయం హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ గ్రూప్ ఆధ్వర్యంలో సభ్యులు సైకిల్‌పై ర్యాలీగా తరలివచ్చి మహాగణపతిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ ఉత్సవ కమిటీ సభ్యులు రాజ్ కుమార్, ప్రవీణ్ తదితరులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు. కార్యక్రమంలో హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ అధ్యక్షుడు మర్రి లక్ష్మణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌లతో పాటు సభ్యులు ఉన్నారు.

## అలరించిన సంగీత ఝురి



రాగాలు పలికిస్తున్న విద్యాంసులు పేరి త్యాగరాజు, భట్టి పవన్‌సింగ్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-8లోని సప్తపర్ణిలో సంగీత క్షీర సాగరం నిర్వహిస్తున్న శాస్త్రీయ సంగీత కచేరీలో భాగంగా బుధవారం ప్రముఖ వయోలిన్ విద్యాంసులు పేరీ త్యాగరాజు, భట్టి పవన్‌సింగ్ ఆలాపనలు సంగీత కళాభిమానులకు వీనుల విందు చేశాయి. రెండు గంటల పాటు వీరిద్దరూ తమ ప్రతిభ చూపుతూ సంగీత ఝురిలో ఓలలాడించారు. మృదంగంపై చిలుముల రామకృష్ణ, ఘటంపై రాహుల్ సుందర్ పోటీ పడ్డారు. ఒకే వేదికపై ఇద్దరు కళాకారులు వయోలిన్‌పై పలికించిన రాగాలు ఆహూతులను తన్మయత్వంలో ముంచెత్తాయి.

## ఖరీదైన ప్రభుత్వ స్థలం హెచ్‌ఎండీఏకు అప్పగింత



బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12 ఎమ్మెల్యే కాలనీలో ఉన్న ప్రభుత్వ స్థలం

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని షేక్‌పేట మండలం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12 ఎమ్మెల్యే కాలనీ రోడ్డులో ఏసీబీ కార్యాలయం ఎదురుగా ఇటీవల షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు 12 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల చెర నుంచి విడిపించి తమ ఆధీనంలోకి తీసుకోవడమే కాకుండా స్థలం చుట్టూ బ్లూషీట్స్ కూడా నిర్మించారు. సర్వే నెంబర్ 102/1లో ఉన్న ఈ స్థలం కొంతకాలంగా కబ్జాదారుల చెరలో ఉంది. షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి ఈ స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు, కోర్టు వివాదాలు పక్కాగా పరిశీలించి ఖరీదైన ఈ 12 ఎకరాల స్థలం ప్రభుత్వానిదేనని తేల్చి ఆక్రమణలు కూల్చివేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు ఈ స్థలం రెవెన్యూ ఆధీనంలో ఉండగా తాజాగా ఈ స్థలాన్ని హెచ్ఎండీఏకు అప్పగించారు. ఇక నుంచి ఈ స్థలం హెచ్ఎండీఏకు చెందినది కాగా పర్యవేక్షణ కూడా సంబంధిత శాఖ అధికారులే చేపట్టాల్సి ఉంటుంది. అయితే హెచ్ఎండీఏకు కేటాయించిన ఎమ్మెల్యే కాలనీ చుట్టూ స్థలాలన్నీ ఇప్పటికే అన్యాక్రాంతమయ్యాయి. కోట్లాది రూపాయలు ఖరీదు చేసే హెచ్ఎండీఏ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. నకిలీ డాక్యుమెంట్లతో కొందరు ప్లాట్లు కూడా తయారుచేసుకున్నారు. ఇప్పుడు తాజాగా ఈ 12 ఎకరాల స్థలాన్ని కూడా హెచ్ఎండీఏకు అప్పగించడం పట్ల సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోమంది. స్థలాన్ని కాపాడుకోవడంలో ఎప్పుడూ హెచ్ఎండీఏ విఫలమవడమే కాకుండా పర్యవేక్షణ కూడా కొరవడుతుందని, ఈ నేపథ్యంలో ఈ 12 ఎకరాల స్థలం కూడా ఎంతవరకు కాపాడతారన్నది ప్రశ్నార్థకంగా మారింది. కనీసం ఈ స్థలాన్ని హైడ్రాకు అప్పగించినా వారు కాపాడేవారని, హెచ్ఎండీఏ చేతిలో పెట్టారంటే కబ్జాదారుల వశమవుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచించి స్థలాన్ని తిరిగి రెవెన్యూకు గానీ, హైడ్రాకు గానీ అప్పగించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

## భవిష్యత్‌పై విద్యార్థుల చూపు

ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్సీ కవిత భవిష్యత్ కార్యాచరణపై ఓయూ విద్యార్థి నేతలు వేచి చూస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అనేక మంది విద్యార్థి నాయకులు రాజకీయ, అధికార పదవుల అవకాశాల కోసం ఎదురుచూస్తున్న విషయం విదితమే. రాష్ట్ర అవతరణ అనంతరం ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వంలో సుమారు 13 మందికి అవకాశాలు లభించగా, కాంగ్రెస్ పాలనలో కేవలం ముగ్గురికి మాత్రమే అధికార పదవులు దక్కాయి. దీంతో 12 ఏళ్లుగా సుమారు 30 మంది విద్యార్థి నాయకులు అవకాశాల కోసం వివిధ పార్టీల్లో తృతీయ శేణి నాయకులుగా సీనియర్ నేతలకు అనుచరులుగా తిరుగుతున్నారు. కవిత కొత్త పార్టీ పెడితే ఓయూ నుంచి విద్యార్థి నేతలు చేరే అవకాశాలు ఉన్నాయన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకులు పేర్కొన్నారు.

## కబ్జాదారులపై తహసీల్దార్ ఫిర్యాదు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఐదెకరాల ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది కబ్జాదారులు బోగస్ పత్రాలతో ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని షేక్‌పేట మండల తహసీల్దార్ వై.అనితారెడ్డి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా ఈ స్థలం వద్ద కబ్జాదారుల బెడద తీవ్రంగా ఉందని, అసాంఘిక శక్తులు తిష్టవేస్తున్నాయని, ప్రభుత్వ హెచ్చరిక బోర్డు కూడా తొలగిస్తున్నారని, వీరిని నియంత్రించాలంటే 24 గంటలూ పోలీసు పికెట్ ఏర్పాటు చేయాలని ఫిర్యాదులో సూచించారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10లోని ఈ ఐదెకరాల స్థలంలో ఎకరన్నర స్థలాన్ని జలమండలికి కేటాయించామని, మిగతా స్థలం ప్రభుత్వం ఆధీనంలోనే ఉందని వెల్లడించారు. ఇటీవల విద్యాసాగర్ అనే పేరుతో కొంతమంది ఈ స్థలంలోకి చొరబడుతున్నారని, కింగ్‌డమ్ రియల్టీ పేరుతో బోర్డు కూడా ఏర్పాటుచేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని, ఇంకొంతమంది వీఆర్ ఇన్‌ఫ్రా పేరుతో బోర్డులు ఏర్పాటుచేశారని, వారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీలు ఈ స్థలంలోకి చొరబడుతున్నారని, గొడవలు జరుగుతున్నారని, న్యూసెన్స్‌కు పాల్పడుతున్నారని, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టాలన్నారు. ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను తొలగిస్తున్న కబ్జాదారులపై తాను ఇప్పటికే ఫిర్యాదు చేయగా ఎఫ్ఐఆర్ కూడా నమోదైందని ఆరోపించారు. ఈ ప్రభుత్వ స్థలాన్ని సంరక్షించాలంటే పోలీసు పికెట్ ఏర్పాటు చేయడం ఒక్కటే మార్గమని, కబ్జాదారులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. బంజారాహిల్స్ పోలీసులు ఫిర్యాదును స్వీకరించి దర్యాప్తు చేపట్టారు.

## జన హృదయ నేత వైఎస్సార్



చిన్నారులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు

వెంగళరావునగర్: మహానేత, దివంగత ఏపీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి భౌతికంగా మన మధ్య లేకున్న తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉన్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు వై.ఈశ్వర ప్రసాదరెడ్డి అన్నారు. వైఎస్సార్ వర్ధంతి పురస్కరించుకుని వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్ మహిళా శిశుసంక్షేమశాఖ ప్రాంగణంలో ఉన్న బాలసదన్‌లోని 200 మంది చిన్నారులకు ఆయన పండ్లు, పుస్తకాలు, పెన్సిల్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఈపీ రెడ్డి మాట్లాడుతూ... పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం తీసుకొచ్చి ఉన్నత విద్యను అందించిన ఘనత దివంగత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. వైఎస్సార్ అంటే ఒక బ్రాండ్ అని ఎన్ని తరాలు గడచినా ఆ పేరు ఎప్పటికీ నిలిచి ఉంటుందని పేర్కొన్నారు. ఫోరం ప్రధాన కార్యదర్శులు బి.రాఘవేంద్రరెడ్డి (యాక్టివిటీస్), ఎస్.వెంకట సుబ్రమణ్యంరెడ్డి, ఎస్.సంజీవయ్య, శ్రీనివాస్, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి రఘునాథరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు జానారెడ్డి, ఏపీ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీలు, ఇంజినీరింగ్ కాలేజీల్లో మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఓయూలో ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దే విద్యార్థులు మత్తుకు బానిసలవ్వడం దురదృష్టకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్‌పై ఇది తీవ్రప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్ నియంత్రణకు ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్సును పెంచి మత్తుపదార్థాల విక్రయాలను పూర్తిగా నియంత్రించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

## ఓయూలో ముగిసిన క్రీడాపోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మోడల్ స్కూల్‌లో మూడు రోజులు జరిగిన అంతర్ పాఠశాలల బాల, బాలికల క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. ముషీరాబాద్ మండలం 69వ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన కబడ్డీ, ఖోఖో ఆటల పోటీల్లో 15 పాఠశాలు పాల్గొన్నట్లు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ముషీరాబాద్ కార్పొరేటర్ సుమిత్ర నవీన్ రావు, డిప్యూటీ డీఈఓ శ్రవణ్, మోడల్ స్కూల్ హెచ్ఎం జ్యోతిశ్రీ విజేతలకు బహుమతులను అందజేశారు.

## అన్నదానాలు.. నిమజ్జనాలు



శ్రీకృష్ణానగర్‌లో కోలాటం ఆడుతున్న మాగంటి వజ్రనాథ్



ఎర్రగడ్డలో డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో..



రహమత్‌నగర్‌లో మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్

వెంగళరావునగర్: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన మంటపాల వద్ద వినాయకులకు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలు మంటపాల వద్ద బుధవారం అన్నదానాలు జరిగాయి. మరికొన్ని వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్ దేదీప్య విజయ్ దంపతులు, వివిధ కాలనీల నేతలు, పూజాది కార్యక్రమాలను నిర్వహించారు.

రహమత్‌నగర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. రహమత్‌నగర్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు. రహమత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద రహమత్‌నగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నిజామాబాద్ శ్రీనివాస్ గుప్తా దంపతులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వెంగళరావునగర్‌లో అన్నదానం..



మధురానగర్ ప్రధాన రహదారిలో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి



మధురానగర్ బి-బ్లాక్‌లో కార్పొరేటర్ దంపతులు

## 100 బీసీ కాలేజీ హాస్టళ్లను మంజూరు చేయాలి

కాచిగూడ: కళాశాలల్లో చదువుకుంటున్న బీసీ విద్యార్థులకు హాస్టల్‌లలో సీట్లు దొరకక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, రాష్ట్రంలో 100 బీసీ కాలేజీ హాస్టళ్లను మంజూరు చేసి విద్యార్థులను ఆదుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం 100 బీసీ హాస్టల్స్‌ను మంజూరు చేయాలని, ప్రస్తుతమున్న హాస్టల్స్‌లో 30 శాతం అదనపు సీట్లను పెంచాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. హైదరాబాద్‌లో 10 బాలికల, 10 బాలుర హాస్టల్స్ ఏర్పాటు చేయాలని కోరారు.

## క్లిప్‌తో గుండెకు రక్షణ



సాక్షి, సిటీబ్యూరో: మైట్రల్ రిగర్జిటేషన్ (గుండె సంబంధిత వ్యాధి) బాధితులకు శస్త్రచికిత్స లేకుండా క్లిప్ సాయంతో ప్రాణాపాయం నుంచి రక్షించొచ్చని డా.సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం గ్లెనిగల్స్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అలాంటి రోగులకు మైక్లిప్ ప్రక్రియతో ప్రాణాపాయాన్ని తప్పించవచ్చని తెలిపారు. ఇలాంటి వ్యాధిలో బాధపడుతున్న 70 ఏళ్ల విశ్రాంత ఉద్యోగికి విజయవంతంగా చికిత్స అందించామన్నారు. ఇంత వరకు అమెరికా నుంచి ఈ క్లిప్‌ను దిగుమతి చేసుకునే వాళ్లమని, మేకిన్ ఇండియాలో భాగంగా ప్రస్తుతం ఇండియాలోనే క్లిప్‌లు తయారు చేస్తున్నారని, దీని వల్ల తక్కువ ఖర్చుతో వైద్యం అందించగలుగుతున్నామన్నారు.

## 10న జాతీయ సదస్సు

ఖైరతాబాద్: దాశరథి కృష్ణమాచార్య, కాళోజీ నారాయణరావు, సి.నారాయణరెడ్డి, దాశరథి రంగాచార్య జయంతులను పురస్కరించుకొని సెప్టెంబర్ 10న సాహితీ మూర్తుల సాహిత్య సమాలోచనపై ఒక రోజు జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. లక్డీకాపూల్‌లోని ఐఐఎంసి కళాశాలలో ఈ కార్యక్రమం ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. సదస్సులో నలుగురు సాహితీవేత్తలపై పత్ర సమర్పణ చేయాలనుకున్న వారు ఈ నెల 6లోపు సమర్పించాలన్నారు.

## కాంగ్రెస్ గెలుపులో బూత్ స్థాయి కార్యకర్తలు కీలకం



మాట్లాడుతున్న విశ్వనాథన్

రహమత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ అభ్యర్థి విజయం సాధించాలంటే బూత్ స్థాయి కార్యకర్తలు కీలకమని ఏఐసీసీ కార్యదర్శి, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకులు పెరుమాళ్ విశ్వనాథన్ సూచించారు. బోరబండ డివిజన్‌లో బుధవారం బూత్ కమిటీ సభ్యులు, నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బూత్ కమిటీ సభ్యులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల్లో పనిచేయని నాయకులను బేషరతుగా పక్కన పెడతామని హెచ్చరించారు. రాష్ట్ర మహిళా కోఆపరేటివ్ చైర్ పర్సన్ శోభారాణి, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, మహిళా కాంగ్రెస్ నగర నాయకురాలు హబీబా సుల్తానా, నాయకులు అశోక్, మహేష్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనం సందర్భంగా 6న సెలవు

సాక్షి,సిటీబ్యూరో: గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ఈ నెల 6న (శనివారం)సెలవు దినంగా ప్రకటించింది. హైదరాబాద్ ,రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలలో సెలవు ఇస్తున్నట్లు పేర్కొంది. దీనికి బదులుగా ..అక్టోబర్ 11న పని దినంగా పరిగణిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## సెమీకండక్టర్ మిషన్‌లో సీబీఐటీ భాగస్వామ్యం

మణికొండ: భారత సెమీకండక్టర్ మిషన్‌లో గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) భాగస్వామ్యం ఉందని, చిప్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిందని ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వీఎల్‌ఎస్‌ఐ డిజైన్, అధునాతన చిప్ అభివృద్ధి రంగంలో తమ నైపుణ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ తమ కళాశాలను భాగస్వామ్య సంస్థగా ఎంపిక చేసిందన్నారు. మంగళవారం జరిగిన సెమీకాన్ ఇండియా 2025లో సీబీఐటీ, ఉస్మానియా యూనివర్సిటీల తయారు చేసిన చిప్‌ను ప్రదర్శనకు ఉంచారన్నారు. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అందజేసిన చిప్ కోల్లేజ్‌లో సీబీఐటీ రూపొందించిన చిప్ ఉందన్నారు. సెమీకాన్ ఇండియా ప్రదర్శన దేశ సెమీకండక్టర్ రూపకల్పన, తయారీలో ఆత్మనిర్భర దిశగా చేసిన కృషి ప్రతిబింబించిందన్నారు. చీఫ్ ఇన్‌వెస్టిగేటర్ డాక్టర్ మొహమ్మద్ జియాద్దీన్ జహంగీర్, కో చీఫ్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ డి.కృష్ణారెడ్డి, ప్రాజెక్ట్ సిబ్బంది పి.శిరీష, పి.చరిష్మా, పీఆర్‌ఓ జీఎస్‌ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# మందుల విక్రయం.. ఇష్టారాజ్యం..!

- నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు.
- గ్రేటర్‌తో సహా శివారులో 12 వేలకు పైగా మెడికల్ దుకాణాలు.
- అధికారుల మొక్కుబడి తనిఖీ



సాక్షి, మేడ్చల్ జిల్లా: మీకు తలనొప్పా.. కడుపు నొప్పి..లేదా ఒళ్లు నొప్పులా.. లేకపోతే జ్వరమా? ఏ సమస్య అయినా సరే.. వైద్యుల వద్దకు వెళ్లాల్సిన పనిలేదు. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలోని మెడికల్ దుకాణాలకు వెళితే మందులు ఇచ్చేస్తారు. వాస్తవానికి వైద్యుడి చీటీ (ప్రిస్క్రిప్షన్) లేకుండా మందులు ఇవ్వకూడదనేది నిబంధన. కానీ కొందరు మెడికల్ దుకాణాల నిర్వాహకులు దీనికి తిలోదకాలిచ్చి, యాంటీబయాటిక్స్ సహా అన్ని మందులూ ఇచ్చేస్తున్నారు. గర్భవిచ్ఛిత్తి మాత్రలు, అబార్షన్ కిట్లను సైతం అమ్ముతున్నారనే ఆరోపణలున్నాయి. కనీసం ఆయా దుకాణాల్లో పార్మాసిస్టుల జాడ కూడా కన్పించదు. కొద్ది రోజులుగా ఔషధ నియంత్రణ అధికారులు నిర్వహిస్తున్న తనిఖీల్లో ఈ విషయాలు బహిర్గతమయ్యాయి.

### యథేచ్ఛగా...

విక్రయించిన, ఏజెన్సీల నుంచి కొనుగోలు చేసి వాటికి బిల్లులు, రికార్డులు తప్పనిసరిగా ఉండాలి. కానీ చాలా దుకాణాల్లో లేవు. ఇటీవల మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులకు అనుసంధానంగా ఉన్న ఫార్మసీల్లో తనిఖీలు చేపట్టారు. పలు రకాల మందులతో సహా గర్భవిచ్ఛిత్తి మాత్రలు, అబార్షన్ కిట్లకు రికార్డులు లేవని తెలిసింది. అనుమతి ఉన్న మెడికల్ దుకాణాలకే ఏజెన్సీలు మందులను విక్రయించాల్సి ఉండగా.. ఆర్‌ఎంపీలు, అనుమతి లేని దుకాణాలకు కూడా విక్రయిస్తున్నారని తేలింది.

### 8 మంది ఏడీలు... 34 మంది డీఐలు ఉన్నా..

గ్రేటర్‌తో సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి ,రంగారెడ్డి జిల్లాల పరిధిలో ఎనమిది మంది ఔషధ నియంత్రణ అధికారులు (డ్రగ్ కంట్రోల్ ఏడీలు), 34 మంది డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నా చర్యలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయనే విమర్శలున్నాయి. హైదరాబాద్ జిల్లాలో ఇద్దరు ఏడీలు , 11 మంది డీఐలు, మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలో ముగ్గురు ఏడీలు , 15 మంది డీఐలు, రంగారెడ్డి జిల్లాలో ముగ్గురు ఏడీలు, 8 మంది డీఐలు పని చేస్తున్నారు. వీళ్ల పరిధిలోకి ఫార్మా కంపెనీలు, మెడికల్ ఏజెన్సీలు, మెడికల్ దుకాణాలు వస్తాయి. మెడికల్ దుకాణాలలో పార్మాసిస్టు లేకున్నా, ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మినా ఔషధ నియంత్రణ అధికారులు చర్యలు తీసుకోవాలి. లైసెన్సు లేకుండా దుకాణాలను నిర్వహించినా కేసు నమోదు చేస్తారు.

### మొక్కుబడిగా తనిఖీలు..

నగరతోసహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 12 వేలకు పైగా మెడికల్ దుకాణాలు, వందల సంఖ్యలో ఏజెన్సీలు ఉన్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోనే 3,576 దుకాణాలు ఉన్నాయి. ప్రతీ నెల 20 నుంచి 25 మెడికల్ షాపులకు నోటీసులను జారీ చేస్తున్న అధికారులు రెండు నుంచి ఐదు షాపులను కూడా సీజ్ చేస్తున్నట్లు చెబుతున్నారు.అయితే అదీ మొక్కుబడిగానే అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తూతూ మంత్రంగా నోటీసులిచ్చి సంబంధిత అధికారులు చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

### ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మితే చర్యలు



మందుల దుకాణాలలో పార్మాసిస్టు లేకున్నా, ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మినా చర్యలు తీసుకుంటాం. లైసెన్సు ఉన్న మెడికల్ దుకాణాలకు మాత్రమే మందులను విక్రయించాలి. బిల్లులు, రికార్డులు తప్పనిసరిగా నిర్వహించాలి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే లైసెన్స్ సస్పెండ్ చేస్తాం.

– లక్ష్మీనారాయణ, ఏడీ, డ్రగ్ కంట్రోలర్, మేడ్చల్.

# ట్యాంక్‌బండ్‌పై టెన్షన్

- ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలంటూ డిమాండ్
- గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, పోలీసులకు మధ్య తోపులాట
- ఆందోళన కారులను అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించిన పోలీసులు



ట్యాంక్ బండ్ పై ఆందోళన చేస్తున్న గణేష్ ఉత్సవ సమితి నేతలు

కవాడిగూడ: వినాయక నిమజ్జనం కార్యక్రమం సందర్భంగా ట్యాంక్ బండ్‌పై అడ్డుగా ఉన్న బారికేడ్లను తొలగించాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ డిమాండ్ చేశారు. ట్యాంక్ బండ్‌పై నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని, అవసరమైన క్రేన్లు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. వినాయకసాగర్‌లో యథావిధిగా వినాయక సామూహిక నిమజ్జనం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం ట్యాంక్ బండ్ పై భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్ సాగర్ గణేష్ ఉత్సవ సమితి నేతలు బలవంతంగా బారికేడ్లను తొలగించారు. బారికేడ్లను తొలగిస్తున్న సమయంలో పోలీసులకు, ఉత్సవ సమితి నేతలకు వాగ్వాదం, తోపులాట జరిగాయి. అందోళన కారులను పోలీసులు అరెస్ట్ చేశారు.దీంతో ట్యాంక్ బండ్ పై కొద్ది సేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అరెస్ట్ చేసిన అందోళన కారులను పోలీసులు నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా శశిధర్ ఆలే భాస్కర్ రాజ్, బుచ్చిరెడ్డి, సంజయ్ గాణేటేలు మాట్లాడుతూ... ట్యాంక్‌బండ్‌పై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడం హిందువుల మనోభావాలు దెబ్బతీయడమేనని ఆయన ఆరోపించారు. గత 45 సంవత్సరాలుగా ట్యాంక్ బండ్ లో వినాయక నిమజ్జనాలు కొనసాగుతున్నాయని వీటిని అడ్డుకుంటామంటే ఊరుకునేది లేదని ఆయన అగ్రహం వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నేతలు ఎ. వినయ్ కుమార్,ఎం.శివాజీ, శివాజీ, ఎంసి మహేందర్ బాబు పాల్గొన్నారు.

## జంతువుల హక్కులపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ గొల్లనపల్లి ప్రసాద్

హిమాయత్‌నగర్ : జంతువుల హక్కులపై అవగాహన పెంచుకోవాలని గాంధీ దర్శన్ ఎగ్జిబిషన్ సొసైటీ డైరెక్టర్ ప్రొఫెసర్ గొల్లనపల్లి ప్రసాద్ అన్నారు. ఈనెల 7న ఫ్రీడమ్ ఫర్ అనిమల్స్ పేరుతో 'అనిమల్ రైట్స్ మార్చ్–2025'ను శిల్పారామం నుంచి బొటానికల్ గార్డెన్ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సినిమా దర్శకుడు శశికిరణ్ టిక్క, దీపిక పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. నేటి నాగరిక ప్రపంచంలో శరీర పోషణ కోసం జంతువులు, వాటి ఉత్పత్తులు అవసరం అన్నది కేవలం అపోహ అన్నారు. మనం ఆరోగ్యంగా ఉండటానికి పాలు, మాంసం, గుడ్లు, తేనె అవసరం లేదన్నారు. ప్యాకెట్ పాలు తాగడం వల్ల అమ్మాయిలు చిన్న వయసులోనే రజస్వల అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో కల్తీ ఆహార పదార్థాల తయారీ, వాడకం విపరీతంగా పెరిగిపోయిందని అన్నారు. దీనిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని కోరారు. జంతువులు కూడా మనుషుల్లాగే సంతోషం, బాధను అనుభవిస్తాయని అన్నారు. వృక్షాధారిత సంపూర్ణ ఆహారంతో మనం ఆరోగ్యంగా ఉండగలమని పరిశోధనలు చెబుతున్నాయని గుర్తు చేశారు. దక్షిణాఫ్రికాకు చెందిన పీటర్ మ్యారీస్ బర్గ్ సంస్థ ప్రతినిధి బన్నీబులా, వీటీటీ ఫౌండర్ ప్రెసిడెంట్ సూరజ్ సీతారామ పాల్గొన్నారు.

## మా ప్లాట్లు బఫర్ జోన్‌లో ఉన్నాయనడం అన్యాయం

సియేట్ మారుతి హిల్స్ కాలనీ బాధితులు

పంజగుట్ట: తాము కష్టార్జితంతో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్లాట్లను ఇప్పుడు హైడ్రా బఫర్ జోన్ పరిధిలో ఉన్నాయని అనడం అన్యాయమని సియేట్ మారుతి హిల్స్ కాలనీ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు డాక్టర్ సదానందం, ఓరుగంటి రాజేంద్ర ప్రసాద్, నాగేందర్ కుమార్‌లు మాట్లాడారు. శేరిలింగంపల్లి మండలం, గుట్టల బేగంపేటలో సియేట్ మారుతి హిల్స్ కాలనీ నివాసితుల ప్లాట్లు ఉన్నాయని తెలిపారు. తమ ప్లాట్లకు దూరంలో ఉన్న మేడ్చల్, అల్లాపూర్ గ్రామం సర్వే నెంబర్ 30లో ఉన్న సున్న చెరువు పరిధిలో బఫర్ జోన్‌లో ఉన్నాయని అనడం బాధాకరమన్నారు. చెరువుకు మాకు 80 ఫీట్ల రోడ్డు మాస్టర్ ప్లాన్‌లోనే ఉందని అయినా ఎఫ్‌టీఎల్ జోన్‌లో ఉన్నాయని అంటున్నారని తెలిపారు. 1954 నుండి సదరు స్థలానికి సంభందించిన డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయని ఎఫ్‌టీఎల్ జోన్‌లో ఉంటే ప్రభుత్వమే ఎందుకు రిజిస్ట్రేషన్ చేసిందని ప్రశ్నించారు.

## 'మహీంద్రా'తో ఆస్ట్రేలియా వర్సిటీ ఒప్పందం

సుభాష్‌నగర్: బహదూర్‌పల్లిలోని మహీంద్రా యూనివర్సిటీ, అకాడమిక్ పరిశోధన రంగాల్లో సహకారాన్ని పెంపొందించడానికి కీలకమైన అడుగు ముందుకు వేసింది. ఆస్ట్రేలియాకు చెందిన మోనాష్ యూనివర్శిటీతో అవగాహన ఒప్పందంపై సంతకం చేసినట్లు బుధవారం మహీంద్రా యూనివర్సిటీ యాజమాన్యం ప్రకటించింది. ఎంఓయులో భాగంగా సంయుక్త పరిశోధనలు, అకాడమిక్ మెటీరియల్స్, స్కాలర్స్ మార్పిడి, అలాగే సంయుక్త సదస్సులు, వర్క్‌షాప్‌లు ఇతర అకడమిక్ కార్యక్రమాల నిర్వహణ చేయనున్నట్లు మహీంద్రా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ యజులు మేడూరి, మోనాష్ యూనివర్శిటీ డిప్యూటీ వైస్ ఛాన్సలర్ (ఇంటర్నేషనల్) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ క్రైగ్ జాఫ్రీ లు తెలిపారు .




## హెచ్‌ఐసీసీలో ఎఫ్‌పీఓ కాన్‌క్లేవ్ ప్రారంభం

మాదాపూర్: ప్రపంచ వాణిజ్య మార్పులు, వాతావరణ అనిశ్చితుల నడుమ భారతీయ రైతులు ప్రపంచానికి పరిష్కార దాతలు కావడానికి సిద్ధంగా ఉన్నారని నీతి అయోగ్ సభ్యులు ప్రొఫెసర్ రమేశ్‌చంద్ర తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 5వ ఎఫ్‌పీఓ (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్)కాన్‌క్లేవ్‌ను బుధవారం సమున్నతి వ్యవస్థాపకుడు అనిల్‌కుమార్ ఎస్‌జీతో కలసి ప్రారంభించారు. భవిష్యత్ సిద్ధ ఎఫ్‌పీవో ఎకోసిస్టమ్ కోసం భాగస్వామ్యాలు స్థిరత్వం వైపు అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ జీవితం, వ్యవసాయం వెన్నుముక మహిళలే అన్నారు. మెరుగైన పద్ధతులు , విద్య, స్థిరమైన సాగు ద్వారా ఆదాయాలు, జీవన ప్రమాణాలు పెంచడంలో కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమున్నతి ఫౌండేషన్ చైర్మన్ ప్రవేశ్ శర్మ, నాబార్డ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఏకే సూద్ పాల్గొన్నారు.




కాన్‌క్లేవ్‌ను ప్రారంభిస్తున్న నీతి అయోగ్ సభ్యులు ప్రొఫెసర్ రామేశ్‌చంద్

## బీసీ రిజర్వేషన్ల బిల్లును వెంటనే ఆమోదించాలి



జిలుకర రవికుమార్

హిమాయత్‌నగర్ : బీసీలకు విద్య, ఉద్యోగ స్థానిక సంస్థలలో రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 42 శాతం రిజర్వేషన్లను రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్ తక్షణమే ఆమోదించాలని తెలంగాణ ప్రజా రాజ్యం పార్టీ(టీపీఆర్‌పీ) వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ విజ్ఞప్తి చేశారు. చట్టం చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అఖిలపక్ష బృందాన్ని సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే బీసీ మేధావులు, బీసీ సంఘాల నేతలను ఢిల్లీకి తీసుకెళ్లాలని అన్నారు. ప్రధాని మోదీని కలిసి పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టే విధంగా తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకురావాలన్నారు.

## చర్చలను స్వాగతిస్తున్నాం...

బంజారాహిల్స్: తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ ఆఫీసర్స్, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ కమిటీ తరుపున డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో జేఏసీ నేతలు జరిపిన చర్చలను స్వాగతిస్తున్నామని కార్యాచరణ కమిటీ హైదరాబాద్ జిల్లా చైర్మన్ విక్రమ్‌కుమార్, కన్వీనర్ ఎంబీ కృష్ణయాదవ్ తెలిపారు. రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారెం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఎలూరి శ్రీనివాస్ నాయకత్వంలో జరిగిన ఈ చర్చలు సానుకూలంగా జరిగాయని చెప్పారు. ప్రభుత్వ పెద్దలు తమ ప్రధాన డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల హక్కుల కోసం అహర్నిశలూ పోరాడుతూ, చర్చల్లో తమ తరుపున బలంగా వాదనలు వినిపించి విజయం సాధించిన బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఏఐలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతాం

– మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



హైటెక్‌సిటీలో జాగర్ గ్లోబల్ కేపబిలిటి సెంటర్‌ను ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు.

మాదాపూర్: తెలంగాణను ఏఐ రాజధానిగా చేయడమే ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్‌సిటీలో బుధవారం అమెరికాకు చెందిన ప్రముఖ ఎంటర్‌ప్రైజ్ ప్రొక్యూర్‌మెంట్ , సప్లయర్ కొలాబరేషన్ సంస్థ జాగర్ గ్లోబల్ కేపబిలిటి సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క టెక్నాలజీనే కాకుండా అన్ని రంగాలకు చెందిన ప్రపంచ దిగ్గజ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానంగా మారిందన్నారు. కొత్తగా ప్రారంభమైన జీసీసీ ద్వారా 180 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో 500కు చేరుతుందన్నారు. జాగర్ ఏఐ ప్లాట్‌ఫాం ఏఐ ఆధారిత ప్రొక్యూర్‌మెంట్ పరిష్కారాల అభివృద్ధికి జీసీసీ వ్యూహాత్మక కేంద్రంగా పనిచేస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తయారీ, విద్య, ఎఫ్‌ఎంసీజీ, రిటైల్ తదితర రంగాలకు సాఫ్ట్‌వేర్ , క్లౌడ్ అపరేషన్ సేవలను అందిస్తుందన్నారు. జీసీసీల ఏర్పాటుకు తెలంగాణ అనుకూలమన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా గతేడాదిలో 70 జీసీసీలు హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయన్నారు. ఈ ఏడాది 100 జీసీసీలను కొత్తగా ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో జాగర్ సీఈవో ఆంద్రూ రోస్కో, డెవలప్‌మెంట్ ఏఐ ఆఫీసర్ గోపినాథ్ పోలవరపు, చీఫ్ కస్టమర్ ట్రాయ్ మేయర్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లె ప్రజలే తెలుగును కాపాడుతున్నారు



పురస్కార గ్రహీతలతో బుర్రా వెంకటేశం

– బుర్రా వెంకటేశం

నాంపల్లి: పల్లెల్లోని ప్రజలే తెలుగును సజీవంగా కాపాడుతున్నారని.. నగర వాసులు ఇతర భాషలతో కూడిన సమ్మిళిత తెలుగును మాట్లాడుతున్నారని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం పేర్కొన్నారు. బుధవారం నాంపల్లి ప్రాంగణంలోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో తెలుగు విశ్వవిద్యాలయం రెండవ రోజు వివిధ రంగాల్లో విశేషమైన సేవలు అందించిన 24 మంది ప్రముఖులకు 2023వ సంవత్సరానికి గాను కీర్తి పురస్కారాలతో సత్కరించారు. పురస్కారం కింద గ్రహీతలకు ఒక్కొక్కరికి రూ.5116 నగదు, అభినందన పత్రాన్ని అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ... ప్రస్తుతం ప్రపంచంలోనే మొదటి పదిహేను భాషలలో తెలుగు ఉందన్నారు. తెలుగును కాపాడుకునే దిశగా ఎన్టీఆర్ చేసిన గొప్ప ఆలోచనలతో ప్రారంభమైన తెలుగు విశ్వవిద్యాలయం రానురాను తన ప్రభను కోల్పోతోందన్నారు. భాషా సాహిత్య లలిత కళా రంగాల్లో చేరే విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఉపాధ్యక్షులు ఆచార్య నిత్యానందరావు ప్రయత్నం చేయాలని సూచించారు. అశ్విని గ్రూప్ చైర్మన్ బీసీవీ సుబ్బారావు మాట్లాడుతూ... తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభామూర్తులను గుర్తించి పురస్కారాలను అందజేయడం అభినందనీయమన్నారు.సభకు తెలుగు వర్శిటీ ఉపాధ్యక్షులు ఆచార్య నిత్యానందరావు అధ్యక్షత వహించారు.

## 5న రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపులు బంద్



కార్యక్రమంలో పాల్గొన్న రేషన్ షాప్ డీలర్లు

పంజగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చినట్లుగా రేషన్ డీలర్లకు ఐదువేలు గౌరవ వేతనం, కమీషన్ల పెంపు వెంటనే ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు కోరారు. తమ డిమాండ్లను, ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈ నెల 5న రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపులు బంద్‌కు పిలుపునిస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి రెడ్డిమల్ల హనుమండ్లు, వర్కింగ్ ప్రసిడెంట్ పి.లక్ష్మీనారాయణలతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి 21 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు తమ మొరను ఆలకించకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పౌరసరఫరాల శాఖా మంత్రి ఉత్తం కుమార్ రెడ్డికి ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినా తమ విషయంలో స్పందించకపోవడం సరికాదన్నారు. ఏప్రిల్ నుంచి పంపిణీ చేసిన బియ్యం కమీషన్ ఇంతవరకు చెల్లించలేదన్నారు. తరచూ అనారోగ్యం పాలౌతున్న రేషన్ డీలర్ల కుటుంబాలకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, రేషన్ డీలర్ చనిపోతే అతని కుటుంబానికి దహన సంస్కారాల నిమిత్తం రూ. 30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, రాము, శ్యామ్, రమేష్, భానుచందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచానికి ఆధునిక సాంకేతికతను అందించాలి



టెక్నికల్ సింపోజియం సావనీర్‌ను విడుదల చేసిన అతిథులు

మణికొండ: ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రపంచానికి ఆధునిక సాంకేతికతను అందించే బాధ్యత తీసుకోవాలని మహీంద్రా అండ్ మహీంద్రా సీనియర్ జనరల్ మేనేజర్ అనిల్‌కుమార్ మహేంద్రకర్ అన్నారు. గండిపేటలోని ఎంజీఐటీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం, మాజిస్టిక్–2025ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 3డి ప్రింటింగ్, ఆటోమేషన్, డ్రోన్ అటానమీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి రోజువారి సాంకేతికతలను నిరంతరం అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. డీఆర్‌డీఓ శాస్త్రవేత్త, జనరల్ నావల్ సైన్సెస్, మెటీరియల్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ... సంప్రదాయ రవాణా వ్యవస్థల నుంచి ఎలక్ట్రిక్ వాహనాలకు జరుగుతున్న పరివర్తన గురించి మెకానికల్ ఇంజనీర్లు తెలుసుకోవాలన్నారు. గ్రీన్ టెక్నాలజీతో పర్యావరణ పరిరక్షణకు ప్రపంచం పెద్ద పీట వేస్తుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి. చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## బీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



బీసీ కమిషన్ సభ్యులతో సమావేశమైన బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు

పంజగుట్ట: తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లుగానే బీసీ ఉద్యోగుల నియామకాల్లో, పదోన్నతుల్లో కూడా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముకురాల చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. బుధవారం చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రమ ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్, సభ్యులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లుగా బీసీ ఉద్యోగుల అపాయింట్‌మెంట్, ప్రమోషన్లల్లో కూడా రిజరేషన్లు కల్పించే చట్టం తీసుకురావాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వంలోని అన్ని విభాగాధిపతులకు తమ ఆధీనంలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగుల వివరాలు బీసీ కమిషన్‌కు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.బీసీ ఉద్యోగులకు గుదిబండలా మారిన క్రిమీలేయర్‌ను రద్దు చెయ్యాలని, ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు 5 శాతానికే పరిమితం చేయాలని కోరారు. కార్యక్రమంలో వరాల శ్రీనివాస్, ఆర్.కోటాజీ, జగన్ మోహన్, హరీష్, వర్మ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్టాలిన్.. నేటి తరం విద్యార్థి నేతలకు ఆదర్శం




ఉస్మానియా యూనివర్సిటీ: ఏఐఎస్‌ఎఫ్ మాజీ నాయకుడు, ఓయూ విద్యార్థి స్టాలిన్ జీవన విధానం నేటి తరం విద్యార్థి నాయకులకు ఆదర్శనమని సీపీఐ నేత కాంపెల్లి శ్రీనివాస్ అన్నారు. ఇటీవల హైదరాబాద్ జిల్లా సీపీఐ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఓయూ పారుశుధ్య కార్మికులు, వివిధ విద్యార్థి సంఘాల నేతలు స్టాలిన్‌ను ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాలులో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఏఐఎస్‌ఎఫ్ జాతీయ స్థాయి నేతగా ఎదిగిన ఆయన సీపీఐలో పూర్తిస్థాయి నాయకునిగా పని చేసేందుకు వ్యక్తిగత జీవితాన్ని త్యజించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు నెల్లి సత్య, గ్యార నరేష్, ఉదయ్, చటారి దశరథ్ పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్ । గురువారం । 4 । సెప్టెంబర్ । 2025



## షూటింగ్.. స్టార్స్

› ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర షూటర్ల సత్తా
› సాట్స్ వేదికగా సన్మానించిన తెలంగాణ రైఫిల్ అసోసియేషన్

సాక్షి, సిటీబ్యూరో: ఆసియా షూటింగ్ చాంపియన్ షిప్–2025లో పతకాలు సాధించిన షూటర్‌ను తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కజకిస్థాన్‌లో ఇటీవల ముగిసిన ఈ చాంపియన్‌షిప్‌లో అద్భుత విజయాలు సాధించిన స్టార్ షూటర్ తనిష్క్ మురళీధర్ కొడవలిని గచ్చిబౌలిలోని సాట్స్ షూటింగ్ రేంజ్‌లో బుధవారం తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ సన్మానించి, అభినందించింది. తనిష్క్ కొడవలి 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ జూనియర్ మెన్స్ వ్యక్తిగత విభాగంలో కాంస్యం, 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ జూనియర్ మెన్స్ టీమ్ విభాగంలో బంగారు పతకం గెలుచుకుని దేశానికి, రాష్ట్రానికి కీర్తి తీసుకువచ్చారు. మరో షూటర్ ఈషాసింగ్ కూడా 25 మీటర్ల పిస్టల్ ఉమెన్ టీమ్ విభాగంలో కాంస్యం సాధించారు. ఈ వేడుకకు హాజరు కాలేకపోయినప్పటికీ విశిష్ట ప్రదర్శనతో పతకం గెలుచుకున్న ఈషాసింగ్‌కు కూడా టీఆర్‌ఏ అభినందనలు తెలిపింది. తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు అమిత్ సంఘీ మాట్లాడుతూ.. తనిష్క్ క్రమశిక్షణ, నిబద్ధత, ఒత్తిడి పరిస్థితుల్లో మానసిక ధైర్యం వంటి లక్షణాలు అత్యున్నతస్థాయి పోటీల్లో విజయం సాధించేందుకు కీలకంగా నిలిచాయని కొనియాడారు. ఈ సందర్భంగా తమ క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ సదుపాయాలు, నిపుణుల మార్గదర్శకత్వం, అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ తమ నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటించింది.

# అపు'రూపం'..

## ఆర్టిస్ట్‌లకు ఆత్మీయ నేస్తం

'గణపతి చిత్రం గీసేటప్పుడు ఒక చిత్రకారుడు పొందే స్వేచ్ఛానుభూతి అతడి కళా ప్రయాణంలో మరెప్పుడూ పొందడు' అని చెప్పారు నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు రమణారెడ్డి. అందుకే ప్రతి ఆర్టిస్ట్ కనీసం ఒక్కసారైన తనివితీరా వినాయకుడి రూపాన్ని చిత్రిస్తారని ఆయన అన్నారు. గణేశ్ నవరాత్రుల సందర్భంగా పలు ఆర్ట్ గ్యాలరీల్లో వినాయక చిత్రకళా ప్రదర్శనలు కొలువుదీరడం సర్వసాధారణం కూడా..

– సాక్షి, సిటీబ్యూరో

ఆర్టిస్ట్: ఎంఎఫ్ హుస్సేన్





వినాయక(గణేశ) చిత్రాలకు దేశంలోనే ప్రసిద్ధి చెందిన ప్రముఖ భారతీయ కళాకారులలో నగరానికి చెందిన దివంగత లెజండరీ చిత్రకారుడు ఎంఎఫ్ హుస్సేన్ ముందుంటారు. అష్ట వినాయక సిరీస్, అదేవిధంగా డ్యాన్సింగ్ గణేశా.. తదితర ఆర్ట్ వర్క్స్ ద్వారా ఆయన విఘ్నేశ్వరుడి రూపాలను వైవిధ్యంగా తీర్చిదిద్ది ప్రశంసలు అందుకున్నారు.

### ఎందరెందరో..

తన శాస్త్రీయ చిత్రాలకు ప్రసిద్ధి చెందిన రాజా రవివర్మ, బెంగాలీ జానపద కళా శైలులను అన్వయించిన జామిని రాయ్, తన వియుక్త రేఖాగణిత చిత్రణలకు ప్రసిద్ధి చెందిన ఎస్‌హెచ్. రజా వంటి చిత్రకారులు గణేశుడి చిత్రావళికి చిరునామాలుగా మారారు. ఇతర జాతీయ స్థాయి చిత్రకళాకారులలో అనిల్ కుమార్ విశ్వకర్మ, భాస్కర్ లాహిరి, ఎస్ఎస్ మనోహరన్, దుర్షిత్ భాస్కర్ కూడా వినాయక చిత్రణలో అగ్రగాములుగా ఉన్నారు.



ఆర్టిస్ట్: పొన్నుస్వామి



ఆర్టిస్ట్: జమినిరాయ్


ఏ బొమ్మ గీసినా నీ రూపమే.. అంటారు చిత్రకళాకారులు.. బుద్ధుడు కావొచ్చు, వేంకటేశ్వర స్వామి కావొచ్చు.. మరెవరైనా సరే ఆ రూపం గీసే చిత్రకారులకు చాలా పరిమితులు, షరతులు ఉంటాయి. దాంతో అప్రయత్నంగానే చిత్రకారులు చాలా జాగ్రత్తగా కుంచెను కదిలిస్తారు. దేవతలలో ఒక్క గణపతి చిత్రాలు మాత్రమే ఆర్టిస్ట్‌లకు స్వేచ్ఛగా కుంచెను ఝుళిపించే అవకాశాన్ని ఇస్తాయి. తద్వారా అపురూపమైన వైవిధ్యానికి జీవం పోసేందుకు వీలవుతుంది. అంతేకాకుండా ఆధునికులు, సంప్రదాయ వాదులు అనే వ్యత్యాసం లేకుండా ప్రతిఒక్కరూ గణేశ్ చిత్రాలను ఇష్టపడుతారు. అందుకే ఫైవ్ స్టార్ హోటల్స్ నుంచి కార్పొరేట్ ఆఫీస్‌ల దాకా గణపతి చిత్రాలు దర్శనమిస్తుంటాయి.

### విఘ్నాధిపతి.. చిత్రకళాధిపతి..

| | |
|---|---|
| జీవితకాలంలో గణేశుడిని చిత్రించని కుంచె అరుదే.. | సిటీ ఆర్ట్ గ్యాలరీలకు కళ గణపతి చిత్రోత్సవం |

ఎంఎఫ్ హుస్సేన్ సహా గణపతి చిత్రీకరణలో ఎందరో..

లక్ష చిత్రాలను గీయడమే లక్ష్యమంటున్న నగర ఆర్టిస్టులు



### లక్ష గణపతి చిత్రాలు.. అదే లక్ష్యం

చిన్నప్పటి నుంచీ మన నగరంలో వినాయక మండపాలను ఆసక్తిగా చూసేవాడిని. విభిన్న ఆకృతుల్లో కనపడే గణనాథుడే నా చిత్రకళా యానానికి స్ఫూర్తిగా చెప్పొచ్చు. ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభం నుంచే పదులు, వందలు, వేల సంఖ్యలో గణపతి చిత్రాలు గీసినా తనవి తీరడం లేదు. నగరంతో పాటు ముంబై, అమృత్‌సర్, బెంగళూర్ వంటి నగరాల్లో కూడా చిత్రకళా ప్రదర్శనలు నిర్వహించాను. ఇప్పటికి దాదాపు 5,500కి పైగా చిత్రాలు గీశాను. పలువురు సెలబ్రిటీల నివాసాల్లో నా వినాయకుడు కళకళలాడుతూ కనిపిస్తున్నాడనేది ఒకటే సంతృప్తి. ఎప్పటికైనా లక్ష వినాయక చిత్రాలను గీయాలని, ఒక పెద్ద కాన్వాస్‌పై అవన్నీ గుది గుచ్చి ఓ విశ్వరూప వినాయకుడికి పట్టం కట్టాలని లక్ష్యం.

– బాలభక్త రాజు, గణపతి చిత్రాలకు పేరొందిన ప్రసిద్ధ చిత్రకారుడు





# కళలు..

## కళాకృతులు

| | | |
|---|---|---|
| క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణలో కళాకృతులు | నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా గృహాలంకరణ వస్తువులు | వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన చేతివృత్తిదారులు |

బంజారాహిల్స్: ఏటి కొప్పాక బొమ్మలు.. అల్లికలతో తీర్చిదిద్దిన నమూనాలు.. చెక్క బొంగరాలు, ఎకో ఫ్రెండ్లీ వస్తువులు, చూడ ముచ్చటగా హస్త కళలతో రూపొందించిన కళాకృతులతో బంజారాహిల్స్‌లోని క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ(సీసీటీ) ప్రాంగణం ఆకట్టుకుంటోంది. సీసీటీ ప్రాంగణంలో శిల్పకారులు, హస్త కళాకారులను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన చర్న్ 2025 ఎగ్జిబిషన్ ఆకట్టుకుంటోంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి ఎంతో గుర్తింపు పొందిన హస్త కళాకారులు, చేతి వృత్తిదారులు ఈ ప్రదర్శనలో తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. కనుమరుగవుతున్న కొన్ని కళలను ఇంకా ఈ కళాకారులు కాపాడుతూ నేటి తరానికి అందిస్తున్న వైనాన్ని పలువురు మెచ్చుకుంటున్నారు. రీసైక్లింగ్‌తో తయారు చేసిన అందమైన కళాకృతులు, పెయింటింగ్స్, పేపర్ క్విల్లింగ్, బొమ్మల తయారీ, కౌ హెడ్ మాస్కలు ఇలా ఒక్కటేమిటి ఆఖరికి బట్టలు ఉతకడానికి వాడే డిటర్జంట్ లిక్విడ్స్‌ను కూడా ఎకో ఫ్రెండ్లీ మోడ్‌లో తయారు చేసి ప్రదర్శించారు.



### వెయ్యికి పైగా ఆర్ట్‌లను తయారు చేశా..



పేపర్ క్విలింగ్ ఆర్ట్ అనేది చాలా అరుదైంది. కేవలం పేపర్లు, సహజ రంగులు మాత్రమే వాడి చేసే ఈ ఆర్ట్‌కు ఇప్పుడిప్పుడే ఆదరణ పెరుగుతోంది. నగరంలో ఈ తరహా ఆర్ట్ తయారు చేసే వారు ఇద్దరు, ముగ్గురికి మించి ఉండరు. ఇప్పటి వరకు నేను వెయ్యికి పైగా పేపర్ క్విలింగ్‌తో ఆర్ట్‌లను తయారు చేశాను. ఒక్కో నమూనాను తయారు చేయడానికి ఒక్కోసారి 40 గంటలకు పైగా సమయం పడుతుంది. ఇవి తయారు చేయాలంటే ఎంతో ఓపిక ఉండాలి. ఎకో ఫ్రెండ్లీగా ఉండే ఈ ఆర్ట్‌లను తీసుకునేందుకు చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారు.

– అంజలి, పేపర్ క్విలింగ్ ఆర్టిస్ట్, హైదరాబాద్

### ఒక్కో డిజైన్ వేయడానికి ఐదు రోజులు



మేం మధ్యప్రదేశ్ నుంచి వచ్చాం. ప్రధానంగా మధ్యప్రదేశ్‌లోని పలు గ్రామాల్లో టెక్చర్ ఆర్ట్‌తో గ్రామీణ ప్రాంత కళాకారులకు ఉపాధి కల్పిస్తున్నాం. ఒక్కో ఆర్ట్ వేయడానికి కళాకారులకు కనీసం ఐదు రోజులు పడుతుంది. సహజ రంగులు వినియోగిస్తాం. మా దగ్గర పని చేసే ట్రైబల్స్‌కు పలు సంస్థలు, కేంద్ర ప్రభుత్వం సైతం అవార్డులు అందించింది. కౌ హెడ్స్, వుడ్ ఆయిల్ పెయింట్స్, మధుభాను ఆర్ట్స్‌ను ఎక్కువగా తయారు చేస్తుంటాం. ఒక్కో ఆర్ట్‌ను వేయడానికి కళాకారులు ఎంతో కష్టపడతారు.

– సుచయిత, మధ్యప్రదేశ్

### ట్రెండ్‌కు తగ్గట్టుగా తయారు చేస్తున్నాం




మేం చాలా సంవత్సరాలుగా ఏటి కొప్పాక బొమ్మలు, కుట్లు అల్లికలతో తయారు చేసిన నమూనాలను విక్రయిస్తున్నాం. మేం తయారు చేసే వస్తువులకు జీఐ ట్యాగ్ కూడా ఉంది. గ్లోబల్ మార్కెట్‌లో ఏటి కొప్పాక బొమ్మలకు డిమాండ్ ఉంది. ప్రస్తుత పిల్లలకు, గృహాలకు సరిపోయే రీతిలో బొమ్మలు కావొచ్చు, గృహాలంకరణ వస్తువులు కావొచ్చు వాటిని తయారు చేస్తున్నాం. రూ.280 నుంచి రూ.3 వేల ధరలకు ఈ వస్తువులను తయారు చేసి విక్రయిస్తున్నాం. 30 ఏళ్ల క్రితం ఉండే బొమ్మలను ప్రస్తుతం లభించే ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్‌తో రీ డిజైన్ చేస్తున్నాం.

– శిల్పా దంటు, వైజాగ్



## వేదిక్ మ్యాథ్స్ ఫౌండర్‌కు వర్జీనియాలో అవార్డ్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ప్రముఖ టెక్నాలజీ నిపుణులు, వేదిక్ మ్యాథ్స్ ఫౌండర్ గాయత్రి రజనీకాంత్ అమెరికా వర్జీనియా వేదికగా అత్యుత్తమ సామాజిక సేవా పురస్కారం అందుకున్నారు. వర్జీనియా వేదికగా గ్లోబల్ మున్నూరు కాపు అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఇందులో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా అమెరికాలోని భారతీయుల కోసం వేదిక్ మ్యాథ్స్‌ను స్థాపించి దాదాపు 15 ఏళ్లుగా వేదిక్ మ్యాథ్స్‌తో క్లిష్టమైన గణిత సమస్యలకు చక్కని పరిష్కారాలు చూపిస్తున్న గాయత్రి రజనీకాంత్ అత్యుత్తమ సామాజిక సేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.



## బ్యూటీ ఫెస్ట్ షురూ..



సాక్షి, సిటీబ్యూరో: సౌందర్య పోషణ చికిత్సలకు పేరొందిన ప్రముఖ బ్రాండ్ వీఎల్‌సీసీ ఆధ్వర్యంలో ది గ్రేట్ ఇండియన్ బ్యూటీ ఫెస్టివల్ ప్రారంభమైంది. ఈ విషయాన్ని సంస్థకు చెందిన తానియా పాండే తెలిపారు. దీనిలో భాగంగా కట్టింగ్ ఎడ్జ్ స్కిన్‌కేర్ ఇన్నోవేషన్, ఫుల్ మేకోవర్ ప్యాకేజీ, ఫెస్టివ్ స్పెషల్ ట్రీట్‌మెంట్స్‌తో పాటు బయోరీపీల్డ్, స్కిన్‌హెల్త్ పునరుజ్జీవనం కోసం స్టెమ్‌సెల్–డిరైవ్డ్ గ్రోత్ ఫ్యాక్టర్స్, సైటోకిన్‌లను ఉపయోగించే బయోటెక్నాలజీ చికిత్స అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఈ ఫెస్ట్ సందర్భంగా నెల రోజుల పాటు ప్రపంచస్థాయి చికిత్సలు లభ్యమవుతాయన్నారు.

## బుక్ ఎ థాన్ @ ఇనార్బిట్ మాల్



సాక్షి, సిటీబ్యూరో: ఇనార్బిట్ మాల్ సైబరాబాద్ వేదికగా క్రాస్‌వర్డ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రాస్‌వర్డ్ బుక్ ఎ థాన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అన్ని వయసుల వారికి నచ్చే విధంగా లక్షకుపైగా పుస్తకాలు ఉన్నాయని, ప్రత్యేక డిస్కౌంట్‌లతో క్రాస్‌వర్డ్ బుక్ ఎ థాన్ ఈనెల 7వ తేదీ వరకు కొనసాగుతుందని ఇనార్బిట్ మాల్ ప్రతినిధి తెలిపారు. అంతేకాకుండా పుస్తకాల సందడితో పాటు దీనికి పండుగ ఉల్లాసాన్ని జోడిస్తూ.. మాల్ వేదికగా ఈ నెల 6, 7వ తేదీలలో కేరళ హార్వెస్ట్ ఫెస్టివల్ 'ఓనమ్'ను వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రత్యక్ష సాంస్కృతిక ప్రదర్శనలు, ఇతర సంప్రదాయ ప్రదర్శనలతో అలరించనున్నారు. ఈ ఓనమ్ వేడుకల్లో సందర్శకులు చెండా మెలమ్ రిథమిక్ బీట్స్, మోహినియట్టం మనోహరమైన కదలికలు, కథకళి సౌందర్యాన్ని కేరళ సాంస్కృతిక గొప్పతనాన్ని ఆస్వాదించవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. ఉత్సవాల్లో సమకాలీన రూపకల్పనతో హస్తకళను మిళితం చేసే ఆభరణాల సేకరణలను ప్రీమియం డైమండ్ బ్రాండ్ ఆకేరా అలరించనుంది.

# ఫోన్ చేజారితే.... గుండె పగిలినట్టే..

నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు.. చేతిలో ఫోన్ ఉండాల్సిందే. నిద్ర లేకపోయినా, తిండి తినకపోయినా ఫోన్ ఉంటే చాలనుకునే జనమూ ఉన్నారు. అంతలా స్మార్ట్‌ఫోన్స్ జీవితంలో భాగమయ్యాయి. అంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ ఉపకరణం చేజారితే గుండె పగిలినంత పని అవుతుంది. ఈ ఫీలింగ్ ఏ ఒక్కరికో పరిమితం కాదు. దేశంలో అత్యధికులది ఇదే మాట.

- సాక్షి, స్పెషల్ డెస్క్



## యూజర్లలో అత్యధికుల అభిప్రాయం ఇదే

- ఫోన్ పాడైతే డేటా నష్టపోతామన్న ఆందోళన
- కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ తాజా సర్వేలో వెల్లడి

టెక్నాలజీ మార్కెట్ రీసెర్చ్ కంపెనీ కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ తాజాగా చేపట్టిన అధ్యయనంలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. తమ స్మార్ట్‌ఫోన్ పగిలిపోయినప్పుడు, కింద పడిపోయినప్పుడు కలత, భయాందోళనకు గురైనట్లు సర్వేలో పాల్గొన్న 95 శాతం మంది తెలిపారు. స్మార్ట్‌ఫోన్ కొనుగోలు నిర్ణయాలను మన్నిక ప్రభావితం చేస్తోంది. కాబట్టే మన్నిక చాలా ముఖ్యమైన అంశంగా 79 శాతం యూజర్లు భావిస్తున్నారు. తరచూ వాడుతుంటారు కాబట్టి చేతి నుంచి ఫోన్ కింద పడడం సహజం. అలా పడినప్పుడు పాడవకుండా బలమైన స్క్రీన్ ఉండాలని ఎక్కువమంది కోరుకుంటున్నారు. అలాగే బలమైన ఫ్రేమ్, నీట తడిసినా ఏమీకాని వాటర్ రెసిస్టెన్స్ సౌకర్యమూ ఉండాల్సిందేనంటున్నారు.

### డేటా కోల్పోతామని..

ఫోన్ అంటేనే ఒక ప్రపంచం. ప్రతి ఒక్కరికీ భావోద్వేగాలతో ముడిపడినది. ఫోన్ పాడైతే డేటా నష్టపోతామన్న భయం చాలామందిలో ఉంది. దాదాపు 89 శాతం మంది ఈ అభిప్రాయాన్ని వెల్లడించారు. ఫొటోలు, వీడియోలు, బ్యాంకింగ్ వివరాలు, కాంటాక్ట్‌లు, చాట్‌లు డిలీట్ అవుతాయని ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు. అందుకే 90 శాతం మంది కస్టమర్లు తమ ఫోన్లకు కవర్స్, స్క్రీన్ గార్డ్స్‌తోపాటు బీమా తీసుకుంటున్నారు. ఫోన్ వేడెక్కడం (41 శాతం), బ్యాటరీ సమస్యలు (32), ప్రమాదవశాత్తు నష్టం వాటిల్లడం (32 శాతం) వంటి సమస్యలు సైతం యూజర్లను ఆందోళన కలిగిస్తున్నాయి.

### గుదిబండగా మరమ్మతు

ఫోన్స్ రిపేర్ గుదిబండగా భావిస్తున్నారు. రిపేర్ అంటేనే ఖరీదైన వ్యవహారంగా మారిందని కస్టమర్లు చెబుతున్నారు. 70 శాతం కంటే ఎక్కువ మంది వినియోగదారులు మరమ్మతు ఖర్చుల కోసం రూ.2,000 కంటే ఎక్కువ ఖర్చు చేశారని సర్వేలో తేలింది. దాదాపు 29 శాతం మంది కస్టమర్లు ఫోన్ రిపేర్ కోసం రూ.5,000 కంటే ఎక్కువ వెచ్చించినట్టు తెలిపారు.

### 'మన్నిక'పై అధ్యయనం

స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఒప్పో ఇండియా తరఫున కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ ఈ సర్వే చేపట్టింది. భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో 'మన్నిక'అనే అంశం పాత్రను అర్థం చేసుకోవడం లక్ష్యంగా అధ్యయనం జరిగింది. దేశంలోని ప్రథమ, ద్వితీయ శ్రేణి నగరాల్లో 4,564 మంది వినియోగదారుల నుంచి సమాచారం సేకరించి నివేదిక రూపొందించారు.

- 78% మంది వినియోగదారులు తమ ఫోన్స్ దెబ్బతింటాయనే భయంతో వర్షం, తీవ్ర ఎండ వంటి కఠిన పరిస్థితుల్లో ఉపయోగించడం లేదు.
- 95% మంది యూజర్లు తమ ఫోన్ పగిలిపోయినప్పుడు, పడిపోయినప్పుడు కలత, ఆందోళనకు గురవుతున్నారు.
- 79% మంది వినియోగదారులు స్మార్ట్‌ఫోన్ మన్నిక అత్యంత ముఖ్యమైన అంశంగా భావిస్తున్నారు.
- 89% మంది తమ ఫోన్ పాడైతే వ్యక్తిగత డేటాను కోల్పోతామని భయపడుతున్నారు. ఫొటోలు, వీడియోలు, బ్యాంకింగ్ వివరాలు, కాంటాక్ట్‌లు, చాట్స్ డిలీట్ అవుతాయని ఆందోళన చెందుతున్నారు.

## క్లుప్తంగా...

### కవితమ్మా.. ఇది తగునా?

**అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**



గజ్వేల్: ఎమ్మెల్సీ కవిత నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తన పేరును ప్రస్తావించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ను దెబ్బతీయడానికి కాంగ్రెస్, బీజేపీలు కవితను ముందుపెట్టి మాట్లాడిస్తున్నాయని ఆరోపించారు. తానూ 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాజకీయంగా నిలదొక్కుకోవడానికి మాత్రమే హరీశ్‌రావుపై మాట్లాడానని ప్రతాప్ గుర్తుచేశారు. తానూ బీఆర్‌ఎస్‌లో చేరిన తర్వాత వాస్తవ పరిస్థితులను హరీశ్‌రావుకు వివరించానని స్పష్టం చేశారు. గతంలో మల్లన్నసాగర్ నిర్వాసితుల పక్షాన పోరాడిన తాను.. ఈ రిజర్వాయర్ ప్రారంభోత్సవంలో కేసీఆర్, హరీశ్‌రావుల ఆధ్వర్యంలో జరిగిన కాళేశ్వరం గొప్పదనాన్ని తెలుసుకున్నానని, ఆ రోజు వేదికపై మాట్లాడినట్లు గుర్తుచేశారు.

### ఇక రేవంత్ ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటాం

**ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ**



పంజగుట్ట (హైదరాబాద్): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు ఇవ్వకపోతే ఇక యుద్ధమే అని, రేవంత్ ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. పింఛన్లు పెరగక 45 లక్షల మంది బాధపడుతుంటే, కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్న వారు 10 లక్షల మంది ఉన్నారని తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈనెల 9న పరేడ్ గ్రౌండ్స్‌లో జరగాల్సిన చలో హైదరాబాద్ కార్యక్రమం ఉపరాష్ట్రపతి ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అక్టోబర్ మొదటి లేదా రెండవ వారంలో పరేడ్ గ్రౌండ్స్‌లోనే చలో హైదరాబాద్ నిర్వహించి లక్షలాది మందితో హైదరాబాద్ దిగ్బంధం చేస్తామన్నారు.

## మైక్రో బ్రూవరీలకు గ్రీన్‌సిగ్నల్

- టీసీయూఆర్‌తోపాటు ఆరు కార్పొరేషన్లలో ఏర్పాటుకు ఎక్సైజ్‌శాఖ నోటిఫికేషన్
- బార్లు, క్లబ్‌లు, పర్యాటక స్థలాలు, హోటళ్లు, రెస్టారెంట్‌లు దరఖాస్తు చేసుకునే అవకాశం
- నేటి నుంచి ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తులు... ఫీజు రూ.లక్ష మాత్రమే
- 1000 చదరపు అడుగుల స్థలం ఉంటే చాలు.. ఎక్కడికక్కడే దరఖాస్తుల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: ఇక నుంచి తెలంగాణలో బీరు తాగాలంటే బార్ అండ్ రెస్టారెంట్‌కే వెళ్లాల్సిన పనిలేదు... వైన్‌షాపుల్లోనూ కొనుక్కోవాల్సిన అవసరం అంతకంటే లేదు... హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, పర్యాటక స్థలాల్లో ఎక్కడైనా దొరుకుతుంది. అప్పటికప్పుడు, అక్కడికక్కడ తయారు చేసిన బీర్‌ను మద్యం ప్రియులు ఆస్వాదించే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. అంతే కాదు... బీర్ అమ్మాలంటే బార్ లైసెన్సు అవసరం లేదు.. వైన్‌షాపులకు టెండర్లు వేయాల్సిన పని అసలే లేదు. వెయ్యి చదరపు అడుగుల స్థలం ఉంటే చాలు.. అక్కడో హోటలో, రెస్టారెంటో ఉంటే చాలు.. అక్కడే తయారు చేసి ఎంచక్కా అమ్ముకోవొచ్చు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా మైక్రో బ్రేవరీల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్)తోపాటు కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో మైక్రో బ్రేవరీల ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ మేరకు టీసీయూఆర్‌తోపాటు ఆరు మున్సిపల్ కార్పొరేషన్లలో మైక్రో బ్రేవరీల ఏర్పాటుకు గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. రూ.లక్ష దరఖాస్తు రుసుం కింద చెల్లించి ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా ప్రాంతాల పరిధిలోని బార్లు, ఎలైట్ బార్లు, క్లబ్‌లు, పర్యాటక స్థలాలు, హోటళ్లు, రెస్టారెంట్లతోపాటు నిబంధనల మేరకు అన్ని అనుమతులతో ఆహార పదార్థాలను అందజేసే సంస్థలు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. టీసీయూఆర్ పరిధిలోని జీహెచ్‌ఎంసీతోపాటు బోడుప్పల్, జవహర్‌నగర్, ఫీర్జాదిగూడ, నిజాంపేట, బడంగ్‌పేట, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో చేసుకునే దరఖాస్తులను నాంపల్లిలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. మిగిలిన ఆరు మున్సిపల్ కార్పొరేషన్లలో ఎక్కడికక్కడే ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ల కార్యాలయాల్లో దరఖాస్తు ఇవ్వొచ్చు. మరో విశేషమేమిటంటే... ఈ నోటిఫికేషన్ ప్రకారం ఎక్కడ, ఎన్ని దరఖాస్తులు వచ్చినా అన్ని మైక్రో బ్రేవరీలను మంజూరు చేస్తామని, తాము పెట్టిన నిబంధనల మేరకు అన్ని అనుమతులు ఉంటే చాలని, అయితే ఏడాదికి రూ.5 లక్షల లైసెన్సు ఫీజును చెల్లించాల్సి ఉంటుందని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి.

## కలిసికట్టుగా సాగుదాం

- మనస్పర్థలు పక్కనబెట్టి పనిచేద్దాం
- కాంగ్రెస్ మోసాలు, బీజేపీ ముప్పును ప్రజలకు వివరించాలి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు
- బీఆర్‌ఎస్‌లోకి మణుగూరు కాంగ్రెస్ నేతలు



కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్న కాంగ్రెస్ నాయకుడు ఊకంటి ప్రభాకర్ రావు

సాక్షి, హైదరాబాద్: పార్టీ నాయకులు, కార్యకర్తలు చిన్నచిన్న మనస్పర్థలు పక్కనపెట్టి కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు, రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటేందుకు కృషి చేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పిలుపునిచ్చారు. కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవడం ద్వారానే రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టడం సాధ్యమవుతుందని అన్నారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాలు, బీజేపీతో రాష్ట్రానికి పొంచి ఉన్న ముప్పును ప్రజలకు వివరించాలని సూచించారు. ఎర్రవల్లి నివాసంలో బుధవారం పినపాక నియోజకవర్గం మణుగూరుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు ఊకంటి ప్రభాకర్ రావు తన అనుచరులతో కలిసి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే రేగ కాంతారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేసినా సింగరేణి ప్రాంతంలోని 13 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఓటమి చెందడంపై లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో గులాబీ జెండా ఎగురవేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ నెల 10, 11 తేదీల్లో భద్రాచలం, కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గాల్లో తాను పర్యటిస్తున్నట్లు వెల్లడించారు.

### కేసీఆర్‌పై సీబీఐ విచారణ సిగ్గుచేటు

తెలంగాణ తాగు, సాగునీటి అవసరాలు తీర్చిన దార్శనికుడు కేసీఆర్‌పై సీబీఐ విచారణ సిగ్గుచేటు అని కేటీఆర్ విమర్శించారు. 'సీబీఐని మోదీ జేబు సంస్థ అని రాహుల్ విమర్శిస్తే, రేవంత్ ఈ సంస్థను ప్రశంసించడం కాంగ్రెస్ దౌర్భాగ్య స్థితికి నిదర్శనం. కాళేశ్వరంతో తెలంగాణ పచ్చబడుతుంటే కొందరి కళ్లు ఎర్రబడుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీ కక్షపూరితంగా అక్రమ కేసులతో కేసీఆర్‌ను బద్నాం చేస్తున్నాయి. వ్యవసాయ సొసైటీల ముందు రైతులు చెప్పుల వరుసలు పెట్టి పడిగాపులు కాయాల్సిన దుస్థితిని కాంగ్రెస్ కల్పించింది. ఎన్నికల ముందు హామీల జాతర.. ఎన్నికల తర్వాత చెప్పుల జాతర అన్నట్లుగా కాంగ్రెస్ పాలన ఉంది. సీఎం రేవంత్ తన మాటలు, చేతలతో ముఖ్యమంత్రి పీఠానికి ఉన్న గౌరవాన్ని మంటగలుపుతున్నారు. హామీల అమలునుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే రోజూ కేసీఆర్, కేటీఆర్ అరెస్ట్ అంటూ సొల్లు పురాణం చెబుతున్నారు'అని కేటీఆర్ విమర్శించారు.

### ఉప ఎన్నికపై దృష్టి పెట్టండి

▶ మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ పలు సూచనలు చేశారు. ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న అభిప్రాయం, దానిని పార్టీకి అనువుగా మలుచుకోవాల్సిన తీరు.. తదితరాలపై దిశా నిర్దేశం చేశారు. కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరేందుకు వచ్చిన మణుగూరు ప్రాంత నాయకులు, కార్యకర్తలు కేసీఆర్‌ను కలిశారు. కాగా కవిత రాజీనామా, ప్రెస్‌మీట్‌కు సంబంధించి అంశాలపై కేసీఆర్ ఎలాంటి ప్రస్తావన చేయలేదని సమాచారం.

**బీఆర్‌ఎస్ ముఖ్య నేతల భేటీ..**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో బుధవారం తెలంగాణ భవన్‌లో ప్రత్యేక సమావేశం జరిగింది. ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, ముఠా గోపాల్, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, శంభీపూర్ రాజు, ఎల్.రమణ, మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, పార్టీ నేతలు ముఠా జైసింహ, ఆజం ఆలీలు ఈ భేటీలో పాల్గొన్నారు. అలాగే నియోజకవర్గంలోని డివిజన్‌ల అధ్యక్షులు, కార్పొరేటర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. నియోజకవర్గం పరిధిలోని ఓటరు జాబితాను డివిజన్‌లు, బూత్‌ల వారీగా లోతుగా పరిశీలించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. కాగా, డివిజన్లు, బూత్‌ల వారీగా మైనారిటీ విభాగం కమిటీలు ఏర్పాటు చేయాలని పార్టీ నేతలు కోరారు. త్వరలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన మరోమారు సమావేశం జరుగుతుందని ముఖ్యనేతలు వెల్లడించారు.

### కవిత విమర్శలు బాధాకరం: వేముల

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత చేసిన విమర్శలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఖండించారు. కేసీఆర్ నాయకత్వంలో.. తెలంగాణ ప్రజల అభ్యున్నతికి నిర్విరామంగా కృషి చేస్తున్న వ్యక్తి హరీశ్ రావని స్పష్టం చేశారు. ఆయనపై కవిత చేసిన ఆరోపణలు అసత్యాలని తెలిపారు. కేసీఆర్ వెన్నంటే ఉంటూ 25 సంవత్సరాలుగా నిస్వార్థంగా పార్టీ కోసం కృషి చేస్తున్న వ్యక్తి జోగినిపల్లి సంతోష్ కుమార్ అని పేర్కొన్నారు. అలాంటి వారి వ్యక్తిత్వం, అంకితభావంపై కవిత విమర్శలు చేయడం బాధాకరమని వ్యాఖ్యానించారు.

## ఇంత అధ్వానంగా ప్రభుత్వాన్ని నడుపుతారా?

**వ్యవసాయ రంగంపై టీడీపీ కూటమి సర్కార్ తీరును ఎండగట్టిన వైఎస్ జగన్**



సాక్షి, అమరావతి: రైతులకు గతంలో సులభంగా దొరికే బస్తా యూరియా కూడా ఇవ్వలేకపోతున్నారు.. ఇంత అధ్వానంగా ప్రభుత్వాన్ని నడుపుతారా..? అంటూ ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడును వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు. వ్యవసాయ రంగంపై టీడీపీ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఎండగట్టారు. రైతులను అన్ని విధాలా దగా చేశారని మండిపడ్డారు. వరుసగా పంటల ధరలు పతనమవుతున్నా, ఈ రెండేళ్లలో వరి, మిరప, పత్తి, జొన్న, కందులు, మినుములు, పెసలు, మొక్కజొన్న, సజ్జ, రాగులు, అరటి, చీనీ, కోకో, పొగాకు పంటలకు ధరల్లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ఈ ప్రభుత్వం ఏ రోజూ ఆదుకోలేదని నిప్పులు చెరిగారు. ఈ మేరకు బుధవారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

## హరీశ్‌రావుపై ఆరోపణలు ఎవరికి లాభం?

- నాడు హరీశ్‌ను పొగిడినవాళ్లే నేడు విమర్శిస్తున్నారు
- టీడీపీకి అనుకూలంగా సీఎం రేవంత్ మాట్లాడటం గర్హనీయం
- బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీకి సంపద లాంటి వ్యక్తి హరీశ్‌రావు అని, ఆయనను బలహీనపరిచేలా వ్యాఖ్యలు చేయడం తెలంగాణకే నష్టం కలిగిస్తాయని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావం సమయంలో జలదృశ్యంలో పార్టీ దిమ్మె కట్టించిందే హరీశ్‌రావు అని, ఏ పని చెప్పినా ఎదురు మాట్లాడకుండా ఆయన పనిచేశారని కొనియాడారు. తెలంగాణ భవన్‌లో బుధవారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, ముఠా గోపాల్, పార్టీ నేతలు ఆజం అలీ, ఇంతియాజ్ ఇసాక్‌లతో కలిసి నిరంజన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తూ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు.

**పార్టీ ఆవిర్భావం నుంచే హరీశ్‌రావు సేవలు**

టీఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచే పార్టీలో హరీశ్‌రావు కీలక నేతగా ఉన్నారని నిరంజన్‌రెడ్డి తెలిపారు. 'నాడు హరీశ్‌రావు పనితీరును పొగిడినవారే నేడు ఆరోపణలు చేస్తున్నారు. వారికి ఎలా మనసు ఒప్పుతుందో అర్థం కావడం లేదు. ఈటల రాజేందర్ పార్టీ నుంచి వెళ్లిపోవడంలో హరీశ్‌రావు పాత్ర లేదు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై శాసనసభలో కాంగ్రెస్ డొల్లతనాన్ని హరీశ్‌రావు ఎండగట్టారు. అలాంటి వ్యక్తిపై ఆరోపణలు చేయడమే కాకుండా, ఆయన సీఎం రేవంత్‌రెడ్డి కాళ్లు మొక్కారని చెప్పడం చాలా బాధగా అనిపించింది. పార్టీకి కష్టమొచ్చినప్పుడు ఆయన అండగా నిలబడ్డారు. ప్రభుత్వంలో ఏ శాఖను ఇచ్చినా సమర్థంగా పనిచేశారు. కాంగ్రెస్ వైఫల్యాలను సభలో, బయట ఎండగడుతున్నది హరీశ్‌రావు. ఆయన మీద ఆరోపణలు చేయడం ద్వారా ఎవరికి లాభం చేకూరుస్తున్నారు?'అని ప్రశ్నించారు. సంతోష్‌రావు ఎన్నడూ ప్రభుత్వంలో లేరని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా మాట్లాడటం గర్హనీయమని నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణలో ఇప్పుడు టీడీపీ లేదని రేవంత్‌రెడ్డి బాధపడుతున్నారని ఎద్దేవా చేశారు.

## బీఆర్‌ఎస్ హస్తగతానికి కుట్ర

▶ మొదటి పేజీ తరువాయి

సంతోష్‌కుమార్‌పై సంచలనాత్మక ఆరోపణలు చేశారు. ముఖ్యాంశాలు ఆమె మాటల్లోనే..

**మా కుటుంబం బాగుండటం వారికిష్టం లేదు..**

కేసీఆర్, కేటీఆర్‌తో నాది కుటుంబ, రక్త సంబంధం. పదవులు, పార్టీతో ముడిపడిన బంధం కాదు. కానీ పార్టీలో ఉంటూ డబ్బులు సంపాదించుకుని వ్యక్తిగత లబ్ధి పొందాలని భావించే వ్యక్తులకు మేము బాగుండటం ఇష్టం లేదు. మా కుటుంబం విచ్ఛిన్నమైతేనే వారికి అధికారం వస్తుంది కాబట్టి నన్ను బయటకు నెట్టారు. ఇది ఇంతటితో ఆగదు అని దైవ సమానులు కేసీఆర్‌కు విజ్ఞప్తి చేస్తున్నా.

**వారిళ్లల్లో బంగారం ఉంటే బంగారు తెలంగాణ అవుతుందా?**

నాకు జన్మనిచ్చి, ప్రాణభిక్ష పెట్టిన నా తండ్రి చిటికెన వేలు పట్టుకుని తెలంగాణ ఉద్యమంలోకి వచ్చిన నేను సామాజిక తెలంగాణ కోరుకోవడం కొందరికి నచ్చలేదు. హరీశ్‌రావు, సంతోష్ నాపై పనికట్టుకుని సామాజిక తెలంగాణ పేరిట పార్టీ పెడుతున్నట్లు ప్రచారం చేశారు. హరీశ్, సంతోష్ ఇళ్లల్లో బంగారం ఉంటే బంగారు తెలంగాణ అవుతుందా? నేను అక్రమ కేసుల్లో తీహార్ జైలులో ఐదు నెలలపాటు గడిపి బయటకు వచ్చిన తర్వాత 47 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ అనుమతితో గులాబీ కండువా కప్పుకుని అనేక ప్రజా సమస్యలు, అంశాలపై పోరాటం చేశా.

**వారిని ఎందుకు క్షమిస్తున్నారన్నదే నా ఆవేదన**

నా మీద జరుగుతున్న కుట్రల విషయంలో తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి చెప్పినా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించలేదు. మీ చెల్లి, మహిళా ఎమ్మెల్సీని అయిన నాపై కుట్రలు జరుగుతున్నాయంటే 'బేటా ఏమైంది?' అని నాకు ఫోన్ చేయరా? కేసీఆర్ నుంచి నేను స్పందన కోరుకోలేదు, కానీ మీరు స్పందించాలి కదా. రామన్నా.. నా మీద ఎవరేం చెప్పారో తెలియదు. నా ప్రాణం పోయినా కేసీఆర్, కేటీఆర్‌కు హాని జరగాలని కోరుకునే ఆడపిల్లను కాదు. ఎన్ని జన్మల పుణ్యముంటే కేసీఆర్ లాంటి తండ్రి నాకు దొరికాడు. కానీ పార్టీకి ద్రోహం చేస్తున్న వారిని ఎందుకు క్షమిస్తున్నారన్నదే నా ఆవేదన.

**రేవంత్‌తో అవగాహన వల్లే వారిపై కేసులు మాఫీ**

హరీశ్‌రావు, సంతోష్‌ల అవినీతి వల్లే మా నాన్న కేసీఆర్‌పై సీబీఐ విచారణ వచ్చింది. హైదరాబాద్–ఢిల్లీ విమాన ప్రయాణంలో సీఎం రేవంత్‌ను హరీశ్ కలిసి కాళ్లు పట్టుకున్న నాటి నుంచి మా కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు మొదలయ్యాయి. హరీశ్‌రావుకు సంబంధించిన పాల వ్యాపారం, రంగనాయక సాగర్ వద్ద భూ ఆక్రమణలు, మాజీ ఎంపీ సంతోష్‌పై మద్యం షాపుల కేసు తదితరాలన్నీ రేవంత్‌తో ఉన్న అవగాహన వల్లే తెరమరుగయ్యాయి. హరిత హారానికి నకిలీ కార్యక్రమం గ్రీన్ ఇండియా చాలెంజ్ పేరిట సినీ నటులను మోసపూరితంగా రప్పించి అటవీ భూములను కొల్లగొట్టేందుకు సంతోష్ ప్రయత్నించాడు.

**శ్రవణ్‌రావుతో కలిసి మా ఫోన్లు ట్యాప్ చేయించారు**

సాధారణ కుటుంబం నుంచి వచ్చిన సంతోష్ అనుచరుడు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మోకిలలో రూ.750 కోట్ల బ్లూఫిన్ విల్లా ప్రాజెక్టు చేస్తున్నారు. సంతోష్‌ను మరో ఎమ్మెల్సీ నవీన్‌రావు తన గురువుగా చెప్పుకుంటున్నాడు. ఏసీబీకి వీరి అడ్రస్‌లు దొరకడం లేదా? రేవంత్ ప్రభుత్వంపై బరిగిసి కొట్లాడుతున్నందుకే మా కుటుంబంపై కుట్రలు జరుగుతున్నాయి. శ్రవణ్‌రావుతో కలిసి హరీశ్‌రావు, సంతోష్.. నా సిబ్బందితో పాటు కేటీఆర్, కేసీఆర్ ఫోన్లను కూడా ట్యాప్ చేయించారు. హరీశ్, సంతోష్ మీతో బాగున్నట్లు నటించవచ్చు. కానీ వాళ్లు మన కుటుంబం, తెలంగాణ మంచి కోరుకునే వారు కాదు. వాళ్లను పక్కన పెట్టి కార్యకర్తలను అక్కున చేర్చుకుని ప్రజల్లోకి వెళ్తేనే పార్టీ బతికి బట్ట కడుతుంది.

**రామన్నా ఆరడుగుల బుల్లెట్‌తో జాగ్రత్తగా ఉండండి..**

ఈ రోజు నన్ను గాయపరిచిన ఆరడుగుల బుల్లెట్..రేపు కేసీఆర్, కేటీఆర్‌లో ఎవరిని గాయపరుస్తుందో? రామన్నా జాగ్రత్తగా ఉండండి. హంపిలో భేటీ అయిన కొందరు నేతలు అవమానకరంగా మాట్లాడి కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధమైన సందర్భంలో కేటీఆర్ చేతులు పట్టుకుని హరీశ్ బ్రతిమిలాడారు. అక్కడ మాట్లాడిన వారిని పార్టీ నుంచి బయటకు పంపారు. అందులో భాగంగానే ఈటల రాజేందర్ బయటకు వెళ్లారు. హరీశ్ వల్లే జగ్గారెడ్డి, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, రఘునందన్‌రావు, విజయశాంతి, విజయ రామారావు తదితరులు పార్టీ నుంచి బయటకు వెళ్లారు. దుబ్బాక, హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో హరీశ్ వల్లే బీఆర్‌ఎస్ ఓటమి పాలైంది.

**కొందరి ఒత్తిడి వల్లే సస్పెన్షన్**

పార్టీ ఉంటే ఎంత.. పోతే ఎంత? అని చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు. కంప్యూటర్‌లో బీఆర్‌ఎస్ హార్డ్‌వేర్ అయితే తెలంగాణ జాగృతి సాఫ్ట్‌వేర్. తెలంగాణ జాగృతి ద్వారా పార్టీ అభివృద్ధిలో నా కంట్రిబ్యూషన్ ఉంది. కేసీఆర్‌పై కొందరు ఒత్తిడి తెచ్చి నన్ను సస్పెండ్ చేయించారని నమ్ముతున్నా. కేసీఆర్ నిర్ణయాన్ని శిరసావహిస్తా. అయితే నా లేఖను లీక్ చేసిన వారిపై వంద రోజులు కావస్తున్నా ఎలాంటి చర్యలు లేవు. కేసీఆర్ సగం ఇడ్లీ తిన్నారనే సమాచారాన్ని కూడా లీక్ చేసే వ్యవస్థ అక్కడ ఉంది. నా కుటుంబంలో జరిగిన అనేక అంశాలు బయటకు చెప్పలేను. రాజకీయ అంశాలు మాత్రమే మాట్లాడుతున్నా. నిజానికి నా లేఖ లీక్ కానంత వరకు నేను మాట్లాడలేదు. భవిష్యత్తులో అవసరమైన మరిన్ని విషయాలు బయట పెడతా. హరీశ్‌రావు, సంతోష్ మేక వన్నె పులులు. వాళ్లను పార్టీలో కొనసాగిస్తే నష్టం జరుగుతుంది.

### ట్రబుల్ షూటర్ కాదు.. బబుల్ షూటర్

హరీశ్ టీఆర్‌ఎస్ ఆరంభం నుంచి లేరు. టీడీపీ నుంచి కేసీఆర్ రాజీనామా చేసి బయటకు వస్తున్న సమయంలో రూ.కోటిన్నరతో వ్యాపారం చేసుకునేందుకు వెళ్లారు. 10 నెలల తర్వాత తిరిగి వచ్చిన హరీశ్‌ను క్షమించిన కేసీఆర్.. ఆయన ఎమ్మెల్యే కాకమునుపే మంత్రి పదవి ఇచ్చారు. హరీశ్‌రావు ట్రబుల్ షూటర్ కాదు.. బబుల్ షూటర్. ఆయనే ట్రబుల్స్ సృష్టించి వాటిని పరిష్కరించినట్లు చెప్పుకుంటారు.

### కేసీఆర్, కేటీఆర్‌ను ఓడించాలని హరీశ్ చూశారు

2018 అసెంబ్లీ ఎన్నికల్లో హరీశ్‌రావు 25 మంది ఎమ్మెల్యేలకు పార్టీ నిధితో పాటు అదనపు నిధులు కూడా ఇచ్చారు. కాళేశ్వరం అవినీతిలో సంపాదించిన సొమ్ముతో తన మనుషులు కొందరు ఎమ్మెల్యేలుగా ఉండాలనుకున్నారు. 2009లో కేటీఆర్‌ను ఓడించేందుకు హరీశ్ రూ.60 లక్షలు పంపారు. కేసీఆర్‌ను కూడా గజ్వేల్‌లో ఓడించాలని చూశారు. నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో ఎమ్మెల్యేలను ప్రభావితం చేసి నన్ను ఓడించారు. ఇలాంటి వారిని పక్కన పెట్టుకుని నన్ను బయటకు పంపితే పార్టీ బాగు పడుతుందా?

### ఏ పార్టీలోనూ చేరడం లేదు..

నేను ఏ పార్టీలోనూ చేరడం లేదు. తెలంగాణ జాగృతి కార్యకర్తలు, మేధావులు, బీసీలు, సామాజిక తెలంగాణ కోసం పనిచేసే వారితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటా. మా తల్లికి దూరంగా ఉండాల్సి రావడమే బాధాకరం. రాఖీ పండుగ ముందు మెసేజ్ పెట్టినా రామన్న బిజీగా ఉండటంతో కుదరలేదు. కేసీఆర్ ఆరోగ్యాన్ని, పార్టీని కాపాడుకుంటూ ప్రజా సమస్యలపై ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని కోరుకుంటున్నా.

## ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా

**బీఆర్‌ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి కూడా**

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన కల్వకుంట్ల కవిత నిజామాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. స్పీకర్ ఫార్మాట్‌లో ఏక వాక్యంతో రాసిన రాజీనామా లేఖను తన అనుచరుల ద్వారా శాసన మండలి చైర్మన్ కార్యాలయంలో అందజేశారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఆయన కార్యాలయంలో ఓఎస్‌డీకి రాజీనామా లేఖను అందజేశారు. గుత్తా సుఖేందర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి తన రాజీనామాను ఆమోదించాల్సిందిగా కవిత కోరారు. అయితే తాను అందుబాటులో లేనని గురువారం మరోమారు ఫోన్‌లో మాట్లాడి రాజీనామా ఆమోదంపై నిర్ణయం తీసుకుంటానని కవితకు సుఖేందర్‌రెడ్డి తెలిపారు. మరోవైపు బీఆర్‌ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన కవిత తన రాజీనామా లేఖను పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌కు పంపించారు. రాజీనామా లేఖను తెలంగాణ జాగృతి నాయకులు పార్టీ ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. రాజీనామా లేఖ అందినట్లు తెలంగాణ భవన్ కార్యదర్శి సంతకం చేసి రశీదును అందజేశారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 4-9-2025



జాతీయ పోషకాహార వారోత్సవాలు

# ఫుడ్ ఫర్ టీన్స్



పిల్లల విషయంలో పెద్దవారికి ఒక రకమైన ఆందోళన ఉంటే... కాస్త పెద్ద పిల్లల విషయంలో ఇంకో రకమైన ఇబ్బందులు ఉంటాయి. అంటే పదేళ్లు దాటి టీనేజ్‌లో ఉండే పిల్లల్లో మరికొన్ని సమస్యలు చూస్తుంటాం. ఈ రోజుల్లో అయితే టీనేజ్ పిల్లల్లో ఆందోళన, మానసిక ఒత్తిడి, అధికంగా కోపం, డిప్రెషన్ వంటివి తరచూ వింటున్నాం. వారు తినే ఆహారపు ప్రభావం మానసిక, శారీరక స్థితిపైన చూపుతుంది. అందుకని, టీనేజ్ పిల్లలున్న ఇంట్లో పోషకాహారం పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలి.

13–19 ఏళ్ల మధ్య ఫిజికల్, మెంటల్ గ్రోత్ వేగంగా మార్పు చెందుతుంటుంది. ఇలాంటప్పుడు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎమ్ఆర్) కొన్ని సాధారణ సూచనలు చేసింది. వాటి ఆధారంగా పోషకాహారాన్ని ఈ వయసు పిల్లలకు సరైన మొత్తంలో ఇవ్వాలి. అలాగే, ఆ ఆహారం మనసుకు సంతృపినిచ్చేలా ఉండాలి.

టీనేజ్ పిల్లల బరువు, ఎత్తు, చేసే పనులు.. ఇవన్నీ దృష్టిలో నిపుణుల సలహాతో సమతుల ఆహారాన్ని ప్లాన్ చేసుకోవచ్చు. ఎక్కువ మొత్తంలో కాకుండా రోజులో 5–6 సార్లు సమయాన్ని బట్టి పైన టేబుల్‌లో ఇచ్చిన హెల్తీ ప్లేట్‌ను తయారుచేసుకోవచ్చు.

### బ్రేక్‌ఫాస్ట్
కప్పు గోధుమ ఉప్మా /దోసె – 2 / కిచిడీ – కప్పు / రాగి రొట్టె – 2 –3 / ఇడ్లీ – 2–3 + కప్పు సాంబార్ + ఉడికించిన గుడ్డు లేదా ఆమ్లేట్ + కొద్దిపాటి గింజలు.

### ఉదయం స్నాక్స్
పండు (ఆపిల్ లేదా అరటి లేదా నారింజ) + కొద్దిగా డ్రైఫ్రూట్స్ / పల్లీ చిక్కీ / వేపిన శనగలు / వేయించిన అవిసెగింజలు / డ్రై ఫ్రూట్ బార్ / ఉడికించిన వేరుశెనగ

### మధ్యాహ్న భోజనం
అన్నం – 1 కప్పు లేదా గోధుమ రొట్టె – 2–3 / తృణ ధాన్యాలు – 1 కప్పు + ఆకుకూరలు – 1 కప్పు + మిక్స్‌డ్ వెజిటబుల్స్ – 1 కప్పు + చికెన్ బ్రెస్ట్ – 100 గ్రా / గుడ్డు – 1 / పనీర్ – 100 గ్రా / చేప – 100–120 గ్రా. + పెరుగు – 1 కప్పు

### సాయంత్రం స్నాక్స్
మొలకెత్తిన గింజలు, విత్తనాలు – 30 గ్రా + చియా సీడ్స్ + నిమ్మ రసం/ పాలు/ పండు జ్యూస్ లేదా సూప్.

### రాత్రి భోజనం
మధ్యాహ్న భోజనం మాదిరి గానే + గ్రిల్ చేసిన చికెన్ బ్రెస్ట్ అన్నంతో లేదా రొట్టెతో + కూరగాయలు + ఉడికించిన బ్రొకోలీ

| | |
|---|---|
| కిలో కేలరీలు : అబ్బాయిలకు 2200–3200 : అమ్మాయిలకు 1800 – 2500 | |
| ప్రొటీన్లు : అబ్బాయిలకు – 52 గ్రా. : అమ్మాయిలకు – 46 గ్రా. | |
| కొవ్వులు (Fat) : 25–35% | |
| కార్బోహైడ్రేట్స్ : 45–65% | |
| విటమిన్–ఎ : 600–900 మైక్రోగ్రాములు | |
| విటమిన్ – సి : 45–75 మి.గ్రా | |
| కాల్షియం : 1300 మి.గ్రా | నీళ్లు – 8 నుంచి 12 గ్లాసులు |



– డా. సుజాతా స్టీఫెన్, న్యూట్రిషనిస్ట్

### ఫుడ్ గ్రూప్స్, పరిమాణం

| | |
|---|---|
| ఏదైనా పండు | – 1 రోజుకు 2–3 సర్వింగ్స్ |
| కూరగాయలు | – రోజుకు 3–5 సర్వింగ్స్ (ఉడికించినవి లేదా వండినవి) |
| ధాన్యంతో వండినవి | – రోజుకు 6 – 8 సర్వింగ్స్ (1 సర్వింగ్ – ½ కప్పు ఉడికిన అన్నం/సిరిధాన్యం/గోధుమ) |
| డెయిరీ ఉత్పత్తులు | – రోజుకు 2 – 3 కప్పులు (పాలు, పెరుగు, చీజ్ రూపంలో) |
| ఆరోగ్యకరమైన కొవ్వులు | – రోజుకు 1 టేబుల్ స్పూన్ (నూనె, గింజలు, విత్తనాలు మొదలైనవి) |
| ప్రొటీన్ ఆహారం | – మాంసం, గుడ్డు మొదలైనవి (1 సర్వింగ్) |

● మన(సు)లో మాట

## తీవ్ర మనోవ్యాధికి సంజీవని!

మేము కోయంబత్తూరులో సెటిల్ అయిన తెలుగు వాళ్లము. మా అబ్బాయి బీటెక్ తర్వాత ఎం. ఎస్. కోసం సంవత్సరం క్రితం అమెరికాకు వెళ్లాడు. మొదట 6 నెలలు బాగానే ఉన్నాడు. తర్వాత అతని ఆలోచనలు, ప్రవర్తనలు మారాయి. అమెరికాలో ఉన్న పోలీసులు, గూఢాచారులు తనని వెంబడిస్తున్నారని తన మెదడు మీద, ఎలాన్ మస్క్, ట్రంప్ ప్రయోగాలు చేస్తున్నారని అనుమానంతో భయపడుతూ– ఉండేవాడు. ఆ ప్రవర్తన ఎక్కువై బాగా చికాకు చేస్తే అక్కడే ఉండే మా చుట్టాలు 6 నెలల క్రింద ఇండియాకు పంపించారు. ఎయిర్ పోర్టులో దిగాక నేరుగా చెన్నైలో ఒక ఆస్పత్రిలో అడ్మిట్ చేశాము. 'స్కిజోఫ్రినియా' లక్షణాలు ఎక్కువగా ఉన్నాయని, బాగా అగ్రెసివ్‌గా, సూసైడల్ ఆలోచనలతో ఉన్నాడని అక్కడి డాక్టర్లు ఇ.సి.టి. ట్రీట్మెంట్ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. మా ఫ్యామిలీ డాక్టర్‌ని అడిగితే ఆయన ఇ.సి.టి. వల్ల మెదడు దెబ్బతింటుంది, భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని చెప్పారని, మేము ఆ ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ చేసి వేరే హాస్పిటల్‌కి తీసుకెళ్లాము. పెద్దగా ఫలితం కనిపించకపోయేసరికి ఇంగ్లీష్ వైద్యం కాకుండా వేరేవైద్యానికి వెళ్లాము. చాలా రోజులు ఆ మందులు వాడినా ఎలాంటి మార్పూ లేదు. దయచేసి మాకు ఏదైనా మంచి దారి చూపగలరు.

**– సోమలింగేశ్వరరావు,** కోయంబత్తూరు

చాలామందిలో అంతర్గతంగా ఉండే ఇలాంటి సమస్యను సాక్షి ద్వారా తెలియజేసినందుకు మీకు నా అభినందనలు. మీ అబ్బాయికి వచ్చిన స్కిజోఫ్రీనియా వ్యాధి వలన ఎంతగా సంఘర్షణకి గురయ్యారో అర్థం అవుతోంది. ముందుగా మీరు అర్థం చేస్కోవాల్సింది, మెదడులో వచ్చే కొన్ని రసాయనిక మార్పుల వల్లనే ఇలాంటి మానసిక సమస్యలు వస్తాయని, అవి తగ్గాలంటే ఆ రసాయనాలని సాధారణ స్థితికి తీసుకురావాలనీ మానసిక వైద్యులు మొదటిగా మందులు, కౌన్సెలింగ్ ద్వారా మార్పులు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తారు.

అయితే కొన్నిసార్లు ఆ సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు లేదా పేషెంటుకి ఆత్మహత్య ఆలోచనలు, జబ్బువల్ల ఇతరులకు హాని చేసేంత ఆవేశం, కోపం, ఉన్నప్పుడు, మందులు పని చేయడానికి చాలా సమయం పట్టొచ్చు: అలాంటప్పుడు పేషెంటుకి కుటుంబ సభ్యులకి జరిగే నష్టం ఎక్కువ. దీన్ని నివారించడం కోసం అత్యంత వేగంగా. ప్రభావ వంతంగా పనిచేసే ఒక సంజీవని లాంటి వైద్య విధానమే' ఇ.సి.టి. ఎలక్ట్రో కన్వల్సివ్ థెరపీ. అంతమంచి చికిత్స విధానాన్ని వాడుక భాషలో 'షాక్ ట్రీట్మెంట్' అంటారు. అదే అన్ని సమస్యలకి, అపోహలకి కారణం అయింది. దీనివల్ల మనిషికి ప్రాణహాని అని లేదా నరాలు చచ్చుబడి, సంసారానికి పనికి రారు అని అనేక అపోహలు, సాధారణ ప్రజలతో పాటు, కొంత మంది వైద్యుల్లో కూడా ఉన్నాయి. మన శరీరంలో ఇతర జ్ఞానేంద్రియాలు, కండరాలు ఇతర వ్యవస్థలన్ని పనిచేయడానికి మెదడులో ఉత్పత్తి అయ్యే కరెంట్ చాలా ముఖ్యం. దాన్ని మార్చడం ద్వారా మెదడులోని రసాయనాల అసమతుల్యాను కూడా సరి చేయవచ్చు. ఒక రకంగా చెప్పాలంటే ఫోన్ లేదా కంప్యూటర్ కి వైరస్ వచ్చి పని చేయక పోతే రీసెట్ ' బటన్ నొక్కి దాన్ని పనిచేసే కండిషన్‌కి ఎలా తీసుకు వస్తామో ఇ.సి.టి. కూడా మెదడుని అలాగే రీసెట్ చేస్తుంది. దీనివల్ల దీర్ఘకాలికంగా ఎలాంటి సమస్యలు వస్తాయని ఇప్పటి వరకు ఎలాంటి శాస్త్రీయ పరిశోధనా తేల్చలేదు. ఒక పేషెంట్ అన్ని రకాలుగా శారీరకంగా ఫిట్‌గా ఉంటేనే ఇ.సి.టి. చికిత్స చేస్తారు. మీ అబ్బాయిని పరీక్షించిన డాక్టరు అన్ని పరీక్షలు చేసి ఎలాంటి ఇబ్బంది లేకపోతేనే ఇ.సి.టి. ట్రీట్మెంట్ గురించి చెప్పి ఉంటారు. కాబట్టి ఎలాంటి అపోహలు, భయాలు లేకుండా చికిత్స ఇప్పించి, మీ వాడి జబ్బు లక్షణాలను తొందరగా తగ్గించుకోండి.

మీ అలాగే వాళ్ళు చెప్పినన్ని రోజులు మందులు వాడితే జబ్బు మళ్ళీ తిరగబెట్టకుండా ఉంటుంది. ఆల్ ది బెస్ట్ !




**డా. ఇండ్ల విశాల్ రెడ్డి**,సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన
మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● బయోపిక్

# వెండితెరపై కశ్మీర్ కోయిల

మనకు ఎం.ఎస్. సుబ్బులక్ష్మి తెలుసు.
మహనీయ కర్నాటక సంగీత విద్వాంసురాలు.
లతా మంగేష్కర్ తెలుసు. సినీ సంగీతానికి రారాణి.
కాని రాజ్ బేగం తెలియదు.
ఆమె వీరిద్దరి కాలం నుంచే పాడుతోంది.
వీరితో సమానంగా కశ్మీర్ ప్రజల జేజేలు అందుకుంది.
కశ్మీర్ కోయిల బిరుదు అందుకుంది.
కాని ఆమె దేశానికి తెలియడానికి ఇంత కాలం పట్టింది.
అదికూడా ఇప్పుడు ఆమె జీవితం ఆధారంగా తీసిన 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్' సినిమా అమేజాన్‌లో విడుదల అయ్యాక.




**1950ల** కాలం ఊహించండి.

కశ్మీర్ పర్వత ప్రాంతం. అక్కడివన్నీ గిరిజన సంప్రదయాలు. కశ్మీర్‌కే తనదైన గొప్ప సంగీతం, గానం, వాయిద్యం, కవిత్వం, గీతం... ఉన్నాయి. అక్కడ కశ్మీరీ భాషలో ఎంతో మంచి సాహిత్యం ఉంది. కాని అక్కడ ఉర్దూ, హిందీ కూడా వాడుకలో ఉంది. నిరంతరం ఏదో ఒక అలజడికి లోనయిన ఆ ప్రాంతంలో స్త్రీలు ఏ పనిలో అయినా ముందుకు రావడం కష్టంగా ఉండేది. వారి కళ కూడా నాలుగ్గోడల మధ్యే తప్ప బహిరంగం కావడానికి లేదు.

ఈ నియమాన్ని బ్రేక్ చేసిన గాయని రాజ్‌బేగం.

1927లో శ్రీనగర్‌లో జన్మించిన రాజ్‌బేగం బాల్యంలోనే పాటను గ్రహించింది. అది అక్కడ కురిసే మంచులా ఆమెలో సహజంగా ఉద్భవించింది. గిరిజన గీతాలు, జానపద పాటలు పెళ్లిళ్లలో పాడటం మొదలు పెట్టింది. 1950లలో ఆమె మొదటిసారి ఆల్ ఇండియా రేడియో కశ్మీర్ స్టేషన్‌లో పాడింది. మరో నాలుగేళ్లకు అదే రేడియోలో స్టాఫర్ అయ్యింది. ఆ తర్వాత బహిరంగ వేదికల మీద పాడసాగింది. తన జీవిత కాలంలో కనీసం రెండు వేల పాటలు ఆమె పాడింది. అయితే దురదృష్టవశాత్తు ఏ పాట రికార్డింగూ అందుబాటులో లేదు. కశ్మీర్ సంగీతానికి ఆమె చేసిన సేవకు 2002లో 'పద్మశ్రీ' దక్కినా ఆమెకు రావాల్సిన ఖ్యాతి రాలేదు. 2016లో రాజ్ బేగం మరణించింది. జనం ఆమెను అక్కడ నిత్యం తలుచుకుంటూనే ఉంటారు. దేశానికి ఆమె పేరు చేరలేదు. కశ్మీర్‌లో పుట్టి పెరిగి అమెరికాలో చదువుకొని వచ్చిన అక్కడే స్థిరపడ్డ దర్శకుడు డానిష్ రెంజు ఆమె బయోపిక్‌ను తీసే అవకాశం పొందగలిగాడు. రాజ్ బేగం జీవితాన్ని, సంగీతాన్ని 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్'గా తీశాడు. అమేజాన్‌లో ఆ సినిమా ఆగస్టు 29 నుంచి స్ట్రీమ్ అవుతూ విమర్శకుల ప్రశంసలు పొందుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయ సంగీత అభిమానుల మెప్పు అందుకుంటోంది. దర్శకుడు ఫర్హాన్ అఖ్తర్ ఈ సినిమాకు ఒక నిర్మాత కావడం విశేషం.

***

'అమ్మా... దేవుడు స్త్రీలను పుట్టించింది కేవలం పెళ్లి కోసం కాదు' అని తన యవ్వన కాలం నుంచి తిరగబడుతూ తన దారిని నిర్మించుకుంటుంది రాజ్ బేగం 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్' సినిమాలో. పెళ్లిళ్లలో పాడుతూ గుర్తింపు పొందిన రాజ్ బేగం రేడియో కశ్మీర్‌లో ఆడిషన్ ఇవ్వడానికి వెళితే అక్కడంతా అబ్బాయిలే ఉండి 'సువ్వొచ్చావ్ ఏంటి' అన్నట్టుగా చూస్తారు. అయినా వారిని ఎదిరించి ఆడిషన్ ఇచ్చి ఎంపికవుతుంది రాజ్ బేగం. అయితే స్థానిక పరిస్థితుల దృష్ట్యా ఆమె తన సొంత పేరును చెప్పుకోవడానికి వీలుండదు. 'నూర్ బేగం' పేరుతో రేడియోలో పాడుతుంది. ఇది కొన్నాళ్లకు తెలిసి ఆమె ఊరి వాళ్లు తీవ్రంగా వ్యతిరేకిస్తారు. ఆడపిల్ల ఇలా మగవాళ్లుండే చోటుకు వెళ్లి పాడటం ఏంటని రాళ్లతో కొడతారు. బహిరంగ వేదికల మీదకు రాకుండా చూస్తారు. రాజ్ బేగం ఇవన్నీ తట్టుకుని తన పాటను జనం వద్దకు తీసుకువెళుతుంది. ఏ జనమైతే ముందు వ్యతిరేకించారో వారంతా ఆమె అభిమానులుగా మారతారు. ఆమెను తమ ప్రాంతపు సాంస్కృతిక రాయబారిగా చేసుకుంటారు. ఆమె పాటలకు పరవశిస్తారు. తన జీవితంలో వేల కొలది పాటలు పాడి రాబోయే తరాలకు స్ఫూర్తినిచ్చింది రాజ్ బేగం. ఆమె వేసిన దారిలో ఇవాళ ఎందరో కశ్మీర్ గాయనులు పాటలు పాడుతున్నారు. రాజ్ ఎదుర్కొన్న వ్యతిరేకత వీరికి లేదు.



'సాంగ్స్ ఆఫ్ పారడైజ్'లో యంగ్ రాజ్ బేగంగా సబా ఆజాద్, వృద్ధ రాజ్ బేగంగా సోని రాజ్‌దాన్ (ఆలియా భట్ తల్లి) నటించారు. సినిమా హిందీ భాషలో సాగినా పాటలు కశ్మీర్ సువాసనలతో ఉంటాయి. కశ్మీర్ జీవితం, సంప్రదాయాలు, మాటా, వరుస... అన్నీ ఈ సినిమాలో కనిపిస్తాయి.

ఇన్నాళ్లకు కశ్మీర్ సినిమా ఒకటి వచ్చింది.

అది ఒక గాయని గురించి కావడం సంతోషపడవలసిన సంగతి.

కళ మరణించదని మరో సారి నిరూపితమైంది.



● పద్మశ్రీ అందుకుంటున్న రాజ్ బేగం

● పేరెంటింగ్

## ఒక హీరో గురించి...

పిల్లలకు ఎప్పుడూ బడి పాఠాలే కాదు బతుకు పాఠాలు, నైతిక విలువల గురించి కూడా చెప్పాలి. అదే నిజమైన పేరెంటింగ్. ఒక తండ్రి తన పిల్లాడికి సులువైన భాషలో మంచీచెడుల గురించి చెప్పిన మాటలు నెటిజనులకు తెగ నచ్చాయి.

ఫైనాన్షియల్ సర్వీసెస్ 'మైఫండ్‌బాక్స్' సీయీవో అనూజ్ పాల్...

'నీ గురించి స్కూల్‌లో ఏమైనా ఫిర్యాదులు ఉన్నాయా?' అని తన చిన్నారిని అడిగాడు.



'నేను ఒకరిని కొట్టాను' అన్నాడు అద్విక్.

'ఎవరిని కొట్టావు? ఎందుకు కొట్టావు?' అని అడిగిన తండ్రి... 'ఒక అమ్మాయిని అలా కొట్టవచ్చా?

నువ్వు ఆ అమ్మాయి వస్తువు లాగేసుకున్నావు. ఇతరుల వస్తువులు అలా లాక్కోవచ్చా? మీ క్లాస్‌మేట్స్ ఇద్దరు కలిసి నిన్ను కొట్టారనుకో, నీకు బాధగా అనిపించదా? వాళ్లు చేసింది తప్పు అనిపించదా... ఇది సరే, నువ్వు భవిష్యత్‌లో ఏం కావాలనుకుంటున్నావు? హీరో అవుతావా? విలన్ అవుతావా?' అని అడిగాడు అనూజ్.

'హీరో' అని జవాబు చెప్పాడు అద్విక్.

'తప్పు చేసినప్పుడు సారీ చెప్పేవారే నిజమైన హీరోలు. మరి నువ్వు సారీ చెబుతావా?' అని అడిగాడు తండ్రి. అద్విత్ ఆ అమ్మాయికి 'సారీ' చెప్పాడు! ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది.

● టెక్నో ఉమెన్

## ఛాయా చిత్రం



'మెటా'లో దశాబ్దకాలం పాటు పనిచేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్పెషలిస్ట్ ఛాయ నాయక్ తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ 'ఓపెన్ ఏఐ'లో చేరింది. ఓపెన్ ఏఐలో ఆమె 'స్పెషల్ ఇనిషియేటివ్స్' టీమ్‌లో పనిచేయనుంది.

'సరియైన సమయంలో సరియైన నిర్ణయం' అని కంపెనీ మార్పు గురించి స్పందించింది ఛాయ. మహారాష్ట్రలోని పుణేకు చెందిన ఛాయ నాయక్ సెక్యూరిటీ, పీస్ స్టడీస్‌లో డిగ్రీ చేసింది. యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో పబ్లిక్ పాలసీ, డాటా సైన్స్‌లో మాస్టర్స్ ప్రోగ్రామ్ చేసింది. పుణేలో'పాత్‌వేస్ టు ఎంపవర్‌మెంట్'లో ప్రాజెక్ట్ మెనేజర్‌గా ఉద్యోగజీవితాన్ని ప్రారంభించింది. ఎన్విరాన్‌మెంటల్ సస్టెయినబిలిటీ కార్యాలయం(యూఎస్)లో జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ స్పెషలిస్ట్‌గా పనిచేసింది. 'ది ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఫ్యూచర్'లో కన్సల్టెంట్‌గా, యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో గ్రాడ్యుయేట్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసిన ఛాయ ఆ తరువాత డాటా–డ్రైవన్, సోషల్ ఇంపాక్ట్ ప్రాజెక్ట్‌లపై దృష్టి పెట్టింది. 'మెటా'లో 'డాటా ఫర్ ఇనిషియేటివ్' హెడ్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించింది. ఫేస్‌బుక్‌లో ఓపెన్ రీసెర్చ్ అండ్ ట్రాన్స్‌పరెన్సీ(ఫోర్ట్) హెడ్‌గా పనిచేసింది. 'ఓపెన్ ఏఐ'లోకి రావడానికి ముందు ఫేస్‌బుక్‌లో జనరేటివ్ ఏఐ ప్రాజెక్ట్ మెనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా పనిచేసింది. 'మెటాలోని తొలి రోజులు నిన్నా మొన్నా జరిగినట్లే అనిపిస్తున్నాయి. మెటాలో పని చేసిన అనుభవం నా కెరీర్‌కు గట్టి పునాది వేసింది' అంటుంది ఛాయ. 'నా ప్రయాణం ఆగిపోలేదు. పుస్తకంలో ఒక పేజీని తిప్పాను. అంతే!' అని లింక్‌డ్ ఇన్ పోస్ట్‌లో కంపెనీ మార్పు గురించి రాసింది ఛాయానాయక్.

● డిజిటల్ అలర్ట్

## అలా... ఆమె ప్రాణాలు కాపాడారు!



ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలికి చెందిన అమ్మాయి ఒకరు 'నేను ఆత్మహత్య చేసుకోబోతున్నాను' అని అర్ధరాత్రి దాటిన తరువాత ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది. 'మెటా' వెంటనే ఈ పోస్ట్‌ను స్టేట్ పోలీస్ మీడియా సెంటర్‌కు పంపి పోలీసులను అలర్ట్ చేసింది. కేవలం పదహారు నిమిషాల వ్యవధిలో ఒక సబ్–ఇన్‌స్పెక్టర్, కొందరు మహిళా పోలీసులు ఆ అమ్మాయి ఉన్న ఇంటికి చేరుకున్నారు. వాంతులు చేసుకున్న ఆ అమ్మాయి నిస్తేజంగా పడి ఉంది. వెంటనే ఆమెను హస్పిటల్‌కు తీసుకువెళ్లారు.

సమయానికి ఆస్పత్రికి తీసుకురావడం వల్ల ఆ అమ్మాయి చావు నుంచి బయటపడింది. ఆమె కోలుకున్న తరువాత... 'ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నావు?' అని అడిగితే... తాను ప్రేమించిన వ్యక్తి మాట్లాడడం మానేశాడని, తన ఫోన్ నంబర్ బ్లాక్ చేశాడని...ఇలా చెప్పుకుంటూ పోయింది.

పెరుగుతున్న ఆన్‌లైన్ సూసైడ్ అటెంప్ట్స్‌ను దృష్టిలో పెట్టుకొని ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు, మెటా భాగస్వామ్యంతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో సుసైడ్–రిలేటెడ్ పోస్ట్‌లపై నిఘా పెడుతున్నారు. వెంటనే రంగంలోకి దిగుతున్నారు. జనవరి 1, 2023 నుంచి ఆగస్ట్ 25, 2025 వరకు 1,315 మంది ప్రాణాలను కాపాడారు.

**బులియన్**
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
సెప్టెంబర్ 3న ముగింపు రూ.లలో

| | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | రాజమండ్రి | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|---|
| బంగారం (24 క్యారెట్లు) | 1,06,810 | 1,08,950 | 1,06,970 | 1,08,950 | 1,07,200 | 1,06,960 |
| బంగారం (22 క్యారెట్లు) | 99,890 | 98,050 | 98,050 | 1,00,990 | 98,620 | 98,050 |
| వెండి | 1,27,000 | 1,26,300 | 1,37,000 | 1,26,300 | 1,26,000 | 1,37,000 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## తొలిసారి 'గ్రాండ్‌స్లామ్' టోర్నీ క్వార్టర్ ఫైనల్లో యూకీ బాంబ్రీ

భారత టెన్నిస్ డబుల్స్ నంబర్‌వన్ యూకీ బాంబ్రీ తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీ డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. న్యూయార్క్‌లో జరుగుతున్న యూఎస్ ఓపెన్ టోర్నీలో మైకేల్ వీనస్ (న్యూజిలాండ్)తో జతకట్టి పురుషుల డబుల్స్ విభాగంలో ఆడుతున్న యూకీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో 14వ సీడ్ యూకీ-వీనస్ ద్వయం 6-4, 6-4తో నాలుగో సీడ్ కెవిన్ క్రావిట్జ్-టిమ్ పుయెట్జ్ (జర్మనీ) జంటను ఓడించింది. 83 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో-కివీస్ జోడీ నాలుగు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థుల సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. క్వార్టర్ ఫైనల్లో 11వ సీడ్ రాజీవ్ రామ్ (అమెరికా)-నికోలా మెక్‌టిక్ (క్రొయేషియా)లతో యూకీ-వీనస్ తలపడతారు. మరోవైపు జూనియర్ విభాగంలో భారత ప్లేయర్ల పోరాటం ముగిసింది. బాలికల సింగిల్స్ రెండో రౌండ్‌లో మాయ రాజేశ్వరన్ 7-6 (7/1), 4-6, 3-6తో రెండో సీడ్ హనా క్లుగ్‌మన్ (బ్రిటన్) చేతిలో ఓడిపోయింది. డబుల్స్ తొలి రౌండ్‌లో మాయ (భారత్)-సినెల్లి (అర్జెంటీనా) జోడీ 2-6, 2-6తో జెలీనా (బెల్జియం)-లైమా (లిథువేనియా) జంట చేతిలో ఓటమి పాలైంది.



# భారత్‌ను ఆదుకున్న మన్‌దీప్

### కొరియాతో 'సూపర్-4' మ్యాచ్‌ను 'డ్రా' చేసుకున్న టీమిండియా



**రాజ్‌గిర్ (బిహార్):** లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన భారత పురుషుల హాకీ జట్టుకు ఆసియా కప్‌లో తొలిసారి గట్టిపోటీ ఎదురైంది. డిఫెండింగ్ చాంపియన్ దక్షిణ కొరియా జట్టుతో బుధవారం జరిగిన 'సూపర్-4' దశ మ్యాచ్‌ను భారత్ 2-2 గోల్స్‌తో 'డ్రా'గా ముగించింది. మ్యాచ్ ముగియడానికి ఏడు నిమిషాలు ఉన్నాయనగా మన్‌దీప్ సింగ్ గోల్ చేసి భారత్‌ను ఓటమి బారి నుంచి తప్పించాడు. గోల్స్ చేసేందుకు వచ్చిన పలు అవకాశాలను వృథా చేసుకున్న భారత జట్టు చివరకు విజయం బదులు 'డ్రా'తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఎనిమిదో నిమిషంలో హార్దిక్ సింగ్ చేసిన గోల్‌తో భారత్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే కొరియా జట్టు రెండు నిమిషాల తేడాలో రెండు గోల్స్ చేసి భారత్‌కు షాక్ ఇచ్చింది. 12వ నిమిషంలో జిహూన్ యాంగ్ గోల్‌తో స్కోరును 1-1తో సమం చేసిన కొరియా... 14వ నిమిషంలో హైయోన్‌హాంగ్ కిమ్ గోల్‌తో 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఒకదశలో భారత్‌కు ఓటమి తప్పదేమోనని అనిపించినా... 53వ నిమిషంలో మన్‌దీప్ సింగ్ గోల్ చేసి భారత్‌ను ఆదుకున్నాడు. ఈ మ్యాచ్‌లో భారత్ తమకు లభించినా ఆరు పెనాల్టీ కార్నర్‌లను వృథా చేసుకుంది. అంతకుముందు చైనాతో జరిగిన మరో 'సూపర్-4' మ్యాచ్‌లో మలేసియా 2-0తో గెలిచింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో కొరియాతో చైనా; మలేసియాతో భారత్ తలపడతాయి.

# పుణేరి పల్టన్ 'హ్యాట్రిక్'

### బెంగాల్ వారియర్స్‌పై ఘన విజయం • 'టైబ్రేక్'లో నెగ్గిన హరియాణా స్టీలర్స్



**విశాఖ స్పోర్ట్స్:** ప్రొ కబడ్డీ లీగ్ 12వ సీజన్‌లో మాజీ చాంపియన్ పుణేరి పల్టన్ వరుసగా మూడో విజయంతో 'హ్యాట్రిక్' నమోదు చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 45-36తో బెంగాల్ వారియర్స్ జట్టుపై నెగ్గింది. కెప్టెన్, ఆల్‌రౌండర్ అస్లామ్ ఇనామ్‌దార్, రెయిడర్ ఆదిత్య షిండే పుణేరి విజయంలో కీలక పాత్ర పోషించారు. వీరిద్దరు చెరో 11 పాయింట్లు స్కోరు చేయగా... పంకజ్ మోహితే, విశాల్ చెరో 5 పాయింట్లు సాధించారు. తొలి అర్ధభాగం ముగిసేసరికి పుణేరి 26-22తో స్వల్పంగా ముందంజలో నిలిచింది. రెండో అర్ధ భాగంలోనూ పల్టన్ తమ జోరును కొనసాగించింది. రెండో 'ఆలౌట్'తో ఆ జట్టు మ్యాచ్‌పై పట్టు బిగించింది. బెంగాల్ తరఫున కెప్టెన్ దేవాంక్ ఒక్కడే 17 పాయింట్లు స్కోరు చేసినా లాభం లేకపోయింది. హరియాణా స్టీలర్స్, యు ముంబా మధ్య జరిగిన రెండో మ్యాచ్ ముందు 'టై'గా ముగిసింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 36-36 పాయింట్లతో సమంగా నిలిచాయి. హరియాణా ఆటగాళ్లలో నవీన్ కుమార్ 9, వినయ్ 8 పాయింట్లు సాధించగా...ముంబా జట్టు తరఫున అజిత్ చౌహాన్ ఒక్కడే 12 పాయింట్లు సాధించడం విశేషం. అయితే చివరకు 'టైబ్రేక్'లో హరియాణాను విజయం వరించింది. ఇందులో హరియాణా 7-6తో ముంబాపై పైచేయి సాధించింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో జైపూర్ పింక్ పాంథర్స్‌తో తెలుగు టైటాన్స్... పుణేరి పల్టన్‌తో దబంగ్ ఢిల్లీ తలపడతాయి.

# జొకోవిచ్ జైత్రయాత్ర

### యూఎస్ ఓపెన్ సెమీఫైనల్లో సెర్బియా దిగ్గజం




జొకోవిచ్

- క్వార్టర్ ఫైనల్లో అమెరికా స్టార్ టేలర్ ఫ్రిట్జ్‌పై విజయం
- కెరీర్‌లో 53వ సారి గ్రాండ్‌స్లామ్ టోర్నీ సెమీస్‌లోకి
- ఫైనల్లో చోటు కోసం అల్‌కరాజ్‌తో 'ఢీ'

**న్యూయార్క్:** రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్‌పై గురి పెట్టిన సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్... యూఎస్ ఓపెన్‌లో తన విజయపరంపరను కొనసాగిస్తూ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ జొకోవిచ్ 6-3, 7-5, 3-6, 6-4తో గత ఏడాది రన్నరప్, ప్రపంచ నాలుగో ర్యాంకర్, నాలుగో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)పై గెలుపొందాడు. టేలర్ ఫ్రిట్జ్‌తో ఇప్పటి వరకు ఆడిన 11 సార్లూ జొకోవిచే నెగ్గడం విశేషం. ఫ్రిట్జ్‌తో 3 గంటల 24 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో జొకోవిచ్ పది ఏస్‌లు సంధించి, ఎనిమిది డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. నెట్ వద్దకు 33 సార్లు దూసుకొచ్చి 22 సార్లు పాయింట్లు గెలిచాడు. 33 విన్నర్స్ కొట్టిన ఈ సెర్బియా స్టార్ 40 అనవసర తప్పిదాలు చేశాడు. తన సర్వీస్‌ను రెండుసార్లు చేజార్చుకున్న జొకోవిచ్ ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. మరోవైపు ఫ్రిట్జ్ 12 ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు, 42 అనవసర తప్పిదాలు చేశాడు. ఫ్రిట్జ్‌పై గెలుపుతో జొకోవిచ్ కెరీర్‌లో 53వ సారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్ దశకు చేరుకున్నాడు.

ఓవరాల్‌గా గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో అత్యధికసార్లు సెమీఫైనల్‌కు చేరిన ప్లేయర్‌గానూ జొకోవిచ్ రికార్డు సృష్టించాడు. 19వసారి యూఎస్ ఓపెన్‌లో ఆడుతున్న జొకోవిచ్ 14వ సారి సెమీఫైనల్లోకి అడుగు పెట్టి జిమ్మీ కానర్స్ పేరిట ఉన్న రికార్డును సమం చేశాడు. యూఎస్ ఓపెన్‌లో నాలుగుసార్లు చాంపియన్‌గా, ఆరుసార్లు రన్నరప్‌గా నిలిచిన జొకోవిచ్ ఈ టోర్నీలో 11వ వసారి ఫైనల్ చేరుకోవాలంటే విశేషంగా రాణించాల్సి ఉంటుంది. సెమీఫైనల్ పోరులో రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ (స్పెయిన్)తో జొకోవిచ్ తలపడతాడు. ముఖాముఖి రికార్డులో జొకోవిచ్ 5-3తో అల్‌కరాజ్‌పై ఆధిక్యంలో ఉన్నాడు. అయితే ఈ టోర్నీలో అల్‌కరాజ్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఒక్క సెట్ కూడా కోల్పోకుండా అల్‌కరాజ్ సెమీఫైనల్ చేరుకున్నాడు. క్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్ 6-4, 6-2, 6-4తో 20వ ర్యాంకర్ జిరీ లెహెస్కా(చెక్ రిపబ్లిక్)ను ఓడించాడు.



అల్‌కరాజ్

### సబలెంకాకు 'వాకోవర్'

మహిళల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్) వరుసగా ఐదో ఏడాది ఈ టోర్నీలో సెమీఫైనల్ చేరుకుంది. క్వార్టర్ ఫైనల్లో సబలెంకా ప్రత్యర్థి, 2023 వింబుల్డన్ చాంపియన్ మర్కెటా వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్) గాయం కారణంగా బరిలోకి దిగలేదు. దాంతో 'వాకోవర్'తో సబలెంకా సెమీఫైనల్ బెర్త్‌ను దక్కించుకుంది. మరోవైపు మహిళల డబుల్స్ విభాగంలో అమెరికా వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్ పోరాటం ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో 45 ఏళ్ల వీనస్ విలియమ్స్ (అమెరికా)-లేలా ఫెర్నాండెజ్ (కెనడా) ద్వయం 1-6, 2-6తో టాప్ సీడ్ టేలర్ టౌన్‌సెండ్ (అమెరికా)-సినియకోవా (చెక్ రిపబ్లిక్) జంట చేతిలో ఓడిపోయింది. 1997 తర్వాత యూఎస్ ఓపెన్ మహిళల డబుల్స్ విభాగంలో టాప్-4 సీడింగ్ జోడీలు సెమీఫైనల్ చేరుకోవడం విశేషం.

**1** అత్యధికసార్లు గ్రాండ్‌స్లామ్ టోర్నీ సింగిల్స్ విభాగంలో సెమీఫైనల్ చేరుకున్న ప్లేయర్‌గా జొకోవిచ్ (53 సార్లు) రికార్డు సృష్టించాడు. అమెరికా మహిళా స్టార్ క్రిస్ ఎవర్ట్ (52 సార్లు) పేరిట ఉన్న రికార్డును జొకోవిచ్ సవరించాడు.

**14** యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ విభాగంలో సెమీఫైనల్ చేరుకోవడం జొకోవిచ్‌కిది 14వ సారి. ఈ టోర్నీలో అత్యధికసార్లు సెమీఫైనల్ చేరుకున్న జిమ్మీ కానర్స్ (అమెరికా : 14 సార్లు) రికార్డును జొకోవిచ్ సమం చేశాడు.

**7** ఒకే ఏడాది నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ సెమీఫైనల్ చేరుకోవడం జొకోవిచ్‌కిది ఏడోసారి కావడం విశేషం. అంతేకాకుండా ఒకే సీజన్‌లోని నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో సెమీఫైనల్ చేరుకున్న అతిపెద్ద వయస్కుడిగానూ జొకోవిచ్ (38 ఏళ్ల 94 రోజులు) గుర్తింపు పొందాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

# సాక్షి సినిమా

## ఫోన్ కూడా చూడకుండా సినిమా చూస్తారు

**- బెల్లంకొండ సాయి శ్రీనివాస్**



• సాయి శ్రీనివాస్, అనుపమ

''ప్రేక్షకులకు మంచి థియేట్రికల్ అనుభూతి ఇవ్వాలని 'కిష్కింధపురి' చిత్రం చేశాం. మంచి సినిమా వస్తే తప్పకుండా జనం థియేటర్స్‌కి వస్తారని నమ్ముతున్నాను. మా 'కిష్కింధపురి' అలాంటి సినిమానే. సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌లా ఉంటుంది. ఫోన్ కూడా చూడకుండా ఈ సినిమాని చూస్తారు... అంత థ్రిల్లింగ్‌గా ఉంటుంది'' అని బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తెలిపారు. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జోడీగా నటించిన చిత్రం 'కిష్కింధపురి'. సాహు గారపాటి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన 'కిష్కింధపురి' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ– ''ఇలాంటి మంచి కథ తీసినందుకు కౌశిక్‌కి థ్యాంక్స్. సాహుగారి ప్యాషన్ ప్రతి ఫ్రేమ్‌లోనూ కనిపిస్తుంది. ఆయనలాంటి నిర్మాతలు ఇండస్ట్రీకి మరింత మంది రావాలి. ఈ నెల 12న మా సినిమా థియేటర్స్‌లో దద్దరిల్లిపోతుంది'' అని చెప్పారు. అనుపమా పరమేశ్వరన్ మాట్లాడుతూ– ''నాకు ఇలాంటి హారర్ జానర్ సినిమాలంటే ఇష్టం'' అని పేర్కొన్నారు. ''సాహుగారికి ఈ కథ చెప్పగానే సింగిల్ సిట్టింగ్‌లో ఓకే చెప్పారు. అలాగే సాయిగారికి కూడా వెంటనే నచ్చింది. మా సినిమా ప్రేక్షకులకు మంచి అనుభూతినిస్తుంది'' అన్నారు కౌశిక్ పెగల్లపాటి. ''ఈ సినిమా ఆడియన్స్ అంచనాలకు తగ్గకుండా ఉంటుంది'' అని సాహు గారపాటి చెప్పారు. ''ఇలాంటి కొత్త సినిమా చేసే అవకాశం ఇచ్చిన దర్శక-నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్.




• మహేశ్‌బాబు

## 120 దేశాల్లో ఎస్‌ఎస్‌ఎమ్‌బి29 విడుదల

### - 'ఎక్స్'లో పోస్ట్ చేసిన కెన్యా విదేశీ వ్యవహారాల మంత్రి ముసాలియా

''సుందరమైన నైవాషా, ఐకానిక్ అంబోసెలి, మసాయి మారా తాలూకు విశాలమైన మైదానం... ఇలా కెన్యాలోని ప్రకృతి అందాలు 120 దేశాల్లో విడుదల కానున్న ప్రతిష్ఠాత్మక చిత్రంలో కనువిందు చేయనున్నందుకు హ్యాపీగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా బిలియన్ (వంద కోట్లు)కి పైగా ప్రేక్షకులకు ఈ చిత్రం చేరువ అవుతుందనే అంచనాలు ఉన్నాయి'' అంటూ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు కెన్యా విదేశీ వ్యవహారాల మంత్రి ముసాలియా డబ్ల్యు ముడవాడి. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో రూపొందుతున్న భారీ చిత్రం గురించే ముసాలియా ఈ విధంగా పేర్కొన్నారు. ఈ ఫారెస్ట్ అడ్వెంచరస్ మూవీ షూటింగ్‌ని ఎక్కువ శాతం కెన్యాలో చిత్రీకరించాలని రాజమౌళి అనుకున్నారట. టీమ్‌తో కలిసి అక్కడి లొకేషన్స్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా ముసాలియాని కలిశారు రాజమౌళి. ఆ ఫొటోలను ముసాలియా తన 'ఎక్స్'లో షేర్ చేసి, అభిప్రాయాలను కూడా పంచుకున్నారు. ''ప్రపంచంలోని గొప్ప ఫిల్మ్ మేకర్స్‌లో ఒకరైన రాజమౌళి సినిమా కోసం కెన్యా ఓ వేదిక అయింది. మంచి విజన్ ఉన్న గొప్ప భారతీయ దర్శకుడు ఆయన. చక్కని స్క్రీన్‌ప్లే రైటర్, కథకుడు కూడా. ఆయన కథలు ఖండాంతర ప్రేక్షకుల ఊహలను ఆవిష్కరించాయి. రెండు దశాబ్దాల కెరీర్‌లో రాజమౌళి శక్తిమంతమైన కథనాలు, దృశ్యాలు, సాంస్కృతికతలను తన కథల్లో చొప్పించారు. 120 మందితో కూడిన ఆయన టీమ్ ఈస్ట్ ఆఫ్రికాలో విస్తృతంగా పర్యటించాక కెన్యాని ఎంచుకుంది. ప్రాథమిక చిత్రీకరణకు గమ్యస్థానంగా మా దేశాన్ని ఎంచుకోవడం ఇక్కడి అందం, ఆతిథ్యం గురించి ప్రపంచ వేదికకు చెప్పినట్లుగా భావిస్తున్నాం. 'ఎస్ఎస్ఎమ్‌బి29' (వర్కింగ్ టైటిల్) సినిమా లెన్స్ ద్వారా మా దేశాన్ని చూపించనుండటం కెన్యాకి గర్వకారణం'' అని ముసాలియా డబ్ల్యు ముడవాడి పేర్కొన్నారు. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో భారీ బడ్జెట్‌తో గ్లోబల్ రేంజ్‌లో కేఎల్ నారాయణ 'ఎస్ఎస్ఎమ్‌బి29' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా ఓ లీడ్ రోల్ చేస్తున్నారు. ఇంకా పలువురు భారతీయ నటీనటులతో పాటు హాలీవుడ్ నటీనటులు నటించనున్నారు. అలాగే హాలీవుడ్ సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికి పని చేస్తున్నారు. ఇక ఈ చిత్రానికి సంబంధించిన ఓ పెద్ద అప్‌డేట్‌ని నవంబరులో ఇవ్వనున్నామని ఇటీవల మహేశ్‌బాబు బర్త్‌డే (ఆగస్ట్ 9) సందర్భంగా రాజమౌళి పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ చిత్రం 2027లో విడుదలయ్యే అవకాశం ఉంది.



• రాజమౌళి, ముసాలియా డబ్ల్యు ముడవాడి

## ఇన్నేళ్ల ప్రయాణాన్ని ఊహించలేదు

**- అనుష్క**



''నేను సినిమాల్లోకి భయం భయంగా వచ్చాను. అయితే రెండు దశాబ్దాల జర్నీ పూర్తి చేసుకున్నాను. ఇన్నేళ్ల ప్రయాణాన్ని ఊహించలేదు. ఈ స్థాయి ఫ్యాన్ ఫాలోయింగ్‌ని, స్టార్‌డమ్‌ని సొంతం చేసుకోవడం హ్యాపీగా ఉంది. ఇందుకు ఫ్యాన్స్‌కి, ప్రేక్షకులకి కృతజ్ఞతతో ఉంటా'' అని హీరోయిన్ అనుష్క శెట్టి చెప్పారు. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క శెట్టి, విక్రమ్ ప్రభు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఘాటీ'. యూవీ క్రియేషన్స్ సమర్పణలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 5న రిలీజ్ కానున్న సందర్భంగా అనుష్క పంచుకున్న విశేషాలు.

- 'ఘాటీ'లో నేను చేసిన శీలావతి క్యారెక్టర్‌లో బ్యూటిఫుల్ షేడ్స్ ఉన్నాయి. నా కంఫర్ట్ జోన్‌ని దాటి చేసిన సినిమా ఇది. శీలావతి నా ఫిల్మోగ్రఫీలో ఎప్పటికీ నిలిచిపోతుంది. సరోజ ('క్రిష్' డైరెక్షన్‌లో చేసిన 'వేదం' సినిమాలోని పాత్ర), శీలావతి వంటి అద్భుతమైన పాత్రలు ఇస్తున్న క్రిష్‌గారికి థ్యాంక్స్.
- క్రిష్‌గారు, చింతకింది శ్రీనివాస్‌గారు ఈ చిత్రకథ చెప్పినప్పుడు ఆసక్తిగా అనిపించింది. షూటింగ్ లొకేషన్స్‌కి వెళ్లిన తర్వాత ఒక కొత్త పాత్ర, సంస్కృతి, ఒక కొత్త విజువల్‌ని ప్రేక్షకులకి చూపించబోతున్నామనే ఎగ్జయిట్‌మెంట్ కలిగింది. ప్రతి మహిళ సాధారణంగా, సున్నితంగా కనిపించినప్పటికీ ఏదైనా ఒక సందర్భం వచ్చినప్పుడు ఒక బలమైన స్తంభంలాగా నిలబడుతుంది. మహిళల్లో ఉండే గొప్ప క్వాలిటీ అది. 'అరుంధతి, రుద్రమదేవి, బాహుబలి, భాగమతి' వంటి సినిమాల్లో చాలా బలమైన పాత్రలు చేశాను. 'ఘాటీ'లో చేసిన శీలావతి పాత్ర కూడా అంతే బలంగా ఉంటుంది. ప్రస్తుతం సమాజంలో ఉన్న ప్రధానమైన సమస్య గంజాయి. క్రిష్‌గారు సమాజానికి దగ్గరగా ఉండే కథలనే ఎంచుకుంటారు. యాక్షన్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన 'ఘాటీ'లో చక్కని సందేశం కూడా ఉంది.
- నేను చేసిన చాలా సినిమాలు కష్టంతో కూడుకున్నవే. 'ఘాటీ'లోనూ ఫిజికల్ హార్డ్ వర్క్ ఉంది. షూటింగ్ కోసం పెద్ద పెద్ద కొండలు ఎక్కేవాళ్లం. ఇలాంటి ఒక వైవిధ్యమైన కథని నమ్మి, నాపై నమ్మకం ఉంచి ఇంత గ్రాండ్ స్కేల్‌లో ఈ సినిమా చేసినందుకు రాజీవ్ రెడ్డి, సాయిబాబుగార్లకు, యూవీ క్రియేషన్స్‌వారికి ధన్యవాదాలు. క్రిష్‌గారు రాసిన మూడు పాటల్లో 'కుందేటి చుక్క...' అంటూ ఆయన చేసిన పదప్రయోగం నాకు చాలా ఇష్టం. షూటింగ్స్ లేనప్పుడు ఎక్కువగా ప్రయాణాలు చేస్తాను... పుస్తకాలు చదువుతాను... సినిమాలు చూస్తాను. ప్రస్తుతం క్రిష్‌గారు ఇచ్చిన 'మహాభారతం' చదువుతున్నాను. రెండేళ్లుగా ఎక్కువగా కుటుంబంతోనే సమయం గడుపుతున్నాను.
- 'ఘాటీ'ని ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దుల్లో షూట్ చేసినప్పుడు నన్ను చూడడానికి భారీ సంఖ్యలో ఫ్యాన్స్ రావడం హ్యాపీగా అనిపించింది. రాజమౌళిగారు లాంటి దర్శకుడు 'బాహుబలి' లాంటి చిత్రాలని అద్భుతంగా తీయడం వల్లే అన్ని వైపులా రీచ్ అయింది. మంచి సినిమా చేస్తే ప్రపంచం నలుమూలల నుంచి గుర్తింపు దొరుకుతుంది. ఇది పవర్ ఆఫ్ సినిమాగా భావిస్తున్నాను. నేను ఎన్ని సినిమాలు చేసినా ఇప్పటికీ నన్ను 'అరుంధతి'గానే గుర్తుపడుతున్నారు. 'బాహుబలి: ది ఎపిక్' మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానుండటం ఆసక్తిగా ఉంది. 'ఛత్రపతి' సినిమా సమయం నుంచి ప్రభాస్‌తో నాకు మంచి స్నేహం ఉంది. మేము కలిసి నటించిన సినిమాల్లో మా మధ్య కెమిస్ట్రీ బాగా కుదిరిందంటే అది ఆయా పాత్రల గొప్పదనం. ఇక బలమైన కథ కుదిరితే ఔట్ అండ్ ఔట్ నెగటివ్ క్యారెక్టర్ చేయాలని ఉంది. మొదటిసారి మలయాళంలో 'కథ నార్' అనే సినిమా చేస్తున్నాను. అలాగే తెలుగులో ఓ కొత్త సినిమా ప్రకటన ఉంటుంది.

## లిటిల్ హార్ట్స్ పెద్ద విజయం సాధించాలి

**- శ్రీ విష్ణు**



• శ్రీ విష్ణు, బన్నీ వాసు, సాయి మార్తాండ్, వంశీ

''మేము గతంలో ఏదైనా సినిమా చేస్తే రిలీజ్ కోసం సురేష్ బాబు, 'దిల్' రాజుగార్ల వద్దకు వెళ్లేవాళ్లం. ఇప్పుడు బన్నీ వాసుగారు చిన్న సినిమా, పెద్ద సినిమా అని చూడకుండా కంటెంట్ బాగుంటే రిలీజ్ చేస్తున్నారు. ఆయన రిలీజ్ చేస్తున్న 'లిటిల్ హార్ట్స్' చిత్రం పెద్ద విజయం సాధించాలి. కొన్ని మూవీస్ ప్రమోషనల్ కంటెంట్ చూడగానే సినిమా చూడాలనిపిస్తుంది. 'లిటిల్ హార్ట్స్' కూడా అలాంటి క్యూరియాసిటీ క్రియేట్ చేసింది'' అని హీరో శ్రీవిష్ణు తెలిపారు. మౌళి తనుజ్, శివానీ నాగారం జంటగా సాయి మార్తాండ్ దర్శకత్వం వహించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. ఆదిత్య హాసన్ నిర్మించిన ఈ సినిమాని బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ నెల 5న విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి అతిథిగా శ్రీ విష్ణు హాజరయ్యారు. మౌళి తనుజ్ మాట్లాడుతూ–''నేను ఎప్పుడో ఎవరినో ఏదో అన్నానంటూ మా 'లిటిల్ హార్ట్స్' గురించి కొందరు సోషల్ మీడియాలో కావాలనే నెగటివ్ కామెంట్స్ రాస్తున్నారు. ఒకరు ఎదుగుతుంటే కిందకులాగే మనుషులు వీళ్లు. మీకు వార్నింగ్ ఇస్తున్నా... మిమ్మల్ని మా మూవీ ద్వారా నవ్విస్తా, మీ మనసులు గెలుచుకుంటా'' అని చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి, కెమెరామేన్ సూర్య బాలాజీ, నటి అనితా చౌదరి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మురళీ పున్న, ఈటీవీ విన్ హెడ్ సాయి కృష్ణ, కంటెంట్ హెడ్ నితిన్, నిర్మాత భాను మాట్లాడారు.

## మ్యాడ్ మార్క్!



• సుదీప్

మ్యాడ్, యాటిట్యూడ్, రూత్‌లెస్, కింగ్... ఈ నాలుగు పదాల్లోంచి సుదీప్ సినిమాకి 'మార్క్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. సుదీప్ హీరోగా నటిస్తున్న 47వ చిత్రం 'మార్క్'. బుధవారం ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. టీజీ త్యాగరాజన్ సమర్పణలో సత్యజ్యోతి ఫిలింస్, కిచ్చా క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విజయ్ కార్తికేయ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం క్రిస్మస్‌కి పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. సుదీప్ కెరీర్‌లోనే అత్యంత భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'మార్క్' ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. విక్రాంత్, నవీన్ చంద్ర, దీప్షిక, రోహిణీ ప్రకాశ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: శేఖర్ చంద్ర, సంగీతం: అజనీష్ లోకనాథ్.

## అందుకే మదరాసి టైటిల్ పెట్టాను

**- మురుగదాస్**



''మామూలుగా మన దక్షిణాది వారిని ఉత్తరాదిలో మదరాసి అని పిలుస్తుంటారు. 'మదరాసి' చిత్రం ఎక్కువగా విలన్ పాయింట్ ఆఫ్ వ్యూలో సాగుతుంది. ఈ మూవీలో హీరోని మదరాసి అని పిలుస్తుంటాడు విలన్. అందుకే టైటిల్ 'మదరాసి' అని పెట్టాను'' అని డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ తెలిపారు. శివ కార్తికేయన్, రుక్మిణీ వసంత్ జోడీగా విద్యుత్ జమాల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మదరాసి'. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 5న విడుదల కానుంది. ఈ చిత్రాన్ని తెలుగులో శ్రీ లక్ష్మీ మూవీస్ రిలీజ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో మురుగదాస్ మాట్లాడుతూ– ''వెస్టన్ కంట్రీస్‌లో ఇప్పటికే ఉన్న సమస్యలు, మన దేశంలోకి వస్తున్న ఓ కొత్త సమస్యను బేస్ చేసుకుని 'మదరాసి' కథ రాశాను. ఈ కథ మొత్తం తమిళనాడు నేపథ్యంలో సాగుతుంది. అయినప్పటికీ ఇందులోని కంటెంట్, కథ అన్ని ప్రాంతాలకు కనెక్ట్ అవుతుంది. ఈ కథ చెప్పిన వెంటనే శివ కార్తికేయన్ ఒప్పుకున్నారు. ప్రస్తుతం ఆయనకు మాస్‌లో మంచి ఇమేజ్ ఉంది. అలాంటి మాస్ హీరోతో నేను చెప్పాలనుకున్న ఈ పాయింట్‌ను చెబితే ఎక్కువ రీచ్ అవుతుంది. విద్యుత్ జమాల్ ప్రస్తుతం హీరోగా చేస్తున్నారు. అయితే 'మదరాసి' కథ నచ్చడంతో విలన్‌గా చేసేందుకు ఒప్పుకున్నారు. శ్రీ లక్ష్మీ మూవీస్ ఎన్వీ ప్రసాద్‌గారితో నాకు ఎన్నో ఏళ్ల నుంచి అనుబంధం ఉంది. ఆయన ఈ మూవీ కోసం ఎంతో ఖర్చు పెట్టారు. దక్షిణాది ప్రేక్షకులు సినిమాని ఎక్కువగా ప్రేమిస్తారు. ప్రస్తుతం మన ఇండియన్ మూవీ ఇండస్ట్రీ ప్రపంచవ్యాప్తంగా సత్తా చాటుతుండటం సంతోషం. ఓ యానిమేషన్ ప్రాజెక్ట్ కోసం చాలా పని చేశాను. కానీ, చివరకు అది పట్టాలెక్కలేదు. అందువల్లే దాదాపు ఐదేళ్లు గ్యాప్ వచ్చింది. స్క్రిప్ట్ ఫైనలైజ్ అయ్యాక నా తర్వాతి ప్రాజెక్ట్ గురించి చెబుతాను'' అని పేర్కొన్నారు.

## స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 410 | 80,568 |
| నిఫ్టీ ▲ | 135 | 24,715 |

| విదేశీ సూచీలు | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 21,441 | ▲ | 161 |
| డోజోన్స్ | 45,024 | ▼ | 272 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 9,173 | ▲ | 56 |
| డాక్స్ | 23,610 | ▲ | 122 |
| షాంఘై | 3,814 | ▼ | 45 |
| నికాయ్ | 41,939 | ▼ | 372 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 87.70 | 88.72 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 116.40 | 119.37 |
| € | యూరో | ఎస్‌బీఐ | 101.20 | 103.95 |
| ¥ | జపాన్ యెన్ (100) | ఎస్‌బీఐ | 59.00 | 60.51 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 56.37 | 58.63 |
| S$ | సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 66.08 | 69.80 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 22.80 | 24.10 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 23.10 | 24.34 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 11.45 | 13.28 |

# ప్రైవేటు ఆసుపత్రుల్లో 'పీఈ' పాగా



గత ఐదేళ్లుగా దేశ ఆరోగ్య పరిరక్షణ (హెల్త్‌కేర్) రంగంలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా గ్లోబల్ పీఈ సంస్థలు దేశీ ఆసుపత్రుల చైన్‌లో భారీ పెట్టుబడులకు తెరతీస్తున్నాయి. ఫలితంగా ప్రయివేట్ రంగంలోని పలు ఆసుపత్రుల పగ్గాలు టెమాసెక్, బ్లాక్‌స్టోన్ తదితర పీఈ దిగ్గజాల చేతికి చిక్కుతున్నాయి. వివరాలు చూద్దాం..

- సాక్షి, బిజినెస్ డెస్క్

దేశీయంగా ప్రయివేట్ ఆసుపత్రుల రంగంలో ప్రపంచ ప్రయివేట్ ఈక్విటీ (పీఈ) దిగ్గజాల ఆధిపత్యానికి తెరలేచింది. గత కొన్నేళ్లుగా టెమాసెక్ హోల్డింగ్స్, బ్లాక్‌స్టోన్, సీవీసీ క్యాపిటల్, కేకేఆర్ తదితర గ్లోబల్ దిగ్గజాలు పలు ప్రయివేట్ ఆసుపత్రుల చైన్‌లను దేశీయంగా సొంతం చేసుకుంటూ వస్తున్నాయి. మరికొన్నింటిలో మైనారిటీ వాటాలను కొనుగోలు చేస్తున్నాయి. ఇందుకు భారీ స్థాయిలో పెట్టుబడులు వెచ్చిస్తున్నాయి. ఫలితంగా సహ్యాద్రి, మణిపాల్, కేర్, స్టెర్లింగ్ తదితర సుప్రసిద్ధ ఆసుపత్రులు పీఈ సంస్థల పరమవుతున్నాయి. వెరసి 80 బిలియన్ డాలర్ల విలువైన దేశీ హెల్త్‌కేర్ రంగంలో కన్సాలిడేషన్‌కు దారి చూపుతున్నాయి. గతంలో పబ్లిక్ సంస్థలు, కుటుంబ ట్రస్ట్‌ల నిర్వహణలో కార్యకలాపాలు కొనసాగించిన పలు ఆసుపత్రులు ప్రస్తుతం పీఈ దిగ్గజాల కనుసన్నలలో సర్వీసులు అందిస్తున్నాయి. తద్వారా దేశీయంగా ప్రయివేట్ ఆసుపత్రులు కుటుంబ యాజమాన్య పరిస్థితుల నుంచి పీఈ సంస్థల నిర్వహణలోకి చేరుతున్నాయి.

### కోవిడ్-19 తదుపరి

కరోనా మహమ్మారి తదుపరి దేశీ హెల్త్‌కేర్ రంగంపై గ్లోబల్ పీఈ దిగ్గజాలకు ఆసక్తి పెరిగినట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో సింగపూర్ సంస్థ టెమాసెక్, యూఎస్ సంస్థ టీపీజీ, కేకేఆర్ భారీ పెట్టుబడులకు తెరతీశాయి. మణిపాల్, మ్యాక్స్ హాస్పిటల్ చైన్‌లో వాటాలు కొనుగోలు చేశాయి. నిజానికి 2007లోనే హైదరాబాద్ దిగ్గజం అపోలో హాస్పిటల్స్‌లో యూకే సంస్థ ఎపాక్స్ పార్ట్‌నర్స్ పెట్టుబడులు చేపట్టింది. అయితే సాధారణంగా హెల్త్‌కేర్ రంగంలో మూడు నుంచి ఐదేళ్ల కాలపరిమితితో పీఈ సంస్థలు పెట్టుబడులకు ఆసక్తి చూపుతాయని మ్యాక్స్ హెల్త్‌కేర్ సీఎండీ అభయ్ సోయి పేర్కొన్నారు. ఈ కాలంలో పెట్టుబడుల ద్వారా ఆర్థిక చేయూతను అందిస్తాయని, మౌలిక సదుపాయాల వృద్ధికి వీలుంటుందని తెలియజేశారు. తదుపరి కార్పొరేట్స్ లేదా యాజమాన్య వ్యక్తులకు నిర్వహణను అప్పగిస్తాయని వివరించారు. 2019లో కేకేఆర్‌తో కలిసి మ్యాక్స్ హెల్త్‌కేర్‌లో నియంత్రిత వాటాను కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.

### భారీ పెట్టుబడులతో మెజారిటీ వాటా సొంతం

- జాబితాలో స్టెర్లింగ్, సహ్యాద్రి, కేర్, మణిపాల్
- హెల్త్‌కేర్ రంగంలో మరిన్ని పెట్టుబడులకు సై
- బ్లాక్‌స్టోన్, టెమాసెక్, టీపీజీ, కేకేఆర్, ఎపాక్స్ పార్ట్‌నర్స్ క్యూ..

### పెట్టుబడుల దన్ను

పీఈ సంస్థల కారణంగా వృద్ధికి అవసరమైన పెట్టుబడులు, సుపరిపాలన, నిర్వహణ సామర్థ్యం, సర్వీసులలో నాణ్యత మెరుగుపడతాయని గ్రాంట్ థార్న్‌టన్ భారత్ నిపుణులు భానుప్రకాష్ కల్మాత్ ఎస్‌జీ పేర్కొన్నారు. ఆసుపత్రుల విస్తరణకూ వీలు చిక్కుతుందని తెలియజేశారు. ప్రస్తుతం దేశీ హెల్త్‌కేర్ రంగంలో సుమారు 20 పీఈ దిగ్గజాలు యాక్టివ్‌గా ఉన్నట్లు తెలియజేశారు. ఏ ఇతర రంగంతో పోల్చినా ఇది అధికమని వెల్లడించారు. ఈ నేపథ్యంలో దేశీయంగా గత దశాబ్ద కాలంలో కార్పొరేట్ హాస్పిటల్ చైన్‌ల రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్(ఆర్‌వోఐ) మెరుగుపడినట్లు క్వాడ్రా క్యాపిటల్ పార్ట్‌నర్ సునీల్ ఠాకూర్ పేర్కొన్నారు. సమర్థ వినియోగం, బెడ్లపై పెరిగిన ఆదాయం, ఉత్తమ వ్యయ నియంత్రణ ఇందుకు దోహదపడినట్లు వివరించారు.

| పెట్టుబడుల హవా | | |
|---|---|---|
| ఆసుపత్రుల చైన్ | పీఈ సంస్థ | వాటా |
| మదర్‌హుడ్ | టీపీజీ గ్రోత్, జీఐసీ | 98 |
| కిమ్స్ కేరళ | బ్లాక్‌స్టోన్ | 80 |
| కేర్ హాస్పిటల్ | బ్లాక్‌స్టోన్ | 73 |
| ఉజాలా సిగ్నస్ | జనరల్ అట్లాంటిక్ | 70 |
| హెచ్‌సీజీ | కేకేఆర్ | 60 |
| ఇందిరా ఐవీఎఫ్ | జీపీఈఏ ఈక్విటీ | 60 |
| మణిపాల్ | టెమాసెక్ హోల్డింగ్స్ | 59 |

### విస్తరణకు వీలు

తొలి దశలో దేశీయంగా ఆసుపత్రులను ప్రభుత్వాలు లేదా కుటుంబ యాజమాన్య నిర్వహణలో సేవలు అందిస్తుండేవి. తదుపరి దశలో ప్రయివేట్ కార్పొరేట్ ఆసుపత్రులు ఊపిరిపోసుకుంటూ వచ్చినట్లు పరిశ్రమ వర్గాలు తెలియజేశాయి. ప్రస్తుతం యూఎస్ తరహాలో పీఈ దిగ్గజాల హవా కనిపిస్తున్నట్లు పేర్కొన్నాయి. యూఎస్‌లో ప్రయివేట్‌గా లేదా సంస్థాగత నిర్వహణలో హెల్త్ సర్వీసులు సమకూర్చుతుంటాయని తెలియజేశాయి. అయితే యూకేలో నేషనల్ హెల్త్ సర్వీస్ పేరుతో ప్రభుత్వ అజమాయిషీలోనే హెల్త్‌కేర్ రంగ నిర్వహణ ఉంటుందని వెల్లడించాయి. కాగా.. గత కొన్నేళ్లలో దేశీయంగా ప్రయివేట్ ఆసుపత్రులను పీఈ దిగ్గజాలు హస్తగతం చేసుకుంటూ వచ్చినట్లు పీడబ్ల్యూసీ ఇండియా అడ్వయిజరీ నిపుణులు సుజయ్ శెట్టి పేర్కొన్నారు. దీంతో మరింత మందికి ఆరోగ్య పరిరక్షణ సేవలు అందుబాటులోకి వచ్చే వీలున్నట్లు తెలియజేశారు. అంతేకాకుండా తగిన పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, వృత్తి నైపుణ్యం వంటి సానుకూలతలకు దారి ఏర్పడనున్నట్లు వివరించారు. దేశీయంగా ఆదాయాలతోపాటు.. లైఫ్‌స్టైల్ తరహా వ్యాధులు పెరగడం, ఆరోగ్య పరిరక్షణపట్ల మెరుగైన అవగాహన వంటి అంశాలు హెల్త్‌కేర్ సర్వీసులకు డిమాండును పెంచుతున్నట్లు తెలియజేశారు. నిజానికి దేశీయంగా ఆసుపత్రులలో తగినన్ని పడకలు, క్రిటికల్ కేర్ సేవల కొరత ఉన్నట్లు వెల్లడించారు.

# 7రోజుల్లో 7,000 జంప్

## రూ.1,07,070 వద్ద కొత్త గరిష్ట స్థాయికి బంగారం



న్యూఢిల్లీ: పుత్తడి నాన్‌స్టాప్‌గా పరుగులు తీస్తోంది. గడిచిన ఏడు రోజుల్లో 10 గ్రాములకు దేశీయంగా రూ.7,000 లాభపడింది. బుధవారం ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం మరో రూ.1,000 పెరిగి రూ.1,07,070 వద్ద ముగిసింది. పసిడికి దేశీయంగా ఇది నూతన జీవిత కాల గరిష్ఠ స్థాయి. ఈ నెల 25న పసిడి ధర రూ.1,00,170 వద్ద ఉండడం గమనార్హం. ఇక 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం 10 గ్రాములకు రూ.1,000 పెరిగి రూ.1,06,200 స్థాయిని తాకింది. మరోవైపు వెండి ధర పెద్దగా మార్పు లేకుండా రూ.1,26,100 స్థాయిలో ట్రేడయ్యింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ పసిడి 21 డాలర్లకు పైనే పెరిగి సరికొత్త గరిష్ఠ స్థాయి అయిన 3,618.50 డాలర్లకు చేరుకుంది. ''యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు పెరిగాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతుండడం, అమెరికా ఆర్థిక వ్యవస్థపై నెలకొన్న ఆందోళనలు బంగారం ధరల ర్యాలీకి మద్దతునిచ్చాయి. ఈ వారం చివర్లో ఓపెక్ ప్లస్ కూటమి సమావేశం జరగనుంది. ఇటీవలి ఉక్రెయిన్ దాడితో రష్యా ఆయిల్ ప్రాసెసింగ్ సామర్థ్యం 17 శాతం ప్రభావితం కావడంతో సరఫరా పరమైన ఆందోళనలు నెలకొన్నాయి. దీంతో ఇటీవలి కనిష్టాల నుంచి చమురు ధరలు సైతం పుంజుకున్నాయి'' అని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా వివరించారు. ఫెడ్ రేటు కోతల అంచనాలకు తోడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న టారిఫ్ విధానాలు పసిడి ధరలను నడిపిస్తున్నట్టు వెంచురా కమోడిటీ హెడ్ ఎన్ఎస్ రామస్వామి సైతం అభిప్రాయపడ్డారు.

# మారుతీ కొత్త ఎస్‌యూవీ 'విక్టోరిస్'

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ తాజాగా 'విక్టోరిస్' ఎస్‌యూవీని ఆవిష్కరించింది. తద్వారా మిడ్‌సైజ్ ఎస్‌యూవీల (స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్) విభాగంలో వాహనాల శ్రేణిని మరింతగా విస్తరించింది. అయితే దీని ధర ఎంత అనేది కంపెనీ వెల్లడించలేదు. విక్టోరిస్‌ను అభివృద్ధి చేయడంపై సుమారు రూ. 1,240 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు సంస్థ తెలిపింది. ఇందులో హైబ్రిడ్, సీఎన్‌జీ వెర్షన్లు కూడా ఉన్నాయి. కొత్త తరం కస్టమర్లు వస్తున్న నేపథ్యంలో దేశీయంగా ఆటోమొబైల్ పరిశ్రమ రూపురేఖలు మారుతున్నాయని మారుతీ సుజుకీ ఇండియా ఎండీ హిసాషి తకెయుచి తెలిపారు. ఈ నేపథ్యంలో గణనీయంగా పెరుగుతున్న యువ కస్టమర్లను దృష్టిలో ఉంచుకుని విక్టోరిస్‌ను రూపొందించినట్లు చెప్పారు. దీన్ని 100 పైగా మార్కెట్లకు కూడా ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. తమ మొత్తం అమ్మకాల్లో ఎస్‌యూవీల వాటా 2020-21 ఆర్థిక సంవత్సరంలో 8.9 శాతంగా ఉండగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 28 శాతానికి ఎగిసిందని తకెయుచి వివరించారు.

మారుతీ సుజుకీ ప్రస్తుతం ఫ్రాంక్స్, బ్రెజా, జిమ్నీ, గ్రాండ్ విటారా లాంటి ఎస్‌యూవీలను విక్రయిస్తోంది. దేశీయంగా మిడ్-సైజ్ ఎస్‌యూవీల అమ్మకాలు ప్రస్తుతం ఏటా 9.5 లక్షల యూనిట్లుగా ఉండగా, మొత్తం ఎస్‌యూవీల మార్కెట్లో వీటి వాటా 40 శాతంగా ఉంది.



ఆవిష్కరణ కార్యక్రమంలో మారుతీ సుజుకీ ఇండియా ఎండీ, సీఈఓ హిసాషి టకేయుచి, మార్కెటింగ్ అండ్ సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
జీఎస్‌టీ సంస్కరణల ఆశలతో.... | సేవల్లో వృద్ధి శరవేగం

# భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-రసాయన శాస్త్రం » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- బ్యాంకింగ్ అవేర్‌నెస్

## విద్య, ఉద్యోగ సమాచారం



### ఏఐసీటీఈ పీజీ స్కాలర్‌షిప్

ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంఈ /ఎంటెక్/ఎం.డిజైన్ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు గేట్/సీఈఈడీ స్కోర్ ఆధారంగా నెలకు రూ.12,400 స్కాలర్‌షిప్ అందించనుంది.

- » అర్హత: విద్యార్థులు ఏఐసీటీఈ ఆమోదం పొందిన సంస్థలలో 2025-26 విద్యా సంవత్సరపు ఆమోదిత సీట్లలో ప్రవేశం పొంది ఉండాలి. చెల్లుబాటు అయ్యే గేట్/సీఈఈడీ స్కోర్ కార్డు కలిగి ఉండాలి.
- » దరఖాస్తు విధానం: విద్యార్థులు తమ యునిక్ ఐడీను సంబంధిత సంస్థ నుంచి పొందాలి. తర్వాత https://pgscholarship.aicte.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. గేట్, సీఈఈడీ స్కోర్ కార్డు, ఆధార్, బ్యాంక్ వివరాలు, కేటగిరి సర్టిఫికేట్ వంటి అవసరమైన పత్రాలు అప్‌లోడ్ చేయాలి.
- » యునిక్ దరఖాస్తు ప్రారంభతేది: 01.09.2025.
- » సంస్థ ద్వారా యునిక్ ఐడీకి చివరితేది: 10.12.2025.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.12.2025
- » వెరిఫికేషన్‌కు చివరితేది: 31.12.2025.
- » వెబ్‌సైట్: https://pgscholarship.aicte.gov.in

### ఐఐటీ ఢిల్లీలో వివిధ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) ఢిల్లీ ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం ఖాళీల సంఖ్య: 7. ప్రాజెక్ట్ కన్సల్టెంట్-01, రీసెర్చ్ అసోసియేట్-01, సీనియర్ రీసెర్చ్ ఫెలో-01, జూనియర్ రీసెర్చ్ ఫెలో-01, సీనియర్ ప్రాజెక్ట్ అసిస్టెంట్-01, ప్రాజెక్ట్ అసిస్టెంట్-01, ప్రాజెక్ట్ అటెండెంట్-01.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీటెక్, ఎంటెక్ పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు నెట్, గేట్‌లో అర్హత సాధించి ఉండాలి.
- » వేతనం: నెలకు ప్రాజెక్ట్ కన్సల్టెంట్‌కు రూ.1,06,650 నుంచి రూ.1,39,150, రీసెర్చ్ అసోసియేట్‌కు రూ.67,000, సీనియర్‌రీసెర్చ్ ఫెలోకు రూ.42,000, జూనియర్ రీసెర్చ్ ఫెలోకు రూ.37,000, సీనియర్ ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.47,790 నుంచి రూ.62,350. ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.29,290 నుంచి రూ.38,220, ప్రాజెక్ట్ అటెండెంట్‌కు రూ.26,860 నుంచి రూ.35,050.
- » ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » ఈమెయిల్: nareshbhatnagar1@gmail.com
- » దరఖాస్తులకు చివరితేది: 08.09.2025.
- » వెబ్‌సైట్: https://ird.iitd.ac.in

### ఏపీ కోఆపరేటివ్ బ్యాంక్‌లో 25 మేనేజర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్(ఏపీసీవోబీ).. మేనేజర్ స్కేల్-1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 25.
- » అర్హత: గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన స్థానిక అభ్యర్థి అయి ఉండాలి. తెలుగు భాషలో ప్రావీణ్యం ఉండాలి. ఇంగ్లిష్ పరిజ్ఞానం తప్పనిసరి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండే అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తారు.
- » వయసు: 01.07.2025 నాటికి మేనేజర్ స్కేల్-1కు 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- » వేతనం: మేనేజర్ స్కేల్-1కు రూ.48,480 నుంచి రూ.85,920.
- » ఎంపిక విధానం: ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 27.08.2025.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 10.09.2025
- » ఆన్‌లైన్ పరీక్ష: సెప్టెంబర్/అక్టోబర్ 2025
- » పరీక్ష కేంద్రాలు: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం.
- » వెబ్‌సైట్: https://apcob.org

### బీఈఎంఎల్, బెంగళూరులో 27 ఎగ్జిక్యూటివ్ పోస్టులు

భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్(బీఈఎంఎల్) వివిధ విభాగాల్లో ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 27.
- » పోస్టుల వివరాలు: చీఫ్ జనరల్ మేనేజర్-03, జనరల్ మేనేజర్-02, డిప్యూటీ జనరల్ మేనేజర్-09, మేనేజర్-02, అసిస్టెంట్ మేనేజర్-11.
- » విభాగాలు: ఫైనాన్స్, హెచ్‌ఆర్, రోలింగ్ స్టాక్ మాన్యుఫ్యాక్చరింగ్, మెట్రో బిజినెస్ డెవలప్‌మెంట్, ఎలక్ట్రానిక్స్ ఏరోస్పేస్, ప్రొడక్షన్ ప్లానింగ్, ఇంజన్ డిజైన్, టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఇంజన్ ప్రాజెక్ట్, అనాలసిస్, ఇంజన్ టెస్టింగ్, రాజ్‌భాషా/అఫిషియల్ లాంగ్వేజ్.
- » అర్హత: గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి సంబంధిత విభాగాల్లో డిగ్రీ, పీజీ, ఎంబీఏ, సీఏ/సీఎంఏ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » వయసు: అసిస్టెంట్ మేనేజర్‌కు 30 ఏళ్లు, మేనేజర్‌కు 34 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు 45 ఏళ్లు, జనరల్ మేనేజర్‌కు 48 ఏళ్లు, చీఫ్ జనరల్ మేనేజర్‌కు 51 ఏళ్లు మించకూడదు.
- » వేతనం: అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.50,000 నుంచి రూ.1,60,000, మేనేజర్‌కు రూ.60,000 నుంచి రూ.1,80,000, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.90,000 నుంచి రూ.2,40,000, జనరల్ మేనేజర్‌కు రూ.1,00,000 నుంచి రూ.2,60,000, చీఫ్ జనరల్ మేనేజర్‌కు రూ.1,20,000 నుంచి రూ.2,80,000.
- » ఎంపిక విధానం: షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ/అసెస్‌మెంట్ డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:12.09.2025.
- » వెబ్‌సైట్: https://www.bemlindia.in

### బీఈఎంఎల్, బెంగళూరులో 100 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్) మేనేజ్‌మెంట్ ట్రైనీ(గ్రేడ్-2) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 100.
- » పోస్టుల వివరాలు: మేనేజ్‌మెంట్ ట్రైనీ గ్రేడ్ 2 (మెకానికల్)-90, మేనేజ్‌మెంట్ ట్రైనీ గ్రేడ్ 2 (ఎలక్ట్రికల్)-10.
- » అర్హత: గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ(మెకానికల్ ఇంజనీరింగ్)ఉత్తీర్ణులై ఉండాలి
- » వయసు: 29 ఏళ్లు మించకూడదు.
- » వేతనం: నెలకు రూ.40,000 నుంచి 1,40,000
- » ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 12.09.2025
- » వెబ్‌సైట్: http://www.bemlindia.in

### బీఈఎంఎల్, బెంగళూరులో 440 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్).. వివిధ ట్రేడుల్లో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 440.
- » పోస్టుల వివరాలు: ఐటీఐ ఫిట్టర్-189, ఐటీఐ టర్నర్-95, ఐటీఐ వెల్డర్-91, ఐటీఐ మెషినిస్ట్-52, ఐటీఐ ఎలక్ట్రీషియన్-13.
- » అర్హత: సంబంధిత విభాగంలో ఐటీఐ ఉత్తీర్ణతతో పాటు నేషనల్ ట్రేడ్ సర్టిఫికేట్(ఎన్‌సీటీ) కలిగి ఉండాలి.
- » వయసు: 29 ఏళ్లు మించకూడదు.
- » ఎంపిక విధానం: రాతపరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » దరఖాస్తులకు చివరితేది: 05.09.2025.
- » వెబ్‌సైట్: http://www.bemlindia.in

### ● ఎన్‌సీసీతో..

# ఇండియన్ ఆర్మీలో లెఫ్ట్‌నెంట్

ఎన్‌సీసీ సర్టిఫికేట్ ఉండి దేశ రక్షణ దళంలో పనిచేయాలనుకునే వారికోసం ఇండియన్ ఆర్మీ స్వాగతం పలుకుతోంది. షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో.. స్పెషల్ ఎంట్రీ ద్వారా అర్హులైన వారికి ఉద్యోగావకాశాలను కల్పిస్తోంది. అవివాహిత పురుష గ్రాడ్యుయేట్లు మాత్రమే వీటికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇంటర్వ్యూలో చూపించిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఈ నేపథ్యంలో.. ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి సమాచారం..

- » అవివాహిత పురుష గ్రాడ్యుయేట్లు అర్హులు
- » ఎంపికైన వారికి చెన్నైలో శిక్షణ
- » ప్రారంభంలోనే నెలకు రూ.లక్ష వేతనం




ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ నోటిఫికేషన్‌కు ఎంపికైన వారికి చెన్నైలో శిక్షణ అందిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్న వారిని లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. ఎంపికైన వారు మొదటి నెల నుంచే రూ.లక్షకు పైగా వేతనం పొందే అవకాశం ఉంటుంది.

#### ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ (మెన్)

మొత్తం ఖాళీలు: 70 (వీటిలో 7 పోస్టులను యుద్ధంలో మరణించిన సైనికోద్యోగుల పిల్లలకు.)

#### అర్హతలు

కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్నవారూ కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే మూడు అకడమిక్ ఇయర్స్ ఎన్‌సీసీ సీనియర్ డివిజన్ వింగ్‌లో కొనసాగిన వారై ఉండాలి. ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్‌లో కనీసం బీ గ్రేడ్ పొందాలి. యుద్ధంలో మరణించిన ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్ అవసరం లేదు.

#### వయసు

జనవరి 1, 2026 నాటికి 19 నుంచి 25 ఏళ్లలోపు ఉండాలి. జనవరి 2, 2001 జనవరి 1, 2007 మధ్య జన్మించినవారు అర్హులు.

#### ఫిజికల్ స్టాండర్డ్స్

ఫిజికల్ స్టాండర్డ్స్‌లో భాగంగా అభ్యర్థులు 2.4 కి.మీ పరుగును 10 నిమిషాల 30 సెకన్లలో పూర్తిచేయాలి. అలాగే పుష్ అప్స్-30, పుల్‌అప్స్-40, సిట్‌అప్-06 చేయాల్సి ఉంటుంది.

#### ఎంపిక ఇలా

వచ్చిన దరఖాస్తులను అభ్యర్థులు పొందిన అకడమిక్, ఎన్‌సీసీ మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఎన్‌సీసీలో ఏ గ్రేడ్ ఉంటే 50,బీ గ్రేడ్ ఉన్నవారికి 25 బోనస్ మార్కులు ఇస్తారు. అలాగే డిగ్రీలో పొందిన మార్కులకూ గరిష్ఠంగా 50 బోనస్ మార్కులు కేటాయించారు. ఈ రెండు మార్కులూ కలిపి ఖాళీలకు అనుగుణంగా అభ్యర్థులను సెలక్షన్ కేంద్రాల్లో నిర్వహించే ఇంటర్వ్యూలకు పిలుస్తారు.

#### రెండు దశల్లో ఇంటర్వ్యూ

తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఏపీ, తెలంగాణ వారికి బెంగళూరులో ముఖాముఖి ఉంటుంది. సైకాలజిస్ట్, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్, ఇంటర్వ్యూ ఆఫీసర్ ఆధ్వర్యంలో రెండు దశల్లో ఐదు రోజులు ఇంటర్వ్యూ కొనసాగుతుంది. తొలిరోజు స్టేజ్-1లో ఉత్తీర్ణులకే తర్వాతి 4 రోజుల స్టేజ్-2లో అవకాశమిస్తారు. ఇందులోనూ విజయవంతమైతే.. మెడికల్ టెస్టులు నిర్వహించి ట్రైనింగ్‌లోకి తీసుకుంటారు.

#### ఎంపికైతే శిక్షణ

ఎంపికైన వారికి ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడెమీ, చెన్నైలో 49 వారాలు శిక్షణ ఉంటుంది. ఈ సమయంలో ప్రతి నెలా రూ.56,100 స్టైపెండ్ చెల్లిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్నవారికి పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ డిగ్రీని మద్రాస్ యూనివర్సిటీ ప్రధానం చేస్తుంది. అనంతరం లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. ఇలా చేరినవారు పదేళ్లు ఉద్యోగంలో కొనసాగవచ్చు. ఆ తర్వాత సంస్థ అవసరాలు, అభ్యర్థుల ఆసక్తుల ప్రకారం కొందరిని శాశ్వత ఉద్యోగం (పర్మనెంట్ కమిషన్)లోకి తీసుకుంటారు. మిగిలినవారికి మరో నాలుగేళ్లు సర్వీస్ పొడిగిస్తారు. అనంతరం వీరు వైదొలుగుతారు. లెఫ్టినెంట్‌గా విధుల్లో చేరినవారు రెండేళ్ల అనుభవంతో కెప్టెన్, ఆరేళ్లకు మేజర్, 13 ఏళ్ల సేవలతో లెఫ్టినెంట్ కల్నల్ హోదాకు చేరుకోవచ్చు. వీరికి రూ.56,100 మూలవేతనంతోపాటు మిలిటరీ సర్వీస్ పే, డీఏ, హెచ్ఎస్ఏ, ఇతర అలవెన్సులు అందుతాయి. తొలి నెల నుంచే రూ.లక్షకు పైగా జీతం పొందవచ్చు.

#### ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు చివరి తేదీ: 2025, సెప్టెంబరు 10
- ఇంటర్వ్యూలు: 2025 నవంబర్ మొదటి వారంలో
- వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in

## క్లుప్తంగా...

### 118 ఏపీపీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 118 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ సెప్టెంబర్ 12 నుంచి ప్రారంభం కానుంది. దరఖాస్తులు సమర్పించేందుకు అక్టోబర్ 5 చివరి తేదీ అని టీఎస్ఎల్‌పీఆర్‌బీ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన స్థానిక అభ్యర్థులు దరఖాస్తు నమోదు, ప్రాసెసింగ్, పరీక్ష నిర్వహణ, పోర్టల్ నిర్వహణ మొదలైన వాటి కోసం రూ.1,000 చెల్లించాలని, ఇతరులు రూ.2,000 చెల్లించాలని పేర్కొన్నారు. అర్హతలు, సిలబస్ లాంటి పూర్తి వివరాల కోసం టీఎస్ఎల్‌పీఆర్‌బీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని సూచించారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ పరిధిలో 118 ఏపీపీ పోస్టుల భర్తీకి అనుమతిస్తూ ఆర్థిక శాఖ జూన్‌లో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే.

### ప్రజా ప్రతినిధుల విన్నపాలకు స్పందిస్తున్నాం

**జెడ్‌ఆర్‌యూసీసీ సమావేశంలో రైల్వే జీఎం శ్రీవాస్తవ**

సాక్షి, హైదరాబాద్: రైల్వే ప్రయాణికులకు వసతులు మెరుగుపరచటం, రైల్వే పరంగా విస్తరణ వంటి అంశాలకు సంబంధించి ప్రజా ప్రతినిధులు, రైల్వే ప్రయాణికుల సంఘాల నుంచి వచ్చిన విన్నపాలు, సూచనలు, తమ స్థాయిలో తీసుకునే చర్యలపై వెంటనే స్పందిస్తున్నామని, మిగతా వాటిని రైల్వే బోర్డు పరిశీలనకు పంపుతామని దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ తెలిపారు. బుధవారం రైల్ నిలయంలో జరిగిన దక్షిణ మధ్య రైల్వే జోనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ 76వ సమావేశం జరిగింది. సమావేశంలో ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, మాగుంట శ్రీనివాసులురెడ్డి, హరీశ్ బాలయోగితోపాటు జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు, డివిజినల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు, వాణిజ్య సంఘాలు, ప్రజలు పాల్గొన్నారు. టికెట్ల జారీలో ఇబ్బందులు, రైళ్ల కొరత, సమయపాలనలో సమస్యలు, కొత్త రైళ్ల ఏర్పాటు ఇలా పలు అంశాలకు సంబంధించి వందల సంఖ్యలో వినతులు అందించారు. విన్నపాలలో వెంటనే చేపట్టేవాటికి స్పందిస్తున్నామని జీఎం చెప్పారు. ఏప్రిల్–ఆగస్టు మధ్య రికార్డు స్థాయిలో రూ.8,593 కోట్ల (ఆరిజినేటింగ్) ఆదాయాన్ని జోన్ సాధించిందని జీఎం వారి దృష్టికి తెచ్చారు. కొత్త లైన్ల విస్తరణ, కవచ్ ఏర్పాటు, వందేభారత్ రైళ్ల ప్రారంభం, వాటి పనితీరు, స్టేషన్ భవనాల ఆధునీకరణ తదితర వివరాలను ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

### ఫాల్కన్ కేసులో మరొకరి అరెస్ట్

**ఆర్యన్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్న ఈడీ**

సాక్షి, హైదరాబాద్: వ్యాపారంలో పెట్టుబడుల పేరుతో ఆర్థిక మోసానికి పాల్పడ్డ ఫాల్కన్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు మరో కీలక నిందితుడిని అరెస్ట్ చేశారు. కేపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆర్యన్ సింగ్‌ను అరెస్ట్ చేసినట్లు ఈడీ హైదరాబాద్ జోనల్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఫాల్కన్ కేసులో సైబరాబాద్ పోలీసులు నమోదు చేసిన 3 వేర్వేరు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా మనీలాండరింగ్ అంశంపై ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. కేసు దర్యాప్తులో భాగంగా సంస్థ వ్యవస్థాపకుడు, ప్రైవేట్ జెట్ యజమాని అమర్‌దీప్ కుమార్‌తోపాటు మరి కొందర్ని ఈడీ అధికారులు ఇదివరకే అరెస్ట్ చేశారు. తాజాగా ఆర్యన్‌సింగ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం నాంపల్లిలోని పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టు నిందితుడికి 14 రోజుల జుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో అతన్ని రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు.

### ప్రతి కార్మికుడికి పింఛన్!

- ఎన్‌పీఎస్ పరిధిలోకి వచ్చేలా కార్యాచరణ
- పీఎఫ్ఆర్‌డీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మమత రోహిత్



సాక్షి, హైదరాబాద్: ప్రతి కార్మికుడికి పింఛన్ అందించడమే లక్ష్యంగా కేంద్రం కార్యాచరణ రూపొందిస్తోందని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) కార్యనిర్వాహక సంచాలకురాలు మమత రోహిత్ స్పష్టం చేశారు. బుధవారం హెచ్ఐసీసీలో జరిగిన ఎఫ్‌పీఓ కాన్‌క్లేవ్–2025లో ఆమె పాల్గొన్నారు. అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ పీఎఫ్ఆర్‌డీఏ పరిధిలో అమలుచేస్తున్న నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్), అటల్ పెన్షన్ యోజన (ఏపీవై)తోపాటు ఇతర పథకాలకు సంబంధించిన అంశాలను వెల్లడించారు. దేశవ్యాప్తంగా 46 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులుండగా, 17 కోట్ల మంది మాత్రమే పింఛన్ పథకాల ద్వారా ప్రయోజనం పొందే అవకాశం ఉందని చెప్పారు. 2047 నాటికి దేశంలోని ప్రతి కార్మికుడికి పింఛన్ పథకం అందేలా కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోందన్నా రు. అత్యధిక సంఖ్యలో కార్మికులున్న వ్యవసాయ, అనుబంధ రంగాలను లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు.

---

ఆర్థికంగా ఎదగాలన్న ఆశ, సామాజికంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలన్న ఆకాంక్ష, కీర్తి ప్రతిష్టల కోసం పాకులాట.. ఈ పోటీ ప్రపంచంలో మనుషుల్ని మానసిక రోగులుగా మార్చేస్తున్నాయి. పైకి ఆరోగ్యంగా కనిపిస్తున్నా.. మనుషుల్లో ఒత్తిడులు, మనో వైకల్యాలు అధికంగా ఉంటున్నాయి. అనుకోనివి జరగడం 'ఆందోళన'లోకి, అనుకున్నవి జరగకపోవటం 'ఒత్తిడి'లోకి మనుషుల్ని నెట్టేస్తున్నాయి.. ప్రాణాల మీదకు తెస్తున్నాయి.. ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా నివేదిక స్పష్టం చేసింది. **సాక్షి, స్పెషల్ డెస్క్**



**భారత్ ఎదుర్కొంటున్న సవాళ్లు ▶**
- తగినన్ని మానసిక చికిత్స ఆసుపత్రులు లేకపోవటం
- ఉన్నవాటిలో కూడా నిర్వహణ పరమైన లోపాలు
- రోగుల పట్ల సిబ్బంది క్రూరత్వం, నిర్లక్ష్యం
- విధి నిర్వహణలో ఉదాసీనత, నిధుల లేమి
- శిక్షణ పొందిన నర్సులు, సోషల్ వర్కర్‌లు, సైకియాట్రిస్టులు, సైకాలజిస్టులు, కౌన్సెలర్‌లు, ఇతర ఆరోగ్య కార్యకర్తల తీవ్ర కొరత.

# ఒత్తిడి.. ఆందోళన

# ఇవేనయా ప్రపంచాన!

| 100 కోట్ల మందికి మానసిక రుగ్మతలు | ప్రతి 100 మరణాలలో ఒకటి ఆత్మహత్య | ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా నివేదిక |
|---|---|---|


ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న ప్రతి 100 మరణాలలో ఒకటి ఆత్మహత్యేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తాజాగా వెల్లడించింది. 2021లో మొత్తం 7,27,000 మంది వివిధ వయసులలోని వారు ఆత్మహత్య కారణంగా ప్రాణాలు కోల్పోయారని తెలిపింది. 20 కంటే ఎక్కువ ఆత్మహత్యా యత్నాలలో ఒక ఆత్మహత్య మరణం సంభవిస్తున్నట్లు డబ్ల్యూహెచ్ఓ పేర్కొంది. మొత్తం మీద ప్రపంచంలో 100 కోట్ల మందికి పైగా వివిధ మానసిక ఆరోగ్య రుగ్మతలతో జీవిస్తున్నారని నివేదించింది.

**మెంటల్ హెల్త్ అట్లాస్ 2024**


'వరల్డ్ మెంటల్ హెల్త్ టుడే', 'మెంటల్ హెల్త్ అట్లాస్ 2024'అనే రెండు కొత్త అధ్యయన నివేదికల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ వివరాలన్నిటినీ పొందుపరిచింది. రానున్న వారాల్లో, 'మెంటల్ హెల్త్ అట్లాస్ 2024'నివేదికలో భాగంగా దేశాల వారీగా డేటాను విడుదల చేయనుంది. కోవిడ్ తర్వాత మానసిక అనారోగ్యాలపై డబ్ల్యూహెచ్ఓ చేపట్టిన తొలి కీలకమైన అధ్యయనాలివి.

**40 దాటితే సమస్యలే**

- 2021లో ప్రపంచ వ్యాప్తంగా 5 కోట్ల 70 లక్షల మందిలో మానసిక రుగ్మతలు నమోదు అయ్యాయి. (బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెంటల్ హెల్త్, న్యూరో సైన్సెస్ నివేదిక ప్రకారం ఇండియాలో 3 కోట్ల మంది తీవ్రమైన మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు)
- మొత్తం రుగ్మతల్లో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువగా ఆందోళన, ఒత్తిడి ఉంటున్నాయి.
- 2011– 2021 మధ్య, మానసిక రోగుల సంఖ్య ప్రపంచ జనాభా కంటే వేగంగా పెరిగింది.



- పురుషులలో ఆత్మవిశ్వాసం తక్కువగా ఉండటం, బలహీనమైన బంధాలు, (అటెన్షన్ డెఫిసిట్ హైపర్‌యాక్టివిటీ డిజార్డర్ – ఏడీహెచ్‌డీ, ఆటిజం స్పెక్ట్రమ్) వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. 18 ఏళ్లలోపు వారిలో.. వయసుకు తగ్గ మానసిక ఎదుగుదల, నైపుణ్యాలు లేకపోవడం వంటివి ఎక్కువగా ఉంటున్నాయి.
- స్త్రీలలో ప్రధాన సమస్యలు.. ఆందోళన, ఒత్తిడి, ఈటింగ్ డిజార్డర్ (ఎక్కువ లేదా తక్కువ తినడం వంటి రుగ్మతలు).
- నలభై ఏళ్లు దాటాక ఒత్తిడి, ఆందోళన పెరిగిపోతున్నాయి.
- 50 – 69 సంవత్సరాల మధ్య మనోవైకల్యాలు గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్నాయి.



**ప్రధాన మానసిక రుగ్మతలు ▶**
- మానవాళిని చుట్టు ముడుతున్న మానసిక రుగ్మతల్లో 'ఆందోళన', 'ఒత్తిడి'లను ప్రధానమైనవిగా డబ్ల్యూహెచ్ఓ గుర్తించింది. 2021లో, అన్ని మానసిక రుగ్మతల్లో ఇవి రెండూ 'మూడింట రెండు వంతుల'కంటే ఎక్కువగా ఉన్నట్లు కనుగొంది. నివేదిక ప్రకారం – 2011–2021 మధ్య మానసిక రోగుల సంఖ్య ప్రపంచ జనాభా కంటే వేగంగా పెరిగింది! దశాబ్దం క్రితం జనాభాలో 0.9 తొమ్మిది శాతంగా ఉన్న మానసిక రుగ్మతలు 13.6 శాతానికి చేరాయి.

**లక్ష్యానికి దూరంగా ఐరాస ▶**
- అన్ని దేశాలలో, అన్ని సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో యువతలో సంభవించే మరణాలలో ఆత్మహత్యలే ఎక్కువగా ఉంటున్నాయి. 2030 నాటికి కనీసం మూడింట ఒక వంతు ఆత్మహత్యలను తగ్గించటానికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా ఐక్యరాజ్య సమితి పెట్టుకున్న లక్ష్యం నెరవేరేలా కనిపించటం లేదు. ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే ఆ గడువు నాటికి 13 శాతం తగ్గుదల మాత్రమే సాధ్యం అయ్యేలా ఉందని డబ్ల్యూహెచ్ఓ అంచనా వేస్తోంది.

---

# ఇక బ్రెడ్డు, బన్ను, చపాతీ, పరోటా చౌక

▶ మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక పన్ను రేటు 3 శాతం ఇక ముందూ కొనసాగనుంది. సెప్టెంబర్ 22 నుంచే (దేవీ నవరాత్రి వేడుకలు మొదలయ్యే రోజు) కొత్త రేట్లు అమల్లోకి రానున్నాయి. కేంద్రం ప్రతిపాదనలకు అన్ని రాష్ట్రాలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపినట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ''సామాన్యుడిని దృష్టిలో పెట్టుకుని ఈ సంస్కరణలు చేపట్టాం. సామాన్యులు రోజువారీ వినియోగించే అధిక శాతం వస్తువులపై పన్ను రేట్లు గణనీయంగా తగ్గనున్నాయి. కార్మికుల ఆధారిత రంగాలకు చక్కని మద్దతు లభిస్తుంది. రైతులు, వ్యవసాయ రంగం, ఆరోగ్య రంగం ప్రయోజనం పొందుతాయి. ఆర్థిక వ్యవస్థలోని కీలక చోదకాలకు ప్రాధాన్యం ఇచ్చాం''అని మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. వ్యాపార నిర్వహణ సైతం సులభతరం అవుతుందని, నిబంధనల అమలు సరళంగా మారుతుందన్నారు. తాజా పన్ను శ్లాబుల క్రమబద్ధీకరణతో రూ.48,000 కోట్ల ఆదాయం తగ్గిపోనుందని, ద్రవ్యపరంగా దీన్ని ఎదుర్కోగలమని కేంద్ర రెవెన్యూ కార్యదర్శి అరవింద్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ నిర్ణయాలతో దేశీ వినియోగం మరింత పెరుగుతుందన్నది కేంద్ర ప్రభుత్వం అంచనా. మన జీడీపీలో 61.4% వినియోగం రూపంలోనే సమకూరుతుండడం గమనార్హం. జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి వచ్చిన రెండో ఏడాదిలో జీడీపీ వృద్ధి 0.5% మేర అదనంగా నమోదవుతుందని ఆర్థిక వేత్తల అంచనా. భారత ఉత్పత్తులపై అమెరికా విధించిన 50 శాతం టారిఫ్‌లు దేశ ఆర్థిక వృద్ధిని 0.20–0.50 శాతం ప్రభావితం చేస్తాయన్న ఆందోళనలు నెలకొనగా.. జీఎస్టీ సంస్కరణలతో ఈ ప్రభావం సమసిపోనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**వీటి ధరలు దిగొస్తాయ్..**

ప్రస్తుతం బ్రాండెడ్ బ్రెడ్, బ్రెడ్ ఉత్పత్తులపై 5–18% మేర జీఎస్టీ అమల్లో ఉండగా ఇది తొలగిపోనుంది. పరాటాపై 18%, చపాతీ, యూహెచ్‌టీ పాలపై 5 శాతం రేటును ఎత్తివేయనున్నారు. నిత్యావసరాలైన టూత్‌పేస్ట్, టూత్ బ్రష్‌లు, టాల్కమ్ పౌడర్, షాంపూలు, సబ్బులు, హెయిర్ ఆయిల్, బటర్, నెయ్యి, మాంసం, బిస్కెట్లతో పాటు షుగర్ కన్ఫెక్షనరీ, జామ్, ఫ్రూట్ జెల్లీలు, డ్రై నట్స్, ఐస్‌క్రీమ్, పండ్ల రసాలు, కార్న్‌ఫ్లెక్స్ తదితర ఉత్పత్తులపై 18% జీఎస్టీ 5 శాతానికి తగ్గిపోనుంది. ఇక వంటింటి వస్తువులు, గొడుగులు, సైకిళ్లు, వెదురు ఫర్నిచర్ వస్తువులు, ఫీడింగ్ బాటిళ్లు, టూత్ పౌడర్‌పై పన్ను 12% నుంచి 5 శాతానికి దిగిరానుంది. సిమెంట్‌పైనా పన్ను 28% నుంచి 18 శాతానికి తగ్గనుంది. 350 సీసీ ఇంజిన్ సామర్థ్యం వరకు ఉన్న ద్విచక్ర మోటారు వాహనాలు, ఏసీలు, డిష్‌వాషర్లు, టీవీలు (32 అంగుళాలకు పైన) తదితర ఎలక్ట్రానిక్స్ వస్తువులపైనా ధరల భారం 28 శాతం నుంచి 18 శాతానికి దిగిరానుంది. 1,200 సీసీ, 4,000 ఎంఎం పొడవు మించని పెట్రోల్, ఎల్పీజీ, సీఎన్జీ వాహనాలు, 1,500 సీసీ వరకు ఉన్న డీజిల్ వాహనాలపైనా పన్ను రేటు 18 శాతానికి తగ్గనుంది. ఎలక్ట్రిక్ వాహనాలపై ఎప్పటి మాదిరే 5 శాతం పన్ను కొనసాగనుంది.

**కూల్ డ్రింక్స్ కాస్ట్‌లీ**

1,200 సీసీ సామర్థ్యానికి మించిన విలాస పెట్రోల్ కార్లు, 1500 సీసీ సామర్థ్యానికి మించిన విలాస డీజిల్ కార్లు, 350సీసీకి పైన ద్విచక్ర వాహనాలు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు (వ్యక్తిగత వినియోగానికి), రేసింగ్‌కార్లు, క్యాసినోలు/గ్యాంబ్లింగ్/గుర్రపు పందేలు/లాటరీలపై పన్ను రేటు 28% నుంచి 40 శాతానికి పెరగనుంది. కూల్ డ్రింక్స్ (చక్కెర కలిసిన ఏరేటెడ్ వాటర్స్, ఫ్లావర్డ్ డ్రింక్స్), పొగాకు, పాన్‌మసాలా, గుట్కా, సిగరెట్లు, నమిలే పొగా కు ఉత్పత్తులు, ముడి పొగాకు, బీడీ, సెంటెడ్ పొగాకు, సిగరెట్లు, సిగార్స్‌పై పన్ను 28%నుంచి 40 శాతానికి పెరగనున్నాయి.

**పొగాకు ఉత్పత్తులపై ప్రస్తుతానికి 28 శాతం**

సిగరెట్లు, గుట్కాలు, పాన్ మసాలా, జర్దా పొగాకు ఉత్పత్తులపైనా 40 శాతం పన్ను రేటును ప్రతిపాదించినప్పటికీ ప్రస్తుతానికి 28 శాతం జీఎస్టీ, దీనిపై కాంపన్సేషన్ సెస్సును కొనసాగించనున్నారు. రాష్ట్రాలకు ఆదాయ నష్టాన్ని భర్తీ చేసేందుకు తీసుకున్న రుణాలను తిరిగి పూర్తిగా చెల్లించేంత వరకు ఇది కొనసాగుతుందని ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు. ఆ తర్వాత వీటిపైనా 40% పన్ను రేటు అమలు కానుంది. ఇది ఎప్పటి నుంచి అన్నది జీఎస్టీ మండలి తర్వాత నిర్ణయిస్తుంది.

**పౌరుల జీవనం మెరుగుపడుతుంది**

కేంద్రం ప్రతిపాదించిన పన్ను తగ్గింపులు, జీఎస్టీ సంస్కరణలకు జీఎస్టీ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలు సామాన్యులకు, రైతులు, ఎంఎస్ఎంఈలు, మధ్య తరగతి ప్రజలు, మహిళలు, యువతకు ప్రయోజనం కలిగిస్తాయి. ఈ విస్తృత స్థాయి సంస్కరణలు పౌరుల జీవనాన్ని మెరుగుపరుస్తాయి. వ్యాపార నిర్వహణ అన్నది, ముఖ్యంగా చిన్న వర్తకులు, వ్యాపారులకు సులభతరం అవుతుంది''
– ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై ప్రధాని మోదీ స్పందన

| ఆరోగ్యానికి దన్ను | ప్రస్తుత | కొత్త |
|---|---|---|
| వ్యక్తిగత హెల్త్, జీవిత బీమా | 18 | నిల్ |
| థర్మామీటర్లు | 18 | 5 |
| మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్ | 12 | 5 |
| అన్ని డయాగ్నోస్టిక్ కిట్స్, రీఏజెంట్లు | 12 | 5 |
| గ్లూకోమీటరు, టెస్ట్ స్ట్రిప్‌లు | 12 | 5 |
| కరెక్టివ్ కళ్లద్దాలు | 12 | 5 |
| **విద్యకు ఊతం** | | |
| మ్యాప్‌లు, చార్ట్‌లు, గ్లోబ్‌లు | 12 | నిల్ |
| పెన్సిళ్లు, షార్ప్‌నర్లు, క్రేయాన్లు, పేస్టెల్స్ | 12 | నిల్ |
| ఎక్సర్‌సైజ్ బుక్స్, నోట్ బుక్స్ | 12 | నిల్ |
| ఎరేజర్లు | 5 | నిల్ |

| రైతుల అభ్యున్నతి | ప్రస్తుత | కొత్త |
|---|---|---|
| ట్రాక్టర్ టైర్లు, విడిభాగాలు | 18 | 5 |
| ట్రాక్టర్లు | 12 | 5 |
| నిర్దిష్ట బయో-పెస్టిసైడ్స్, సూక్ష్మ పోషకాలు | 12 | 5 |
| డ్రిప్ ఇరిగేషన్ సిస్టం, స్ప్రింక్లర్లు | 12 | 5 |
| సాగు యంత్రాలు | 12 | 5 |
| **ఎలక్ట్రానిక్ ఉపకరణాలపై ఆదా** | | |
| ఎయిర్ కండీషనర్లు | 28 | 18 |
| టీవీలు (32 అంగుళాలకు పైన) (ఎల్ఈడీ, ఎల్‌సీడీ టీవీలు సహా) | 28 | 18 |
| మానిటర్లు, ప్రొజెక్టర్లు | 28 | 18 |
| డిష్ వాషింగ్ మెషిన్లు | 28 | 18 |

| వాహనాలు చౌక | ప్రస్తుత | కొత్త |
|---|---|---|
| పెట్రోల్, పెట్రోల్ హైబ్రిడ్, ఎల్‌పీజీ, సీఎన్‌జీ కార్లు (1200 సీసీ, 4000 మి.మీ. మించనివి) | 28 | 18 |
| డీజిల్, డీజిల్ హైబ్రిడ్ కార్లు (1500 సీసీ, 4000 మి.మీ. మించనివి) | 28 | 18 |
| 3 వీలర్లు | 28 | 18 |
| మోటర్‌సైకిళ్లు (350 సీసీ, అంతకు లోపు) | 28 | 18 |
| వస్తువుల రవాణాకు ఉపయోగించే మోటర్ వాహనాలు | 28 | 18 |

## రాష్ట్రాలకు లాభమే!

**జీఎస్టీ శ్లాబ్ రేట్ల క్రమబద్ధీకరణతో రాష్ట్రాలకు అదనంగా రూ.4 లక్షల కోట్లు**
**తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణాది రాష్ట్రాలకు పెద్ద ఎత్తున లబ్ధి**
**తాజా నివేదికలో అంచనా వేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

సాక్షి, హైదరాబాద్: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) శ్లాబ్ రేట్లను క్రమబద్ధీకరించడం ద్వారా రాష్ట్రాల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తెలిపింది. ఈ మేరకు ఎస్‌బీఐ పరిశోధనా విభాగం ఓ పత్రాన్ని వెలువరించింది. ఈ నివేదిక ప్రకారం జీఎస్టీ వసూళ్లు, కేంద్ర పన్నుల్లో వాటా పంపిణీ ద్వారా రాష్ట్రాలకు 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.14 లక్షల కోట్లకు పైగా సమకూరుతాయని తెలిపింది. శ్లాబ్ రేట్ల క్రమబద్ధీకరణకు ముందు ఆయా రాష్ట్రాలన్నీ కలిపి జీఎస్టీ, కేంద్ర పన్నుల్లో వాటా రూపంలో దాదాపు రూ.9.9 లక్షల కోట్లు పొందుతాయని అంచనా వేయగా, క్రమబద్ధీకరణ తర్వాత రూ.4.2 లక్షల కోట్ల మేర అదనపు ప్రయోజనం కలుగుతుందని వెల్లడించింది. జీఎస్టీ అమలు చేసిన అనంతరం ఐదేళ్ల పాటు రాష్ట్రాలకు కేంద్రం నుంచి వచ్చిన పరిహారం రూపంలో 14 శాతం మేర ఆయా రాష్ట్రాల రెవెన్యూ వసూళ్లు పెరిగాయని తెలిపింది. ఇప్పుడు కూడా అదే రీతిన రాష్ట్రాల ఆదాయం పెరుగుతుందని అంచనా వేసింది. జీఎస్టీ శ్లాబ్ రేట్ల క్రమబద్ధీకరణ అనంతరం ఎస్‌జీఎస్టీ, సీజీఎస్టీ కలిపి మొత్తం రూ.19.9 లక్షల కోట్ల మేర రెవెన్యూ వస్తుందని, అందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు చెరో రూ.10 లక్షల కోట్లను పంచుకుంటాయని వివరించింది. దీనికి తోడు కేంద్రానికి వచ్చే రూ.10 లక్షల కోట్ల నుంచి 41 శాతం పన్నుల్లో వాటా కింద రాష్ట్రాలకు ఇస్తుందని, ఈ లెక్కన మరో రూ.4.1 లక్షల కోట్లు వస్తాయని ఆ నివేదికలో వెల్లడించింది. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ తదితర దక్షిణాది రాష్ట్రాలు ఈ ఆర్థిక సంవత్సరంలో వస్తుందని అంచనా వేసినదాని కంటే ఎక్కువ జీఎస్టీ పొందుతాయని అంచనా వేసింది.

**ఎస్‌బీఐ నివేదిక ప్రకారం శ్లాబ్ రేట్ల మార్పు తర్వాత దక్షిణాది రాష్ట్రాలకు వచ్చే ఆదాయ అంచనా**

| రాష్ట్రం | జీఎస్టీ అంచనా | వచ్చేది | పెరిగే మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| తెలంగాణ | 42,075 | 50,779 | 8,705 |
| ఆంధ్రప్రదేశ్ | 35,863 | 52,622 | 16,759 |
| కర్ణాటక | 99,137 | 1,14,240 | 15,103 |
| తమిళనాడు | 72,309 | 89,200 | 16,892 |
| కేరళ | 24,786 | 32,758 | 7,972 |

## రాష్ట్ర ఆదాయ ప్రయోజనాలు కాపాడండి

**జీఎస్టీ కౌన్సిల్ భేటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర ఆదాయ ప్రయోజనాలను కాపాడేందుకు తెలంగాణ మరోసారి జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో బలమైన వాదనను వినిపించింది. జీఎస్టీ హేతుబద్ధీకరణ అమలుతో రాష్ట్రాలకు నష్టాలు తలెత్తే అవకాశమున్న నేపథ్యంలో, వాటిని భర్తీ చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. దేశ రాజధాని ఢిల్లీలోని సుష్మా స్వరాజ్ భవన్‌లో బుధవారం జరిగిన 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో భట్టి పాల్గొన్నారు. పరిహార సెస్ పునర్వ్యవస్థీకరణ, జీవిత, ఆరోగ్య బీమా రేటు హేతుబద్ధీకరణపై మంత్రుల బృందాలు సమర్పించిన తుది నివేదికలు సమావేశంలో చర్చకు వచ్చాయి. జీవిత, ఆరోగ్య బీమాకు సంబంధించిన మంత్రుల బృందంలో తెలంగాణ భాగస్వామిగా ఉండగా, వ్యక్తిగత జీవిత, ఆరోగ్య బీమాలపై పన్ను మినహాయింపు కల్పించాలని సిఫారసు చేసినట్లు భట్టి విక్రమార్క వివరించారు. పన్ను రేటు హేతుబద్ధీకరణ వల్ల పన్ను శ్లాబులు తగ్గుతాయని, ముఖ్యంగా సామాన్య ప్రజలు ఉపయోగించే వస్తువులపై పన్ను భారాన్ని తగ్గించే దిశగా ఇది సానుకూల నిర్ణయం అవుతుందని తెలంగాణ పేర్కొంది.

**అదనపు లెవీలతో కేంద్రానికే ఆదాయం**

ప్రస్తుతానికి సిన్ ఉత్పత్తులు (సిగరెట్లు, గుట్కా, మద్యం మొదలైనవి), అలాగే లగ్జరీ ఉత్పత్తులపై పన్ను రేట్లు ప్రతిపాదిత 40 శాతం జీఎస్టీ శ్లాబ్ కంటే ఎక్కువగా ఉన్నాయని భట్టి గుర్తు చేశారు. ఈ పరిస్థితిలో హేతుబద్ధీకరణ తర్వాత కూడా అదే పన్ను భారాన్ని కొనసాగించేందుకు వీలుగా కేంద్రం జీఎస్టీ పరిధికి వెలుపల అదనపు లెవీలు విధించే అవకాశం ఉందని అన్నారు. ఈ విధంగా వచ్చే ఆదాయం మొత్తం కేంద్ర ఖజానాకు మాత్రమే చేరుతుందని, రాష్ట్రాలకు లాభం ఉండదని పేర్కొన్నారు. పన్ను రేటు హేతుబద్ధీకరణ అమలులోకి వస్తే రాష్ట్రాలకు ఆదాయంలో తగ్గుదల తప్పదని అన్నారు. ఈ నేపథ్యంలో జీఎస్టీకి వెలుపల లెవీల రూపంలో కేంద్రానికి లభించే అదనపు ఆదాయాన్ని రాష్ట్రాలతో పంచుకోవాలని గట్టిగా డిమాండ్ చేశారు.

## హైదరాబాద్‌కు మరో వందేభారత్

**సికింద్రాబాద్–పుణె మధ్య త్వరలో ప్రారంభం**

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌కు మరో వందేభారత్ రైలు రాబోతోంది. సికింద్రాబాద్–పుణే మధ్య ఇది నడవనుంది. ఈ రెండు నగరాల మధ్య రైలు ప్రయాణికుల సంఖ్య భారీగా ఉన్నందున వందేభారత్ రైలు నడపాలని గతంలోనే నిర్ణయించారు. కానీ, రేక్ అందుబాటులో లేక జాప్యం జరిగింది. తాజాగా హైదరాబాద్ నుంచి పుణేకు నడిపేందుకు రేక్ కేటాయించినట్టు తెలిసింది. నెల రోజుల్లో దాన్ని పట్టాలెక్కించేందుకు రైల్వే బోర్డు ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్–పుణే మధ్య ప్రయాణికుల సంఖ్య భారీగా ఉంది. ప్రస్తుతం ఈ రెండు నగరాల మధ్య 17 రైళ్లు నడుస్తుండటం విశేషం.

**8 గంటల్లోనే..:** రెండు నగరాల మధ్య 592 కి.మీ. దూరం ఉంది. సాధారణ రైళ్లు గమ్యం చేరేందుకు 11 గంటల నుంచి 13 గంటల సమయం పడుతోంది. శతాబ్ది రైలు 8.30 గంటలు, దురంతో 8.45 గంటల సమయం తీసుకుంటున్నాయి. ఈ నిడివిని వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 8 గంటల్లో చేరుకోనుంది. దీంతో అత్యంత వేగంగా వెళ్లే రైలుగా వందేభారత్ నిలవనుంది. వందేభారత్ రైలు ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మధ్యాహ్నం పుణేకు చేరుకుంటుంది. అక్కడ మధ్యాహ్నం బయలుదేరి తిరిగి రాత్రి 11 వరకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు సర్వీసు ప్రారంభమయ్యాక డిమాండ్‌ను బట్టి దురంతోను కొనసాగించాలా వద్దా నిర్ణయించనున్నారు.

## ఎడ్లబండిపై ఊరేగించి..

**సన్మానం..**

**రిటైర్డ్ ఉపాధ్యాయునికి ఘనంగా సన్మానం**



ఓదెల(పెద్దపల్లి): పదేళ్లపాటు విద్యాబుద్ధులు నేర్పి ఆదర్శంగా తీర్చిదిద్దిన రిటైర్డ్ ఉపాధ్యాయుడిని విద్యార్థులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఎడ్లబండిపై ఊరంతా ఊరేగించారు. గ్రామస్తులు పూలవర్షం కురిపించి ఘనంగా వీడ్కోలు పలికారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కనగర్తిలోని దాసరి పద్మ – హన్మయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రజాక్ మియా పదేళ్లుగా విద్యాబోధనలతో నూతన ఒరవడి సృష్టించారు. చిన్నారులను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారు. పదో తరగతిలో టాపర్‌గా నిలుస్తున్న వారికి సొంత నిధులు వెచ్చిస్తూ నగదు ప్రోత్సాహకాలు ప్రకటిస్తున్నారు. ఈక్రమంలోనే ఆయన ఉద్యోగ విరమణ తెలిసి.. విద్యార్థులు, తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఎడ్లబండిపై పాఠశాల నుంచి గ్రామంలోని ప్రధాన రహదారుల వెంట సుమారు రెండుగంటల పాటు ఊరేగించారు. కార్యక్రమంలో ఓదెల, ఎలిగేడు ఎంఈవోలు ఎర్ర రమేశ్, నరేంద్రాచారి, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు, గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## తప్ప తాగి.. క్లాస్‌లోనే నిద్రపోయి..

**సస్పెన్షన్..**

**ఆసిఫాబాద్ జిల్లా గిరిజన పాఠశాలలో ఓ టీచర్ నిర్వాకం**



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/జైనూర్: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు తరగతి గదిలోనే తప్ప తాగి నిద్రపోయాడు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం పార గ్రామ పంచాయతీ పరిధి సుకుడుపల్లి గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో ఏకోపాధ్యాయునిగా జాదవ్ విలాస్ పనిచేస్తున్నారు. జాదవ్ గత కొద్దిరోజులుగా బడికి మద్యం తాగి వస్తూ పాఠాలు చెప్పకుండా నిద్రపోతున్నాడు. ఇది గుర్తించిన గ్రామ మాజీ సర్పంచ్ మెస్రం గోవిందరావు బుధవారం జాదవ్ మద్యం తాగి బల్ల కిందనే పడుకోవడాన్ని వీడియో తీసి ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు పంపించాడు. తీవ్రంగా పరిగణించిన అధికారులు విచారణ చేపట్టారు. ఎస్సీఆర్పీ, స్థానిక ఎస్సై రవికుమార్ విచారణలో మద్యం సేవించినట్లు తేల్చారు. బ్యాగులో కూడా మద్యం బాటిల్ ఉన్నట్లు గుర్తించి అధికారులకు నివేదిక ఇచ్చారు. దీంతో ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఆర్.రమాదేవి ఉత్తర్వులు జారీ చేశారు.

## హైదరాబాద్ నుంచి ఆమ్‌స్టర్‌డ్యామ్‌కు నేరుగా విమాన సర్వీసులు

శంషాబాద్: నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డ్యామ్ నగరానికి హైదరాబాద్ నుంచి నేరుగా విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన కేఎల్ 874 విమానం బుధవారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి తన తొలి సర్వీసును టేకాఫ్ తీసుకుని ఆమ్‌స్టర్‌డ్యామ్ నగరంలోని షిపోల్ విమానాశ్రయానికి బయలుదేరింది. హైదరాబాద్ నుంచి సోమ, బుధ, శనివారాల్లో ఈ సర్వీసులు ఉంటాయి. ఆమ్‌స్టర్‌డ్యామ్ షిపోల్ విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు ఆది, మంగళ, శుక్రవారాలు విమాన సర్వీసులు అందుబాటులో ఉంటాయి. ఢిల్లీ, ముంబై, బెంగళూరు తర్వాత భారత్‌లోకి నాలుగో గేట్‌గా ఆమ్‌స్టర్‌డ్యామ్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తమ సర్వీసులు ప్రారంభించినట్లు ఈ సందర్భంగా కేఎల్ఎం సీవోవో స్టీవెన్ మార్టెన్ తెలిపారు. దీనిద్వారా ఫార్మా, ఐటీ, పర్యాటక రంగాల్లో పురోగాభివృద్ధికి బాటలు పడతాయని నెదర్లాండ్స్ రాయబారి మారిసా గెరార్డ్స్ అన్నారు. కొత్త కనెక్టివిటీ యూరప్, ఉత్తర అమెరికా బంధాలను మెరుగుపరుస్తుందని ఎయిర్‌పోర్టు సీఈవో ప్రదీప్ ఫణికర్ పేర్కొన్నారు.

## అధికారికంగా కాళోజీ జయంత్యుత్సవాలు

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ తెలంగాణ కవి కాళోజీ నారాయణరావు జయంతి ఉత్సవాలను ఏటా సెప్టెంబర్ 9న రాష్ట్ర పర్వదినంగా జరుపుకోవాలని ఆదేశిస్తూ సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి రఘునందన్ రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్లు, అన్ని ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, విద్యా సంస్థలు ఈ మేరకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 

# 'నరేగ' పనుల్లో నారీ శక్తి

## మట్టి పనుల్లో 'మేము సైతం' అంటున్న మహిళలు

- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో వారిదే ఆధిక్యం
- దేశవ్యాప్తంగా 27.64 కోట్ల మంది.. అందులో మహిళలు 13.85 కోట్లు
- చురుగ్గా పాల్గొంటున్న 12.16 కోట్ల మందిలో ఆరున్నర కోట్ల మంది మహిళలే
- తమిళనాడు, కేరళ, రాజస్తాన్, పంజాబ్‌లో అత్యధికం.. అదే వరుసలో తెలంగాణ
- తెలంగాణలో నల్లగొండ, ములుగు, మహబూబాబాద్ జిల్లాలు
- దినసరి కూలీలకు 'ఉపాధే'మేలంటున్న మహిళా కూలీలు



హనుమకొండ జిల్లా వేలేరు మండలం లోక్యాతండా గ్రామంలోని తిప్పాయకుంట చెరువులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

- సాక్షి ప్రతినిధి, వరంగల్

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్–నరేగ)లో మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. దేశ వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో 70 శాతం మంది కూలీలు మహిళలే పనిచేస్తున్నట్లు అధికారుల నివేదికలు చెబుతున్నాయి. దేశ వ్యాప్తంగా రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలలో అత్యధికంగా మహిళా కూలీలే పాల్గొంటున్నట్లు.. ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన నివేదికలో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ వెల్లడించింది. భూమి అభివృద్ధి, చెరువుల తవ్వకం వంటి పనుల్లో పురుషులతో సమానంగా కష్టపడుతున్నారు. కుటుంబ పోషణకు కావలసిన ఆర్థిక సహాయాన్ని అందిస్తూ ఇంటిని చక్కదిద్దడంలో భాగస్వామ్యం వహిస్తున్నారు. పురుషులతో సమానంగా వ్యవసాయం, భూమి అభివృద్ధి, చెరువు కాలువల తవ్వకం, ఫిష్‌పాండ్ తవ్వకాలు వంటి మట్టి పనుల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

### దేశ వ్యాప్తంగా 'ఉపాధి'లెక్క ఇదీ.

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ గణాంకాల ప్రకారం.. దేశంలో 741 జిల్లాలు.. 2,69,228 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పథకం అమలవుతోంది. ఇందుకోసం 27.64 కోట్ల మంది ఉపాధి పనుల్లో పాల్గొనేందుకు జాబ్‌కార్డులు పొందారు. ఇందులో 12,16,19,422 మంది కూలీలు మాత్రమే పనుల్లో చురుగ్గా పాలొంటున్నారు. వీరి కోసం 2025–26 సంవత్సరానికి 9.29 కోట్ల పనులను గుర్తించి 122.91 కోట్ల పని దినాలను కూలీలకు కల్పించారు. ఇందువల్ల ప్రత్యక్షంగా సుమారు 4.12 కోట్ల కుటుంబాలకు 'ఉపాధి'కలిగినట్లు కేంద్రప్రభుత్వ నివేదిక వెల్లడించింది. ఉపాధి కూలీలు నమోదు చేసుకున్న 27,64,35,398 మందిలో మహిళా కూలీల సంఖ్య 13,85,16,125 (50.10 శాతం కాగా, చురుగ్గా పాల్గొన్న 12,16,19,422 మందిలో 6,50,33,150 (53.47 శాతం) మంది మహిళలు కావడం గమనార్హం.

### అత్యధికంగా ఆరు రాష్ట్రాలలో... అదే వరుసలో తెలంగాణ

34 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలలో ఉపాధి కూలీలు మహిళల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ.. తెలంగాణతో పాటు మరో ఆరు రాష్ట్రాల్లో 56 నుంచి 80 శాతానికి పైగా ఉన్నారు. తమిళనాడులో ఉపాధి పనుల్లో చురుగ్గా పాల్గొంటున్న కూలీల సంఖ్య 88.71 లక్షలుగా ఉండగా.. అందులో మహిళా కూలీలు 71.84 లక్షలు (80.98 శాతం)గా ఉన్నారు. కేరళలో 22.85 లక్షలకు మహిళలు 18.12 లక్షలు (79.89 శాతం)గా, రాజస్తాన్‌లో 116.29 లక్షలకు 70.20 (62.89 శాతం), పంజాబ్‌లో 15.99 లక్షలకు 9.26 లక్షలు (57.91 శాతం), తెలంగాణలో 55.90 లక్షల మంది కూలీలకు మహిళలు 31.33 లక్షలు (56.40 శాతం)గా ఉన్నారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో 96.51 లక్షలకు 52.47 లక్షలు (54.37 శాతం)గా, కర్ణాటకలో 75.52 లక్షలకు 38.67 లక్షలు (51.20 శాతం)గా.. ఇలా దాదాపుగా అన్ని రాష్ట్రాల్లో మహిళా కూలీలదే ఉపాధి పనుల్లో ఆధిక్యంగా ఉంది. కాగా తెలంగాణలో మొత్తం కూలీలు 1.04 కోట్లు ఉండగా.. చురుగ్గా పనుల్లో పాల్గొనే 55,89,867 మంది కూలీలలో 31,32,674 మంది మహిళలు ఉన్నారు. దాదాపు అన్ని జిల్లాల్లో మహిళలే అధికంగా పాల్గొంటుండగా, నల్లగొండ, ఖమ్మం, మహబూబాబాద్, మెదక్ తదితర జిల్లాల్లో అత్యధికంగా ఉన్నారు.



హనుమకొండ జిల్లా వేలేరు మండలం మల్లికుదుర్ల ఊరచెరువులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

### 'ఉపాధి'ని వీడని సవాళ్లు..

ఉపాధి హామీ పథకం కింద రూ.307ల దినసరి వేతనంగా ఇస్తున్నా.. అనేక ప్రాంతాల్లో కూలీలకు వేతనాలు ఆలస్యంగా అందుతున్నాయి. ఇది ఉపాధి కూలీల ఆర్థిక ఇబ్బందులకు దారి తీస్తోంది. వేసవిలో పని ప్రదేశాల్లో తగిన సౌకర్యాలు కల్పించకపోవడం, వేతనాలు తక్కువగా ఉండటం వంటి సమస్యలు ఉన్నాయి. కొన్నిచోట్ల క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు పనులు చేయకుండానే డబ్బులు డ్రా చేయడం, మస్టర్ల మాయాజాలం చేయడం వంటి అవినీతిపై.. కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలను స్వయం ఉపాధి వైపు మళ్లించేలా, ఆవులు, మేకల పెంపకం వంటి వ్యక్తిగత ప్రయోజనాలు పొందేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. పని ప్రదేశాలలో సకల సౌకర్యాలను కల్పించాలని, వేడి వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని పనులను ఉదయం, సాయంత్రం వేళల్లోనే కల్పించాలని గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలు జారీ చేసినా.. వేతనాలు ఆలస్యం అవ్వడం, పనులకు వెళ్లేటప్పుడు సౌకర్యాలు లేకపోవడం, సిబ్బంది అవినీతి వంటి సమస్యలు వారిని వేధిస్తున్నాయని చెబుతున్నారు.

| దేశవ్యాప్తంగా 'ఉపాధి'జిల్లాలు: | గ్రామ పంచాయతీల సంఖ్య: |
|---|---|
| 741 | 2,69,228 |

'ఉపాధి 'కోసం నమోదు చేసుకున్న కూలీలు: **27,64,35,398**

వీరిలో మహిళల సంఖ్య: **13,85,16,125** (50.10 శాతం)

ఉపాధి పనుల్లో చురుగ్గా పాల్గొంటున్న కూలీలు: **12,16,19,422**

ఉపాధి పనుల్లో పాల్గొనే మహిళా కూలీలు: **6,50,33,150**

ఉపాధి పనుల్లో పాల్గొనే మహిళా కూలీల శాతం **53.47** శాతం

| 'ఉపాధి'లో లబ్ధి పొందుతున్న కుటుంబాలు: | 2025-26 కోసం గుర్తించిన పనులు మొత్తం: |
|---|---|
| 4.13 కోట్లు | 9.29 కోట్లు |

కల్పించిన పని దినాలు (02.09.2025 వరకు): **122,91,09,626**

### ఉపాధితో ఎంతో మేలు అయితంది



ఉపాధి హామీ పనులు గ్రామాల్లో నిర్వహించడం వల్ల మాలాంటి నిరుపేద కూలీలకు ఎంతగానో మేలు జరుగుతోంది. వ్యవసాయ పనులు లేని సమయంలో.. ఉపాధి హామీ కూలి పనులకు క్రమం తప్పకుండా వెళ్తాం. ఫీల్డ్ అసిస్టెంట్ ఇచ్చిన కొలతల ప్రకారం పనిచేస్తే పెంచిన కూలి రేటు రూ.307 వస్తుంది. బయట కూలి పనికి వెళ్లినా కూలి రూ.300లే ఇస్తున్నారు. దీంతో ఉపాధి హామీ పనికి వెళ్లడమే మేలనిపిస్తోంది. పని జరుగుతున్న ప్రదేశంలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే ఇంకా బాగుంటుంది.

– కుంట రజిత, మల్లికుదుర్ల గ్రామం, హనుమకొండ జిల్లా

## కుంటి సాకులతో కొనసాగుతున్నారు

- బార్ కౌన్సిల్‌పై న్యాయవాదుల జేఏసీ మండిపాటు




న్యాయవాదుల జేఏజీ భేటీలో మాట్లాడుతున్న పొన్నం అశోక్‌గౌడ్. చిత్రంలో హెచ్‌సీఏఏ మాజీ అధ్యక్షులు రఘునాథ్, రవీందర్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: రెండేళ్ల కాల పరిమితితో 2018లో ఎన్నికైన రాష్ట్ర బార్ కౌన్సిల్ కార్యవర్గ ప్రతినిధులు ఏడేళ్లు దాటినా కుంటి సాకులు చెబుతూ కొనసాగుతున్నారని న్యాయవాదుల జేఏసీ ఆగ్రహం వ్యక్తంచేసింది. 'నో ఎలక్షన్స్.. నో జస్టిస్'పేరిట ఏర్పాటైన జేఏసీ ప్రతినిధులు బుధవారం మధ్యాహ్నం బార్ అసోసియేషన్ హాల్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. ఏడేళ్ల వ్యవధిలో ఎంతో మంది న్యాయవాద వృత్తిలోకి వచ్చారని, వారికి బార్ కౌన్సిల్‌కు ఎన్నికలుంటాయన్న విషయం కూడా తెలియకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. న్యాయవాదుల ఆకాంక్షలకు భిన్నంగా బార్ కౌన్సిల్ ప్రతినిధులు వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా బార్ కౌన్సిల్ సభ్యులు వెంటనే పదవులకు రాజీనామా చేసి ప్రజాస్వామ్య పద్ధతిలో బార్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రఘునాథ్, కొండల్‌రెడ్డి, ఎస్.ప్రతాప్‌రెడ్డి, అభిలాష్ ఆశ్రిత్ బొబ్బిలి, ఎ.పద్మాచారితో పాటు వివిధ జిల్లాల బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులు ఏఐ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ) పరిజ్ఞానాన్ని జర్నలిస్టులు పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఏఐ, టూల్స్, టెక్నిక్స్‌పై బుధవారం మీడియా అకాడమీ ఆడిటోరియంలో వర్క్‌షాపు నిర్వహించారు. ఏఐ సాంకేతికతపై ఇంటర్నేషనల్ ట్రైనర్ ఉడుముల సుధాకర్‌రెడ్డి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. డిజిటల్ మీడియా, సోషల్ మీడియాలో ఏఐని ఉపయోగించుకుంటూ.. తక్కువ సమయంలో ఎక్కువ అంశాలను పాఠకులు, వీక్షకులకు అందించవచ్చని స్పష్టం చేశారు. ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టు కూడా నిత్య విద్యార్థిలా ఉండాలన్నారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రెండు ఎంపీటీసీ స్థానాలివ్వండి

- టీపీసీసీ అధ్యక్షునికి దివ్యాంగుల వినతి

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో.. కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని వికలాంగ ప్రాతినిధ్య సాధన కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం గాంధీభవన్‌కు వచ్చిన పలువురు కమిటీ సభ్యులు.. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రతి మండలంలో కనీసం రెండు ఎంపీటీసీ స్థానాల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించేలా తక్షణమే చొరవ తీసుకోవాలని, ఈ మేరకు సీట్ల కేటాయింపు కోసం జిల్లా పార్టీలకు ఆదేశాలివ్వాలని కోరారు.

## 'సహకార' డిజిటలైజేషన్‌తో గ్రామీణాభివృద్ధి వేగవంతం

### నాబార్డ్ చైర్మన్ శాజీ కె.వి.ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో సహకార సంఘాల బలోపేతంపై ప్రాంతీయ వర్క్‌షాప్

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) కంప్యూటరైజేషన్ ప్రక్రియ సత్ఫలితాలు ఇస్తోందని నాబార్డ్ చైర్మన్ శాజీ కె.వి. తెలిపారు. ఇప్పటివరకు 52,500 పీఏసీఎస్‌లు డే–ఎండ్ ఆపరేషన్లు పూర్తి చేశాయని, 9 వేల పీఏసీఎస్‌లు డైనమిక్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయని తెలిపారు. అలాగే 33,000 పీఏసీఎస్‌ల ఆడిట్లు ఈపీఏసీఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా పూర్తయినట్లు చెప్పారు. అదనంగా 7,500 ప్యాక్స్‌లను 'ఈప్యాక్స్ ఓన్లీ'గా గుర్తించినట్లు వివరించారు. నాబార్డ్ తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో సహకార మంత్రిత్వశాఖ భాగస్వామ్యంతో బుధవారం హైదరాబాద్‌లోని డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో జరిగిన ప్రాంతీయ వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగించారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం–2025లో భాగంగా ఈ వర్క్‌షాప్‌ను 'కో ఆపరేటివ్ బిల్డ్ ఏ బెటర్ వరల్డ్' థీమ్‌తో నిర్వహించారు. ఈ సందర్భంగా శాజీ కె.వి. మాట్లాడుతూ పీఏసీఎస్‌ల డిజిటలైజేషన్ ద్వారా ఏర్పడిన డిజిటల్ వేదిక సహకార సంఘాలకు కొత్త వ్యాపార నమూనాలను ప్రారంభించడానికి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. దేశంలో గ్రామాల్లో ఈ–మార్కెటింగ్ విస్తరించడానికి, గ్రామీణ సమాజానికి మరిన్ని సేవలు అందించడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. సహకార మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి సిద్ధార్థ్ జైన్ మాట్లాడుతూ వ్యవసాయ సహకార సంఘాల కార్యాలయాలను ఆధునీకరించడం ద్వారా గ్రామీణ–పట్టణ అంతరాలను తగ్గించవచ్చని సూచించారు. నాబార్డ్ సీజీఎం ఉదయ్ భాస్కర్, డిప్యూటీ ఎం.డి జి.ఎస్.రావత్, నాబార్డ్ ప్రధాన కార్యాలయం సీజీఎంలు సంజయ్ గుప్తా, డా. సుమన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# లోక కల్యాణానికి మహాపాదయాత్ర

- ముస్తాబాద్ నుంచి శబరిమల పాదయాత్ర ప్రారంభం
- 1,400 కిలోమీటర్ల మహాపాదయాత్ర
- ఇరుముడులతో బయల్దేరిన 36 మంది భక్తుల బృందం



వర్షంలో సాగుతున్న రాజు గురుస్వామి బృందం

ముస్తాబాద్(సిరిసిల్ల): సర్వేజన సుఖినోభవంతు.. సర్వ లోక కల్యాణమస్తు అంటూ రాజుగురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు మహాపాదయాత్ర చేపట్టారు. శబరిమలలో కొలువుదీరిన శ్రీహరిహరపుత్ర అయ్యప్ప స్వామి కోవెలకు రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ అయ్యప్పస్వామి ఆలయం నుంచి మహాపాదయాత్ర బృందం బయల్దేరి వెళ్లింది. ముస్తాబాద్‌లోని అయ్యప్పస్వామి ఆలయం నుంచి ఈనెల 20న మహాపాదయాత్ర ప్రారంభమైంది. 36 మంది అయ్యప్పస్వాములు మాల ధరించి ఇరుముడులతో మహాపాదయాత్ర చేపట్టడం విశేషం. రెండు నెలల పాటు 1,400 కిలోమీటర్ల మేర మహాపాదయాత్ర సాగనుంది.

### మహా కఠినం పాదయాత్ర..

ముస్తాబాద్ నుంచి రాజుగురుస్వామి, ఆలయ కమిటీ చైర్మన్ చీటీ జితేందర్‌రావు ఆధ్వర్యంలో చేపట్టిన మహాపాదయాత్ర కఠినంగా సాగుతోంది. వాన, చలి, ఎండలకు తట్టుకుని స్వాములు 'ఓం స్వామియే శరణమయ్యప్ప'.. అంటూ ముందుకు సాగుతున్నారు. వందలాది కిలోమీటర్ల మేరకు సాగే యాత్రలో స్వాముల పాదాలు పగిలి రక్తమోడుతున్నాయి. కొందరి పాదాలు వాచిపోయాయి. అయినా.. 'శరణమయ్య శరణమయ్య అయ్యప్పస్వామి'.. అంటూ ముందుకు సాగిపోతున్నారు. యాభై ఏళ్లు దాటినవారు కూడా యాత్ర చేపట్టడం గమనార్హం. భక్తితో నిశ్చలమైన మనసుతో దృఢమైన సంకల్పంతోనే పాదయాత్ర చేస్తున్నారు. కొండలు గుట్టలు దాటి చేస్తున్న యాత్రలో ట్రాఫిక్‌లో వాహనాల నుంచి ఎదురయ్యే ప్రమాదాలు, రాత్రి వేళల్లో సాగే యాత్రకు అడవుల్లో వచ్చే మృగాలు, పాముల నుంచి తప్పించుకుని యాత్ర ముందుకు సాగుతోంది.

### 13వ సారి మహాపాదయాత్ర

ముస్తాబాద్‌కు చెందిన రాజుగురుస్వామి 13వ సారి శబరిమలకు పాదయాత్ర చేస్తున్నారు. గతంలో రాజుగురుస్వామి ఈ ప్రాంతం సస్యశ్యామలం కావాలని, కరువు నుంచి కాపాడాలని కోరుతూ.. ఉత్తరప్రదేశ్ కాశీ నుంచి గంగ నీటితో ముస్తాబాద్‌కు పాదయాత్ర చేశారు. ఎడారిగా మారిన ఎగువమానేరులో గంగాజలాన్ని కలిపారు. అక్కడినుంచి శబరిమలకు యాత్ర చేశారు. శరీరం సహకరించకున్నా.. శబరిమలకు 13వసారి పాదయాత్ర చేయడం వెనుక ఆయన పట్టుదల, సంకల్పం, ఆత్మవిశ్వాసం కనిపిస్తున్నాయి.

### ప్రజలు సుభిక్షంగా ఉండాలి



వానలు కురిసి పంట చేలు సస్యశ్యామలం కావాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో పాదయాత్ర చేస్తున్నాం. 13వ సారి మహాపాదయాత్ర చేసే అదృష్టం కలిగింది. మనసు దృఢ నిశ్చయంతోనే ఇది సాధ్యం. అందరినీ కలుపుకొని ముందుకు సాగుతున్నాం.

- రాజు, గురుస్వామి

### రోజుకు 25 కిలోమీటర్ల నడక



నేను 15 సార్లు అయ్యప్ప మాల వేశాను. శబరిమల మహాపాదయాత్ర చేయాలనే సంకల్పం వచ్చేది. ఈసారి ఆ అవకాశం దక్కింది. శబరిమలకు నడిచి వెళ్లడం మరపురాని అనుభూతి. ఆరోగ్యపరంగా, మానసికంగా బలంగా ఉండాలి. రోజుకు 25 కిలోమీటర్లు నడుస్తున్నాం.

- జనగామ శరత్‌రావు, మాజీ ఎంపీపీ

### మహాపాదయాత్ర అద్భుతం



ఆధ్యాత్మిక చింతనతో మహాపాదయాత్ర చేస్తున్నాం. కష్టాలు ఎదురైనా అద్భుతమైన అనుభూతితో యాత్ర ముందుకు సాగుతోంది. నేను 20వ సారి దీక్ష చేస్తున్నాను. స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణతో నడుస్తున్నాం. దారిలో ఎంతో మంది భక్తులు స్వాగతం పలుకుతున్నారు.

- చీటీ జితేందర్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్





హైదరాబాద్ నగరంలో గణేశ్ నిమజ్జనోత్సవం వైభవంగా సాగుతోంది. బుధవారం హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనాల దృశ్యాలు

## బస్తా కోసం.. బారులే బారులు



భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెంలో పీఏసీఎస్ ఎదుట యూరియా కోసం క్యూలో నిలబడిన రైతులు



మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట యూరియా పంపిణీ కేంద్రం వద్ద రైతుల క్యూలైన్లు



మెదక్ జిల్లా శివ్వంపేట పీఏసీఎస్ వద్ద బారులు తీరిన రైతులు

# విశాఖ జూకి కొత్త అతిథులు


స్ట్రైప్డ్ హైనా


హాగ్‌డీర్


రోడ్డీషెల్ డక్


రెడ్ క్రౌన్డ్ రూఫ్ టార్టల్(తాబేలు)

ఇందిరాగాంధీ జూ పార్కుకు కొత్త వన్యప్రాణులు చేరుకున్నాయి. వన్యప్రాణి మార్పిడి విధానంలో భాగంగా జూ అధికారులు కాన్పూర్‌లోని జూలాజికల్ పార్కు నుంచి వివిధ జాతులకు చెందిన 25 వన్యప్రాణులను ఇటీవల రోడ్డు మార్గంలో తీసుకువచ్చారు. వాటికి బదులుగా విశాఖ జూ పార్కు నుంచి పలు జాతులకు చెందిన 23 వన్యప్రాణులను కాన్పూర్ జూ పార్కుకు తరలించారు. కాన్పూర్ జూ నుంచి స్వాంప్‌డీర్లు-3 (ఒక మగ, రెండు ఆడవి), స్ట్రైప్డ్ హైనా-1(ఆడది), కామన్ సాండ్ బోవ-2(అన్‌నౌన్), రెడ్ క్రౌన్డ్ రూఫ్ టార్టల్-4(అన్‌నౌన్), హగ్డీర్-3(ఒకటి మగ, రెండు ఆడవి), ఖలీజ్ ఫీసెంట్-6(మూడు జతలు), రోడ్డుషెల్ డక్-4(రెండు జతలు), రెడ్ సాండ్ బోవ-2(ఒక జత) వన్యప్రాణులను విశాఖ తీసుకువచ్చినట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. వాటికి బదులుగా విశాఖ జూ పార్కు నుంచి మూడు అడవి కుక్కలు, ఒక స్ట్రైప్డ్ హైనా, ఒక ఇండియన్ గ్రే వుల్ఫ్, మూడు జతలు పారాకీట్స్, రెండు జతల గ్రీన్ ఇగ్వానాలు, రెండు బార్కింగ్ డీర్లు పంపించినట్లు తెలిపారు. జూకి తీసుకువచ్చిన వాటిని క్వారంటైన్‌లో ఉంచామన్నారు. కొద్ది రోజుల్లో వాటిని సందర్శకుల కోసం వాటి ఎన్‌క్లోజర్లలో విడిచిపెడతామని తెలిపారు. –ఆరిలోవ


స్వాంప్‌డీర్(బారసింగ)



రెడ్‌సాండ్ బోవ, కామన్ పాండ్ బోవ

## క్లుప్తంగా...

### ఏపీకి నలుగురు తెలంగాణ అధికారులు

సాక్షి, అమరావతి: పరస్పర బదిలీల్లో భాగంగా తెలంగాణ నుంచి నలుగురు వ్యవసాయ శాఖ అధికారులు ఏపీకి బదిలీ అయ్యారు. వనపర్తి జిల్లా వ్యవసాయ కార్యాలయంలో పనిచేస్తున్న ఏవో(టెక్) ఎం.మురళీధర్, మండల వ్యవసాయ అధికారి ఒ.వినయ్‌కుమార్, అశ్వారావుపేట మండల వ్యవసాయ అధికారి పి.శివరామప్రసాద్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లంతకుంట మండల వ్యవసాయ అధికారి ఎం.సురేష్‌రెడ్డి ఏపీకి బదిలీ అయ్యారు. అదే సమయంలో ఏపీకి చెందిన వ్యవసాయ అధికారులు ఎల్.పార్వతి. బి.జ్యోత్స్న, ఎస్.క్లరెన్స్ కృపాలిని, వి.శ్రీదేవి తెలంగాణకు బదిలీ అయ్యారు. ఈ మేరకు వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### గిరిజన కళాకారులకు మెరుగైన జీవనోపాధి కల్పిస్తాం

**గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ భార్గవి**

సాక్షి, అమరావతి: గిరిజన కళాకారులకు మెరుగైన జీవనోపాధి కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ భార్గవి చెప్పారు. గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా హస్తకళలు, గిరిజన నృత్యాలు, జీవనోపాధి మార్గాలు తదితరాలపై చర్చించారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాణి మందా తదితరులు పాల్గొన్నారు.

### సీఈడీఎం శిక్షణతో డీఎస్సీలో 152 మందికి ఉద్యోగాలు

**మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి**


సాక్షి, అమరావతి : కేంద్ర, రాష్ట్రస్థాయిలో జరిగే వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలకు హాజరయ్యే మైనారిటీ అభ్యర్థులకు సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సీఈడీఎం) ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నామని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఇటీవల మెగా డీఎస్సీ పరీక్షలకు హాజరైన 1,780 మంది మైనారిటీ అభ్యర్థులకు దీనిద్వారా శిక్షణ ఇవ్వగా, 1,200 మందికి పైగా అభ్యర్థులు అర్హత మార్కుల కంటే ఎక్కువ మార్కులు సాధించారన్నారు. వారిలో 152 మంది ఉద్యోగాలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని.. వీరిని త్వరలో సన్మానించనున్నట్లు బుధవారం ఆయనొక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో కూడా ఈ శిక్షణనిచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

### నేడు కేబినెట్ సమావేశం

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు అధ్యక్షతన గురువారం ఉదయం 11 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఇటీవల సీఆర్‌డీఏ, స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. వీటితో పాటు మరిన్ని అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటారని పేర్కొన్నాయి

### పోలవరం పూర్తి చేయడమే బీజేపీ లక్ష్యం

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్**



ఏలూరు (టూటౌన్): పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడమే బీజేపీ లక్ష్యం అని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. బీజేపీ నేతలు ప్రజానాయకులుగా మారి ప్రజల సమస్యలను పరిష్కరించాలని పిలుపునిచ్చారు. ఏలూరులో బుధవారం జరిగిన జిల్లా విస్తృత స్థాయి బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోలవరం జాతీయ ప్రాజెక్టుకు కేంద్రం రూ.15 వేల కోట్లు మంజూరు చేసిందన్నారు. అలాగే, కొల్లేరు రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, కొల్లేరు జీవవైవిధ్యాన్ని కాపాడతామని చెప్పారు. 'మన ఊరు.. మన జెండా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# అవినీతికి రెవెన్యూ

## మండల రెవెన్యూ కార్యాలయాల్లో అవినీతి బాగోతం

### శ్రీ సత్యసాయి జిల్లాలోని ప్రతి మండలంలోనూ వెలుగు చూస్తున్న భూ తగాదాలు

'ప్రజా సమస్యల పరిష్కారవేదిక'ను ఆశ్రయిస్తున్న బాధితులు

కూటమి నేతల ఒత్తిళ్లతో అధికారుల తప్పిదాలు

కొత్తచెరువు, పుట్టపర్తి, గోరంట్ల, చిలమత్తూరు మండలాల్లో అధికం



▶ పుట్టపర్తి మండలం కొట్లపల్లి రెవెన్యూ పొలం సర్వే నంబరు 254-3లోని 4.68 ఎకరాలకు 1965లోనే ప్రభుత్వం హరిజన సుబ్బన్నకు డీ పట్టా ఇచ్చింది. ఆయన మరణాంతరం ఆయన కుమారుడు గంగాద్రి సాగులో ఉన్నాడు. అయితే ఇటీవల ఆ భూమిని అధికారులు బెంగళూరుకు వలస వెళ్లిన ముగ్గురి పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించారు. వన్-బీ, పాసు పుస్తకాలు కూడా ఇచ్చారు. దీంతో బాధితుడు తహసీల్దార్ కార్యాలయానికి రాగా.. అధికారుల నుంచి ఎలాంటి సమాధానం రాలేదు.

▶ పుట్టపర్తి మండలం కప్పలబండ రెవెన్యూ పొలం సర్వే నంబరు 179-6లోని 25 సెంట్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో ఒకరికి ఇచ్చారు. ప్రస్తుతం అదే నంబరుపై మరొకరి పట్టా ఇచ్చారు. దీంతో ఇరు వర్గాల మధ్య భూ తగాదా మొదలైంది. ఇరువర్గాల వారు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఇరువర్గాలు వేర్వేరు రాజకీయ పార్టీలకు చెందిన వారు కావడంతో అధికార పార్టీ సానుభూతి పరులకు ఆ భూమి దక్కింది.

▶ పెడపల్లి రెవెన్యూ పొలం సర్వే నంబరు 665-6లోని 1.36 ఎకరాలను 40 ఏళ్ల క్రితం చంద్రనాయక్‌కు ఇచ్చారు. ఇటీవల రెవెన్యూ రికార్డుల్లో ఈ భూమి యజమానికిగా మరొకరి పేరు చేర్చారు. సాగులో ఉన్నప్పటికీ.. రికార్డుల పరంగా వేరొకరి వస్తుండటంతో బాధితుడు రెవెన్యూ అధికారులను సంప్రదించాడు. సాగుకు అడ్డం వస్తే.. పోలీస్ స్టేషన్‌కు వెళ్లు.. రెవెన్యూ రికార్డుల్లో అవకతవకలతో ఏం కాదులే ఓ అధికారి రైతుకు చెప్పినట్లు తెలిసింది.

సాక్షి, పుట్టపర్తి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల భూములకు రక్షణ లేకుండా పోయింది. అధికారం అండతో కొందరు నేతలు ఇతర పార్టీల సానుభూతి పరుల భూముల రికార్డులను తారుమారు చేస్తున్నారు. ఏళ్లుగా సాగులో ఉన్నా... రాజకీయ కుట్రలతో రికార్డుల నుంచి పేర్లు తొలగించి.. తమకు అనుకూలమైన వారి పేర్లు చేరుస్తున్నారు. తాము చెప్పినట్లు వినకపోతే బదిలీ తప్పదని బెదిరిస్తుండటంతో కూటమి నేతలు చెప్పిన వాటికంతా అధికారులు తలూపుతున్నారు.

#### 'పరిష్కార వేదిక'కు బాధితులు

ఏళ్లుగా సాగులో ఉన్నప్పటికీ రికార్డుల్లో మరొకరి పేరు చూపుతుండటంతో ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు మరొకరి చెందుతున్నాయి. దీంతో బాధితులు తహసీల్దార్ కార్యాలయాలను సంప్రదిస్తే.. ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించాలని సూచిస్తున్నారు. ఆ తర్వాత సర్వే చేస్తామని మాట దాట వేసి.. పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలోనే బాధితులంతా ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు తరలి వస్తున్నారు. న్యాయం చేయండయ్యా అంటూ కలెక్టర్‌ను వేడుకుంటున్నారు. కానీ వారి అర్జీలన్నీ మళ్లీ తహసీల్దార్ కార్యాలయాలకే చేరుతుండగా... సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. మరికొందరు బాధితులు తమ భూమిని ఇతరులు ఆక్రమించుకున్నారని పోలీస్ స్టేషన్ల మెట్లు ఎక్కుతున్నారు. అయితే సివిల్ పంచాయితీతో తమకు సంబంధం లేదని పోలీసులు తేల్చిచెబుతున్నారు.

#### భూములకు రక్షణ కరువు

ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను కూటమి పార్టీల నాయకులు కబ్జా చేస్తున్నారు. రెవెన్యూ అధికారులనే పావులుగా వాడుకుంటూ.. భూదందాలు చేస్తున్నారు. ఈక్రమంలోనే డీ-పట్టా భూములకు రక్షణ లేకుండా పోయింది. 40 ఏళ్లుగా సాగులో ఉన్నా.. రికార్డుల్లో పేర్లు మార్చి పంచాయితీలు చేస్తున్నారు. చివరకు సరిహద్దులో దేశానికి కాపలాకాసే సైనికుల భూములు కాజేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన భూములను లాగేసుకుంటున్నారు.

#### అక్కడే ఎక్కువగా..

భూమి విలువ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే భూ తగాదాలు పెరుగుతున్నాయి. పుట్టపర్తి, కొత్తచెరువు, చిలమత్తూరు సోమందేపల్లి, పెనుకొండ, గోరంట్ల మండలాల నుంచి ప్రతి వారం భూ సమస్యలతో బాధితులు కలెక్టరేట్‌కు వస్తున్నారు. పదే పదే ఫిర్యాదు ఇచ్చినా... ఫలితం లేదని వాపోతున్నారు. పైగా ఫిర్యాదును పరిశీలించిన అధికారులు.. రాజకీయ నాయకుల వద్దకు వెళ్లాలని సూచిస్తున్నారని వాపోతున్నారు.

#### కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

పుట్టపర్తి మండలం పెడపల్లిలో ప్రభుత్వ భూమిలో ఓ వ్యక్తి భవనం నిర్మించారు. స్థానికులు కలెక్టర్ చేతన్‌కు ఫిర్యాదు చేయగా.. స్పందించిన ఆయన కూల్చేయాలని ఆదేశాలిచ్చారు. అయితే జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి ఈ అంశంలో జోక్యం చేసుకున్నారు. ఫిర్యాదు చేసిన వారెవరో తన వద్దకు వచ్చేలా చూడాలని.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ భవనం కూల్చరాదని అధికారులకు హుకుం జారీ చేసినట్లు సమాచారం. దీంతో ఆ భవనం కూల్చేందుకు అధికారులెవరూ సాహసం చేయడంలేదు. పైగా మాజీ మంత్రి చర్యలతో ఫిర్యాదుదారులూ భయపడ్డారు.


సౌదీ అరేబియాలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రవాసాంధ్రులు


షార్జాలోని వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ అభిమానులు, తదితరులు

# షార్జాలో వైఎస్సార్‌కు ఘన నివాళి

సింహాద్రిపురం/కడప కార్పొరేషన్: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా యూఏఈలోని షార్జాలో మహమ్మద్ జిలాన్ బాషా ఆధ్వర్యంలో ప్రసన్న సోమిరెడ్డి, కోటేశ్వరరెడ్డి నేతృత్వంలో తెలుగు ప్రజలు మంగళవారం వైఎస్సార్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేశారు. అనంతరం వైఎస్సార్ అభిమాని జిలాన్ బాషా మాట్లాడుతూ వైఎస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో లక్షలాది కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. ఆయన చూపిన దారి ఎప్పటికీ తమకు ప్రేరణ అని పేర్కొన్నారు. అనంతరం అభిమానులు వైఎస్సార్ స్మృతులను పంచుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమంలో ప్రవాసాంధ్రులు శ్రీనివాస్ చౌదరి, అక్రమ్ బాషా, బ్రహ్మానంద రెడ్డి, నాగ ప్రతాప్ రెడ్డి, కర్ణ, పవన్, గంగిరెడ్డి, క్రాంతికుమార్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శివలింగా రెడ్డి, హనుమంత్ రెడ్డి, తాజుద్దీన్, సత్య, అంజాద్, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**సౌదీ అరేబియాలో...**

డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతిని సౌదీ అరేబియాలో ఘనంగా నిర్వహించారు. జుబైల్ ప్రాంతంలో అనుయాకినో కంపెనీ క్యాంపులో కడప పట్టణానికి చెందిన షేక్ ఇలాహి ఆధ్వర్యంలో ప్రవాసాంధ్రుల వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అనుయాకినో కంపెనీలో పని చేసే సుమారు 50 మంది కార్మికులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నేతలు తాజుద్దీన్, అబ్రార్ , ఖ్వాజా, బాషా, సలాం బాషా, మతీవ్, అఫ్జల్, ఆతిఫ్, ముహమ్మద్, జాఫర్, ఫర్ ఖాన్, ఫైరోజ్, అసిమ్, ఫైసల్ తదితరులతో పాటు కిషోర్, సంతోష్, శ్రీను పాల్గొన్నారు.

### ఇంటి వద్దకే చేనేత వస్త్రాలు

సాక్షి, అమరావతి: వినియోగదారులకు వారి ఇంటి వద్దే చేనేత వస్త్రాలు అందించేందుకు ఆప్కో ద్వారా డోర్ డెలివరీ సదుపాయం కల్పించామని మంత్రి సవిత బుధవారం చెప్పారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, జియో మార్ట్ వంటి ఈ-కామర్స్ సంస్థల ద్వారా ఆన్‌లైన్ అమ్మకాలు చేస్తున్నామన్నారు. పోచంపల్లి, ధర్మవరం, మంగళగిరి పట్టుచీరలతో పాటు రెడీమేడ్ వస్త్రాలను ఆప్కో షోరూంలలో, ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టగా.. తక్కువ వ్యవధిలో రూ.45 లక్షల విలువైన వస్త్రాలను కొనుగోలు చేశారని వెల్లడించారు. సరికొత్త డిజైన్లతో రెడీమేడ్ చేనేత వస్త్రాలను మార్కెట్‌లోకి తెస్తున్నట్లు చెప్పారు. నేతన్నలకు శిక్షణ కూడా ఇస్తున్నామని తెలిపారు.

### పీపీపీ విధానంలో లిడ్ క్యాప్ భూముల అభివృద్ధి


సాక్షి, అమరావతి: లిడ్ క్యాప్ భూములను పబ్లిక్, ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్(పీపీపీ) విధానంలో అభివృద్ధి చేయనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి చెప్పారు. బుధవారం సచివాలయంలో ఆయన లిడ్‌క్యాప్‌పై సమీక్ష నిర్వహించారు. తిరుపతి ఎస్వీ ఆటో నగర్‌లోని 4.5 ఎకరాలు, విజయవాడ ఆటోనగర్‌లోని ఎకరం స్థలంలో మల్టీపర్పస్ కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించే అంశంపై చర్చించారు. దీనిపై ముఖ్యమంత్రితో చర్చించి.. విధివిధానాలు రూపొందిస్తామని మంత్రి చెప్పారు. సమీక్షలో లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, ఉన్నతాధికారులు ఎం.ఎం.నాయక్, ప్రసన్న వెంకటేష్, టీవీఎస్ ప్రసాదరావు, సునీల్‌రాజ్ కుమార్ పాల్గొన్నారు.

### భక్తులను మోసగిస్తే కఠిన చర్యలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులను మాయమాటలతో మోసగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టీటీడీ ఈవో శ్యామలరావు హెచ్చరించారు. వారం క్రితం భక్తురాలు ఊర్వశి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈవో బుధవారం ప్రకటన విడుదల చేశారు. గూగుల్ ద్వారా వసతి కోసం వెతికే క్రమంలో శ్రీనివాసం రెస్ట్ హౌసెస్ అనే వెబ్‌సైట్‌లో ఇచ్చిన మొబైల్ నెంబర్ 8062180322 ను ఊర్వశి సంప్రదించగా, అభిమన్యు అనే వ్యక్తి తాను శ్రీనివాసం కాంప్లెక్స్‌లో రిసెప్షన్‌కి చెందిన వాడినని పరిచయం చేసుకున్నాడు. ఆమెకు వసతి కల్పిస్తామని చెప్పి డబ్బు వసూలు చేశాడు. సొమ్ము చెల్లిస్తే వసతి టికెట్‌ను పీడీఎఫ్ పంపిస్తామని హామీ ఇచ్చాడు. డబ్బు తీసుకున్న తర్వాత అభిమన్యు తన ఫోన్ కాల్స్ , వాట్సాప్ మేసేజ్‌లకు స్పందించకుండా మోసం చేశాడు. దీంతో ఊర్వశి 1930 క్రైమ్ హెల్ప్ లైన్‌కు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై టీటీడీ ఈవో స్పందిస్తూ ప్రకటన విడుదల చేశారు.

# రాజధానిలో మురుగు శుద్ధి కేంద్రాల పనులకు టెండర్

- 3 ప్యాకేజీల కింద రూ.899.43 కోట్లతో టెండర్లు పిలిచిన సీఆర్‌డీఏ
- ల్యాండ్ పూలింగ్ లేఅవుట్‌లలో ఎస్టీపీల నిర్మాణం
- పనుల పూర్తికి 30 నెలలు గడువు.. ఏడేళ్ల నిర్వహణ కాంట్రాక్టర్‌దే



సాక్షి, అమరావతి: అమరావతిలో మురుగు శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నిర్మాణానికి సీఆర్‌డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ) బుధవారం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ల్యాండ్ పూలింగ్ స్కీం (ఎల్పీఎస్) లేఅవుట్‌లలో వీటిని నిర్మించనున్నారు. ఇప్పటికే ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు టెండర్లు పూర్తి చేశారు. తాజాగా ఎస్టీపీల నిర్మాణం, ఏడేళ్ల పాటు నిర్వహణకు మూడు ప్యాకేజీల కింద రూ.899.43 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. ఈ పనుల పూర్తికి 30 నెలల సమయాన్ని గడువుగా నిర్దేశించారు. బిడ్ల దాఖలుకు ఈ నెల 25 తుది గడువు. అదే రోజున టెక్నికల్ బిడ్.. 27న ఆర్థిక బిడ్ తెరిచి టెండర్లు ఖరారు చేసి కాంట్రాక్టర్లకు అప్పగించనున్నారు.

■ అమరావతికి భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇందుకు 17 వేల ఎకరాల్లో లే అవుట్లను అభివృద్ధి చేయాలి. లేఅవుట్ల మౌలిక సదుపాయాల పనులకు సీఆర్‌డీఏ టెండర్లను పూర్తి చేసింది. ల్యాండ్ పూలింగ్ స్కీం లేఅవుట్లలో ఎస్టీపీల ఏర్పాటుకు తాజాగా టెండర్లు పిలిచింది.

■ జోన్ 4, 7, 9, 10లలో 103 ఎంఎల్‌డీలు (రోజుకు 103 మిలియన్ లీటర్లు) మురుగు నీటిని శుద్ధి చేసే సామర్థ్యంతో నాలుగు ఎస్టీపీలు, 33 ఎంఎల్‌డీల సామర్థ్యంతో నాలుగు టెర్షియరీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణం, ఏడేళ్ల నిర్వహణకు రూ.290.92 కోట్లను కాంట్రాక్టు విలువగా నిర్ణయించింది. రూ.52.84 కోట్లను జీఎస్టీ, సీనరేజీ వంటి పన్నుల రూపంలో ఇస్తామని పేర్కొంది. అంటే.. ఈ పనుల కాంట్రాక్టు విలువ రూ.343.76 కోట్లు.

■ జోన్-1, 2, 3, 5, 6లలో 90 ఎంఎల్‌డీల సామర్థ్యంతో ఐదు ఎస్టీపీలు, 29 ఎంఎల్‌డీల సామర్థ్యంతో ఐదు టెర్షియరీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణం, ఏడేళ్ల నిర్వహణ పనులకు రూ.262.48 కోట్లను కాంట్రాక్టు విలువగా నిర్ణయించింది. అదనంగా రూ.47.62 కోట్లను జీఎస్టీ, సీనరేజీ వంటి పన్నుల రూపంలో ఇస్తామని వెల్లడించింది. ఆ పనుల కాంట్రాక్టు విలువ రూ.310.10 కోట్లు.

■ జోన్-12, 12ఏలో 80 ఎంఎల్‌డీల సామర్థ్యంతో రెండు ఎస్టీపీల నిర్మాణం, ఏడేళ్ల నిర్వహణకు రూ.207.85 కోట్లను కాంట్రాక్టు విలువగా నిర్ణయించింది. అదనంగా రూ.37.73 కోట్లను జీఎస్టీ, సీనరేజీ పన్నుల రూపంలో ఇస్తామని పేర్కొంది. అంటే.. ఆ పనుల కాంట్రాక్టు విలువ రూ.245.58 కోట్లు.

# ఒప్పంద సమయానికి ప్రాజెక్టులు పూర్తి చేయాలి

**మంత్రి గొట్టిపాటి రవికుమార్**



సాక్షి,అమరావతి: పునరుత్పాదక విద్యుత్ రంగంలోని ప్రాజెక్టుల్లో రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. రిలయన్స్, యాక్సిస్ ఎనర్జీ, సుజ్లాన్ ప్రతినిధులతో ఆయన సచివాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఎంఓయూ ప్రకారం సమయానికి ప్రాజెక్టులు పూర్తి చేసే బాధ్యత కంపెనీలదే అని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణలో స్థానిక యువతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భూ సేకరణలో ఎదురవుతున్న సమస్యలను పారిశ్రామికవేత్తలు మంత్రికి వివరించారు. వచ్చే మూడేళ్లలోనే సోలార్, విండ్, సీబీజీ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పారు. ఉపయోగంలో లేని ప్రభుత్వ భూమికి ఎకరాకు రూ.15 వేల కౌలు, రైతుల భూములకు ఎకరాకు రూ.31 వేల కౌలు రూపంలో ఆదాయం వస్తుందని మంత్రి తెలిపారు. విండ్ అనుకూల ప్రాంతాల్లో సోలార్ ప్రాజెక్టుల అనుమతులపై సమీక్షించాలని సుజ్లాన్ ప్రతినిధులు మంత్రిని కోరారు. అనంతరం విద్యుత్ అధికారులతో జరిగిన సమీక్షలో మాట్లాడుతూ రూ.14,962 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 400 కేవీ, 220కేవీ, 132కేవీ సబ్ స్టేషన్లు ఇతర ట్రాన్స్‌కో ప్రాజెక్టుల నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. పోర్టులు, పారిశ్రామిక కేంద్రాలు, రాజధాని ప్రాంతం వంటి ప్రధాన ప్రాజెక్టులకు విద్యుత్ సరఫరా నిరంతరాయంగా అందేలా పనులు వేగవంతం చేయాలన్నారు. 2027 నాటికి రూ.6,000 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టులను పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

● మిలాద్ ఉన్ నబి

మానవత్వం విలువ కోల్పోయి, బలహీనుల అర్తనాదాలు వినిపించని కాలం అది. స్త్రీలు హక్కుల్లేని స్థితిలో ఉండేవారు. ఆడబిడ్డ పుడితే పాతిపెట్టేవారు. సమాజంలో సమానత్వం, మానవ హక్కులు అనే భావనలు లేవు. అటువంటి చీకటి కాలంలో ముహమ్మద్ ప్రవక్త (స) వెలుగునిచ్చే దీపస్తంభంలా అవతరించారు. మానవాళి విమోచకుడిగా, న్యాయం, సమానత్వం, దయ, కరుణలకు ప్రతిరూపంగా ఆయన జన్మించారు. ఆయన అవతరణతో సమాజంలో వెలుగులు ప్రసరించాయి. అన్యాయం మీద తిరుగుబాటు, అణగారినవారికి ఆధారం, స్త్రీలకు గౌరవం, బానిసలకు విముక్తి లభించాయి. అందువల్ల ఆయన జన్మదినం సమస్త మానవాళికి పర్వదినం.

# కారుచీకటిలో కాంతిరేఖ

ఆయన జీవితమే మానవ హక్కులు, సమానత్వపు న్యాయ విప్లవం. ఆయన సందేశం ఒక్కటే: మానవులందరూ దేవుని దృష్టిలో సమానులే, ఎవరికీ ఎవరిపై ఎలాంటి ఆధిక్యతా లేదు. నైతికపరంగా ఉత్తములైనవారే దైవానికి ప్రీతిపాత్రులు.

మహిళలకు ఆయన ఇచ్చిన గౌరవం విప్లవాత్మకం. 'తల్లి పాదాల కింద స్వర్గం ఉంది' అని ప్రకటించారు. ఆడపిల్ల పుట్టడాన్ని ఆశీర్వాదంగా చూపించారు. భార్యకు, తల్లికి, కూతురుకు సమాన హక్కులు కల్పించారు. బానిసను సోదరుడిగా చూడమని, వారిని విముక్తం చేయడం గొప్ప పుణ్యమని బోధించారు.

ప్రవక్త (స) సమాజంలో న్యాయం నెలకొల్పడానికి అద్భుతమైన సూత్రాలు చెప్పారు: ఆయన విప్లవం కేవలం మతపరమైనది కాదు; సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాలన్నింటినీ అది పరివేష్టించిఉంది. ముహమ్మద్ ప్రవక్త (స) కేవలం ఆధ్యాత్మిక నాయకుడే కాదు, సమ సమాజ నిర్మాత కూడా. ఆయన మదీనాలో స్థాపించిన రాజ్యాంగం మానవ చరిత్రలో తొలి లిఖితబద్ధమైన సామాజిక ఒప్పందం. దీన్ని సహీఫతుల్ మదీనా అంటారు. ఇందులో ముస్లింలు, యూదులు, ఇతరులందరికీ సమాన హక్కులు కల్పించారు. భిన్న మతాలు కలిసికట్టుగా జీవించగలరని ఆయన నిరూపించారు. ఇది ఆధునిక ప్రజాస్వామ్య భావనకు పునాది.

ఆర్థిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గం విశిష్టమైనది. వడ్డీ (రిబా)ని ఆయన నిషేధించారు. జకాత్, సదఖా వంటి వ్యవస్థలు పేదలకు భరోసా కల్పించాయి. సంపద కేవలం కొద్ది మందికే కాకుండా సమాజంలో సమానంగా ప్రవహించాలని ఆయన సూచించారు.


దైవ ప్రవక్త ముహమ్మద్ (స) చేసిన బోధనలు మానవాళి మొత్తానికీ వర్తిస్తాయి. ఆయన సందేశం జాతి, మతం, వర్గం, సరిహద్దులను దాటి విశ్వవ్యాప్త మానవ విలువలుగా నిలిచింది. అందుకే ఆయనను ముస్లింలు మాత్రమే కాకుండా ప్రపంచంలోని అసంఖ్యాకమంది మానవతావాదులు కూడా గౌరవిస్తారు. విజ్ఞానం, వైద్య శాస్త్రం, తాత్త్విక ఆలోచనల పెరుగుదలకు ఆయన బోధనలు ప్రేరణగా నిలిచాయి.

నేటి ప్రపంచం మరోసారి అన్యాయం, అసమానత్వం, హింస, వివక్షలతో నిండిపోయింది. జాతి, వర్ణం, మతం, లింగం పేరుతో విభజనలు పెరుగుతున్నాయి. ధనం, శక్తి, అధికారాలు కొందరి చేతుల్లో కేంద్రీకృతమై మానవాళి దోపిడీకి గురవుతోంది. ఇలాంటి సమయంలో దైవ ప్రవక్త (స) బోధనలు మరింత ప్రాసంగికం అవుతున్నాయి.

నేటి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం ఆయన చూపిన మానవతా బోధనలలోనే ఉంది. వాటిని అనుసరిస్తేనే సమానత్వం, శాంతి, సోదరభావం కలిగిన సమాజాన్ని నిర్మించుకోగలుగుతాము. మీలాదున్నబీ సందర్భంగా మనం జరుపుకునేది కేవలం సభలూ, ర్యాలీలు కాకుండా, ఆయన చూపిన మార్గాన్ని అనుసరించి సమాజాన్ని మార్చే సంకల్పం చేసుకోవాలి. ప్రతి ఒక్కరికి న్యాయం, ప్రతి ఒక్కరికి గౌరవం, ప్రతి ఒక్కరికి హక్కులు కల్పించే సమాజాన్ని నిర్మించడం ద్వారానే దైవ ప్రవక్త (స)కు నిజమైన వారసులం కాగలుగుతాము.


మానవ హక్కుల చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన ప్రకటన ఆయన చివరి హజ్ ప్రసంగం. అందులోనే నేటి మానవ హక్కుల చార్టర్‌కు బీజాలు ఉన్నాయి. ఆయన యుద్ధాన్ని కాక, శాంతిని ప్రోత్సహించారు. వివాదాలు ఏర్పడితే చర్చలతో పరిష్కరించుకోవాలని, క్షమ, దయలతో ముందుకు సాగాలని బోధించారు. క్షమ అనేది మానవ హృదయాన్ని గెలుచుకునే శక్తిమంతమైన ఆయుధం అని ఆయన నిరూపించారు.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్



● గ్రహణం

# మోక్షప్రద కాలం



భాద్రపద పౌర్ణమి, ఆదివారం సంపూర్ణ చంద్ర గ్రహణం ఏర్పడనుంది. గతంలో ఒకటి రెండు గ్రహణాలు వచ్చినా అవి మన దేశంలో కనిపించలేదు కాబట్టి వాటి ప్రభావం మన దేశంలో లేదు. ఈ ఆదివారం ఏర్పడనున్న చంద్రగ్రహణం ఏ సమయంలో ఏర్పడనుంది. గ్రహణ సమయంలో ఎలాంటి పరిహారాలు పాటించాలనే దానిపై పండితులు చెప్పిన వాటిలో ముఖ్యాంశాలు.

ఆదివారం,7న రాత్రి 9:58 గంటలకు చంద్ర గ్రహణం ప్రారంభమై సెప్టెంబర్ 8వ తేదీ తెల్లవారుజామున 1:26 గంటలకు ముగియనుంది. దీని మొత్తం వ్యవధి దాదాపు మూడున్నర గంటలు. ఈ ఏడాదిలో ఇదే చివరి చంద్రగ్రహణం.

**సూతక కాలం అంటే ఏమిటి? ఆ సమయంలో ఏం చేయాలి?**

హిందూ సంప్రదాయం ప్రకారం గ్రహణం ఏర్పడటానికి ముందు కొంత సమయం నుంచి, గ్రహణ సమయంతో పాటు, గ్రహణం తరువాత కొంత సమయాన్ని కలిపి సూతక కాలంగా పరిగణిస్తారు. ఈ సందర్భంగా చంద్ర గ్రహణం ఏర్పడటానికి 9 గంటల ముందు సూతక కాలం మొదలవుతుంది. అంటే ఆదివారం మధ్యాహ్నం 12.57 నుంచి సూతక కాలం ప్రారంభమవుతుంది. ఈ సూతక కాలంలో ఆలయాల తలుపులు మూసివేస్తారు, పూజలు చేయరు. గ్రహణం ముగిసిన తర్వాత సంప్రోక్షణ కార్యక్రమాలు చేసిన తరువాత తలుపులు తెరిచి యథావిధిగా పూజలు చేస్తారు. రాహుకేతు పూజలు జరిగే ఆలయాలు మాత్రం గ్రహణ సమయంలోనూ తెరిచే ఉంటాయి

**దైవారాధన ఎలా?**

గ్రహణ స్నానం చేసిన తర్వాత ఇంటిని, పూజ గదిని శుభ్రం చేసుకుని నిత్య పూజ చేసుకోవాలి.

**గ్రహణం ముగిసిన తర్వాత ఏం చేయాలి?**

ఆదివారం అర్ధరాత్రి 1:26 నిమిషాలకు గ్రహణం ముగుస్తుంది కాబట్టి మరునటి రోజైన సెప్టెంబర్ 8 సోమవారం సూర్యోదయానికి ముందే గ్రహణ స్నానం చేయాలి. నదీ స్నానాలు, సముద్ర స్నానాలు చేయడం వల్ల మరిన్ని శుభ ఫలితాలు ఉంటాయని పెద్దలు చెబుతారు.

**పాటించాల్సిన నియమాలు ఏంటంటే...**

గ్రహణం రోజున సూతక కాలం ఆరంభం అయినప్పటి నుంచి గ్రహణం ముగిసే వరకు ఆహారం తీసుకోరు. ఆరోగ్యం సరిగా లేని వారు ఆహారం తీసుకోకుండా ఉండలేకపోతే పాలు, పండ్ల రసం వంటివి తీసుకుంటారు. అలాగే గ్రహణానికి ముందు వండిన ఆహారంపై దర్భ గడ్డి లేదా తులసి ఆకులు వేయడం వల్ల ఆహారం కలుషితం కాకుండా ఉంటుందని నమ్మకం.గ్రహణం సమయంలో శుభకార్యాలు, పూజలు, దేవాలయ దర్శనాలు చేయరు. వీలైనంత వరకు భగవన్నామ స్మరణ, ధ్యానం మంచిది. .

**దానాలు శ్రేష్ఠం**

చంద్ర గ్రహణం ముగిసిన తర్వాత సమీపంలో ఉన్న దేవాలయానికి వెళ్లి దైవ దర్శనం చేసుకోవడం మంచి ఫలితాలను ఇస్తుంది. గ్రహణ సమయం లోనూ, ఆ తర్వాతా చేసే దానాలకు విశేషమైన ఫలితం ఉంటుందని పండితులు చెబుతున్నారు. ముఖ్యంగా శక్తి మేరకు బట్టలు, ఆహారం, ధాన్యం, డబ్బు దానం చేయాలి. ఈ నియమాలను పాటించడం వల్ల గ్రహణం వలన ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని నమ్మకం. అలాగే గ్రహణ స్నానం తర్వాత పితృదేవతల ప్రీతి కోసం పిండ ప్రదానాలు చేయడం, బ్రాహ్మణులకు గోదానం వంటివి చేయడం వలన వంశాభివృద్ధి కలుగుతుందని విశ్వాసం.

ఈ ఆదివారం రానున్న చంద్ర గ్రహణం రోజు మనం కూడా పెద్దలు, శాస్త్రాలు చెప్పిన పరిహారాలు పాటించడం శ్రేయస్కరం.

● నిర్మల వాణి

# గణేశ నిమజ్జనం ఆంతర్యం





అనంత చతుర్దశికి ఒక విశేషం వుంది. ఆ రోజు నాడే శ్రీ వినాయకుడిని నీళ్ళలో నిమజ్జనం చేస్తాం. ఆయనను ప్రతిష్ఠించి పది రోజులు పూజలు జరుపుకున్న తరువాత మట్టితో చేసిన ఆయన ప్రతిమను నదిలో గానీ, సముద్రంలో గానీ కలపడానికి కారణం అలా పూజలందుకున్న వినాయకుని కున్న శక్తులు ఆ నీటి ప్రవాహం ద్వారా సర్వత్రా వ్యాప్తి చెందుతాయని, ఆ విధంగా శ్రీ గణేశుని శక్తులు, తత్వమయిన పవిత్రత, వివేకం, అబోధి తత్వం, విచక్షణ, తల్లిపట్ల సమర్పణా భావం ఆ అనంతమైన నీటిలో స్థిరపడి ప్రవహిస్తూ సముద్రంలోకి చేరుకుంటాయి.

అనంత అంటేనే శ్రీ వినాయకుడు. అనంత అంటే నాశనం లేనివాడు. అనంతగా వ్యాపించి వున్న గణేశశక్తి.

అంతటి మహత్తు, మహిమాన్వితుడిని నిమజ్జనానికి తీసుకెళుతున్నప్పుడు ఎంతో భక్తి శ్రద్ధలతో, మేళ తాళాలతో, మంగళ ప్రదమైన గణేశ్ కీర్తనలతో సాగనంపాలి.

ఆయన జన్మించిన భాద్రపద శుక్ల చవితి నాడు ఆయనను ప్రతిష్ఠించి, ఆ తరువాత పదవ రోజున, అంటే అనంత చతుర్దశి నాడు సముద్రంలో నిమజ్జనం చేయడానికున్న ప్రాముఖ్యత అటువంటిది.

మట్టినుంచి ఉద్భవించిన గణేశుడు నీటిలోకి చేరి తద్వారా మానవాళికి, జంతువులకు, ప్రకృతికి తన శక్తులను, తత్వాన్ని ప్రసాదిస్తాడు. అందుచేత నిమజ్జనం కార్యక్రమాన్ని గౌరవిస్తూ అత్యంత భక్తి శ్రద్ధలతో ఒక పుణ్యకార్యంగా జరుపుకోవాలి తప్పించి అశ్లీలతకు, నిందారోపణలకు, ఘర్షణలకు దారితీసే వాతావరణంలో కాదు.

– డా. పి.రాకేశ్
(పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలా దేవి గారి ప్రవచనాలు ఆధారంగా)

● ఓనం

# కేరళ సంస్కృతికి దర్పణం



కేరళలో అతి ముఖ్యమైన పండుగ ఓనం. మలయాళీలు ఘనంగా జరుపుకునే పర్వదినాలలో ఇది ఒకటి. వితరణ శీలి, ప్రజానురంజక పాలకుడైన బలిచక్రవర్తి ఈరోజు భూమి మీదకు తిరిగి వస్తాడని మలయాళీలు నమ్ముతారు. ఈ పండుగ ప్రతి ఏటా ఆగస్టు లేదా సెప్టెంబర్ నెలల్లో వస్తుంది. ఇది 12 రోజులపాటు జరుపుకునే పండుగ. ఇది ఎంతో చరిత్ర, సంస్కృతి, మతపరమైన ప్రాముఖ్యత కలిగిన పండుగ. ఈ సంవత్సరం ఓనం పండుగను సెప్టెంబరు 5, శుక్రవారం జరుపుకోనున్నారు. తిరువోణం అని పిలువబడే రోజునే బలి వస్తాడంటారు. ఆ రోజే ప్రధానవేడుకను చేసుకుంటారు.

కేరళ సంస్కృతికి అద్దం పట్టే పండుగ ఓనం. బలి చక్రవర్తి ఆగమనాన్ని పురస్కరించుకుని మలయాళీలు ఈరోజున తమ ఇళ్లను పువ్వులు, తోరణాలు, రంగోలీలతో ఎంతో అందంగా తీర్చిదిద్దుతారు. అంతేకాకుండా ఖీర్, పులిస్సేరి వంటి రుచికరమైన వంటకాలను కూడా తయారు చేస్తారు. ప్రతి కుటుంబం ఓనం సద్యను తయారు చేస్తాయి. ఈ శాకాహార భోజనంలో 20కిపైగా వంటకాలు ఉంటాయి.

ఈ పండుగను పురస్కరించుకుని కథాకళి నృత్యం, వల్లం కలి(బోట్ రేస్) వంటివి ఏర్పాటు చేస్తారు. దీంతోపాటు కైకొట్టికలి, తుంబి తుల్లాల్ సాంప్రదాయ నృత్యాలు చేస్తారు. ఈరోజున మగవారు చొక్కా, ముండు అని పిలువబడే లుంగీ ధరిస్తారు. స్త్రీలు ముండు, నరియతు అనబడే ఒక బంగారు పై ఆచ్ఛాదనను ధరిస్తారు. ఓనం కేరళలో వ్యవసాయ పండుగ. కుమ్మట్టికలి, పులికలి వంటి జానపద ప్రదర్శనలు కూడా ఇస్తారు.పురుషులు తలప్పంతుకలి (బంతితో ఆడేది), అంబెయ్యల్ (విలువిద్య) వంటి ఆటల్లో పాల్గొంటారు.



**ఓనం పండుగ ముఖ్య తేదీలు**

- సెప్టెంబర్ 4, 2025 - ఉత్రాదం రోజు, మొదటి ఓనం (ఉత్రదప్పచ్చిల్)
- సెప్టెంబర్ 5, 2025 - తిరువోణం రోజు, రెండవ ఓణం (ప్రధాన వేడుక)
- సెప్టెంబర్ 6, 2025 - అవిట్టం రోజు, మూడవ ఓనం, త్రిస్సూర్ పులికలి
- సెప్టెంబర్ 7, 2025 - చాతాయం రోజు, నాల్గవ ఓనం

● కథాశిల్పం

# విష్ణు సేనాపతి విష్వక్సేనుడు

శైవ సంప్రదాయంలో గణపతిని తలుచుకున్నట్లుగానే వైష్ణవులు తొలిగా విష్వక్సేనుని స్మరిస్తారు, పూజిస్తారు. ఈయన విష్ణుగణాలకు అధిపతి. వైకుంఠసేనాని. సాక్షాత్తు విష్ణువులాగే చతుర్భుజాలతో ఉంటాడు.

విష్వక్సేనుల వారు భాద్రపద మాసంలో పూర్వాషాఢ నక్షత్రంలో ఆవిర్భవించారు. బంగారు వర్ణంతో విశాలమైన కనులతో పుట్టుకతోనే దేహంపై శంఖం, ఖడ్గం, ధనస్సు చిహ్నాలతో సేనాపతి అవుతాడనే సంకేతంగా పుడతాడు. ఈయనను కశ్యపమహర్షి పెంచి వేదాన్ని, మంత్రశాస్త్రాలను నేర్పిస్తాడు. తరువాత వృషభాద్రిపై 12 సంవత్సరాల పాటు తపస్సు చేసి శ్రీనివాసుని అనుగ్రహంతో సేనాపతిగా అవతరిస్తాడు. తిరుమలలో వెంకటేశ్వరస్వామి వారి ఆలయానికి ఈశాన్య భాగంలో విష్వక్సేనుల వారి సన్నిధి ఉందనే విషయం చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసు. స్వామివారి ఆలయానికి చుట్టూ ముక్కోటి ప్రదక్షిణ మార్గంలో ఈ సన్నిధి కనిపిస్తుంది. అయితే సంవత్సరానికి ఒకసారి వైకుంఠ ఏకాదశి, వైకుంఠ ద్వాదశి రెండు రోజులు మాత్రమే ఈ ముక్కోటి ప్రదక్షిణ ప్రాంతాన్ని తెరిచి ఉంచడం జరుగుతుంది. అప్పుడు కూడా భక్తుల రద్దీ వలన ఈ సన్నిధి దగ్గరికి వెళ్లడానికి అందరికీ అవకాశం ఉండదు. తిరుమలలో జరిగే బ్రహ్మోత్సవాలలో ముందుగా సేనాపతి ఉత్సవం జరుగుతుంది. ఈ సందర్భంగా ఈయన నాలుగు మాడ వీధులలో ఊరేగింపుగా వచ్చిన తరువాత వెంకటేశ్వర స్వామి వారు వాహనంపై వేంచేస్తారు.




విష్వక్సేనుడు జ్ఞాన ప్రదాయకుడు. ఈయన నాలుగు చేతులతో పద్మపీఠంపై ఆసీనుడై నిజ హస్తాలతో కుడి చేత అభయ ముద్ర లేక సూచి హస్తం లేక పుష్పాన్ని ధరించి ఉంటాడు.

విష్ణు స్వరూపానికి ఈయనకు ఒకటే తేడా. మహావిష్ణువుకు శ్రీవత్సం బ్రహ్మసూత్రం ఉంటాయి. విష్వక్సేనుడికి అవి ఉండవు. ఈ స్వామి ముక్తిని జ్ఞానాన్ని ప్రసాదిస్తాడని పరాశర సంహిత చెప్పింది.

– కె.వి.ఎస్. బ్రహ్మాచార్య
ఆగమ, శిల్పశాస్త్ర పండితులు

● సువార్త

# ప్రేమైక జీవితము: వివాహబంధం



వివాహ వ్యవస్థలో కథోలిక సంఘాలలో ఏడు సంస్కారాలు పాటిస్తారు. ఒకటి- బాప్తిస్మము, రెండు- ప్రభు సంస్కారము, మూడు- నిర్ధారణ (కన్ఫర్మేషన్), నాలుగు - జ్ఞానస్నానం (రికన్సిలేషన్), ఐదు - రోగుల పరామర్శ (ఎనాంటిగ్ ఆఫ్ సిక్), ఆరు - పరిశుద్ధ వివాహం, ఏడు - పరిశుద్ధ ఉత్తర్వులు (హోలీ ఆర్డర్స్). ఈ ఏడింటిలో ప్రాముఖ్యమైనది, ఘనమైనది, పవిత్రమైనది వివాహము. ఇది శాశ్వతమైన బంధం. వీటిని అన్ని సంఘాలవారు ఆచరించకపోయినా ప్రొటెస్టెంట్ క్రైస్తవులు ఒకటి -బాప్తిస్మము, రెండు- ప్రభు సంస్కారము పాటిస్తున్నారు. ప్రభువు గృహాన్ని (యింటిని కట్టించకపోతే కట్టువాని ప్రయాస వ్యర్థమేనని, అలాగే గుణవతి అయిన భార్య లభించుట అరుదు. గుణవతి అయిన భార్య ముత్యం కంటే అమూల్యమైనది. (బైబుల్ గ్రంథంలో చూస్తాం).

బైబిల్‌లోని ఆదికాండ గ్రంథంలో హవ్వను ఆదామును కలుగజేసి తొలి/ప్రథమ కుటుంబం వారిరువురిని, తర్వాత బైబిల్‌లోని చివరి గ్రంథమైన ప్రకటన గ్రంథంలో సంఘం (చర్చ్) వధువుగాను, ప్రభువును వరుడుగాను గుర్తించండి. అలాగే వివాహం ఒప్పందం కాదు, కొనసాగించుకోవటానికి రద్దు పరచుకోవటానికి ఇది శాశ్వత బంధం.

రెక్కలు వచ్చి పిల్లలు స్థిరపడి వారు వేరే ప్రాంతానికి వెళ్ళినప్పుడు ఒకరికొకరు తోడూ నీడా ఈ రెండు పండుటాకులైన భార్యాభర్తలు, భార్య దేవుడిచ్చిన 'వరం', అనాది సంకల్పం చొప్పున ఏర్పడిన దాంపత్యం అనగా (మేడ్ ఫర్ ఈచ్ అదర్). దీనికి కావల్సింది సమాధానం. పెండ్లి అయిన తర్వాత మిగిలిన శేష జీవితంలో ఆనందంగా సుఖసంతోషంతో జీవించాలి. దీనికి ప్రదానం ప్రార్థన.

దేవునియందు భయభక్తులు కలిగి ఆయన మార్గంలో నడుచువారు ధన్యులు. నిశ్చయముగా నీవు నీ చేతుల కష్టార్జితం అనుభవించెదవు. అప్పుడు ధన్యుడవు. నీకు మేలు కలుగును. నీ పిల్లల పిల్లలను చూస్తావు. ఇశ్రాయేలీయుల మీద సమాధానముండునుగాక (దావీదు కీర్తనలు 128:1-6). కావున ఈదీవెనలతో పిల్లా పాపలతో జీవించి, పెండ్లి అంటే నూరేళ్ళ పంటగావున, సమాధానంగా జీవించుదురు గాక.

– కోట బిపిన్ చంద్రపాల్

# తిథి.. విధి

4, గురువారం వామన ద్వాదశి: శ్రవణ నక్షత్రం, ద్వాదశి తిథి కలసిన రోజును వామన జయంతిగా జరుపుకుంటారు. విష్ణుమూర్తి మానవాళిని రక్షించేందుకు ధరించిన అవతారాలలో ఐదవది వామనావతారం. ఈ రోజున వామనునికి అర్ఘ్యం సమర్పించాలి.



మూడు అడుగులతో ఈ లోకాన్ని జయించాడు కాబట్టి వామనుడికి త్రివిక్రముడు అని పేరు. ఆ త్రివిక్రముని పేరు మీద ఉన్న ఆలయాలలో కంచిలో ఉన్న ఉళగలంద పెరుమాళ్ ఆలయం, ఖజురహోలో గల్న వామన ఆలయం ప్రసిద్ధిమైనవి. ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ తదితర చోట్ల కూడా వామనుడి ఆలయాలు కనిపిస్తాయి.

వామనుడు లక్ష్యం ఉన్న జ్ఞానానికి సూచన. వామన జయంతి సందర్భంగా ఆ విష్ణుమూర్తిని కొలిచినవారు కూడా ఆ అహంకారాన్ని జయించి, ఈతి బాధల నుంచి విముక్తి పొందుతారని నమ్ముతారు. ఈరోజున పెరుగు దానం చేయడం పుణ్యప్రదం.

**6. శనివారం అనంత పద్మనాభ చతుర్దశి**



భాద్రపద శుక్ల చతుర్దశినాడు జరుపుకొనే వ్రతం అనంత చతుర్దశి వ్రతం లేదా అనంత పద్మనాభ వ్రతం. ఇది హిందూ సంప్రదాయంలో ఉన్న కామ్య వ్రతాలలో ప్రధానమైనది. కష్టాలలో మునిగి ఉన్నప్పుడు బయటపడటానికి ఓ ఉత్తమ సాధనంగా ఈ వ్రతాన్ని భావించటం తరతరాలుగా వస్తోంది. అనంతుడన్నా, అనంతపద్మనాభస్వామి అన్నా సాక్షాత్తూ కాలమే. కాల స్వరూపుడైన వైకుంఠవాసుడి అవతారమే శ్రీ కృష్ణుడు. పాల కడలిలో శేషయ్య మీద పవళించి ఉండి నాభి కమలంలో బ్రహ్మదేవుడు కూర్చొని ఉండగా లక్ష్మీదేవి పాదాలొత్తుతున్న ఆ దివ్య స్వరూపమే అనంత పద్మనాభుడు. ఆయనను కొలిచిన వారి కష్టాలన్నీ తొలగి సకల సంపదలూ లభిస్తాయని ప్రతీతి.

## బిజినెస్ రీల్

### జియో అన్‌లిమిటెడ్ ఉచిత డేటా ఆఫర్




న్యూఢిల్లీ: యూజర్ల సంఖ్య 50 కోట్లు దాటడం, తొమ్మిదో వార్షికోత్సవం సందర్భాలను పురస్కరించుకుని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ ఉచితంగా అపరిమిత డేటా ఆఫర్ ప్రకటించింది. యానివర్సరీ వీకెండ్, నెల రోజుల రూ. 349 సెలెబ్రేషన్ ప్లాన్, ఏడాది వ్యవధికి వర్తించే ప్లాన్లు ఈ ఆఫర్ కింద ఉన్నాయి. వీటి ప్రకారం సెప్టెంబర్ 5 నుంచి 7 వరకు ప్లాన్లతో సంబంధం లేకుండా 5జీ స్మార్ట్‌ఫోన్ యూజర్లందరూ అపరిమిత 5జీ డేటాను ఉచితంగా పొందవచ్చు. 4జీ యూజర్లు రూ. 39 యాడ్-ఆన్ ద్వారా రోజుకు 3జీబీ గరిష్ఠ పరిమితితో ఈ ఆఫర్‌ను పొందవచ్చు. సెప్టెంబర్ 5 నుంచి అక్టోబర్ 5 వరకు రూ. 349 ప్రత్యేక ప్లాన్ తీసుకున్న వారికి నెల రోజుల అపరిమిత ఉచిత డేటాతో పాటు ఎంటర్‌టైన్‌మెంట్, ఇతరత్రా యాప్‌లకు సబ్‌స్క్రిప్షన్‌ను జియో అందిస్తోంది. మరోవైపు, రూ. 1,200 ప్లాన్ కింద కొత్తగా జియోహోమ్ కనెక్షన్లను తీసుకున్న వారికి రెండు నెలల పాటు సర్వీస్ అందించనున్నట్లు కంపెనీ తెలిపింది.

### కోవాసెంట్ నుంచి ఏఐ ఏజెంట్ కంట్రోల్ టవర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కోవాసెంట్ టెక్నాలజీస్ తాజాగా ఏఐ ఏజెంట్ కంట్రోల్ టవర్ (ఏఐ-యాక్ట్) పేరిట కొత్త టూల్‌ను ఆవిష్కరించింది. వివిధ ఏఐ ప్రోగ్రాంలను (లేదా ఏజెంట్లను) సమన్వయపర్చుకుంటూ, వాటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవడంలో కంపెనీలకు ఇది సహాయకరంగా ఉంటుంది. ప్రస్తుతం వివిధ కార్యకలాపాలకు వివిధ ఏఐ ఏజెంట్లను ఉపయోగిస్తుండటం వల్ల గందరగోళం, భద్రతాపరమైన రిస్కులు తలెత్తుతున్నాయని కోవాసెంట్ టెక్నాలజీస్ సీఎండీ సీవీ సుబ్రమణ్యం తెలిపారు. ఈ నేపథ్యంలో ఇలాంటి ఏఐ ఏజెంట్లన్నింటికీ ఏఐ యాక్ట్ అనేది ఒక సెంట్రల్ కంట్రోల్ రూమ్‌లాగా పని చేస్తుందని ఆయన వివరించారు.

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-9-2025

| | |
|---|---|
| విశాఖ | 575-00 |
| చిత్తూరు | 578-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 570-00 |
| విజయవాడ | 570-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| హైదరాబాద్ | 535-00 |
| వరంగల్ | 537-00 |
| రిటైల్ ధర | 5.95 |

### నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| TATASTEEL | 167.83 | 5.96 |
| HINDALCO | 742.7 | 3.02 |
| JSWSTEEL | 1,074.70 | 2.94 |
| COALINDIA | 389.4 | 2.45 |
| INDUSINDBK | 767.8 | 2.21 |

### నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| INFY | 1,480.00 | -1.25 |
| NESTLEIND | 1,192.30 | -0.72 |
| HDFCLIFE | 777.25 | -0.7 |
| WIPRO | 249.54 | -0.55 |
| NTPC | 334.5 | -0.54 |

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 7,804 |
| ఎన్ఎస్ఈ | 95,966 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 1,24,896 |
| ఎఫ్ఐఐ | - 1,666 |
| డీఐఐ | + 2,459 |

### ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 63.88 | $ 65.59 |
| బ్రెంట్ | 67.54 | $ 69.14 |

# సేవల్లో వృద్ధి శరవేగం

**ఆగస్టులో 62.9 • 15 ఏళ్ల గరిష్ఠ స్థాయి**



న్యూఢిల్లీ: సేవల రంగం బలమైన వృద్ధితో దూసుకుపోతోంది. 15 ఏళ్ల గరిష్ఠ స్థాయిలో ఆగస్టు నెలకు హెచ్ఎస్‌బీసీ ఇండియా సేవల రంగ పీఎంఐ 62.9గా నమోదైంది. జూలైలో ఇది 60.5గా ఉంది. 2010 తర్వాత సేవల రంగం పనితీరు ఒక నెలలో ఈ స్థాయిలో వృద్ధిని సాధించడం ఇదే ప్రథమం. కొత్త ఆర్డర్లు గణనీయంగా పెరగడం, డిమాండ్ పరిస్థితులు చెప్పుకోతగ్గ మేర మెరుగవడం బలమైన పనితీరుకు సాయపడినట్టు హెచ్ఎస్‌బీసీ సర్వే తెలిపింది. 2014 సెప్టెంబర్ నుంచి చూస్తే అంతర్జాతీయ అమ్మకాలు మూడో అత్యధిక గరిష్ఠ స్థాయికి చేరినట్టు పేర్కొంది. ఆసియా, యూరప్, మధ్యప్రాచ్యం, యూఎస్ క్లయింట్ల నుంచి డిమాండ్ భారీగా ఉన్నట్టు తెలిపింది. దీంతో భారత కంపెనీలు అదనపు సిబ్బందిని నియమించుకునేందుకు దారితీసినట్టు పేర్కొంది. సిబ్బంది పెరుగుదలతో కంపెనీలు మరిన్ని ఆర్డర్లను సొంతం చేసుకోగలవని తెలిపింది. మానవ వనరులపై అధిక వ్యయాలు, బలమైన డిమాండ్ పరిస్థితుల నేపథ్యంలో ఆగస్టులో సేవల ధరలు గణనీయంగా పెరిగినట్టు హెచ్ఎస్‌బీసీ భారత ముఖ్య ఆర్థికవేత్త ప్రంజుల్ భండారీ పేర్కొన్నారు. ఇక ఆగస్టు నెలలో తయారీ, సేవల రంగ పనితీరును సూచించే హెచ్ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్ పీఎంఐ సైతం 17 ఏళ్ల గరిష్ఠ స్థాయిలో 63.2గా నమోదైంది. 400 సేవల రంగ కంపెనీల అభిప్రాయాల ఆధారంగా 'హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ'ని ఎస్అండ్‌పీ గ్లోబల్ ప్రతి నెలా విడుదల చేస్తుంటుంది.

## ఐపీవో స్ట్రీట్

### అర్బన్ కంపెనీ @ రూ. 98-103

**ఈ నెల 10–12 మధ్య ఐపీవో • రూ. 1,900 కోట్ల సమీకరణ**




న్యూఢిల్లీ: మొబైల్ యాప్ ఆధారంగా బ్యూటీ, హోమ్ సర్వీసులందించే అర్బన్ కంపెనీ పబ్లిక్ ఇష్యూకి రూ. 98–103 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 10న ప్రారంభమై 12న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 9న షేర్లను జారీ చేయనుంది. దీనిలో భాగంగా రూ. 472 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 1,428 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా కంపెనీ రూ. 1,900 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 145 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేయవలసి ఉంటుంది. ఇష్యూ విజయవంతమైతే కంపెనీ విలువ సుమారు రూ. 15,000 కోట్లుగా నమోదయ్యే వీలుంది. ఈ నెల 17న స్టాక్ ఎక్స్చేంజీలలో లిస్టకానుంది. యాక్సెల్ ఇండియా, ఎలివేషన్ క్యాపిటల్, వీవైసీ11 లిమిటెడ్ తదితరాలు ఐపీవోలో షేర్లను ఆఫర్ చేయనున్నాయి. ఈక్విటీ జారీ నిధులను కొత్త టెక్నాలజీ అభివృద్ధితోపాటు, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కార్యాలయాల లీజ్ పేమెంట్స్, మార్కెటింగ్ వ్యయాలు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. కస్టమర్లకు యాప్ ఆధారంగా కంపెనీ.. క్లీనింగ్, పెస్ట్ కంట్రోల్, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, కార్పెంట్రీ తదితర పలు సర్వీసులను సమకూర్చుతోంది.

### శ్రింగార్ హౌస్ @ రూ. 155-165

**ఈ నెల 10–12 మధ్య ఐపీవో • రూ. 401 కోట్ల సమీకరణ**



న్యూఢిల్లీ: జ్యువెలరీ కంపెనీ శ్రింగార్ హౌస్ ఆఫ్ మంగళ సూత్ర పబ్లిక్ ఇష్యూకి రూ. 155–165 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 10న ప్రారంభమై 12న ముగియనుంది. దీనిలో భాగంగా 2.43 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. తద్వారా కంపెనీ రూ. 401 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఈ నెల 17న స్టాక్ ఎక్స్చేంజీలలో లిస్టకానుంది. ఈక్విటీ జారీ నిధులను వర్కింగ్ క్యాపిటల్‌సహా.. సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. 2009లో ఏర్పాటైన కంపెనీ ప్రధానంగా అమెరికన్ డైమండ్స్, క్యూబిక్ జిర్కోనియా, ముత్యాలు తదితర విభిన్న స్టోన్స్‌తోకూడిన 22 కేరట్లు, 18 కేరట్ల బంగారు మంగళ సూత్రాలను రూపొందిస్తోంది. బిజినెస్ టు బిజినెస్(బీ2బీ) సర్వీసుల ద్వారా ఆర్గనైజ్‌డ్ మార్కెట్లో సుమారు 6 శాతం వాటాను కలిగి ఉంది. గత ఆర్థిక సంవత్సరం(2024–25) ఆదాయం రూ. 1,430 కోట్లను తాకగా.. నికర లాభం రూ. 61 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది రూ. 1,101 కోట్ల ఆదాయం, రూ. 31 కోట్ల నికర లాభం ఆర్జించింది.

# గృహ రుణాల్లో ప్రభుత్వ బ్యాంకుల పైచేయి



**జూన్ చివరికి 46 శాతం వాటా**
- 28.2 శాతానికి ప్రైవేటు బ్యాంకుల పరిమితం

ముంబై: గృహ రుణ మార్కెట్లో ప్రభుత్వరంగ బ్యాంకుల ఆధిపత్యం కొనసాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికం చివరికి మొత్తం గృహ రుణాల్లో 46.2 శాతం వాటాతో ప్రభుత్వరంగ బ్యాంకులు ముందున్నాయి. 2024 జూన్ చివరికి ఇది 37.6 శాతంగా ఉంది. ఇదే కాలంలో ప్రైవేటు బ్యాంకుల వాటా 35.2 శాతం నుంచి 28.2 శాతానికి పడిపోయింది. ఈ వివరాలను క్రెడిట్ బ్యూరో సంస్థ క్రిఫ్ హైమార్క్ విడుదల చేసింది. రిటైల్ రుణాల్లో గృహ రుణాల వాటాయే పెద్ద మొత్తంలో ఉంటోంది. ఎందుకంటే ఇతర రుణాలతో పోల్చి చూస్తే ఒక్కో గృహ రుణం పరిమాణం అధిక మొత్తంలో ఉండడం, పైగా ఇది సెక్యూర్డ్ లోన్ కావడంతో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ మార్కెట్లో గట్టిగా పోటీపడుతుంటాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల గృహ రుణాల్లో 31–90 రోజుల వరకు చెల్లింపులు లేని రుణాలు 2.85 శాతానికి చేరినట్టు క్రిఫ్ హైమార్క్ నివేదిక తెలిపింది. అదే ప్రైవేటు రంగ బ్యాంకుల గృహ రుణాల్లో ఇలాంటి వసూలు కాని రుణాలు 1.04 శాతమే ఉన్నట్టు వెల్లడించింది. ప్రైవేటు బ్యాంకులు రిస్క్‌ను ముందుగా గుర్తించడం, బలమైన అండర్‌రైటింగ్ (రుణ అర్హతలు, రుణ గ్రహీత చెల్లింపు సామర్థ్యాలను విశ్లేషించడం) ప్రమాణాలను పాటించడం దీనికి కారణంగా పేర్కొంది. ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంకుల్లో రూ.35 లక్షల్లోపు రుణాల్లోనే చెల్లింపులు నిలిచిపోయినవి ఎక్కువగా ఉంటున్నట్టు తెలిపింది.

**పెద్ద మొత్తంలో రుణాల పట్ల ఆసక్తి**

బ్యాంకులు చిన్న రుణాల కంటే పెద్ద పరిమాణంలో గృహ రుణాల మంజూరు పట్ల ఆసక్తి చూపిస్తున్నాయి. రూ.75 లక్షలకు పైబడిన రుణాల (ఒక్కోటీ) మంజూరు 38 శాతానికి చేరగా, క్రితం ఏడాది దే కాలంలో ఇది 33.6 శాతంగా ఉన్నట్టు క్రిఫ్ హైమార్క్ నివేదిక తెలిపింది. ఇక రూ.5–55 లక్షల్లోపు గృహ రుణాల మంజూరు 34.7 శాతం నుంచి 31.2 శాతానికి తగ్గాయి.

**కొత్త క్రెడిట్ కార్డుల్లో స్తబ్దత**

కొత్త క్రెడిట్ కార్డుల మంజూరు జూన్ త్రైమాసికంలో క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 28 శాతం తగ్గి 40.6 లక్షలుగా ఉన్నట్టు ఈ నివేదిక తెలిపింది. ఆర్‌బీఐ నియంత్రణలను కఠినతరం చేయడం, బ్యాంకుల రిస్క్ ధోరణి తగ్గడం, రుణ ఆస్తుల పటిష్టతపై దృష్టి సారించడం కారణాలుగా పేర్కొంది. జూన్ త్రైమాసికంలో కొత్త క్రెడిట్ కార్డుల మంజూరులో ప్రైవేటు బ్యాంకుల వాటా ఏడాది క్రితం ఉన్న 71 శాతం నుంచి 75 శాతానికి పెరిగింది.

# ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు చెక్ పెట్టాలి

- అంతర్గత నియంత్రణలను బలోపేతం చేసుకోవాలి
- బ్యాంక్‌లకు సెబీ చీఫ్ పాండే సూచన



న్యూఢిల్లీ: ఇన్‌సైడర్ ట్రేడింగ్ నియంత్రణలను పాటించడం బ్యాంకుల యాజమాన్యాల నైతిక బాధ్యత అని సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే గుర్తు చేశారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఉల్లంఘనలను గుర్తించి, నివారించేందుకు వీలుగా అంతర్గత నియంత్రణలను బలోపేతం చేసుకోవాలని సూచించారు. ''అంతర్గత నియంత్రణలు బలహీనంగా ఉన్నప్పుడు, ప్రక్రియలు అస్పష్టంగా ఉన్నప్పుడు, బాధ్యతలను సరిగ్గా నిర్వచించనప్పుడు, పర్యవేక్షణ సరిగ్గా లేనప్పుడు ఇన్‌సైడర్ ట్రేడింగ్ రిస్క్ పెరుగుతుంది''అని పాండే తెలిపారు. చాలా మోసాలకు అంతర్గత నియంత్రణలు బలహీనంగా ఉండడమే కారణమన్నారు. ఇండస్ ఇండ్ బ్యాంక్ మాజీ ఎండీ–సీఈవో, డిప్యూటీ సీఈవోలు బయటకు వెల్లడించని సున్నిత సమాచారం (యూపీఎస్ఐ) ఆధారంగా బ్యాంక్ షేర్లలో ట్రేడింగ్ నిర్వహించినట్టు తెలుస్తూ, సెబీ ఇటీవలే చర్యలు ప్రకటించడం గమనార్హం. దీంతో సెబీ చైర్మన్ తాజా సూచనలకు ప్రాధాన్యం నెలకొంది. అంతర్గతంగా బలమైన నియంత్రణలు ఏర్పాటు చేసుకోవడం, వెంటనే సమాచారాన్ని స్టాక్ ఎక్స్చేంజ్‌లకు వెల్లడించడం, తమ బాధ్యతల పట్ల ఉద్యోగుల్లో స్పష్టమైన అవగాహన కల్పించడం ద్వారా ప్రతి సున్నిత సమాచారం విషయంలో జవాబుదారీ తనం ఉండేలా చూడొచ్చని అభిప్రాయపడ్డారు. సమావేశాల్లో సున్నిత సమాచారాన్ని అనధికారికంగా పంచుకోవడం, ఈమెయిల్ రూపంలో తెలియజేసినా దాన్ని ఉల్లంఘనగానే పరిగణించాలని పేర్కొన్నారు. ''ఒక్కసారి సమచారం లీక్ అయితే సెకన్లలోనే డిజిటల్ నెట్‌వర్క్‌లపైకి చేరిపోతుంది. దాంతో స్టాక్ ధరలకు, ఇన్వెస్టర్ల విశ్వాసం, బ్యాంకు ప్రతిష్ఠకు జరిగే నష్టాన్ని భర్తీ చేయలేం''అని పేర్కొన్నారు.

### జియో ఫైనాన్షియల్‌కు నిధులు

**ప్రమోటర్ గ్రూప్ నుంచి రూ. 3,956 కోట్లు**




న్యూఢిల్లీ: విస్తరణకు వీలుగా జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు ప్రమోటర్ గ్రూప్ కంపెనీలు తాజాగా రూ. 3,956 కోట్ల పెట్టుబడులు సమకూర్చాయి. ఒక్కో వారంట్‌కు రూ. 316.5 ధరలో కంపెనీ బోర్డు 50 కోట్ల వారంట్లను జారీ చేసింది. వెరసి ప్రమోటర్ సంస్థలు సిక్కా పోర్ట్స్ అండ్ టెర్మినల్స్, జామ్‌నగర్ యుటిలిటీస్ అండ్ పవర్‌కు 25 కోట్లు చొప్పున వారంట్లను అందుకున్నాయి. తద్వారా రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూప్ ఎన్‌బీఎఫ్‌సీ.. జియో ఫైనాన్షియల్ రూ. 3,956 కోట్లు అందుకుంది. ఈ ఏడాది జూలైలో ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా ప్రమోటర్ గ్రూప్ సంస్థలకు మార్పిడికివీలయ్యే వారంట్ల జారీకి కంపెనీ బోర్డు అంగీకరించిన సంగతి తెలిసిందే. తద్వారా రూ. 15,825 కోట్లు సమీకరించేందుకు ప్రణాళికలు వేసింది. ప్రమోటర్లుగా ముకేశ్ అంబానీ కుటుంబంతోపాటు.. ఇతర సంస్థలు ప్రస్తుతం కంపెనీలో ఉమ్మడిగా 47.12 శాతం వాటా కలిగి ఉన్నాయి. కాగా.. ఈ ఏడాది(2025–26) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 4 శాతం పుంజుకుని రూ. 325 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా రూ. 418 కోట్ల నుంచి రూ. 619 కోట్లకు జంప్ చేసింది.

### పోస్ట్ పేమెంట్ బ్యాంక్‌తో యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ జత

**పోస్టాఫీసుల ద్వారా బీమా ఉత్పత్తుల విక్రయం**



న్యూఢిల్లీ: తపాలా శాఖకు చెందిన ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ)తో యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ప్రథమ శ్రేణి నగరాలకు వెలుపల ఇతర పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అందుబాటు ధరలకే బీమా పాలసీలను అందించేందుకు ఈ భాగస్వామ్యం ఉకపరిస్తుందని ఉభయ సంస్థలు సంయుక్తంగా ప్రకటించాయి. ఐపీపీబీకి దేశవ్యాప్తంగా ఉన్న 650 బ్యాంకింగ్ సేవల కేంద్రాల ద్వారా టైర్ 3, టైర్ 4, గ్రామీణ ప్రాంతాల్లో సమగ్రమైన జీవిత బీమా పరిష్కారాలను ఆఫర్ చేయనున్నట్టు పేర్కొన్నాయి. 2047 నాటికి ప్రతి ఒక్కరికీ బీమా రక్షణను అందించాలన్న బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) ఆకాంక్షకు, అందరికీ ఆర్థిక సేవలను చేరువ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ సంకల్పానికి తమ భాగస్వామ్యం సహకరిస్తుందని తెలిపాయి. స్మార్ట్ వెల్త్ అడ్వాంటేజ్ గ్యారంటీ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూఏజీ), స్మార్ట్ వైబ్ ప్లాన్, పలు టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్లను ఆఫర్ చేయనున్నట్టు యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రకటించింది. భిన్న ఆర్థిక అవసరాలకు చేరుకునే విధంగా ఇవి ఉంటాయని తెలిపింది.

# రికార్డు కనిష్టాల్లో కరెన్సీ..

### కాస్తంత కోలుకున్న రూపాయి

**కనిష్ఠం నుంచి 13 పైసలు పైకి**

ముంబై: రూపాయి ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి నుంచి కాస్త కోలుకుంది. బుధవారం ఫారెక్స్ మార్కెట్లో డాలర్ మారకంలో 88.02 వద్ద ముగిసింది. బలహీన యూఎస్ డాలర్ ఇండెక్స్‌కుతోడు చమురు ధరలు కొంత తగ్గడం ఇందుకు అనుకూలించింది. డాలర్‌తో పోల్చితే రూపాయి 88.15 వద్ద ట్రేడింగ్ మొదలు పెట్టగా, రోజులో 88.19 స్థాయి వరకు దిగజారింది. అక్కడి నుంచి చూస్తే 12 పైసలు కోలుకుంది. క్రితం రోజు ముగింపుతో పోల్చితే 13 పైసలు బలపడింది.



**రూపాయిపై ఎగుమతిదారుల అప్రమత్తత**



న్యూఢిల్లీ: రూపాయి మారకం విలువ కనిష్ఠ స్థాయిలకు తగ్గిపోతుండటం ఎగుమతులకు ప్రయోజనకరమే అయినప్పటికీ పరిశ్రమ వర్గాల్లో దీనిపై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. దీనివల్ల విదేశీ మార్కెట్లలో మరింత మెరుగ్గా పోటీ పడటానికి అవకాశం ఉన్నా.. ముడివస్తువుల రేట్లు పెరిగిపోవడం వల్ల ప్రయోజనాలు అంతంతమాత్రంగానే ఉంటాయని దిగుమతి ఆధారిత పరిశ్రమలు చెబుతున్నాయి. రత్నాభరణాలు, పెట్రోలియం, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాలు వీటిలో ఉన్నాయి. రూపాయి బలహీనపడటం వల్ల మన ఉత్పత్తులను చౌకగా ఎగుమతులు చేస్తూ విదేశీ మార్కెట్లలో విస్తరించేందుకు వీలవుతుంది. కానీ, అదే సమయంలో దిగుమతుల వ్యయాలూ పెరిగిపోతాయి. దీనితో నిర్దిష్ట ముడి వస్తువుల కోసం దిగుమతులపై ఆధారపడిన ఎగుమతిదార్లకు మార్జిన్లు తగ్గిపోయి, పెద్దగా ప్రయోజనం ఉండదని ఎగుమతి సంస్థల సమాఖ్య ఎఫ్ఐఈవో డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ తెలిపారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 88 స్థాయికి పడిపోయిన నేపథ్యంలో ఎగుమతిదార్ల అభిప్రాయాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**ఎగుమతిదార్లకు మద్దతుగా నిలుస్తాం..**

అమెరికా టారిఫ్‌ల భారం వల్ల ప్రతికూల ప్రభావాలు పడకుండా ఎగుమతిదారులకు కావాల్సిన మద్దతునిస్తామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ హామీ ఇచ్చారు. అంతర్జాతీయంగా వాణిజ్య పరిస్థితులు మారిపోతున్న నేపథ్యంలో వారి ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఎగుమతిదార్లు ఉత్పత్తి నాణ్యత పెంచుకోవాలని, అంతర్జాతీయ ప్రమాణాలను పాటించాలని, సరఫరా వ్యవస్థల్లో మార్పులు..చేర్పులు చేసుకోవాలని, ప్రత్యామ్నాయ మార్కెట్లపై దృష్టి పెట్టాలని సూచించారు.

# జీఎస్‌టీ సంస్కరణల ఆశలతో....

- 410 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- నిఫ్టీ లాభం 135 పాయింట్లు
- మెరిసిన మెటల్ షేర్లు



ముంబై: కొత్త జీఎస్‌టీ సంస్కరణలపై ఆశలతో పాటు మెటల్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు బుధవారం అరశాతం లాభపడ్డాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఢిల్లీలో జరుగుతున్న 56వ జీఎస్‌టీ కౌన్సిల్ భేటీలో 500 ఉత్పత్తుల ధరలపై కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ప్రస్తుత విధానంలో నాలుగు పన్ను శ్లాబ్‌లు (5%, 12%, 18%, 28%) ఉండగా.. ఇకపై రెండు శ్లాబ్‌లు (5%, 18%) మాత్రమే ఉంటాయని ఆర్థిక మంత్రిత్వశాఖ తెలిపింది. జీఎస్‌టీ 2.0తో ధరలు తగ్గి వినియోగం పెరగొచ్చనే ఆశావహ అంచనాలతో సెన్సెక్స్ 410 పాయింట్లు లాభపడి 80,568 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 135 పాయింట్లు లాభపడి 24,715 వద్ద నిలిచింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 80,005 – 80,671 శ్రేణిలో మొత్తంగా 667 పాయింట్లు పరిధిలో కదలాడింది. నిఫ్టీ 157 పాయింట్లు బలపడి 24,737 వద్ద గరిష్టాన్ని తాకింది. ఆసియాలో దక్షిణ కొరియా మినహా అన్ని రంగాల షేర్లూ నష్టాలు చవిచూశాయి. యూరప్ మార్కెట్లు స్వల్ప నష్టాలతో ముగిశాయి. అమెరికా మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- ట్రేడింగ్‌లో మెటల్ షేర్లు మెరిశాయి. చైనా 2025, 2026లో స్టీల్ ఉత్పత్తిని తగ్గించాలనే నిర్ణయం, అంతర్జాతీయంగా డాలర్ బలహీనత కారణంగా మెటల్ షేర్లకు డిమాండ్ లభించింది. టాటా స్టీల్ 6%, జిందాల్ స్టీల్, సెయిల్ 5.50% ర్యాలీ చేశాయి. నాల్కో, హిందాల్కో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 3%, ఎన్ఎండీసీ, లాయిడ్స్ మెటల్స్, వేదాంత 2% రాణించాయి.
- రంగాల వారీగా బీఎస్ఈ ఇండెక్సుల్లో మెటల్ 3%, కమోడిటీ 1.50% లాభపడ్డాయి, ఫార్మా, కన్జూమర్ డిస్క్రెషనరీ, ఫైనాన్సియల్ సర్వీసెస్, బ్యాంకెక్స్, ఆటో సూచీలు 1% పెరిగాయి. మరోవైపు ఐటీ, టెక్, వినిమయ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.
- విక్రాన్ ఇంజనీరింగ్ లిస్టింగ్ నిరాశపరిచింది. ఇష్యూ ధర(రూ.97)తో పోలిస్తే బీఎస్ఈలో 3% ప్రీమియంతో రూ.98 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో రూ.102 వద్ద గరిష్టాన్ని, రూ.93 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. చివరికి ఒకటిన్నర శాతం నష్టంతో రూ.95.64 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.2,467 కోట్లుగా నమోదైంది.



## 'నంబర్‌వన్' సురుచి

### ప్రపంచ షూటింగ్ ర్యాంకింగ్స్

**న్యూఢిల్లీ:** భారత యువ షూటర్ సురుచి ఇందర్ సింగ్ అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ తాజా వరల్డ్ ర్యాంకింగ్స్‌లో సురుచి 'టాప్' ప్లేస్ దక్కించుకోగా... ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన మను భాకర్ ఆరో ర్యాంక్‌లో నిలిచింది. ఈ ఏడాది ఐఎస్ఎస్ఎఫ్ లీమా వరల్డ్ కప్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో సురుచి స్వర్ణం నెగ్గింది. దీంతో పాటు వ్యక్తిగత విభాగంలో మ్యూనిక్, లిమా, బ్యూనస్ ఎయిర్స్ వరల్డ్‌కప్‌లలో పసిడి పతకాలు సాధించింది. 19 ఏళ్ల సురుచి 4162 పాయింట్లతో మొదటి స్థానంలో నిలవగా... చైనాకు చెందిన యోవో కియాన్ జున్ (3195 పాయింట్లు), కియాన్ వీ (2178 పాయింట్లు) వరుసగా రెండో, మూడో స్థానాలు దక్కించుకున్నారు. మనూ భాకర్ 1988 పాయింట్లతో ఆరో ప్లేస్‌లో కొనసాగుతోంది. ఇక 25 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో మను భాకర్ 1800 పాయింట్లతో నాలుగో ర్యాంక్ దక్కించుకోగా... హైదరాబాద్ షూటర్ ఇషా సింగ్ 1512 పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది. ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్ 50 మీటర్ల ఎయిర్ రైఫిల్ కేటగిరీలో స్వర్ణం గెలిచిన భారత షూటర్ సిఫ్ట్ కౌర్ సమ్రా 3034 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మహిళల విభాగంలో ఎలవెనిల్ వలరివన్ 2604 పాయింట్లతో ఐదో స్థానం దక్కించుకుంది.

## 'టాప్' ర్యాంక్‌లో సికందర్ రజా



**దుబాయ్:** జింబాబ్వే సీనియర్ ప్లేయర్ సికందర్ రజా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వన్డే ఆల్‌రౌండర్స్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం దక్కించుకున్నాడు. ఇటీవల శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లో జింబాబ్వే జట్టు 0–2తో పరాజయం పాలైనా... అటు బంతితో ఇటు బ్యాట్‌తో ఆకట్టుకున్న సికందర్ రజా... రెండు స్థానాలు మెరుగు పరుచుకొని 'టాప్' ప్లేస్‌కు దూసుకెళ్లాడు. 39 ఏళ్ల రజా 302 పాయిట్లతో అగ్రస్థానంలో ఉండగా... అఫ్గానిస్తాన్ ప్లేయర్లు అజ్మతుల్లా ఒమర్జాయ్ (296 పాయింట్లు), నబీ (292 పాయింట్లు) వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. శ్రీలంకతో రెండు వన్డేల్లోనూ హాఫ్ సెంచరీలు చేసిన సికందర్ రజా... బంతితోనూ మెరిశాడు. టెస్టు ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా (405 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. టి20 ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో భారత ప్లేయర్ హార్దిక్ పాండ్యా 252 పాయింట్లతో 'టాప్' ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు.

# భారత బాక్సర్లకు సవాల్

## నేటి నుంచి ప్రపంచ చాంపియన్‌షిప్

### నిఖత్, లవ్లీనాలపై దృష్టి ● సెప్టెంబర్ 14 వరకు పోటీలు



నిఖత్



లవ్లీనా

**లివర్‌పూల్:** రెండేళ్ల క్రితం జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్‌లలో భారత బాక్సర్లు మెరుగైన ప్రదర్శనతో సత్తా చాటారు. మహిళల విభాగంలో మన బాక్సర్లకు నాలుగు స్వర్ణాలు దక్కగా, పురుషుల విభాగంలో మూడు కాంస్యాలు లభించాయి. అయితే ఆ తర్వాత మన బాక్సర్ల ప్రభ తగ్గింది. అటు ఆసియా క్రీడల్లో, ఇటు పారిస్ ఒలింపిక్స్‌లో కూడా పేలవ ప్రదర్శనతో మన ప్లేయర్లు విఫలమయ్యారు. ఈ ఏడాది వరల్డ్ కప్‌లలో ఫర్వాలేదనిపించినా... దీంతో పోలిస్తే వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పోటీ చాలా ఎక్కువ. 65 దేశాలకు చెందిన 550 మంది బాక్సర్లు ఇందులో పాల్గొంటుండగా... పారిస్ ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన 17 మంది ఇక్కడ బరిలో నిలవడం విశేషం. ఈ నేపథ్యంలో రెండేళ్లకు ఒకసారి జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్‌కు రంగం సిద్ధమైంది. నేటి నుంచి ఈ నెల 14 వరకు పోటీలు జరుగుతాయి. భారత్ నుంచి పురుషుల, మహిళల విభాగాల్లో కలిపి 20 మంది బాక్సర్లు బరిలోకి దిగుతున్నారు.

**మూడో మెడల్‌పై నిఖత్ గురి...**

తెలంగాణ ప్లేయర్ నిఖత్ జరీన్ మరోసారి ప్రపంచ వేదికపై తన సత్తా చాటాలని పట్టుదలగా ఉంది. గతంలో రెండుసార్లు (2022, 2023)లలో ఆమె చాంపియన్‌గా నిలిచింది. అయితే ఈ రెండు సందర్భాల్లో ఆమె 52 కేజీలు, 50 కేజీల విభాగంలో బరిలోకి దిగింది. ఇప్పుడు ఈవెంట్ మారిన నిఖత్ 51 కేజీల కేటగిరీలో పోటీ పడనుంది. దాంతో ఆమె కొత్తగా సన్నద్ధం కావాల్సి వచ్చింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఇదే వయో విభాగంలో ఆడిన నిఖత్.. .రెండో రౌండ్‌లోనే ఓటమి పాలైంది. ఇప్పుడు కూడా ఆమె తగిన స్థాయిలో సాధన చేయలేకపోయింది. పారిస్‌లో పరాజయం తర్వాత నిఖత్ ఒకే ఒక టోర్నీలో అది కూడా జాతీయ స్థాయిలోనే ఆడింది. టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, వరల్డ్ చాంపియన్‌షిప్‌లో మూడు పతకాలు సాధించిన లవ్లీనా బొర్గొహైన్ కూడా తన స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వాలని భావిస్తోంది. 75 కేజీల కేటగిరీలో తలపడనున్న లవ్లీనాకు కూడా సరైన ప్రాక్టీస్ లభించలేదు.

**ఎక్కువ మంది కొత్తవారితో...**

మహిళల బృందంతో పోలిస్తే పురుషుల విభాగంలో అనుభవజ్ఞులైన భారత బాక్సర్లు తక్కువ మంది ఉన్నారు. 2023లో జరిగిన గత ఈవెంట్‌లో పతకాలు సాధించిన నిశాంత్ దేవ్, దీపక్ భోరియా, హుసాముద్దీన్ వేర్వేరు కారణాలతో ఈసారి టోర్నీకి దూరమయ్యారు. సుమీత్ కుందు, 2021 వరల్డ్ యూత్ చాంపియన్ సచిన్ సివాచ్, హర్ష్ చౌధరీలకు మాత్రమే గతంలో వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న అనుభవం ఉంది. మిగతా యువ బాక్సర్లంతా తమ ప్రతిభను ప్రదర్శించేందుకు దీనికి సరైన వేదికగా వాడుకోనున్నారు. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న బాక్సర్లందరికీ ఆగస్టు 18 నుంచి సెప్టెంబర్ 1 వరకు షెఫీల్డ్‌లో ప్రత్యేక శిక్షణా శిబిరం కూడా జరిగింది.

**భారత జట్ల వివరాలు: పురుషుల విభాగం:** జాదుమణీ సింగ్ (50 కేజీలు), పవన్ బర్త్‌వాల్ (55 కేజీలు), సచిన్ సివాచ్ (60 కేజీలు), అభినాశ్ జమ్వాల్ (65 కేజీలు), హితేశ్ గులియా (70 కేజీలు), సుమీత్ కుందు (75 కేజీలు), లక్ష్య చహర్ (80 కేజీలు), జుగ్నూ అహ్లావత్ (85 కేజీలు), హర్ష్ చౌధరీ (90 కేజీలు), నరేందర్ బెర్వాల్ (ప్లస్ 90 కేజీలు). **మహిళల విభాగం:** మీనాక్షి హుడా (48 కేజీలు), నిఖత్ జరీన్ (51 కేజీలు), సాక్షి (54 కేజీలు), జైస్మీన్ లంబోరియా (57 కేజీలు), సంజు ఖత్రి (60 కేజీలు), నీరజ్ ఫొగాట్ (60 కేజీలు), సనమచ చాను (70 కేజీలు), లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు), పూజ రాణి (80 కేజీలు), నుపూర్ షెరాన్ (ప్లస్ 80 కేజీలు).

## పాకిస్తాన్‌కు అఫ్గానిస్తాన్ షాక్

### 8 పరుగుల తేడాతో విజయం ● మెరిసిన జద్రాన్, అటల్, రషీద్, నబీ

**షార్జా:** బ్యాటర్ల పట్టుదలకు బౌలర్ల సహకారం తోడవడంతో... పాకిస్తాన్‌పై అఫ్గానిస్తాన్ విజయం సాధించింది. ఆసియాకప్ టి20 టోర్నమెంట్‌కు ముందు జరుగుతున్న ముక్కోణపు టి20 సిరీస్‌లో అఫ్గానిస్తాన్ తమ ఖాతాలో రెండో గెలుపును వేసుకుంది. మంగళవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఈ పోరులో అఫ్గాన్ 18 పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఇబ్రహీం జద్రాన్ (45 బంతుల్లో 65; 8 ఫోర్లు, 1 సిక్స్), సాదిఖుల్లా అటల్ (45 బంతుల్లో 64; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్‌సెంచరీలతో ఆకట్టుకున్నారు. మరో ఓపెనర్ గుర్బాజ్ (8) రెండో ఓవర్‌లోనే అవుట్ కాగా... అజ్మతుల్లా ఒమర్జాయ్ (4), నబీ (6) స్కోరు పెంచే క్రమంలో పెవిలియన్ చేరారు. ఇబ్రహీం, అటల్ రెండో వికెట్‌కు 113 పరుగులు జోడించడంతో అఫ్గాన్ మంచి స్కోరు చేయగలిగింది. పాకిస్తాన్ బౌలర్లలో ఫహీమ్ అష్రఫ్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం పాకిస్తాన్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 151 పరుగులకు పరిమితమై ఓడిపోయింది. హరీస్ రవూఫ్ (16 బంతుల్లో 34 నాటౌట్; 4 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... ఫఖర్ జమాన్ (18 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ సల్మాన్ ఆఘా (15 బంతుల్లో 20; 1 ఫోర్, 1 సిక్స్), సాహిబ్‌జాదా ఫర్హాన్ (13 బంతుల్లో 18; 1 ఫోర్, 2 సిక్స్‌లు) తలా కొన్ని పరుగులు చేశారు. అఫ్గాన్ బౌలర్లలో కెప్టెన్ రషీద్ ఖాన్, నబీ, నూర్ అహ్మద్, ఫజల్‌హక్ ఫారూఖీ తలా రెండు వికెట్లు పడగొట్టారు. ముక్కోణపు సిరీస్‌లో మూడు మ్యాచ్‌లాడిన పాకిస్తాన్ 2 విజయాలు ఒక పరాజయంతో 4 పాయింట్లు ఖాతాలో వేసుకోగా... అఫ్గానిస్తాన్ కూడా మూడు మ్యాచ్‌లాడి రెండు విజాయాలతో 4 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతోంది. గురువారం తదుపరి మ్యాచ్‌లో ఆతిథ్య యూఏఈతో పాకిస్తాన్ ఆడుతుంది. లీగ్ దశ ముగిసిన అనంతరం పట్టిక తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఆదివారం ఫైనల్ జరగనుంది.



ఇబ్రహీం జద్రాన్

## ఆనందం విషాదంగా మారింది!

### బెంగళూరు తొక్కిసలాటపై విరాట్ కోహ్లి



**బెంగళూరు:** రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తొలిసారి ఐపీఎల్ టైటిల్ గెలిచిన తర్వాత జరిగిన తొక్కిసలాట తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. జూన్ 4న చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన ఈ ఘటనలో 11 మంది మృతి చెందగా, పెద్ద సంఖ్యలో అభిమానులు గాయపడ్డారు. మరణించిన వారి కుటుంబాలకు ఇటీవలే ఆర్‌సీబీ రూ. 25 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని కూడా ప్రకటించింది. టీమ్ స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లి ఇప్పుడు ఈ ఘటనపై స్పందించాడు. నాటి తొక్కిసలాట తనను తీవ్రంగా బాధించిందని అతను అన్నాడు. 'జూన్ 4న జరిగిన ఘటనతో నా గుండె పగిలింది. జీవితంలో ఇలాంటి విషాదాన్ని ఎవరూ ఊహించలేదు. మా ఫ్రాంచైజీ చరిత్రలో అత్యంత ఆనందదాయకమైన క్షణం కావాల్సిన సమయం ఎంతో బాధాకరంగా మారిపోయింది. ప్రమాదంలో చనిపోయిన వారికి సంబంధించిన ఆలోచనలతోనే మా మనసు నిండిపోయింది. వారి కోసం, గాయపడిన అభిమానుల కోసం కూడా నేను ప్రార్థించాను. తమవారిని కోల్పోయినవారి బాధ ఇప్పుడు మాది కూడా. మున్ముందు మనందరం కలిసి మరింత జాగ్రత్తగా, బాధ్యతగా ముందుకు వెళదాం' అని ఆర్‌సీబీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో కోహ్లి చెప్పాడు. ఐపీఎల్ ఫైనల్ తర్వాత మళ్లీ ఏ స్థాయిలోనూ క్రికెట్ ఆడని కోహ్లి... తాను ఆడుతున్న ఏకైక ఫార్మాట్ అయితే వన్డేల్లో త్వరలోనే మళ్లీ బరిలోకి దిగే అవకాశం ఉంది.

## ఐఓఏకు శుభవార్త

### అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ నిధుల పునరుద్ధరణ




**న్యూఢిల్లీ:** అంతర్గత వివాదాల పరిష్కారానికి భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) దిద్దుబాటు చర్యలకు నడుం బిగించిన నేపథ్యంలో... అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) శుభవార్త చెప్పింది. గత కొంత కాలంగా పరిపాలన సమస్యలతో సతమతమవుతున్న ఐఓఏకు రావాల్సిన నిధులను ఐఓసీ నిలిపివేయగా... తాజా పరిణామాల నేపథ్యంలో నిధులను తిరిగి ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. 'భారత ఒలింపిక్ సంఘంలోని అంతర్గత వివాదాలు, పాలనా సమస్యలను పరిష్కరించడానికి గత కొన్ని వారాలుగా తీసుకున్న పలు దిద్దుబాటు చర్యలను గమనించాం. సమస్యల పరిష్కారంపై నిర్మాణాత్మకంగా దృష్టి సారించారని అర్థం చేసుకున్నాం. అపరిష్కృత అంశాలపై త్వరలో ఒక నిర్ణయానికి వస్తారని నమ్ముతున్నాం' అని ఐఓసీ ఒలింపిక్ సాలిడారిటీ డైరెక్టర్ జేమ్స్ మాక్లియోడ్. ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉషకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఐఓఏలో జీత భత్యాలు సహా పలు పాలనా వ్యవహారాల్లో అవకతవకలు జరగడంతో గతేడాది భారత్‌కు రావాల్సిన వార్షిక గ్రాంట్ రూ. 15 కోట్లను ఐఓసీ నిలిపి వేసింది. దీంతో అథ్లెట్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఐఓఏ సీఈవోగా రఘురామ్ అయ్యర్ అధిక వేతనం తీసుకుంటున్నారనే నేపంతో... ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌కు చెందిన 12 మంది సభ్యులు ఆయన నియామకాన్ని నిరాకరించారు. దీనికి తోడు పలు దీర్ఘకాలిక అంతర్గత కలహాలు కూడా వెలుగుచూడటంతో ఐఓసీ... మన దేశానికి రావాల్సిన గ్రాంట్‌ను నిలిపి వేసింది.

## ఫైనల్లో హైదరాబాద్

**చెన్నై:** ఆలిండియా బుచ్చిబాబు ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. హరియాణాతో జరిగిన నాలుగు రోజుల సెమీఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ 90 పరుగుల తేడాతో విజయం సాధించింది. హైదరాబాద్ నిర్దేశించిన 272 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు... ఓవర్‌నైట్ స్కోరు 6/2తో చివరిరోజు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన హరియాణా 62.4 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ బౌలర్ నితిన్ సాయి యాదవ్ 44 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టి హరియాణాను దెబ్బ తీశాడు. జమ్మూ కశ్మీర్ జట్టుతో జరిగిన మరో సెమీఫైనల్లో తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ (టీఎన్‌సీఏ) ప్రెసిడెంట్స్ ఎలెవన్ జట్టు విజయం సాధించింది. ఫైనల్లో టీఎన్‌సీఏ ప్రెసిడెంట్స్ జట్టుతో హైదరాబాద్ తలపడుతుంది.

## కమిందు మెరుపులు

### తొలి టి20లో జింబాబ్వేపై శ్రీలంక విజయం



**హరారే:** జింబాబ్వే పర్యటనలో వన్డే సిరీస్ చేజిక్కించుకున్న శ్రీలంక జట్టు టి20ల్లోనూ శుభారంభం చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన తొలి టి20లో శ్రీలంక 4 వికెట్ల తేడాతో జింబాబ్వేను ఓడించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. బ్రియాన్ బెనెట్ (57 బంతుల్లో 81; 12 ఫోర్లు) చక్కటి ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా... కెప్టెన్ సికందర్ రజా (22 బంతుల్లో 28; 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. మారుమని (7), సీన్ విలియమ్స్ (14), ర్యాన్ బుర్ల్ (17), టషింగా (11) విఫలమయ్యారు. శ్రీలంక బౌలర్లలో దుష్మంత చమీరా 30 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో శ్రీలంక 19.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 177 పరుగులు చేసింది. నిసాంక (32 బంతుల్లో 55; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకం సాధించగా... కుశాల్ మెండిస్ (35 బంతుల్లో 38; 4 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కమిందు మెండిస్ (16 బంతుల్లో 41 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు) రాణించారు. ముఖ్యంగా కమిందు మెండిస్ ఆఖర్లో ఆకాశమే హద్దుగా చెలరేగి జట్టును గెలిపించాడు. ఓపెనర్లు సత్తా చాటడంతో ఒక దశలో 96/1తో పటిష్టంగా కనిపించిన శ్రీలంక ఆ తర్వాత 125/5తో కష్టాల్లో పడింది. ఈ సమయంలో కమిందు భారీ షాట్‌లతో విరుచుకుపడటంతో లంక జట్టు సిరీస్‌లో బోణీ కొట్టింది. జింబాబ్వే బౌలర్లలో రిచర్డ్ నరావా 2 వికెట్లు పడగొట్టాడు. ఇరు జట్ల మధ్య శనివారం రెండో టి20 జరగనుంది.




## చాంపియన్ జోగుళాంబ లయన్స్

**సాక్షి, హైదరాబాద్:** యువ తెలంగాణ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో జోగుళాంబ లయన్స్ జట్టు చాంపియన్‌గా అవతరించింది. లాల్‌బహదూర్ ఇండోర్ స్టేడియంలో బుధవారం ముగిసిన ఈ చాంపియన్‌షిప్ ఫైనల్లో జోగుళాంబ లయన్స్ 35–21 పాయింట్ల తేడాతో భద్రాద్రి బ్రేవ్స్ జట్టును ఓడించింది. విరామ సమయానికి జోగుళాంబ జట్టు 16–12తో ఆధిక్యంలో నిలిచింది. జోగుళాంబ జట్టు తరఫున రెయిడర్ రాజు, డిఫెండర్ నవీన్ రాణించారు. వీరిద్దరికే టోర్నీ 'బెస్ట్ రెయిడర్'... 'బెస్ట్ డిఫెండర్' పురస్కారాలు లభించాయి. 'బెస్ట్ ఆల్‌రౌండర్' అవార్డు లక్ష్మణ్‌కు దక్కింది. విజేత జట్టుకు రూ. 1 లక్ష, రన్నరప్ జట్టుకు రూ. 75 వేలు ప్రైజ్‌మనీ లభించింది. సెమీఫైనల్లో ఓడిన యాదాద్రి యోధాస్, బాసర విద్యుత్స్ జట్లకు రూ. 50 వేల చొప్పున ప్రైజ్‌మనీ దక్కింది. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ డీసీపీ రాహుల్ హెగ్డే, తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేశ్ ముదిరాజ్, సెక్రటరీ మహేందర్ రెడ్డి విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందజేశారు.

## బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ టి20 మ్యాచ్ రద్దు

**సిల్హెట్:** బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ మధ్య బుధవారం జరగాల్సిన మూడో టి20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అయింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి రెండు మ్యాచ్‌లు గెలిచి 2–0తో సిరీస్ చేజిక్కించుకున్న ఆతిథ్య బంగ్లాదేశ్... మూడో మ్యాచ్‌లోనూ మెరుగైన స్థితిలో ఉన్న దశలో వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. దీంతో ఫలితం తేలకుండానే మ్యాచ్ ముగిసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్... 18.2 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. బంగ్లా సారథి లిటన్ దాస్ (46 బంతుల్లో 73; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) మరో అర్ధశతకంతో మెరిశాడు. షమీమ్ హుసేన్ (21), జాకీర్ అలీ (20 నాటౌట్), నూరుల్ హసన్ (22 నాటౌట్) తలా కొన్ని పరుగులు చేశారు. నెదర్లాండ్స్ బౌలర్లలో కైల్ క్లెయిన్ 3 వికెట్లు పడగొట్టాడు. ఈ దశలో ఆరంభమైన వర్షం తెరిపినివ్వకపోవడంతో పలుమార్లు పరిశీలించిన అంపైర్లు చివరకు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో బంగ్లాదేశ్ 2–0తో సిరీస్ కైవసం చేసుకుంది. లిటన్ దాస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది.



సౌత్‌జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టీమ్ ఈవెంట్‌లో తెలంగాణ జట్టు రెండు విభాగాల్లో విజేతగా నిలిచింది. జూనియర్ బాలుర, జూనియర్ బాలికల విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచిన తెలంగాణ... సీనియర్ పురుషుల, సీనియర్ మహిళల విభాగాల్లో మూడో స్థానంతో ముగించింది.

బియ్యం సేకరణ లక్ష్యాన్ని

# తగ్గించిన కేంద్రం

**ఈ ఏడాది 4.63 కోట్ల మెట్రిక్ టన్నులే లక్ష్యం**

- వరి సాగు విస్తీర్ణం పెరిగినా.. సేకరణ లక్ష్యంలో తగ్గుదల

**సాక్షి, న్యూఢిల్లీ:** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి బియ్యం సేకరణ లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం అనూహ్యంగా కుదించింది. గత సంవత్సరంలో ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే ఈసారి బియ్యం సేకరణను ఏకంగా 22,00,000 మెట్రిక్ టన్నుల మేర తగ్గించింది. ఈ మేరకు తాజా అంచనాలను కేంద్ర ప్రభుత్వం వెలువరిచింది. 2024–25 సంవత్సరానికిగాను ఖరీఫ్ సీజన్‌లో 4.85 కోట్ల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న విషయం తెల్సిందే. ఈ సంవత్సరం 4.63 కోట్ల టన్నుల బియ్యాన్ని మాత్రమే సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోవడం గమనార్హం. ఇది గత ఏడాది గణాంకాలతో పోలిస్తే 5.8 శాతం తక్కువ. ఇటీవల కేంద్ర ఆహార, పౌర సరఫరాల మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్ర ప్రభుత్వాల కార్యదర్శులతో నిర్వహించిన భేటీలో ఈ మేరకు బియ్యం సేకరణ లక్ష్యాలను ఖరారు చేసింది. వాస్తవానికి భారతదేశ వ్యాప్తంగా ఈ ఖరీఫ్‌లో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. వర్షాలు అధికంగా పడటంతో రైతులు అధిక దిగుబడి ఆశించి ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగు మొదలెట్టారు. దేశ వ్యాప్తంగా సగటు వరి సాగు విస్తీర్ణం 4.03 కోట్ల హెక్టార్లు మాత్రమే. కానీ ఈ సంవత్సరం అందకు మించిన స్థాయిలో అంటే 4.20 కోట్ల హెక్టార్లలో వరి సాగు మొదలెట్టారు. గత సంవత్సరం కన్నా ఏకంగా 29,60,000 హెక్టార్ల అధిక సాగు జరగడం విశేషం. అయితే విస్తీర్ణం పెరిగినప్పుడు ఆమేరకు దిగుబడి పెరిగే వీలుంది. అందుకు తగ్గట్లు బియ్యం సేకరణ పరిమాణం పెరగాలి. ఆ మేరకు సేకరణ లక్ష్యం పెరగాల్సిందిపోయి గణనీయంగా తగ్గింది. ఇందుకు కారణాలను ప్రభుత్వ వర్గాలు బయట పెట్టలేదు. వాస్తవానికి భారతదేశవ్యాప్తంగా ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన సహా వివిధ కేంద్ర ప్రభుత్వ ఆహార పథకాల అమలుకు ఏటా 4.10 కోట్ల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. బఫర్ స్టాక్ కింద మరో 1.02 కోట్ల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. అయితే ప్రస్తుతం తమ వద్ద ఇప్పటికే 3.80 కోట్ల మెట్రిక్ టన్నుల బఫర్ నిల్వలున్నాయని కేంద్ర ప్రభుత్వం ఇటీవల వెల్లడించింది. ఈ కారణంగానే బియ్యం సేకరణ లక్ష్యాను పెంచుకోవాల్సిందిపోయి తగ్గించినట్లుగా వార్తలొచ్చాయి.

## చైనా ఆయుధ సంపత్తి



బీజింగ్ (చైనా)లో బుధవారం జరిగిన విక్టరీ డే పరేడ్‌లో ఎల్‌వై-1 లేజర్ ఆయుధం


పరేడ్‌లో ముందుకెళ్తున్న అధునాతన యుద్ధట్యాంక్‌లు


ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన హెచ్‌ఎస్‌యూ100 అండర్‌వాటర్ డ్రోన్


వాహనంపై ప్రదర్శించిన అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికల్


పొడవాటి ఏజేఎక్స్002 అండర్‌వాటర్ డ్రోన్


వైజే 17 నౌకా విధ్వంసక క్షిపణులు

రూ. 56 కోట్ల విలువైన

# కొకైన్ స్వాధీనం

**నైజీరియన్ యువకుడి సహా నలుగురి అరెస్టు**

- చెన్నై అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌లో ఘటన

**అన్నానగర్(తమిళనాడు):** ఆఫ్రికా దేశం ఇథియోపియా నుంచి ఢిల్లీకి అక్రమంగా తరలించిన రూ.56 కోట్ల విలువైన కొకైన్‌ను కస్టమ్స్ అధికారులు బుధవారం చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మత్తుపదార్థాన్ని తరలించేందుకు ప్రయత్నించినందుకుగాను నైజీరియన్ యువకుడు సహా నలుగురిని కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సరకును ఎవరి కోసం తీసుకొచ్చారు? ఈ డ్రగ్ నెట్‌వర్క్‌లో ఎవరెవరు ఉన్నారు? వంటి అంశాలపై కూపీ లాగేందకు వారందరినీ ప్రశ్నిస్తున్నారు. ఇథియోపియా రాజధాని నగరం అడిస్ అబాబా నుంచి వచ్చిన విమానం చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం దిగంది. విమానంలో పెద్ద మొత్తంలో మాదకద్రవ్యాలు తీసుకొచ్చినట్లు విమానాశ్రయ కస్టమ్స్ అధికారులు, సెంట్రల్ నార్కోటిక్స్ కంట్రోల్ యూనిట్ అధికారులకు సమాచారం అందింది. దీంతో వెనువెంటనే అధికారులు అంతర్జాతీయ ప్రయాణికుల లగేజీ, హ్యాండ్ బ్యాగ్‌ల తనిఖీలను ముమ్మురం చేశారు. ఈక్రమంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన పాతకేళ్ల ఎమానుషా, హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన 24 ఏళ్ల షకీల్ అత్తారీల బ్యాగేజీలనూ అధికారులు తనిఖీచేశారు. వీరు ఇద్దరూ పర్యాటక వీసాపై ఆఫ్రికన్ దేశానికి ప్రయాణించి చెన్నైకి తిరిగొచ్చారు. వాస్తవానికి వీళ్లిద్దరూ ఢిల్లీ లేదా ముంబైకి వెళ్లకుండా చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో దిగినట్లు తేలడంతో కస్టమ్స్ అధికారులు వీరిపై ప్రత్యేకంగా దృష్టిసారించి మరీ తనిఖీలు పెంచారు. దీంతో వీళ్ల లగేజీని కస్టమ్స్ అధికారులు సోదా చేయగా చాక్లెట్ల మధ్యలో పెట్టి తీసుకొచ్చిన కొకైన్ బయటపడింది. 5.618 కేజీల బరువున్న ఈ కొకైన్ విలువ అంతర్జాతీయమార్కెట్‌లో ఏకంగా రూ. 56 కోట్లు ఉంటుందని అంచనా. తర్వాత వీరిద్దరినీ అరెస్ట్‌చేశారు. కొకైన్ అక్రమ రవాణా ముఠాలోని ఒక సభ్యుడిని ముంబైలో, ఓ నైజీరియన్‌ను ఢిల్లీలో అరెస్టు చేశారు. ఈ కొకైన్ సరకు వాస్తవానికి ఢిల్లీకి తరలించాలని దోపిడీదారులు భావించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

# నక్సలైట్లు అంతమయ్యేదాకా విశ్రమించం

- దేశాన్ని నక్సల్స్‌రహితంగా మార్చడానికి కట్టుబడి ఉన్నాం
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టీకరణ
- 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్'లో పాల్గొన్న జవాన్లకు సన్మానం


జవాన్‌ను సత్కరిస్తున్న అమిత్ షా

**న్యూఢిల్లీ/సుక్మా:** నక్సలైట్లపై కఠినంగా వ్యవహరించక తప్పదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. దేశంలో నక్సలైట్లు అందరూ లొంగిపోవడమో లేక వారిని పూర్తిగా అదుపులోకి తీసుకోవడమో లేక సమూలంగా అంతం చేయడమో జరిగే దాకా నరేంద్ర మోదీ ప్రభుత్వ విశ్రమించబోదని తేల్చిచెప్పారు. చత్తీస్‌గఢ్‌లోని కర్రెగుట్టపై నక్సలైట్లకు వ్యతిరేకంగా 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్'ను విజయవంతంగా నిర్వహించిన సీఆర్‌పీఎఫ్, జిల్లా రిజర్వ్ గార్డ్(డీఆర్‌జీ), కోబ్రా జవాన్లతో పాటు చత్తీస్‌గఢ్ పోలీసులను అమిత్ షా బుధవారం ఢిల్లీలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశాన్ని నక్సల్స్ రహితంగా మార్చడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌లో మన జవాన్లు ప్రదర్శించిన ధైర్యసాహసాలు దేశంలో నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్లలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుందని ప్రశంసించారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ వీరోచితంగా పోరాటం సాగించారని, కర్రెగుట్టపై నక్సలైట్ల బేస్ క్యాంప్‌ను ధ్వంసం చేశారని తెలిపారు. అడుగడుగునా పేలుడు పదార్థాల(ఐఈడీ) ముప్పును తప్పించుకుంటూ ముందుకెళ్లారని చెప్పారు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్టుతో తీవ్రవాదులకు కోలుకోలేని దెబ్బ తగిలిందని అమిత్ షా వెల్లడించారు. అత్యంత వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధిని వారు ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పాఠశాలల, ఆసుపత్రులను ధ్వంసం చేస్తున్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందకుండా కుట్రలు సాగిస్తున్నారని ఆరోపించారు.

**పశుపతినాథ్ నుంచి తిరుపతి దాకా..**

ప్రభుత్వం చేపట్టిన నక్సలైట్ల వ్యతిరేక ఆపరేషన్లతో 6.5 కోట్ల మంది జీవితాల్లో కొత్త వెలుగులు ప్రసరిస్తున్నాయని అమిత్ షా వ్యాఖ్యానించారు. తీవ్రవాదుల పీడ విరగడవుతుండడంతో పశుపతినాథ్ నుంచి తిరుపతి దాకా ప్రజలు లబ్ధి పొందుతున్నారని వివరించారు. నక్సలైట్లపై పోరాటంలో గాయపడిన భద్రతా సిబ్బందికి ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ నాటికి నక్సలిజాన్ని అంతం చేయడమే తమ ఆశయమని స్పష్టంచేశారు. సన్మాన కార్యక్రమంలో చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి, ఉప ముఖ్యమంత్రి విజయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

**చత్తీస్‌గఢ్‌లో 20 మంది నక్సలైట్లు లొంగుబాటు**

చత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో 20 మంది నక్సలైట్లు లొంగిపోయినట్లు పోలీసు అధికారులు బుధవారం తెలియజేశారు. వీరిలో 11 మందిపై మొత్తం రూ.33 లక్షల బహుమానం ఉన్నట్లు చెప్పారు. లొంగిపోయిన వారిలో తొమ్మిది మంంది మహిళలు ఉన్నారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) బెటాలియన్ నెంబర్ వన్‌కు చెందినవారు సైతం ఉన్నట్లు వెల్లడించారు. మావోయిస్టు సిద్ధాంతాల్లోని డొల్లతనం అర్థం కావడంతోపాటు అమాయక గిరిజనులపై మావోయిస్టుల అకృత్యాలు నచ్చక 20 మంది లొంగిపోయారని జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ పేర్కొన్నారు. మావోయిస్టుల్లో అంతర్గత కలహాలు సైతం లొంగుబాటుకు కారణమయ్యాయని వివరించారు. చత్తీస్‌గఢ్ ప్రభుత్వం ప్రారంభించిన నియాద్ నెల్లనార్(మీ మంచి గ్రామం) పథకం పట్ల నక్సలైట్లు ఆకర్షితులు అవుతున్నారని, అందుకే లొంగిపోవడానికి ముందుకొస్తున్నారని స్పష్టంచేశారు. ఈ పథకం కింద ప్రభుత్వం మారుమూల గ్రామాలను అభివృద్ధి చేస్తోంది. లొంగిపోయిన వారికి పునరావాసం కల్పిస్తోంది. వారికి తొలుత రూ.50 వేల చొప్పున నగదు అందజేస్తోంది. అనంతర ఇతర ప్రయోజనాలు కల్పిస్తోంది.

యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్‌లో

## సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్!

**యూపీఎస్సీ చైర్మన్ అజయ్ కుమార్ వెల్లడి**

**న్యూఢిల్లీ:** యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్(యూపీఎస్సీ)తోపాటు రాష్ట్రాల పబ్లిక్ సర్వీసు కమిషన్లలో తీసుకురావాల్సిన సంస్కరణలు, చేపట్టాల్సిన నూతన విధానాలను ఖరారు చేయడానికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) అందుబాటులోకి రాబోతోంది. యూపీఎస్సీ చైర్మన్ అజయ్ కుమార్ బుధవారం ఈ విషయం వెల్లడించారు. అత్యుత్తమ విధానాలపై ఈ కేంద్రం అధ్యయనం చేస్తుందని పేర్కొన్నారు. ఇది ప్రామాణిక నియమావళి, నూతన ఆవిష్కరణలకు సంబంధించిన నాలెడ్జ్ హబ్‌గా పని చేస్తుందని తెలిపారు. యూపీఎస్సీ ఆధ్వర్యంలోనే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటవుతుందని, రాష్ట్రాల పబ్లిక్ సర్వీసు కమిషన్లు ఇందులో భాగస్వామిగా మారుతాయని స్పష్టంచేశారు. సంస్కరణలు, ఉత్తమ విధానాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకుంటాయని చెప్పారు. ప్రతిపాదిత సీఓఈ విధివిధానాలపై సలహాలు ఇవ్వాలని రాష్ట్రాల పబ్లిక్ సర్వీసు కమిషన్ల చైర్మన్లకు అజయ్ కుమార్ సూచించారు. ఈ కేంద్రం కేవలం పబ్లిక్ సర్వీసు కమిషన్లకే కాకుండా.. జాతీయ స్థాయి రిక్రూట్‌మెంట్ బోర్డులకు సైతం లబ్ధి చేకూరుతుందని తెలిపారు. పరీక్షలు, నియామక ప్రక్రియలను మరింత బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సూచిస్తుందని వివరించారు.

## వరద బాధితులను ఆదుకోవాలి

- ప్రత్యేక సహాయ ప్యాకేజీ ప్రకటించాలి
- ప్రధాని నరేంద్ర మోదీకి రాహుల్ గాంధీ విజ్ఞప్తి

**న్యూఢిల్లీ:** పంజాబ్, జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో వరద బీభత్సం పట్ల కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తంచేశారు. వరద బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక సహాయ ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక, పునరావాస చర్యలను వేగవంతం చేయాలని అన్నారు. ఈ మేరకు బుధవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. ఈ విపత్కర సమయంలో ప్రధానమంత్రి స్వయంగా చొరవ తీసుకొని, సహాయక చర్యను పర్యవేక్షిస్తే బాధితులకు ఎంతో ఊరట కలుగుతుందని పేర్కొన్నారు. వరద ధాటికి వేలాది మంది నిరాశ్రయులయ్యారని, ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇళ్లను, కుటుంబ సభ్యులను కాపాడుకొనేందుకు ప్రజలు పడుతున్న యాతన చూస్తుంటే మనసు చలించిపోతోందని రాహుల్ వెల్లడించారు. ఇక ఎంతమాత్రం ఆలస్యం చేయకుండా ప్రత్యేక సహాయ ప్యాకేజీని ప్రభుత్వం సిద్ధం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## ఎలుకలు కరిచి నవజాత శిశువు మృతి

**ఇండోర్:** మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ ప్రభుత్వ ఆస్పత్రిలోని పీడియాట్రిక్ సర్జరీ వార్డులో ఎలుకలు కొరికి నవజాత శిశువు మరణించింది. ఆగస్టు 30–31 మధ్య రాత్రి ఇద్దరు నవజాత శిశువులను ఎలుకలు కరిచాయి. ఒకరి చేతికి, మరొకరి భుజానికి గాయమైంది. వారిలో కేవలం 1.2 కిలోగ్రాముల బరువున్న శిశువు మంగళవారం మరణించింది. అయితే తీవ్రమైన ఇన్ఫెక్షన్, పుట్టుకతో వచ్చే సమస్యలే కారణమని వైద్యులు తెలిపారు. చికిత్స సమయంలో తల్లిదండ్రులు ఆ బిడ్డను పట్టించుకోకుండా వదిలేశారని వైద్యులు ఆరోపించారు. అయితే ఎలుకలు కరవడం వల్లే మృతి చెందిందని శిశువు కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. దీనిపై స్పందించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ విధుల్లో ఉన్న ఇద్దరు నర్సులను సస్పెండ్ చేశారు. పెరియోపరేటివ్ సర్జరీ విభాగాధిపతికి షోకాజ్ నోటీసులు జారీ చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఎలుకల నిర్వహణకు బాధ్యత వహించే తెగులు నియంత్రణ సంస్థకు రూ. లక్ష జరిమానా విధించారు.

# దశాబ్దాల కృషిని ట్రంప్ నాశనం చేశారు

**అమెరికా-భారత్ వాణిజ్య విధానాలపై కాంగ్రెస్ సభ్యుడు రో ఖన్నా**

**నోబెల్‌కు భారత్ నామినేట్ చేయకపోవడం వల్లే సుంకాలని ఆగ్రహం**

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై భారతీయ అమెరికన్, కాంగ్రెస్ సభ్యుడు రో ఖన్నా విమర్శలు గుప్పించారు. భారత్‌పై భారీ సుంకాలు విధించి దశాబ్దాలుగా ఇరుదేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నాశనం చేశారని ఆగ్రహంవ్యక్తం చేశారు. దశాబ్దాల పాటు చేసిన కృషి ఒక్క సుంకాల వల్ల తుడిచి పెట్టుకుపోయిందన్నారు. అరుదైన అత్యవసర పరిస్థితి అంటూ హెచ్చరించారు. పాకిస్తాన్ చేసినట్లుగా, తనను నోబెల్ శాంతి బహుమతికి భారత్ నామినేట్ చేయనందునే ట్రంప్ అలా చేస్తున్నారని ఆరోపించారు. 'నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ పేరును నామినేట్ చేయడానికి మోదీ నిరాకరించారు. దీంతో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేయడానికి చేసిన 30 ఏళ్ల కృషిని నాశనం చేశారు. చైనా కంటే భారతదేశంపై ఆయన 50% ఎక్కువ సుంకాలను విధించారు. ఇవి బ్రెజిల్, చైనా కంటే ఎక్కువ' అని ఖన్నా పేర్కొన్నారు. ట్రంప్ విధానాలు భారత్‌ను చైనా, రష్యాల వైపు నడిపిస్తున్నాయనే అనేక మంది మాజీ దౌత్యవేత్తలు, అధికారుల ఆందోళనను ఆయన పునరుద్ఘాటించారు. సుంకాలు అమెరికాలోకి భారత తోలు, వస్త్ర ఎగుమతులను, అలాగే అమెరికన్ తయారీదారుల నుంచి భారత్‌లోకి ఎగుమతులను దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**భారతీయ అమెరికన్లు స్పందించాలి...**

రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవడం వల్లే భారత్‌పై సుంకాలు విధించినట్టు ట్రంప్ పేర్కొన్నప్పటికీ.. సుంకాలకు నోబెల్ కోణమే ప్రధానమని భావిస్తున్నారు. భారత్‌తో సంబంధాన్ని నాశనం చేసే ట్రంప్ అహంకారాన్ని అమెరికా అనుమతించబోదని, భారతీయ అమెరికన్లు అతనికి వ్యతిరేకంగా మాట్లాడాలని పిలుపునిచ్చారు. ట్రంప్‌కు ఓటు వేసిన భారతీయ అమెరికన్లందరూ ఇప్పుడు ఆయనను ప్రశ్నించాలని సూచించారు. ట్రంప్‌కు తాను ఓటు వేయలేదని ఇండియన్ అమెరికన్ వ్యాపారవేత్త వినోద్ ఖోస్లా చేసిన పోస్ట్‌ను కూడా షేర్ చేస్తూ ఖన్నా తన వీడియో సందేశాన్ని పోస్ట్ చేశారు. 'ఆయనకు నోబెల్ వస్తే ఆ తరువాత నోబెల్ ఎవరికిచ్చినా నేను పట్టించుకోను. ఎందుకంటే అది అపవిత్రం అవుతుంది' అని వినోద్ ఖోస్లా తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## టైమ్స్ టాప్-100లో మితేశ్ ఖాప్రా

**కృత్రిక మేధలో పరిశోధనలకు విశిష్ట గుర్తింపు**



**న్యూఢిల్లీ:** కృత్రిక మేధ(ఏఐ)లో అత్యంత ప్రభావశీల వ్యక్తుల టాప్–100 జాబితాలో ఐఐటీ–మద్రాస్ ప్రొఫెసర్ మితేశ్ ఖాప్రాకు స్థానం దక్కింది. ప్రఖ్యాత టైమ్ మ్యాగజైన్ ఈ జాబితాను ఇటీవల విడుదల చేసింది. ఖాప్రా ఐఐటీ–మద్రాస్‌లో డిపార్టుమెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. లాంగ్వేజ్ ప్రాసెసింగ్, మెషీన్ లెర్నింగ్‌లో ఆయన విస్తృత పరిశోధనలు చేశారు. ఏఐ4భారత్ అనే కంపెనీని స్థాపించారు. భారతీయ భాషల్లో ఏఐ సేవలు పొందడానికి ఓపెన్-సోర్స్ టూల్స్, డేటాసెట్స్‌ను రూపొందించారు. అత్యాధునిక టెక్నాలజీ, దాని రోజువారీ వాడకం మధ్యనున్న అంతరాన్ని ఆయన తొలగించినట్లు టైమ్.కామ్ పేర్కొంది. ఆంగ్ల భాష ఆధారిత ఏఐ మోడల్స్‌పై భారతీయులు ఆధారపడడం తగ్గినట్లు తెలియజేసింది. టైమ్స్ టాప్–100 జాబితాలో స్థానం సంపాదించిన మితేశ్ ఖాప్రాపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది.

# కిమ్ జోంగ్‌కు పుతిన్ కృతజ్ఞతలు

**ఉక్రెయిన్‌పై యుద్ధంలో సహకరిస్తున్న కొరియా సేనలకు ప్రశంసలు**

**బీజింగ్‌లో ప్రత్యేకంగా సమావేశమైన ఇరువురు నేతలు**



**బీజింగ్:** రష్యా, ఉత్తర కొరియా అధినేతలు పుతిన్, కిమ్ జోంగ్ ఉన్ చైనా రాజధాని బీజింగ్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బుధవారం విక్టరీ డే పరేడ్‌లో పాల్గొన్న అనంతరం స్టేట్ గెస్ట్ హౌస్‌లో కలుసుకున్నారు. భేటీ ప్రారంభం కావడానికి ముందు మీడియా ప్రతినిధులతో పుతిన్ మాట్లాడారు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా సైనికులతో కలిసి పోరాడుతున్న ఉ.కొరియా జవాన్లపై ప్రశంసల వర్షం కురిపించారు. రష్యా-ఉత్తర కొరియా మధ్య బంధం నానాటికీ బలపడుతోందని కిమ్ హర్షం వ్యక్తంచేశారు. గత ఏడాది జూన్‌లో ఇరుదేశాలు వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంపై సంతకాలు చేశారని తెలిపారు. అప్పటి నుంచి పరస్పరం సహకరించుకుంటున్నాయని పేర్కొన్నారు. రష్యాకు, రష్యా సహకరించడం సోదర దేశంగా తమ బాధ్యత అని వ్యాఖ్యానించారు. అవసరమైన సాయం అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. అయితే, ఉక్రెయిన్‌పై యుద్ధం గురించి కిమ్ నేరుగా ప్రస్తావించలేదు. మీడియాతో మాట్లాడిన అనంతరం పుతిన్, కిమ్ ద్వైపాక్షిక అంశాలపై విస్తృతంగా చర్చించుకున్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో సహకరిస్తున్నందుకు కిమ్‌కు పుతిన్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసినట్లు సమాచారం. రష్యాలో పర్యటించాలని కోరుతూ కిమ్‌ను పుతిన్ ఆహ్వానించారు. ఉక్రెయిన్‌పై యుద్ధం కోసం ఉత్తర కొరియా సైన్యం రష్యాకు అండగా నిలుస్తున్న సంగతి తెలిసిందే. ఉత్తర కొరియా ఇప్పటిదాకా 15,000 మంది సైనికులను పంపించింది. బాలిస్టిక్ మిస్సైళ్లు, ముందుగుండు సామగ్రి సహా పలు కీలక ఆయుధాలను సైతం సరఫరా చేస్తోంది. ఇదిలా ఉండగా, ఉత్తర కొరియాలో కిమ్ జోంగ్ ఉన్ అధికార పగ్గాలు చేపట్టి 14 ఏళ్లవుతోంది. మరో దేశంలో భారీ అధికారిక కార్యక్రమంలో ఆయన పాల్గొనడం ఇదే మొదటిసారి కావడం విశేషం. బీజింగ్‌లో పుతిన్, కిమ్, చైనా అధినేత జిన్‌పింగ్ సమావేశమవుతారని తొలుత వార్తలు వచ్చాయి.

# డి.ఆర్.గాడ్గిల్ నివేదికపై సమీక్ష ఎప్పుడు నిర్వహించారు?

## కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

### సర్కారియా కమిషన్ సిఫారసులు

**అత్యవసర పరిస్థితి (అధికరణం 356)**

అత్యవసర అధికారాలు దేశ సమగ్రత, ఐక్యతను కాపాడటానికేగానీ కేంద్రానికి మితిమీరిన అధికారాలు కావని సర్కారియా కమిషన్ పేర్కొంది. కాబట్టి అధికరణం 356ను ఆచితూచి ఉపయోగించాలని, చిట్టచివరి అవకాశంగా మాత్రమే ప్రయోగించాలని సూచించింది. అలాంటి కొన్ని సందర్భాలు..

- రాజకీయ అనిశ్చిత పరిస్థితి
- అంతర్గత విచ్ఛిన్నకర పరిణామాలు
- రాజ్యాంగ నిర్దేశాల అమల్లో నిర్లక్ష్యం
- పరిపాలనా యంత్రాంగం వైఫల్యం

రాష్ట్రపతి పాలన ప్రకటనను పార్లమెంటు ఆమోదించాక రాష్ట్ర విధాన సభను రద్దు చేయొద్దు. అప్పుడే పార్లమెంటుకు రాష్ట్రపతి పాలనకు సంబంధించిన విషయాల మీద తగిన నియంత్రణ అవకాశం లభిస్తుంది. అంతేకాకుండా ఏ పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన విధించాల్సి వచ్చిందో ప్రకటనలో పేర్కొనాలి. అప్పుడే న్యాయ సమీక్ష జరిపే వీలుంటుంది. రాజస్థాన్ రాష్ట్రం- భారత ప్రభుత్వాల వివాదం, మినర్వా మిల్లుల వివాదం సందర్భంగా సుప్రీంకోర్టు ఈ అభిప్రాయాన్ని వెలిబుచ్చింది.

**రాష్ట్రాలకు ఆదేశాల విషయంలో..**

సర్కారియా కమిషన్ 256, 257 అధికరణల ప్రకారం కార్యనిర్వాహక విషయాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న ఆధిపత్యంలో ఎలాంటి మార్పులు చేయనవసరం లేదని భావించింది. అయితే 258 అధికరణను ఉదారంగా అన్వయించి వికేంద్రీకరణను ప్రోత్సహించాలని సూచించింది.

**కేంద్ర సాయుధ దళాల మొహరింపు**

సాయుధ దళాల మొహరింపు నిర్ణయాధికారం పూర్తిగా కేంద్ర ప్రభుత్వానిదే. కానీ ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్నీ సంప్రదించాలి. ఇలాంటి చర్య కొన్నిసార్లు చట్టబద్ధంగా సహేతుకమైనప్పటికీ, రాజకీయంగా సరైన నిర్ణయం కాకపోవచ్చని కమిషన్ అభిప్రాయం.

**అఖిల భారత సర్వీసులు**

అఖిల భారత సర్వీసులను కొనసాగించాలని వాటిని శక్తివంతం చేయాలని సర్కారియా కమిషన్ భావించింది. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిర్ణయాలు తీసుకోవాలి. దీని కోసం క్యాబినెట్ సెక్రెటరీ ఆధ్వర్యంలో ఒక సలహా సంఘాన్ని నియమించాలి. మరిన్ని అఖిల భారత సర్వీసుల ఏర్పాటుకు రాష్ట్రాలు సిద్ధం కావాలి.

**అంతర్రాష్ట్ర మండలి (అధికరణం-236)**

శాశ్వత అంతర్రాష్ట్ర మండలిని అంతర్ ప్రభుత్వ మండలి పేరుతో అధికరణం-263 కింద ఏర్పరచి సామాజిక, ఆర్థిక, ప్రణాళికేతర విషయాల మీద శ్రద్ధ తీసుకోవాలి. జాతీయ అభివృద్ధి మండలి అలాగే కొనసాగాలి. కానీ జాతీయ అభివృద్ధి మండలి స్థాయిని లాంఛనప్రాయం చేసి అధికరణం-263 కింద పునర్నిర్మించి జాతీయ ఆర్థిక అభివృద్ధి మండలి అనే కొత్త పేరు ఇవ్వాలని కమిషన్ అభిప్రాయపడింది.

**అధికార భాష**

భాషను రాజకీయం చేయడం దేశ ఐక్యత, సమగ్రతకు మంచిదికాదు. అధికార భాషా విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవడానికి సర్కారియా కమిషన్ కొన్ని సిఫారులు చేసింది. త్రి భాషా సూత్రాన్ని అన్ని రాష్ట్రాలు అమలు చేయాలి.

**ప్రసార సాధనాలు (మీడియా)**

ప్రసార సాధనాలను ఉమ్మడి జాబితా లేదా రాష్ట్ర జాబితాకు బదిలీ చేయడానికి కమిషన్ సుముఖత చూపలేదు. కానీ ఆకాశవాణి, దూరదర్శన్ల విషయంలో సహేతుకమైన అధికార వికేంద్రీకరణ చేపట్టాలని సూచించింది. జాతీయ ప్రయోజనాలకు,రాష్ట్రాల అవసరాలకు మధ్య సమతుల్య పూర్వక సయోధ్య ఉండాలని కమిషన్ సూచించింది.

**విచారణ చట్టం**

విచారణ చట్టాన్ని సవరించాలని, కేంద్ర రాష్ట్ర మంత్రులపై విచారణ సంఘాన్ని వీలైనంత వరకూ నియమించొద్దని కమిషన్ అభిప్రాయపడింది. విచారణ సంఘాన్ని నియమించే ముందు పార్లమెంటు ఉభయ సభలు మెజారిటీ ఓటు ద్వారా తీర్మానం ఆమోదించాలని కమిషన్ సూచించింది. విచారణ సంఘం నియామకానికి ముందు ఈ విషయాన్ని అంతర్ ప్రభుత్వ మండలిలో ఉంచాలని కమిషన్ అభిప్రాయం.

**అంతర్రాష్ట్ర వివాదాలు**

అంతర్రాష్ట్ర నదీ జలాల ట్రిబ్యునల్కు సంబంధించిన చట్టాన్ని సవరించాలని, అయిదేళ్లలోపు నిర్ణయాలు అమలు జరగాలని సూచించింది.

**హైకోర్టు జడ్జిల నియామకం**

రాజ్యాంగాన్ని సవరించి నిర్ణీత కాలంలో కేంద్ర రాష్ట్రాలు పరస్పరం సంప్రదించుకొని హైకోర్టు జడ్జిలను నియమించేలా చట్టాన్ని రూపొందించాలని సర్కారియా కమిషన్ సూచించింది.

### డి.ఆర్. గాడ్గిల్ ఫార్ములా

దేశం అనుసరిస్తున్న సమాఖ్య తరహా వ్యవస్థలో కేంద్ర, రాష్ట్రాల మధ్య సరైన రీతిలో ఆర్థిక వనరుల పంపిణీ కోసం మార్గదర్శక సూత్రాలు, సహేతుకమైన సూచనలు చేయాల్సిందిగా మాజీ ప్రణాళిక సంఘం డిప్యూటీ చైర్మన్ డి.ఆర్. గాడ్గిల్ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ కమిటీ కేంద్ర ప్రభుత్వం అందించే ప్రణాళిక సహాయాన్ని రాష్ట్రాల మధ్య పంపిణీ చేయడానికి ఒక ఫార్ములా (సూత్రాన్ని)రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి 1971లో అందించింది. డి.ఆర్.గాడ్గిల్ నివేదికపై 1981లో ఒకసారి, 1992లో మరోసారి సమీక్ష నిర్వహించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ గాడ్గిల్ ఫార్ములాను అనుసరించి జనాభా ఆధారంగా 60 శాతం నిధులు, తలసరి ఆదాయం ఆధారంగా 25 శాతం నిధులు రెవెన్యూ వ్యయాలను సరిచూసుకొని ఫిస్కల్ డెఫిసిట్ను తగ్గించినందుకు 7.5 శాతం, ఎడారి, కొండ ప్రాంతాలు, శిశుమరణాలు, ఆరోగ్యం తదితర సమస్యల ఆధారంగా 7.5 శాతం నిధులను కేటాయించాలని స్పష్టంగా విశదీకరించింది.

**నోట్:** కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలకు సహాయాన్ని అందిస్తుంది. కానీ వెనుకబడిన, పేద రాష్ట్రాలకు ఈ ఫార్ములా ప్రకారం నిధుల పంపిణీ అంత ఉపయోగకరంగా లేదు.

విత్త రంగంలో చూపిన క్రమశిక్షణను గాడ్గిల్ ఫార్ములా ప్రోత్సహించేలా లేదని కొందరు నిపుణుల అభిప్రాయం.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

### జస్టిస్ మదన్మోహన్ పూంఛీ కమిషన్

కేంద్ర, రాష్ట్ర సంబంధాలను అధ్యయనం చేసి సూచనలు చేయడానికి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మదన్మోహన్ పూంఛీ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం 2007 ఏప్రిల్ 28న ఈ కమిషన్ను ఏర్పాటు చేసింది.

**కమిషన్ సభ్యులు**

1. ధీరేంద్రసింగ్ (హోంశాఖ మాజీ కార్యదర్శి)
2. అమరేశ్ బాంగ్చీ (మాజీ డైరెక్టర్, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ)
3. వినోద్ కుమార్ దుగ్గల్ (హోంశాఖ మాజీ కార్యదర్శి)
4. డాక్టర్ ఎన్ఆర్ మాధవ మీనన్ (మాజీ డైరెక్టర్, జాతీయ న్యాయ అకాడమీ, భోపాల్)

పూంఛీ కమిషన్ తన నివేదికను 7 అధ్యాయాలుగా రూపొందించి 2010 ఏప్రిల్ 20న కేంద్ర ప్రభుత్వానికి అందించింది.

**నివేదికలోని ముఖ్య అధ్యాయాలు**

1. కేంద్ర, రాష్ట్ర సంబంధాల పరిణామ క్రమాన్ని మొదటి అధ్యాయంలో వివరించింది.
2. పౌరహక్కులు, భావ ప్రకటన స్వేచ్ఛను తెలిపే 19వ అధికరణం,అత్యవసర పరిస్థితిని వివరించే 353 అధికరణం, రాష్ట్రాల సంక్షేమం, సంరక్షణను కేంద్ర ప్రభుత్వ బాధ్యతగా తెలిపే 355అధికరణం, రాష్ట్రపతి పాలనను తెలిపే 356 అధికరణం, అంతర్రాష్ట్ర మండలిని తెలిపే 263 అధికరణం గురించి అధ్యయనం చేసి సమగ్ర వివరాలను 2వ అధ్యాయంలో కమిషన్ వివరించింది.
3. కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధాలు, విత్త సంబంధాలు, ప్రాంతీయ అసమానతలను 3వ అధ్యాయంలో పొందుపరిచింది.
4. 73,74 రాజ్యాంగ సవరణలు, 6వ షెడ్యూల్కు సంబంధించిన సూచనలను 4వ అధ్యాయంలో పొందుపరిచింది. తీవ్రవాదం, తిరుగుబాట్లు, నక్సలిజం, హింస, మత కల్లోలాలు, జాతీయ అంతరంగిక భద్రతను 5వ అధ్యాయంలో పొందుపరిచింది. పర్యావరణ సమస్యలు, వనరుల విభజనకు సంబంధించి 6వ అధ్యాయంలో పేర్కొంది. సామాజికాభివృద్ధి, సుపరిపాలన, ఎలక్ట్రానిక్ సేవలను 7వ అధ్యాయంలో పొందుపరిచింది. ఇలా 7 అధ్యాయాలుగా కమిషన్ నివేదికను తయారుచేసింది.

**సిఫారసులు**

- తీవ్రవాద సమస్యకు గురైన ప్రాంతాలను పరిమిత కాలం పాటు కేంద్ర ప్రభుత్వం పాలనలోకి తెచ్చేందుకు 355, 356వ అధికరణలను సవరించాలి.
- 355, 356 అధికరణల కింద అత్యవసర నిబంధనలను స్థానికీకరణం చేయాలంటే రాష్ట్రం మొత్తం రాష్ట్రపతి పాలన విధించకుండా సమస్యాత్మక,యంత్రాంగం వైఫల్యం చెందిన ప్రాంతాల్లో మాత్రమే రాష్ట్రపతి పాలన విధించాలి. రాష్ట్రపతి పాలనను 3 నెలలకు మించకుండా చూడాలని కమిషన్ సిఫారసు చేసింది.
- రాష్ట్రాల్లో మత కల్లోలాలు, హింస, అంతరంగిక ప్రాంతీయ వైషమ్యాలు సంభవించినప్పుడు కేంద్ర బలగాలు నేరుగా మొహరించాలి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అనుమతి లేకుండా కేంద్ర బలగాలను పంపాలి. ఇలాంటి ప్రత్యేక పరిస్థితులు ఉత్పన్నమైనప్పుడు వారం పాటు నిరంతర పర్యవేక్షణ, కేంద్ర బలగాలను, కేంద్ర హోంశాఖ సమీక్షించాలి.
- రాష్ట్రాల మంత్రి మండలి సలహాకు వ్యతిరేకంగా ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతించే హక్కు గవర్నర్లకు ఉండాలి. విశ్వవిద్యాలయాలకు చైర్మన్లుగా గవర్నర్లను నియమించొద్దని కమిషన్ అభిప్రాయపడింది.
- సరైన కారణాలు తెలపకుండా గవర్నర్ల తొలగింపు సరికాదని పేర్కొంది. గవర్నర్ పదవీ కాలాన్ని ఐదేళ్లుగా నిర్ణయించాలని తెలిపింది. రాష్ట్రపతి మహాభియోగతీర్మానం ద్వారానే గవర్నర్లను తొలగించాలని అభిప్రాయపడింది.
- అధికరణం 163(2) ద్వారా గవర్నర్లకు సంక్రమించిన విచక్షణాధికారాల పరిధిని రాజ్యాంగ సవరణ చేసి తగ్గించాలి. బిల్లులను తన వద్ద అట్టిపెట్టుకొనే అధికారాన్ని తగ్గించి 4 నెలల్లోగా కచ్చితంగా బిల్లుపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయాలని సూచించింది.
- జాతీయ సమగ్రతా మండలి ఏడాదికోసారి సమావేశం కావాలని చెప్పింది. జాతీయ పరిశోధనా ఏజెన్సీ వంటి కొత్త సంస్థలను అధ్యయనం చేసి నివేదించింది.

వీరప్ప మొయిలీ అధ్యక్షతన రెండో పరిపాలనా సంస్కరణల సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం 2005 ఆగస్టు 31న నియమించింది. దీనిలో సభ్యులు.

1. వి. రామచంద్రన్ 2. డాక్టర్ ఏ.పి.ముఖర్జీ
3. డాక్టర్ ఎ.హెచ్. ఖత్రో
4. డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ (రాజీనామా చేశారు)
5. శ్రీమతి వినితా రాయ్ (కార్యదర్శి)

వీరప్పమొయిలీ అధ్యక్షతన నియమించిన రెండో పరిపాలనా సంస్కరణ సంఘం ప్రభుత్వం, పాలనా వ్యవస్థను సమగ్రంగా అధ్యయనం చేసి బాధ్యతాయుత, జవాబుదారీతనం, సమర్థ పాలనకు సంబంధించి మొత్తం 15 అధ్యయన నివేదికలను కేంద్రప్రభుత్వానికి సమర్పించింది.

### గతంలో అడిగిన ప్రశ్నలు

1. కింది వాటిలో కేంద్ర, రాష్ట్ర సంబంధాలతో సంబంధం లేనిది?
   ఎ) ఇంద్రజిత్ గుప్తా కమిటీ
   బి) పశ్చిమబెంగాల్ ప్రభుత్వ మెమొరాండం
   సి) రాజమన్నార్ కమిటీ
   డి) సర్కారియా కమిషన్
2. రెండో పరిపాలనా సంస్కరణల సంఘం అధ్యక్షుడు ఎవరు?
   ఎ) సి. రంగరాజన్
   బి) వినోద్ రాయ్
   సి) వీరప్పమొయిలీ
   డి) వినితారాయ్
3. ఎన్నికల అజమాయిషీ, సూచనలు, నియంత్రణ ఎన్నికల సంఘం చేతుల్లో ఉండాలని ఏ రాజ్యాంగ అధికరణ తెలుపుతుంది?
   ఎ) 324 బి) 323
   సి) 325 డి) 326
4. కింది వాటిలో ఏ కేసు విషయంలో సుప్రీంకోర్టు తీర్పు కేంద్ర, రాష్ట్ర సంబంధాలను పునర్ నిర్వచించింది?
   ఎ) ఇంద్ర సహానీ కేసు
   బి) రాయనరావు కేసు
   సి) ఎస్.ఆర్. బొమ్మయ్ కేసు
   డి) ఐ.ఆర్. కొయల్హో కేసు
5. కేంద్ర,రాష్ట్ర సంబంధాలకు సంబంధించి డి.ఆర్. గాడ్గిల్ సూత్రాన్ని ఎందుకు ఉపయోగిస్తారు?
   ఎ) పన్నుల రాబడుల విభజన
   బి) రాష్ట్ర రుణాల మాఫీ
   సి) రాష్ట్రాలు కొత్త అప్పులు చేయకుండా ఉండటానికి
   డి) రాష్ట్రాలకు కేంద్ర సహాయాన్ని సమకూర్చడానికి
6. సర్కారియా కమిషన్ అధ్యయన నివేదికను ఎప్పుడు సమర్పించింది?
   ఎ) 1988 బి) 1989
   సి) 1987 డి) 1986
7. అఖిల భారత సర్వీసులను ముఖ్యంగా ఐఏఎస్, ఐపీఎస్లను రద్దు చేయాలని సిఫారసు చేసిన కమిటీ ఏది?
   ఎ) సర్కారియా కమిషన్
   బి) రాజమన్నార్ కమిషన్
   సి) ఖేర్ కమిషన్ డి) కాకా కలేల్కర్ కమిషన్

**సమాధానాలు**

1) ఎ; 2) సి; 3) ఎ; 4) సి; 5) డి; 6) సి; 7) బి.

# నార్కో అనాలసిస్లో వాడే రసాయనాలు?

శరీరంలో జరిగే అన్ని జీవక్రియలు నాడీ వ్యవస్థ ఆధీనంలో ఉంటాయి. మానవ నాడీ వ్యవస్థలో మూడు భాగాలు ఉంటాయి. అవి.. కేంద్ర నాడీవ్యవస్థ, పరధీయ నాడీవ్యవస్థ, స్వయం చోదిత నాడీవ్యవస్థ. కేంద్ర నాడీ వ్యవస్థలో మెదడు, వెన్నుపాము ఉంటాయి. వీటిని ఆవరించి ఉండే మూడు పొరలను మెనింజస్ అంటారు. మెదడు.. తలలోని దృఢమైన ఎముకల పెట్టె(కపాలం)లో, నీటి అలల మధ్య తేలుతూ పటిష్ట భద్రత మధ్య ఉంటుంది. మెదడును వివిధ పరికరాలతో స్కానింగ్ చేసి దానిలోని మార్పులను గుర్తించి వ్యాధులను నిర్ధారించడాన్ని బ్రెయిన్ మ్యాపింగ్ అంటారు.

### మానవ నాడీ వ్యవస్థ

మానవుడిలో మెదడు.. తలలోని దృఢమైన ఎముకల పెట్టె (కపాలం)లో, నీటి అలల మధ్య తేలుతూ పటిష్ట భద్రత మధ్య ఉంటుంది. కపాలం అధ్యయనాన్ని క్రేనియాలజీ అంటారు. శరీరంలో జరిగే అన్ని జీవక్రియలు నాడీ వ్యవస్థ ఆధీనంలో ఉంటాయి. ఈ వ్యవస్థ శరీరానికి వెలుపల, లోపల జరిగే మార్పులకు ప్రతిచర్యలను కలిగిస్తుంది. నాడీ వ్యవస్థ అధ్యయనాన్ని న్యూరాలజీ అంటారు. మానవ నాడీవ్యవస్థలో మూడు భాగాలు ఉంటాయి. అవి.. కేంద్ర నాడీవ్యవస్థ, పరధీయ నాడీవ్యవస్థ, స్వయం చోదిత నాడీవ్యవస్థ.

### కేంద్ర నాడీ వ్యవస్థ

ఇందులో రెండు భాగాలు ఉంటాయి. ఒకటి.. మెదడు. రెండు.. వెన్నుపాము. వీటిని ఆవరించి ఉండే మూడు పొరలను మెనింజస్ అంటారు. ఆ పొరలు (వెలుపలి నుంచి లోపలి వైపునకు వరుసగా).. వరాశిక, లౌతుకళ, మృద్వి. ఈ పొరలకు బ్యాక్టీరియా (నిస్సేరా మెనింజైటిస్) సంక్రమిస్తే మెనింజైటిస్ వ్యాధి వస్తుంది. ఈ పొరల మధ్య ఉండే ద్రవ పదార్థాన్ని మస్తిష్క మేరుద్రవం(సెరిబ్రో స్పైనల్ ఫ్లూయిడ్) అంటారు. ఈ ద్రవం మెదడుకు, వెన్నుపాముకు రక్షణ కల్పి స్తుంది. మెదడులోని నాడీకణాలకు ఆహారాన్ని, ఆక్సీజన్ను సరఫరా చేస్తుంది.

### మెదడు

మెదడు అధ్యయనాన్ని 'ప్రినాలజీ' అంటారు. అప్పుడే పుట్టిన శిశువు మెదడు 300-400 గ్రాముల బరువు ఉంటుంది. వయోజనుల మెదడు 1350-1400 గ్రాములు, పురుషుల్లో 1375 గ్రాములు, స్త్రీల్లో 1275 గ్రాముల బరు వు ఉంటుంది. మెదడులో 75 శాతానికి పైగా నీరు ఉంటుంది.

జంతువుల్లో అత్యంత బరువైన మెదడు (8 కిలోలు)తిమింగలంలో ఉంటుంది. ఏనుగు మెదడు 5 కిలోలు ఉంటుంది. నాడీ కణాల సంఖ్య మాత్రం మానవుల మెదడులోనే ఎక్కు వ. ఏనుగు మెదడులో 2,300 కోట్ల నాడీ కణా లు, చింపాంజీలో 700 కోట్లు, మానవుడిలో 8,600 కోట్లు ఉంటాయి.

నాడీ వ్యవస్థ నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం నాడీకణం (న్యూరాన్). మెదడు పనితీరుకు మూలం న్యూరాన్. మెదడు కణాల్లో న్యూరాన్లు పది శాతం ఉంటాయి. మిగతా 90 శాతం గ్లియల్ కణాలు ఉంటాయి. ఈ కణాలు పోషక పదార్థాలను అందించడంతోపాటు మెద డును శుభ్రం చేస్తాయి. మెదడు బరువు ఎక్కువ ఉన్నవారు ఎక్కువ తెలివితేటలు కలిగి ఉంటారని ఫ్రెడరిక్ టిడ్మాన్ పేర్కొన్నాడు.

- మానవుడి దేహం బరువులో మెదడు బరు వు రెండు శాతం మాత్రమే. కానీ శరీరం లోని మొత్తం శక్తిలో దాదాపు 20 శాతం, ఆక్సీజన్లో 20 శాతం, గ్లూకోజ్లో 25 శాతాన్ని వినియోగించుకుంటుంది.
- చుంచెలుక శరీరం మొత్తం బరువులో మెదడు బరువు 10 శాతం ఉంటుంది. మెదడుకు 5 నుంచి 7 సెకన్ల పాటు ఆక్సీజన్ అందకుంటే బ్రెయిన్ డెడ్ అవుతుంది.
- శరీరం లాగే మెదడుకూ విశ్రాంతి (నిద్ర) అవసరం.
- పెద్దవారు రోజుకు ఆరు గంటలు నిద్రపోవాలి
- క్రీడాకారులు 9 గంటలు, 18 ఏళ్ల లోపు వారు 8 గంటలు, నవజాత శిశువులు 18 గంటలు విశ్రాంతి తీసుకోవాలి.

### బ్రెయిన్ మ్యాపింగ్

అత్యాధునిక స్కానింగ్, మ్యాపింగ్ పరిశోధనల వల్ల మెదడు పనితీరుపై అవగాహన ఏర్పడింది. మెదడును వివిధ పరికరాలతో స్కానింగ్ చేసి దానిలోని మార్పులను గుర్తించి వ్యాధులను నిర్ధారించడాన్ని బ్రెయిన్ మ్యాపింగ్ అంటారు. మెదడు వ్యాధుల గుర్తింపు పరీక్షలు..

1. ఎలక్ట్రో ఎన్సెఫలో గ్రామ్ (ఈఈజీ)
2. మ్యాగ్నెటిక్ ఎన్సెఫలో గ్రామ్ (ఎంఈజీ)
3. మ్యాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్(ఎంఆర్ఐ)
4. కంప్యూటెడ్ టోమోగ్రఫీ (సీటీ స్కాన్)
5. ఫంక్షనల్ మ్యాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్ (ఎఫ్ఎంఆర్ఐ)

- స్కానింగ్లో రేడియోధార్మిక కిరణాలను ఉపయోగిస్తారు.
- కండరాల నొప్పులు, పక్షవాతం చికిత్సలో పరారుణ కిరణాలను వాడతారు.

### నార్కో అనాలసిస్

- మెదడులోని సమాచారాన్ని యథావిధిగా బయటకు చెప్పించే ప్రక్రియ నార్కో అనాలసిస్ టెస్ట్.
- ఈ పరీక్షను అంతర్జాతీయ ఉగ్రవాదులు, ఆర్థిక నేరస్తులు, కుంభకోణాలకు పాల్పడిన వ్యక్తుల నుంచి నిజాలను రాబట్టడానికి ఉపయోగిస్తారు.
- ఈ పరీక్షలో వాడే రసాయనాలు.. సోడియం అమైటాల్, సోడియం పెంటాథాల్.

**నోట్:** ఈ పరీక్ష రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం వ్యక్తి స్వేచ్ఛకు, జీవించే హక్కుకు వ్యతిరేకం. కాబట్టి తప్పనిసరి పరిస్థితుల్లో కోర్టు అనుమతితో దీన్ని నిర్వహించాలి.




టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
బయాలజీ

### మెదడు - నిర్మాణం

మెదడులో మూడు భాగాలు ఉంటాయి. అవి.. ముందు మెదడు, మధ్య మెదడు, వెనక మెదడు.

### ముందు మెదడు

ముందు మెదడునే సెరిబ్రమ్/మస్తిష్కం/పెద్ద మెదడు అని అంటారు. సెరిబ్రమ్ 995 గ్రాముల బరువు ఉంటుంది. దీనిలోని ఎత్తైన ప్రదేశాలను(గట్లను) గైరై అని, లోతైన ప్రదేశాలను సల్సై అని అంటారు. మస్తిష్కం 2 మస్తిష్కార్ధగోళాలు గా విభజితమవుతుంది. కుడి మస్తిష్కార్ధ గోళం ఎడమ కాళ్లు, చేతులను; ఎడమ మస్తిష్కార్ధగోళం కుడి కాళ్లు, చేతులను నియంత్రిస్తాయి.

- కుడి మస్తిష్కార్ధ గోళానికి గాయమైతే దేహంలోని ఎడమ వైపు భాగాలకు, ఎడ మ గోళానికి దెబ్బ తగిలితే కుడి వైపు భాగాలకు పక్షవాతం వస్తుంది. ఈ మస్తిష్కార్ధ గోళాలను నాడీదండం కలుపుతుం ది. మస్తిష్కానికి, మధ్య మెదడుకు మధ్యద్వారగోర్థం ఉంటుంది. ఇది రాంబాయిడ ల్ ఆకారంలో కనిపిస్తుంది. థలామస్,హైపోథలామస్గా విభజితమవుతుంది.

**హైపోథలామస్ విధులు**

1) భావోద్వేగాల నియంత్రణ
2) ఆకలి, దప్పిక
3) నిద్ర, మెలకువ
4) నీటి సమతుల్యత, రక్తపీడనం, శరీర ఉష్ణోగ్రత క్రమత
5) లైంగిక వాంఛ

- హైపోథలామస్..పీయూష గ్రంథిని నియంత్రిస్తుంది.మానవుడిలో ఈ గ్రంథి ప్రధానమైంది.
- దృశ్య, శ్రవణ, స్పర్శ, వాసన, రుచిని తెలుసుకోవడానికి మస్తిష్కంలో ఐదు జ్ఞాన కేంద్రాలు ఉంటాయి.
- మస్తిష్కాన్ని ఉదర తలం నుంచి చూస్తే అందులో గదాకృతి నిర్మాణాలు కనిపిస్తా యి. వాటిని ఘ్రాణ లబింకలు అంటారు.

**మస్తిష్కం విధులు**

1) జ్ఞాపక శక్తి 2) తెలివితేటలు
3) ఆలోచన 4) ఊహా శక్తి
5) వివేచన 6) సమస్యల పరిష్కారం
7) అభ్యాసం 8) మాట్లాడటం

### మధ్య మెదడు

- ఇది మందంగా, దృఢంగా ఉన్న చిన్న కాడ వంటి భాగం.
- ఇది హైపోథలామస్కు, పాన్స్వెరోలికి మధ్య ఉంటుంది. మధ్య మెదడు పృష్ఠ భాగంలో నాలుగు లంబికలతో 'కార్పొరా క్వాడ్రిజమైనా' అనే నిర్మాణం ఉంటుంది. ఇది దృశ్య, శ్రవణ జ్ఞానాలను కలిగిస్తుంది.

### వెనక మెదడు

ఇది మెదడు చివరి భాగం. దీనిలో మూడు భాగాలు ఉంటాయి. అవి..

1) అనుమస్తిష్కం
2) పాన్స్ వెరోలి
3) మజ్జాముఖం.

### అనుమస్తిష్కం (సెరిబెల్లమ్)

- దీన్ని లిటిల్ బ్రెయిన్ (చిన్న మెదడు) అని కూడా అంటారు.
- ఇది తల వెనక భాగంలో (మస్తిష్కానికి దిగువన, మజ్జాముఖానికి పైన) ఉంటుంది.

**విధులు**

1) శరీర సమతాస్థితిని కాపాడటం
2) నియంత్రిత కండరాల చలనాలను క్రమబద్ధీకరించడం

**నోట్:** మత్తుమందు ఇచ్చినప్పుడు, మద్యా న్ని అధికంగా సేవించినప్పుడు ఈ భాగం సక్రమంగా పనిచేయక మనిషి అదుపు తప్పుతాడు.

### పాన్స్ వెరోలి

- ఇది మజ్జాముఖానికి వెనక, మధ్య మెదడుకు కింద ఉంటుంది. శ్వాస కండరాల కదలికలను నియంత్రించి, ఉచ్ఛ్వా సలో పీల్చే వాయువుల ఘనపరిమాణాన్ని క్రమపరుస్తుంది.

### మజ్జాముఖం

ఇది మెదడు చివరి భాగం. మెదడును, వెన్నుపామును కలిపే సంధానకర్త/వారధి. ఇది అనియంత్రిత కండరాలకు సమాచారాన్ని అందిస్తుంది.

**విధులు**

1) శ్వాసక్రియ, నాడీ స్పందన, రక్తపీడనం, హృదయ స్పందన, పేగులు, జీర్ణాశయం, ఆహార వాహిక, మూత్రాశయం చలనాలను నియంత్రిస్తుంది.
2) వాసోమోటర్గా పనిచేస్తుంది(రక్తనాళా ల్లో జరిగే చర్యల వల్ల వాటి వ్యాసం మారుతుంది)
3) మింగడం, దగ్గడం, తుమ్మడం, వాంతులు, వెక్కిళ్లను నియంత్రిస్తుంది.

- మానవ మెదడులో మజ్జాముఖం అతి ముఖ్య భాగం. దీనికి తీవ్ర గాయమైతే (శ్వాసక్రియకు అంతరాయం కలిగి) వ్యక్తి మరణిస్తాడు.

### వెన్నుపాము

మజ్జాముఖం.. వెనక వైపునకు విస్తరించి వెన్నుపాముగా మారి మొండెం చివరి వరకు ప్రయాణిస్తుంది. ఇది 42 నుంచి 45 సెం.మీ. పొడవు ఉంటుంది. వెన్నుపాము దాని అడ్డుకోతలో హెచ్ లేదా సీతాకోకచిలుక ఆకారంలో కనిపిస్తుంది. వెన్నుపాము లోపలి వైపు బూడిద రంగు పదార్థం, వెలుపలి వైపు తెలుపు పదార్థం ఉంటాయి. వెన్నుపాము మెదడుకు, శరీర భాగాలకు మధ్యవర్తిగా, సంధానకర్తగా పనిచేస్తుంది. అందువల్ల వెన్నుపామును టెలిఫోన్ ఎక్స్ఛేంజ్/రిలే సెంటర్ అని పేర్కొంటారు.

**విధులు**

అసంకల్పిత ప్రతీకార చర్యలను చూపడం. అంటే అనుకోకుండా వేగంగా, వెంటనే, అప్రయత్నంగా జరిగే చర్యలు. ఈ చర్యలు వెన్నుపాము ఆధీనంలో మాత్రమే ఉంటాయి. వీటికి మెదడుతో సంబంధం లేదు.

**ఉదాహరణలు:**

- వేడి వస్తువులను తాకగానే చేతిని వెనక్కి లాగడం.
- కీటకం అకస్మాత్తుగా కంటి వద్దకు రాగానే కనురెప్పలు మూయడం.
- చీకట్లో ఒక్కసారిగా కాంతి పడగానే కళ్లు మూసుకోవడం.

### గతంలో అడిగిన ప్రశ్నలు

1. శరీరంలో ఉష్ణ నియంత్రణ కేంద్రం?
   1) కశేరు నాడీదండం
   2) హైపోథలామస్
   3) అనుమస్తిష్కం
   4) వెన్నుపాము
2. తుమ్మడం, మింగడం, వాంతులు, వెక్కిళ్లు దేని నియంత్రణలో ఉంటాయి? (గ్రూప్-1, 1990)
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
   3) మజ్జాముఖం 4) వెన్నుపాము
3. ఆల్కహాల్, అనస్థీషియా.. మెదడులోని ఏ భాగంపై ప్రభావం చూపుతాయి?
   1) సెరిబ్రమ్ 2) సెరిబెల్లమ్
   3) మెడుల్లా అబ్లాంగేటా 4) వెన్నుపాము
4. మెదడును ఆవరించి ఉన్న పొరలేవి (వెలుపలి నుంచి లోపలి వైపునకు వరుసగా)?
   1) మృద్వి 2) వరాశిక
   3) లౌతుకళ 4) ప్లూరా
   1) 1, 2, 3, 4 2) 2, 3, 4, 1
   3) 2, 3, 1 4) 3, 2, 1
5. అనుమస్తిష్కం (సెరిబెల్లమ్) దేనికి సంబంధించింది? (ఏపీ టౌన్ ప్లానింగ్, 2010)
   1) కండర కదలికల సమన్వయం
   2) గ్రాహకాంగం 3) జ్ఞాపకశక్తి
   4) దృష్టి
6. మెదడులోని ఏ భాగం జ్ఞాపకశక్తికి మూలం? (జేఎల్, 2004)
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
   3) దవ్వ 4) అధో పర్యంకం
7. మానవ మెదడు సగటు బరువు?
   1) 1300 గ్రా॥ 2) 1400 గ్రా॥
   3) 1500 గ్రా॥ 4) 1350 గ్రా॥
8. ఆకలి, దప్పిక, లైంగిక వాంఛ, శరీర ఉష్ణోగ్రత దేని ఆధీనంలో ఉంటాయి? (గ్రూప్-1, 2000)
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
   3) మజ్జాముఖం 4) హైపోథలామస్
9. శరీరంలో వార్తలను గ్రహించి విశ్లేషించి సమన్వయపరిచే కేంద్రం?(జేఎల్, 2003)
   1) గుండె 2) కాలేయం
   3) మూత్రపిండాలు 4) మెదడు
10. పార్కిన్సన్ వ్యాధి ఏ అవయవానికి వస్తుంది? (ఏఈఈ, 2006)
   1) గుండె 2) చర్మం
   3) మెదడు 4) కాలేయం

**సమాధానాలు**

1) 2; 2) 3; 3) 2; 4) 3; 5) 1; 6) 1; 7) 2; 8) 4; 9) 4; 10) 3.

# పైరైటీస్ రూపంలో ఇండియాలో లభించే ముడి ఖనిజం?

**గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం**

**జనరల్ స్టడీస్**

**రసాయన శాస్త్రం**

### లోహాల ఉనికి

భూమి వల్కలంలో అత్యంత విస్తారంగా లభించే మూలకం ఆక్సిజన్(45.5 శాతం). ఆక్సిజన్ తర్వాత విస్తృతిని సిలికాన్(27 శాతం) ఆక్రమిస్తుంది. భూపటలంలో లభించే మూలకాల్లో మూడోది, లోహాల్లో మొదటిది అల్యూమినియం(8.3 శాతం). రెండోది ఇనుము(5శాతం). మూలకాల్లో నాలుగో స్థానం, మనిషి ఉపయోగించిన మొదటి లోహం రాగి (కాపర్). అత్యధికంగా వినియోగించే లోహం ఇనుము(ఐరన్).

### లోహ సంగ్రహణ

బంగారం(గోల్డ్), ప్లాటినం లాంటి కొన్ని లోహాలు మాత్రమే ప్రకృతిలో స్వాభావికంగా లభిస్తాయి. కార్బన్, సల్ఫర్ భూమి పైపొరల్లో స్వేచ్ఛాస్థితిలో ఉంటాయి. ఉత్కృష్ట వాయువులు గాలిలో స్వేచ్ఛగా ఉంటాయి. ఆక్సిజన్, నైట్రోజన్లు గాలిలో స్వేచ్ఛాస్థితిలో ఉన్నప్పటికీ ఇతర మూలకాల్లో సంయోగ పదార్థాలను ఏర్పరుస్తాయి. దాదాపు మిగిలిన మూలకాలన్నీ ఒకదానితో మరోటి కలిసి భూమి పొరల్లో సంయోగ పదార్థాలుగా ఉంటాయి. సహజంగా లభించే లోహ సంయోగ పదార్థాల నుంచి లోహాన్ని నిష్కర్షించి వేరు చేసే పద్ధతిని 'లోహ నిష్కర్షణ' అంటారు. సమ్మేళనాల నుంచి లోహాలను సంగ్రహించడం, శుద్ధి చేయడంతోపాటు వివిధ మిశ్రమ లోహాలు తయారు చేయడం లోహ సంగ్రహణశాస్త్ర పరిధిలోకి వస్తాయి.

### ఖనిజాలు (మినరల్స్)

ప్రకృతిలో లభించే లోహ సమ్మేళనాలు ఇసుక, రాళ్లు, బంకమన్ను మొదలైన మలినాల తో కలిసి ఉంటాయి. ఈ విధంగా లభించే లోహాల ముడి పదార్థాలను ఖనిజాలు అంటారు. గనుల నుంచి తవ్వి ఖనిజాలను వెలికి తీస్తారు. అయితే అన్ని ఖనిజాల నుంచి లోహాన్ని వేరు చేయడం లాభదాయకం కాదు. వాణిజ్యపరంగా ఏ ఖనిజం నుంచి లాభదాయకంగా లోహాన్ని వేరు చేస్తారో దాన్ని ఆ లోహధాతువు(ఓర్) అంటారు. ఉదాహరణకు అల్యూమినియం.. బాక్సైట్ రూపంలో, కయోలినైట్ అనే బంకమన్ను.. కోరండం, డయాస్పోర్లుగా లభిస్తాయి. ఇవన్నీ అల్యూమినియం ఖనిజాలు. కానీ అల్యూమినియం లోహాన్ని 'బాక్సైట్' నుంచి మాత్రమే లాభసాటిగా సంగ్రహిస్తారు. అందువల్ల బాక్సైట్‌ను అల్యూమినియం ధాతువుగా పరిగణిస్తారు.

ఎక్కువ శాతం లోహాలు ఆక్సైడ్లుగా లభిస్తాయి. ఇతరత్రా కార్బొనేట్లు, సల్ఫేట్లు, సల్ఫైడ్లు, క్లోరైడ్‌ల రూపాల్లో లభిస్తాయి.

ధాతువును ఎంచుకునేటప్పుడు కేవలం ఆర్థికాంశాలే కాకుండా పర్యావరణ అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఉదాహరణకు సల్ఫైడ్ ఖనిజమైన 'ఐరన్ పైరైటీస్' నుంచి ఐరన్‌ను సంగ్రహిస్తే అది వాతావరణాన్ని కలుషితం చేసి ఆమ్ల వర్షాలకు కారణమయ్యే 'సల్ఫర్ డై ఆక్సైడ్'ను విడుదల చేస్తుంది. కాబట్టి ఆక్సైడ్ ఖనిజాలైన హైమటైట్ లాంటి ఖనిజాలను ఉపయోగిస్తారు.



| ఖనిజ రూపం | ఖనిజాలు |
|---|---|
| ఆక్సైడ్ | బాక్సైట్, హెమటైట్, మాగ్నటైట్, మోనోజైట్, సిలికా, జింకైట్ (ఫిలాసఫర్స్ ఊల్). |
| కార్బొనేట్ | సున్నపురాయి, మాలకైట్, కాలమైన్, డోలమైట్, సిడరైట్ |
| సల్ఫేట్ | బెరైటీస్, జిప్సం. |
| సల్ఫైడ్ | పైరైటీస్, సిన్నబార్, గెలీనా, కాపర్ గ్లాన్స్. |
| క్లోరైడ్ | కార్నలైట్, హార్న్ సిల్వర్, రాతి ఉప్పు(రాక్‌సాల్ట్). |

**కొన్ని ముఖ్యమైన లోహాలు - వాటి ఖనిజాలు**

| లోహం | ముఖ్య ఖనిజాలు |
|---|---|
| అల్యూమినియం | బాక్సైట్, కోరండం, డయాస్పోర్, కయోలినైట్ |
| బేరియం | బెరైటీస్ |
| కాపర్ | కాపర్ పైరెటీస్, చాల్కో పైరెటీస్, మాలకైట్, క్యూప్రైట్, కాపర్ గ్లాన్స్. |
| ఐరన్ | ఐరన్ పైరెటీస్ (ఫూల్స్ గోల్డ్), హెమటైట్, మాగ్నటైట్, సిడరైట్, లిమొనైట్, సిడరైట్. |
| కాల్షియం | సున్నపురాయి (కాల్షియం కార్బొనేట్), జిప్సం. |
| మెగ్నీషియం | కార్నలైట్, మాగ్నసైట్, ఎప్సం లవణం. |
| థోరియం | మోనోజైట్ |
| మెర్క్యూరీ | సిన్నబార్ |
| జింక్ | కాలమైన్, జింక్‌బ్లెండ్, జింకైట్. |
| మాంగనీస్ | పైరోలుసైట్ |
| సిల్వర్ | అర్జెంటైట్, హార్న్ సిల్వర్ |
| లెడ్ (సీసం) | గెలీనా |
| సోడియం | రాతి ఉప్పు (రాక్ సాల్ట్), చిలీ సాల్ట్ పీటర్. |

### సాంద్రీకరణ

ముడి ఖనిజాల్లో చాలా వరకు మాలిన్యాలు ఉంటాయి. వీటి నుంచి శుద్ధ లోహాన్ని పొందడానికి కొన్ని రసాయన ప్రక్రియల ద్వారా మలినాలను తొలగిస్తారు. ఈ పద్ధతిని 'సాంద్రీకరణ' అంటారు.

### సాంద్రీకరణ పద్ధతులు

**లెవిగేషన్:** గురుత్వాకర్షణ సూత్రంపై ఆధారపడిన సాంద్రీకరణ పద్ధతిలో వేగంగా వచ్చే నీటి ధారతో చూర్ణం చేసిన ముడి ఖనిజాన్ని కడుగుతారు. తేలికైన మాలిన్య కణాలు నీటి ప్రవాహంతో కొట్టుకుపోగా బరువైన శుద్ధి ముడి ఖనిజ కణాలు నిలిచిపోతాయి. ఇది భౌతిక పద్ధతి.

**ప్లవన క్రియ:** సల్ఫైడ్ ఖనిజాల నుంచి మలినాలను తొలగించడానికి ఈ పద్ధతిలో చూర్ణం చేసిన ముడి ఖనిజాన్ని నీటిలో అవలంబనం చేస్తారు. అనంతరం నూనె సమక్షంలో గాలిని పంపిస్తూ గిలకరించడం వల్ల పైన ఏర్పడే నురుగులోకి ఖనిజ కణాలు వస్తాయి. నురుగు కోసం పైన్ ఆయిల్, కొవ్వు ఆమ్లాలు, గ్జాంథేట్‌లను కలుపుతారు. జింక్, లెడ్ లాంటి లోహాల ఖనిజాలను ఈ విధంగా సాంద్రీకరిస్తారు. ఇది కూడా భౌతిక పద్ధతి.

**లీచింగ్ (నిక్షాళనం):** ఇది ఒక రసాయన పద్ధతి. ఇందులో ధాతువు రసాయన స్వభావాన్ని అనుసరించి, తగిన కారకాన్ని ఉపయోగించి, ధాతువు మాత్రమే ద్రావణంలో కరిగేలా చేస్తారు. కరగకుండా మిగిలిపోయిన మలినాలను వడపోత ద్వారా వేరు చేస్తారు. ఉదాహరణకు బాక్సైట్‌ను సోడియం హైడ్రాక్సైడ్‌ను ఉపయోగించి లీచింగ్ చేస్తారు.

**అయస్కాంత వేర్పాటు పద్ధతి:** ముడి ఖనిజానికి కానీ, మలినానికి కానీ అయస్కాంత ధర్మం ఉంటే ఈ పద్ధతిలో సాంద్రీకరిస్తారు. చూర్ణం చేసిన ముడి ఖనిజాన్ని అయస్కాంత రోలర్ మీద తిరిగే కన్వేయర్ బెల్ట్ మీద పడేలా చేస్తే ఖనిజం మాలిన్యం నుంచి వేరు అవుతుంది. ఈ పద్ధతిలో ఇనుప ఖనిజాలను, టిన్ స్టోన్‌ను సాంద్రీకరిస్తారు.

### ముడి లోహాన్ని సంగ్రహించడం

ధాతువు నుంచి లోహాన్ని సంగ్రహించడానికి కొన్ని రసాయన ప్రక్రియలను అవసరానికి తగినట్లు ఉపయోగిస్తారు. వాటిలో ముఖ్యమైన ప్రక్రియలు.

**భస్మీకరణం(కాల్సినేషన్):** ధాతువును గాలి లేకుండా బాగా వేడి చేసి బాష్పశీల (వాయురూప) మలినాలను తొలగించే పద్ధతిని భస్మీకరణం అంటారు. కార్బొనేట్, బైకార్బొనేట్ ఖనిజాలకు ఈ పద్ధతిని ఎక్కువగా ఉపయోగిస్తారు. ఉదాహరణకు కాల్షియం కార్బొనేట్ (సున్నపురాయి)ని భస్మీకరణం చేస్తే కాల్షియం ఆక్సైడ్ (సున్నం) ఏర్పడుతుంది. కార్బన్ డై ఆక్సైడ్ వేరు పడుతుంది.

**భర్జనం(రోస్టింగ్):** గాలి సరఫరా చేస్తూ లోహ ద్రవీభవన స్థానం కంటే తక్కువ ఉష్ణోగ్రత వద్ద కొలిమిలో ముడి ఖనిజాన్ని వేడి చేసే ప్రక్రియ భర్జనం. ప్రధానంగా సల్ఫైడ్ ఖనిజాలను ఆక్సైడ్‌లుగా మార్చేందుకు ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. ఉదాహరణకు రివర్బరేటరీ కొలిమిలో కాపర్ సల్ఫైడ్ ఖనిజాన్ని భర్జనం చేస్తారు.

**ప్రగలనం:** ధాతువును ద్రవకారి(ధాతువు ద్రవీకరణ ఉష్ణోగ్రతను తగ్గించే పదార్థం) కలిపి కానీ లేకుండా కానీ వేడిచేసి లోహాన్ని ద్రవస్థితిలో పొందే ప్రక్రియను ప్రగలనం అంటారు.

**క్షయకరణం:** లోహ ఆక్సైడ్‌లను సాధారణంగా కోక్(కార్బన్) లేదా కార్బన్ మోనాక్సైడ్ (CO) కలిపి వేడి చేస్తారు. ఈ ప్రక్రియలో అవి ఆక్సిజన్‌ను కోల్పోయి లోహాలుగా క్షయకరణం చెందుతాయి. ఉదాహరణకు 'బ్లాస్ట్ ఫర్నేసు'లో కోక్ మండటం వల్ల ఏర్పడిన కార్బన్ మోనాక్సైడ్.. ఐరన్ ఆక్సైడ్‌ను ఐరన్‌గా క్షయకరణం చేస్తుంది.

### లోహ సంగ్రహణ - ముఖ్యాంశాలు

- ధాతువులో లోహంతోపాటు ఉండే మలినాలను 'గాంగ్' అంటారు.
- ఇనుము సంగ్రహణలో 'బ్లాస్ట్ కొలిమి'ని ఉపయోగిస్తారు. కొలిమిలోకి ప్రవేశపెట్టే కోక్, ధాతువు, సున్నపురాయిల మిశ్రమాన్ని చార్జ్ అంటారు.
- రివర్బరేటరీ కొలిమిలో ప్రగలనం, వేడి చేయడం ద్వారా కాపర్‌ను నిష్కర్షణ చేస్తారు.
- గలన స్థితిలో ఉండే లోహాన్ని పచ్చి కర్రలతో కలియబెట్టి మాలిన్యాలను వేరు చేస్తారు. ఈ పద్ధతిని 'పోలింగ్' అంటారు.
- విద్యుద్విశ్లేషణ పద్ధతిలో లోహాన్ని శుద్ధి చేసే ప్రక్రియలో అపరిశుద్ధ లోహాన్ని ఆనోడ్‌గా, శుద్ధమైన లోహ రేకును కాథోడ్‌గా వాడతారు.
- బ్లాస్ట్ ఫర్నేసులో 750° సెంటీగ్రేడ్ వద్ద ఏర్పడిన ఇనుము ఘన స్థితిలో, గుల్లబారి ఉంటుంది. దీన్ని 'స్పాంజ్ ఐరన్' అంటారు.
- స్పాంజ్ ఐరన్ కొలిమి అడుగు భాగం ద్రవరూపంలోకి మారుతుంది. ఈ స్థితిలో కార్బన్, ఫాస్ఫరస్, సిలికా చేరి దుక్క ఇనుము లేదా పోత ఇనుము(కాస్ట్ ఐరన్)గా మారుతుంది. దీనిలో కార్బన్ 3 నుంచి 4 శాతం ఉంటుంది.
- దుక్క ఇనుము సంఘటనలో మార్పుల ద్వారా చేత ఇనుము(వ్రాట్ ఐరన్), స్టీల్ తయారు చేస్తారు.
- చేత ఇనుము శుద్ధమైన ఇనుము. ఇందులో కార్బన్ 0.1 - 0.25 శాతం మాత్రమే ఉంటుంది.
- ఉక్కు(స్టీల్)లో కార్బన్ 0.1-1.5 శాతం మాత్రమే. కార్బన్ శాతం పెరుగుతున్న కొద్దీ పెలుసుదనం పెరుగుతుంది.
- ఉక్కు ప్రధానంగా ఇనుము, కార్బన్ల మిశ్రమ లోహం. కార్బన్‌తోపాటు వివిధ పరిమాణాల్లో మాంగనీస్, నికెల్, క్రోమియం, మాలిబ్డినం, వెనేడియం, టంగ్‌స్టన్ మొదలైన లోహాలను మిశ్రమం చేసి ప్రత్యేక ధర్మాలు ఉన్న ఉక్కును తయారు చేస్తారు.
- స్టెయిన్‌లెస్ స్టీల్‌లో ఇనుము, కార్బన్‌తోపాటు క్రోమియం, నికెల్ ఉంటాయి.
- దుక్క ఇనుము నుంచి స్టీల్ తయారీకి 'ఓపెన్ హార్త్ కొలిమి'ని ఉపయోగిస్తారు.

### మాదిరి ప్రశ్నలు

1. సిన్నబార్ దేని ధాతువు?
   1) బంగారం 2) యురేనియం
   3) సీసం 4) మెర్క్యూరీ
2. చార్జ్ అంటే ఏమిటి?
   1) విద్యుదావేశం 2) ఖనిజ చూర్ణం
   3) కోక్, సున్నపురాయి, ధాతువుల మిశ్రమం
   4) కోక్, ధాతువుల మిశ్రమం
3. బ్లాస్ట్ ఫర్నేస్‌లో లభించే గుల్లబారిన ఇనుమును ఏమంటారు?
   1) స్టీల్ 2) బ్లిస్టర్ ఐరన్
   3) స్పాంజ్ ఐరన్ 4) చేత ఇనుము
4. చేత ఇనుములో కార్బన్ శాతం?
   1) 2 శాతం 2) 0.1 శాతం
   3) 0.8 శాతం 4) 0.2 శాతం
5. గాలి లేకుండా ధాతువును వేడి చేసి బాష్పశీల మలినాలను తొలగించే ప్రక్రియ?
   1) భస్మీకరణం 2) భర్జనం
   3) నిక్షాళనం 4) పోలింగ్

### సమాధానాలు

1) 4; 2) 3; 3) 3; 4) 4; 5) 1.

### గతంలో అడిగిన ప్రశ్నలు

1. పైరైటీస్ రూపంలో ఇండియాలో లభించే ముడి ఖనిజం?
   1) అల్యూమినియం 2) ఇనుము
   3) బంగారం 4) ప్లాటినం
2. అల్యూమినియం లోహం ధాతువు?
   1) బాక్సైట్ 2) బెరైటీస్
   3) సిన్నబార్ 4) హెమటైట్
3. భూపటలంలో పుష్కలమైన లోహం?
   1) ఇనుము 2) బంగారం
   3) అల్యూమినియం 4) లెడ్
4. ఫిలాసఫర్స్ ఊల్ అంటే ఏమిటి?
   1) జింక్ బ్రోమైడ్ 2) జింక్ నైట్రేట్
   3) జింక్ ఆక్సైడ్ 4) జింక్ క్లోరైడ్

### సమాధానాలు

1) 2; 2) 1; 3) 3; 4) 3.

# Banks in India can be classified under..

**BANK EXAMS**

**BANKING AWARENESS**

1. Co-operative Banks come under the control of RBI by virtue of certain provisions of:
   a) Reserve Bank of India Act 1934
   b) Banking Laws (Application to Co-operative Societies) Act 1965
   c) Banking Regulation Act 1949
   d) Negotiable Instruments act 1881
   e) All the above
2. Which among the following is part of the banking business under the provisions of section 6(1) of B R Act:
   a) Collecting and transmitting of money
   b) Negotiating loans and advance
   c) Acquiring and holding the investments
   d) All the above
   e) None of the above
3. Which one of the following is not Appropriate:
   a) A Commercial bank is prohibited in selling insurance products
   b) An urban co-operative bank can sell mutual fund products
   c) A Private Sector bank can issue a Credit card
   d) A Nationalized bank is permitted to accept articles under safe custody
   e) None of the above
4. Which kind of assistance is provided by EXIM Bank to Indian companies?
   a) Direct loans to exporters
   b) Technology services
   c) Consultancy services
   d) Credit for export of capital goods
   e) All the above
5. Banks in India can be classified under ______ categories:
   a) A body corporate constituted under a special statute
   b) Company registered under the companies act
   c) Foreign company
   d) a, b only e) All a, b and c
6. Central government can exempt a particular bank from the provisions of banking regulation act:
   a) On the recommendations of the RBI.
   b) If the central government is satisfied with the case
   c) If requested by the board of directors of the bank
   d) If unanimous resolution passed by shareholders of the bank
   e) All the above
7. Other than the Governor, Deputy Governors of RBI, the other directors are :
   a) Appointed b) Nominated
   c) Selected d) Elected
   e) Any of the above
8. Which of the following statements is not correct regarding nominations?
   a) Two or more persons can be nominated by a depositor or group of depositors. A Bank will have a full discharge of its liability if it makes the payment to the nominee.
   b) Bank is not obliged to receive any notice of claim from any other person other than the depositor
   c) The Bank will take due notice of any order or certificate from competent jurisdiction relating to deposits where nominee is appointed.
   d) Nominee should be individual and not an institution.
   e) Only a & b
9. Which of the following statements is correct?
   a) RBI approval is required for appointment of a chairman of a Bank.
   b) RBI is empowered to remove top managerial personnel of a Bank.
   c) RBI may appoint suitable person in place of the person so removed.
   d) Only b & c e) All the above
10. If RBI cancels the license of a bank, the bank has the remedy option of:
    a) Filling a review application before governor of RBI
    b) Filling an appeal with RBI after passing a general body resolution
    c) Appealing to central government
    d) Appeal after recommendations of general body and governor to central government
    e) Any of the above
11. Which of the following statements is correct?
    a) The RBI may decide the maximum amount of advance which a Bank may provide to one company or firm or individual.
    b) RBI may advice the Bank for which maximum amount of guarantee may be given to any one company or firm
    c) RBI is empowered to determine other terms and conditions to be followed by a Banking company while considering the loans and advances.
    d) Only b & d e) All the above
12. A bank has refused to open the account without any valid reasons. When the matter was referred to the Bank's Regional Office, no response received even after two months. Then:
    a) The person can refer the matter to Banking Ombudsman.
    b) Even though he is yet to become the customer of the bank, he can refer the matter to Banking Ombudsman.
    c) Since he is the non customer he loses the right to refer the matter to Banking Ombudsman
    d) The person can refer the matter to the Head Office/ Corporate Office of the Bank and then only can approach Banking Ombudsman
    e) None of the above
13. Most of the banks have established ________ for giving focused attention to a particular aspect of banking:
    a) Specialized branches
    b) Large branches
    c) Medium branches
    d) Overseas branches
    e) None of the above
14. If a co-operative bank fails, the depositors of such a bank is protected up to Rs.1 lakh subject to the provision that:
    a) The depositor is not having more than Rs.1 lac at the time of failure of the bank
    b) The bank has registered with the DICGC
    c) The depositor has is not having more than one deposit account
    d) The depositor has opted for insurance coverage specifically
    e) If the bank is paying Insurance Premium to LIC regularly
15. Which of the following statements not correct?
    a) The Nationalized Banks may go to public to raise capital
    b) Public Sector Banks can raise foreign equity up to 49 per cent.
    c) Private Sector Banks can raise capital from the public
    d) Regional Rural Banks cannot raise capital from the public
    e) None of the above
16. Which of the following is correct regarding Capital Adequacy ratio?
    a) The objective of Capital adequacy is to strengthen the financial stability of banks
    b) Capital is divided into two tiers, tier I and tier II
    c) Assets are assigned risk weight from 0-100 based on intensity of risk
    d) Only b is correct
    e) All the above
17. What are the implications of moral suasion?
    a) It has only psychological advantage
    b) It has no legal sanction
    c) It may or may not be an effective tool
    d) It is only a trial of RBI to exercise its function to control the economic system
    e) All the above
18. The limits for FPI investment in govt. securities (G-sec) will be raised in phases (by March 2018) to what per cent of the outstanding stock as per RBI?
    a) 2 % b) 3% c) 4%
    d) 5% e) 6%
19. Which of the following agencies maintain RIDF (Rural Infrastructure Development Fund)?
    a) Ministry of Rural Development
    b) Reserve Bank of India
    c) NABARD d) SIDBI
    e) None of the above
20. An inchoate instrument is one which does not have:
    a) The Amountb) The Date
    c) Name of the payee
    d) Signature of the drawer
    e) a, b & c
21. Leasing, Hire purchase and Bill discounting are the main functional domains of:
    a) NBFCs b) Banks
    c) Mutual funds
    d) Insurance Companies
    e) Only b & c
22. A co-operative Bank operating in different states are regulated by :
    a) State co-operative societies Act
    b) Banking regulation Act
    c) Multi Unit Co-operative societies Act
    d) Banking Laws (application to co-operative societies)
    e) None of the above
23. The gilt-edged security market is the market for which of the Following?
    a) Market for trading in gold
    b) Market for trading in silver
    c) Market for government securities
    d) Market for industrial securities
    e) None of the above
24. Which of the following can be called as intermediary in the financial System?
    a) Insurance companies
    b) Banking companies
    c) Mutual funds
    d) Financial institutions
    e) All of the above
25. Acceptance is required in the case of:
    a) Usance Bill b) Demand bill
    c) Cheque d) Demand Draft
    e) None of these
26. Matured, but not paid, term deposits are treated as :
    a) Demand liability b) Time liability
    c) No liability d)Contingent liability
    e) None of the above
27. Urban cooperative banks are controlled by:
    a) Registrar of societies
    b) State governments
    c) Reserve bank
    d) b & c
    e) None of the above
28. A Cheque drawn in favour of Raju & Co. and endorsement is duly confirmed by the collecting banker. Will the paying banker get protection?
    a) Will not get, as endorsement is irregular
    b) Will get protection as endorsement is confirmed by the collecting banker
    c) Will get only if payee has rectified the action
    d) Paying banker is not concerned with the genuineness of endorsement
    e) None of the above
29. The holder of a Negotiable instrument is Holder in due course if:
    a) He receives the instrument in good faith and without negligence
    b) He receives the instrument before its maturity
    c) He receives the instrument for lawful consideration
    d) All of the above
    e) None of the above

### KEY

1) e; 2) d; 3) a; 4) e;
5) e; 6) a; 7) b; 8) a;
9) e; 10) c; 11) e; 12) a;
13) a; 14) b; 15) b; 16) e;
17) e; 18) d; 19) c; 20) e;
21) a; 22) c; 23) c; 24) e;
25) a; 26) a; 27) d; 28) a;
29) d;